
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 18 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 212
బుధవారం 23-10-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'


భారత్‌కు పెద్ద దెబ్బ
గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్‌–2026 నుంచి 9 క్రీడాంశాలు తొలగింపు -16లో


టపటపా!
సెన్సెక్స్ 931 పాయింట్లు క్రాష్. నిఫ్టీకి 309 పాయింట్ల నష్టం -17లో


వక్ఫ్ బిల్లుపై రసాభాస
వక్ఫ్ సవరణ బిల్లుపై ఎంపీలు వాగ్వాదానికి దిగారు. టీఎంసీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ఆవేశంతో గాజు నీళ్లసీసా పగలగొట్టారు.
వివరాలు 6లో ▸


బెంగళూరు అతలాకుతలం
బెంగళూరులో వర్షం బీభత్సం సృష్టించింది. నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల కట్టడం కూలిన ఘటనలో ఒకరు మృతి చెందారు.
వివరాలు 6లో ▸


కొనసాగుతున్న బెదిరింపులు
విమాన సర్వీసులకు బాంబు బెదిరింపులు ఆగట్లేదు. వారంలోనే 170కిపైగా విమాన సర్వీసులకు బెదిరింపులు వచ్చాయి.
వివరాలు 6లో ▸


నస్రల్లా బంకర్‌లో భారీ సంపద
బీరుట్‌లోని నస్రల్లా బంకర్‌లో 50 కోట్ల డాలర్లకుపైగా విలువైన బంగారం, నగదు లభ్యమైనట్టు ఇజ్రాయెల్ తెలిపింది.
వివరాలు 6లో ▸

ఉద్యోగుల ఉద్యమ బాట

సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రకటించిన తెలంగాణ జేఏసీ

కొత్త ప్రభుత్వమని 10 నెలలు వేచి చూశాం: జాయింట్ యాక్షన్ కమిటీ

- సీఎంఆర్‌ఎఫ్‌కు మేం రూ.130 కోట్లు ఇచ్చినప్పుడు రెండురోజుల్లో సమావేశం అన్నారు
- ఇప్పుడు సీఎం రేవంత్, సీఎస్ కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు
- డీఏలు మరిచిపోయారు.. జీపీఎఫ్‌లో ఉన్న డబ్బులు కూడా తీసుకునే పరిస్థితి లేదు
- ఈ నెల 26న కేబినెట్‌లో పరిష్కరించకపోతే 28న సీఎం, సీఎస్‌కు కార్యాచరణ లేఖ ఇస్తాం
- నవంబర్‌లో జిల్లా కలెక్టర్లకు కార్యాచరణ లేఖ.. భారీ ర్యాలీలు.. ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు
- జనవరిలో నల్లబ్యాడ్జీలతో విధులకు.. మౌన ప్రదర్శనలు, బైక్ ర్యాలీలు, మానవహారాలు
- జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు వెల్లడి


టీఎన్జీవో కార్యాలయంలో జరిగిన టీజీ జేఏసీ సమావేశంలో నినాదాలు చేస్తున్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై పది నెలలవుతున్నా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం లేదని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీ జేఏసీ) ఆవేదన వ్యక్తం చేసింది. కొత్త ప్రభుత్వమని ఇన్నాళ్లు వేచి చూశామని తెలిపింది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ప్రతి మంత్రి గడప తొక్కామని, తమ సమస్యలు సీఎం వద్దకు తీసుకెళ్లాలని విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొంది. తమ డిమాండ్లు దృష్టికి తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అపాయింట్‌మెంట్ కోరుతున్నా ఇవ్వడం లేదని వాపోయింది. సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రకటించింది. మంగళవారం టీఎన్జీవో కార్యాలయంలో టీజీ జేఏసీ (తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లతో కూడిన సంయుక్త కార్యాచరణ కమిటీ) విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల మొత్తం 51 డిమాండ్లు, అతి ముఖ్యమైన ఆరు డిమాండ్లకు సంబంధించి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం జేఏసీ చైర్మన్, ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడారు.

డీఏలు, హెల్త్‌కార్డులు ఏమయ్యాయి?

'ఉద్యోగుల డిమాండ్లు, పెండింగ్ బిల్లులు, జీపీఎఫ్, ఇతర సమస్యలపై సమావేశంలో చర్చించాం. పలు కీలక నిర్ణయాలు తీసుకున్నాం. ఈ నెల 26న జరిగే మిగతా 2వ పేజీలో ▶

డ్రగ్స్ దందాలో టీవీ చానల్ అధినేత

గతంలో పలు వివాదాలు..

ఓ 'సొసైటీ' వ్యవహారాల్లోనూ వివాదాస్పద పాత్ర

- డ్రగ్స్ నిందితులు, అనుమానితులతో దీర్ఘకాలంగా లింకులు
- 15 మంది వినియోగదారులతో సంప్రదింపులు
- వీరిమధ్య 2,500 ఫోన్ కాల్స్, పదుల సంఖ్యలో ఎస్సెమ్మెస్‌లు
- పోలీసులకు చిక్కిన ఆధారాలు..ఆయన వ్యవహారాలపై నిఘా
- వారసత్వంగా అందిన చానల్‌తో మీడియా అధినేతగా మారిన వైనం

సాక్షి, హైదరాబాద్: ఆయనో మీడియా అధినేత.. తండ్రి స్థాపించిన టీవీ చానల్ నిర్వహణ పగ్గాలు వారసత్వంగా పొందారు. గతంలోనే పలు వివాదాలు ఆయన్ను చుట్టుముట్టగా, ఇటీవల ఓ 'సొసైటీ' వ్యవహారాల్లోనూ ఆయన పాత్ర వివాదాస్పదమైంది. తాజాగా ఆయనకు సంబంధించిన మరో ఆందోళనకర విషయం వెలుగులోకి వచ్చింది. మాదకద్రవ్యాల కేసుల్లో నిందితులు, అనుమానితులతో సదరు న్యూస్ చానల్ యజమానికి సంబంధాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు 15 మంది డ్రగ్స్ వినియోగదారులు, అనుమానితులతో ఆయన సంప్రదింపులు జరిపినట్లు పోలీసులకు ఆధారాలు లభించడంతో పటిష్ట నిఘా వేసి ఉంచారు.

కొన్నాళ్లుగా పరిశీలిస్తున్న పోలీసులు

రాష్ట్ర పోలీసు విభాగం కొన్నాళ్లుగా మాదకద్రవ్యాల క్రయ విక్రయాలను తీవ్రంగా పరిగణిస్తోంది. ఒకప్పుడు ఏదైనా కేసులో దొరికిన డ్రగ్ పెడ్లర్ వద్దే దర్యాప్తు, విచారణ ఆగిపోయేది. తద్వారా మాదకద్రవ్యాల దందాకు కళ్లెం పడట్లేదని భావించిన పోలీసు విభాగం కొత్త పంథా అనుసరించడం మొదలెట్టింది. డ్రగ్స్ విక్రేతలు, ఖరీదు చేసే వారితో పాటు అనుమానితులకు సంబంధించిన ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. దీనికోసం ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం సైతం మిగతా 12వ పేజీలో ▶



న్యూస్‌రీల్

హాన్‌–మూసీ.. పోలికలెన్నో!



మూసీ నదికి పునరుజ్జీవం తేవాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం.. అందులో భాగంగా దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లోని హాన్ నదిని అధ్యయనం కోసం ఎంపిక చేసుకుంది. రెండు నదుల మధ్య చాలా పోలికలు ఉండటమే అందుకు కారణం.
- వివరాలు 13లో▶

ఎన్‌ఐసీ చేతికి 'ధరణి'



ధరణి పోర్టల్ నిర్వహణను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసీ)కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ధరణి పోర్టల్‌ను నిర్వహిస్తున్న టెరాసస్ కంపెనీ గడువు ఈనెల 29తో ముగియనుంది.
- వివరాలు 13లో▶

సీట్లొచ్చినా.. చేరేదెవరు?



ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపు వ్యవహారంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కాలేజీలే సీట్లు భర్తీ చేసుకునేందుకు హైకోర్టు అనుమతించింది. దీనిపై సుప్రీంకోర్టులో సవాల్ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.
- వివరాలు 2లో▶

త్వరలోనే 'కాళేశ్వరం'పై విజిలెన్స్ తుది నివేదిక



కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్వహిస్తున్న విచారణ కొలిక్కి వచ్చిందని, త్వరలోనే నివేదిక అందజేస్తామని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీజీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.
- వివరాలు 13లో▶

ఇదండీ సంగతి



ప్రభుత్వం పోషిస్తానంటే కనడానికి రెడీనే అంటున్నాయ్ సార్ కొత్త జంటలు!!

165 మంది ఏఈవోల సస్పెన్షన్

5లో

వ్యవసాయశాఖ సంచలన నిర్ణయం

- హైదరాబాద్ వ్యవసాయ కమిషనరేట్ వద్ద ధర్నా.. ఉద్రిక్తత
- ఏఈవోల విన్నపాన్ని వినకుండానే వెళ్లిపోయిన వ్యవసాయశాఖ డైరెక్టర్
- నేడు వందలాది మందితో కమిషనరేట్‌ను ముట్టడిస్తామని ఏఈవోల హెచ్చరిక..
- మరోవైపు మూకుమ్మడి సెలవులో 2,600 మంది..
- డిజిటల్ క్రాప్ సర్వేపై సహాయ నిరాకరణ చేస్తుండటం వల్లే సస్పెండ్ చేశారంటున్న ఏఈవోలు
- రైతుబీమాలో రైతుల మరణాల వివరాల నమోదులో నిర్లక్ష్యమని ఉత్తర్వుల్లో పేర్కొన్న వైనం


హైదరాబాద్‌లోని వ్యవసాయ కమిషనర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు

కటకటాల్లోకి నిర్మాత శివరామకృష్ణ

- రాయదుర్గం, యాచారంలోని ప్రభుత్వ భూమిపై కన్ను
- స్టేట్ ఆర్కైవ్స్ ఉద్యోగి సాయంతో నకిలీ పత్రాలు సృష్టి
- వీటి ఆధారంగా రూ.వేల కోట్ల విలువైన ఓ భూమిలో పాగా
- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు



సాక్షి, హైదరాబాద్: నగర శివార్లలోని ప్రభుత్వ భూములపై కన్నేసిన టాలీవుడ్ నిర్మాత, రియల్టర్ బూరుగుపల్లి శివరామకృష్ణ వాటిని కైవసం చేసుకోవడానికి పెద్ద కథే నడిపాడు. రూ.వేల కోట్ల ఖరీదైన వీటిని కైవసం చేసుకోవడానికి స్టేట్ ఆర్కైవ్స్ ఉద్యోగితో చేతులు కలిపాడు. ఇతడి సాయంతో నకిలీ పత్రాలను అసలైనవిగా చూపిస్తూ రాయదుర్గంలోని 83 ఎకరాల భూమిలో పాగా వేశాడు. అలాగే, యాచారంలోని పది ఎకరాల భూమిపై మిగతా 12వ పేజీలో ▶

దేవుడి భూముల్లో 'సౌర' వెలుగులు

- వ్యవసాయ యోగ్యం కాని భూముల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం
- స్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో నిర్వహణ
- దేవాలయాలకు లీజు రూపంలో ఆదాయం
- ప్రయోగాత్మక పరిశీలనకు 250 ఎకరాల భూమి గుర్తింపు


- వివరాలు 12లో

అవమానాలు చాలు.. ఇకనైనా బతకనివ్వండి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు



- ఈరోజు మమ్మల్ని కాంగ్రెస్ పార్టీ చంపేసింది.. ఎన్జీవో పెట్టుకునైనా ప్రజలకు సేవ చేస్తా
- గంగారెడ్డి హత్యతో తీవ్ర భావోద్వేగం

5లో

జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడి దారుణహత్య



ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి అన్నివిధాలా సహకరిస్తాం

- పుతిన్‌కు మరోసారి స్పష్టం చేసిన మోదీ
- బ్రిక్స్ సదస్సు కోసం రష్యా వెళ్లిన ప్రధాని
- నేడు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ

- వివరాలు 6లో▶

గత మూడు నెలల్లోనే రష్యాలో ఇది నా రెండో పర్యటన. రష్యా, భారత మైత్రి కాలపరీక్షకు నిలిచిన బంధం. రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి తక్షణం శాంతియుత పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా ఎలాంటి సాయమైనా చేసేందుకు భారత్ సదా సిద్ధం.
- ప్రధాని నరేంద్ర మోదీ

క్లుప్తంగా...

కేరళకు సీఎం రేవంత్‌రెడ్డి

నేడు వయనాడ్‌లో ప్రియాంక నామినేషన్‌కు హాజరు



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం సాయంత్రం కేరళ బయలుదేరి వెళ్లారు. వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరగనున్న ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రియాంక గాంధీ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్ కార్యక్రమానికి సీఎం హాజరై.. హైదరాబాద్ తిరిగి వస్తారని సీఎంవో వర్గాలు వెల్లడించాయి.

మద్దతుధర లభించక దౌర్భాగ్య స్థితిలో రైతులు

మాజీమంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ మేనిఫెస్టోలో వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన తర్వాత బోనస్ మాట అటుంచి మద్దతు ధర కూడా లభించని దౌర్భాగ్య స్థితిలోకి రైతులను నెట్టేశారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 322 సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు ప్రకటించినా ఆచరణలో ఇప్పటివరకు ఒక్క రైతు దగ్గర కూడా పత్తి కొనుగోలు చేసిన పాపాన పోలేదని మంగళవారం ఓ ప్రకటనలో ఆరోపించారు. కాంగ్రెస్ ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకారం, పత్తి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521తో పాటు, రూ.500 బోనస్ కలిపి రూ.8,021 కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మక్కల మద్దతు ధర రూ. 2,225కు కాంగ్రెస్ ఇస్తానన్న బోనస్ కలిపితే రైతుకు క్వింటాల్‌కు రూ.2,725 మద్దతు ధర ఇవ్వాలని కోరారు.

మనుధర్మంతో మహిళాభ్యున్నతి తిరోగమనం

ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే



సింగరేణి (కొత్తగూడెం): ప్రధాని నరేంద్రమోదీ అనుసరిస్తున్న మనుధర్మ విధానాలతో మహిళాభ్యున్నతి తిరోగమనం చెందుతోందని అఖిల భారతప్రజాతంత్ర మహిళా సమాఖ్య (ఐద్వా) జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే అన్నారు. రాజ్యాంగం స్త్రీ, పురుష సమానత్వాన్ని సూచిస్తుంటే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అనుసరిస్తున్న సిద్ధాంతాలు అందుకు భిన్నంగా ఉంటున్నాయని విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో జరుగుతున్న ఐద్వా రాష్ట్ర మహాసభల్లో మంగళవారం ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలతో మహిళలకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రధాని అయ్యాక దళిత, గిరిజన మహిళలపై దాడులు పెరిగాయని ఆరోపించారు. నరేంద్ర మోదీ ప్రజావ్యతిరేక విధానాల వల్లే గత ఎన్నికల్లో బీజేపీకి సీట్లు తగ్గాయని చెప్పారు. మహాసభల్లో మాజీ ఎంపీ మిడియం బాబూరావు ప్రసంగించారు. ఐద్వా జాతీయ నేతలు పీకే శ్రీమతి, ఎస్.పుణ్యవతి, సుధాసుందర రామన్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణజ్యోతి, మల్లు లక్ష్మి, ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో కిసాన్‌సెల్ కార్యవర్గ సమావేశం

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం గాంధీభవన్‌లో జరిగింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ కిసాన్‌సెల్ వైస్‌చైర్మన్, తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, టీపీసీసీ కిసాన్ సెల్ చైర్మన్ సుంకేట అన్వేశ్‌రెడ్డితో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లాల కిసాన్‌సెల్ అధ్యక్షులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని రైతాంగ సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించారు. కాగా, తమకు మార్కెట్ కమిటీలు, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యం కల్పించాలని కిసాన్ కాంగ్రెస్ నేతలు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

బంజారాహిల్స్: బీఆర్‌ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావుతో సహా ఆపార్టీ ముఖ్యనేతలు కేటీ రామారావు, హరీశ్‌రావులను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేసేలా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు బీఆర్‌ఎస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డిపై మంగళవారం బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో గెల్లు శ్రీనివాస్‌యాదవ్, పల్లె రవికుమార్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, రామచంద్రనాయక్, డాక్టర్ రాకేశ్‌కుమార్, నోముల భగత్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పదవిలో ఉండి ఆయన భాష బాగోలేదని, మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులకు ప్రాణహాని ఉందన్నారు. వారికి ఏమి జరిగినా ప్రభుత్వానిదే బాధ్యత అని హెచ్చరించారు. ఈ నెల 19న చార్మినార్ వద్ద నిర్వహించిన రాజీవ్ సద్భావనయాత్రలో సైతం బుల్డోజర్ ముందు అడ్డంగా పడుకోవాలి..ఎప్పుడు పడుకుంటావో చెప్పు అంటూ మరోసారి బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు.

సీట్లొచ్చినా.. చేరేదెవరు?

ఇప్పటికే పూర్తయిన ఇంజనీరింగ్ కౌన్సెలింగ్.. మొదలైన తరగతులు

- హైకోర్టు తీర్పుతో కాలేజీల్లో పెరగనున్న 3వేల సీట్లు..
- సుప్రీంకోర్టులో సవాల్ చేసిన సర్కార్
- న్యాయపోరాటానికి వెనుకాడని కాలేజీలు
- సీట్ల పెంపు వ్యవహారంలో నాటకీయ పరిణామాలు



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల పెంపు వ్యవహారంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. సీట్ల పెంపును ప్రభుత్వం అడ్డుకుంటే, కాలేజీలే సీట్లు భర్తీ చేసుకునేందుకు హైకోర్టు అనుమతించింది. ఇప్పటికే రాష్ట్రంలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. క్లాసులు కూడా మొదలయ్యాయి. విద్యార్థులంతా ఇంజనీరింగ్, డిగ్రీ, లేదా ఇతర రాష్ట్రాల్లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలు పొందారు. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పుతో పెరిగే దాదాపు 3 వేల సీట్లు ఎలా భర్తీ అవుతాయనేది అర్థం కావడం లేదు. కోర్టు తీర్పు రాగానే ప్రైవేటు కాలేజీలు స్పాట్ అడ్మిషన్లు చేపట్టాయి. ఎంతమంది వస్తే అంతమందిని చేర్చుకుంటున్నాయి. విద్యాజ్యోతి కాలేజీలో 120 సీట్లు పెరిగితే 15 మంది స్పాట్ అడ్మిషన్ల ద్వారా చేరారు. మిగతా మూడు కాలేజీల్లోనూ ప్రవేశాలు కొంత మేర జరిగాయి. ఈ క్రమంలో హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాల్ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సీట్ల పెంపును అడ్డుకునేందుకు ప్రభుత్వం.. ఎలాగైనా సీట్లు పెంచుకునేందుకు ప్రైవేటు కాలేజీలు న్యాయపోరాటానికీ వెనుకాడటం లేదు.

వచ్చే ఏడాదిపైనే ఆశ

డిమాండ్ లేని ఇతర కోర్సుల్లో సీట్లు తగ్గించుకుని కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో ప్రైవేటు కాలేజీలు సీట్లు పెంచుకున్నాయి. అనుమతులూ తెచ్చుకున్నాయి. దీనికి ప్రభుత్వం ససేమిరా అనడం, వివాదం కోర్టు మెట్లెక్కడం తెలిసిందే. ఆలస్యంగా తీర్పు వచ్చినా ప్రైవేటు కాలేజీలు సీట్లపై ఎందుకు ఆసక్తి చూపుతున్నాయనే సందేహాలు కలుగుతున్నాయి. కాలేజీలు ఈ సంవత్సరాన్నే దృష్టిలో పెట్టుకోలేదు. ఇప్పుడు సీట్లు పెరిగితే, వచ్చే ఏడాదీ ఇది కొనసాగుతుంది. ఈ ఏడాది ప్రవేశాలు కాకున్నా, కంప్యూటర్ సీట్లు కావడం వల్ల వచ్చే ఏడాది అన్నీ భర్తీ అయ్యే వీలుంది. ఒక్కో బ్రాంచీలో 120 సీట్లు ఉంటే, మేనేజ్‌మెంట్ కోటా కింద దాదాపు 33 సీట్లు ఉంటాయి. కంప్యూటర్ సైన్స్‌లో ఒక్కో సీటు రూ.16 లక్షలపైనే పలుకుతుంది. డిప్లొమా కోర్సుల ద్వారా రెండో ఏడాదిలోనూ ఇంజనీరింగ్ సీట్లు కేటాయిస్తారు. ఇందులోనూ మేనేజ్‌మెంట్ కోటా సీట్లు పెంచుకునే వీలుంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వంపై న్యాయ పోరాటానికి కాలేజీలు సిద్ధపడుతున్నాయి.

ఇది ప్రభుత్వం కక్షే



మౌలిక వసతులన్నీ ఉండటం వల్లే సీట్ల పెంపును కోరాం. ఏఐసీటీఈ, జేఎన్‌టీయూహెచ్ అనుమతించింది. కోర్టు కూడా పెంచుకోవచ్చని తెలిపింది. అయినా ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించడం దారుణం. విద్యారంగంలోకి రాజకీయాలను తీసుకురావడం మంచిది కాదు. సీఎస్‌ఈ సీట్ల కోసం విద్యార్థుల నుంచి డిమాండ్ పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో సీట్లు లేకుండా చేయడం సమంజసం కాదు.

సూర్యదేవర నీలిమ
(ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ నిర్వాహకురాలు)

ప్రభుత్వం పట్టుదల ఎందుకు?

హైకోర్టు తీర్పును ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. అక్కడ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తే స్పాట్ ద్వారా చేరిన విద్యార్థులకు ఇబ్బంది తప్పదని అధికార వర్గాలు అంటున్నాయి. సీట్ల పెంపును అడ్డుకోవడాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రైవేటు కాలేజీలపై నియంత్రణ దిశగా వెళ్లాలనుకుంటున్న ప్రభుత్వానికి ఈ విషయం కీలకమని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు సీట్ల పెంపును అనుమతిస్తే, భవిష్యత్‌లో ప్రతీ కాలేజీ సివిల్, మెకానికల్ సీట్లు రద్దు చేసుకునే ప్రమాదం ఉందని, సీఎస్‌ఈ దాని అనుబంధ కోర్సులే ఉండే అవకాశముందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ కారణంగానే సీట్ల పెంపును అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు వరకూ పోరాడుతోందని ఓ సీనియర్ అధికారి తెలిపారు.

ఉద్యోగుల ఉద్యమ బాట

▶ మొదటి పేజీ తరువాయి

కేబినెట్ సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. మంత్రివర్గ భేటీలో ఉద్యోగుల సమస్యలపై సానుకూల నిర్ణయం తీసుకోకుంటే నిరసనలతో కూడిన కార్యాచరణతో ముందుకెళ్తాం. ప్రత్యేక తెలంగాణలో కీలకపాత్ర పోషించిన ఉద్యోగులు నేడు తమ సమస్యలకు సంబంధించి ప్రభుత్వంపై పోరాటం చేయాల్సి వస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఐదు డీఏలు ఇస్తామన్న హామీ ఏమైంది? జీపీఎఫ్‌లో ఉన్న డబ్బులను కూడా తీసుకునే పరిస్థితి లేదు. పీఆర్సీ ముచ్చటే లేదు. ఉద్యోగుల భాగస్వామ్యంతో హెల్త్‌కార్డులు ఇవ్వాలని కోరినా దాని ఊసేలేదు. హెల్త్‌కార్డులు ఇస్తామని తెచ్చిన జీవో ఏమైందో చెప్పాలి. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఉద్యోగులు, పెన్షనర్లు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్రంలో వరదలు వస్తే ఉద్యోగులమంతా ఏకమై ప్రభుత్వానికి (సీఎంఆర్‌ఎఫ్) రూ.130 కోట్లు ఇచ్చాం. అప్పుడు రెండురోజుల్లో సమావేశం పెడతామన్నారు. ప్రభుత్వానికి చేదోడువాదోడుగా ఉంటున్న ఉద్యోగులకు, ప్రభుత్వం కూడా అదే విధంగా ఉండాలి. జేఏసీ ఏ పార్టీకీ కొమ్ము కాయదు. ఉద్యోగుల సమస్యలపై మాత్రమే పోరాటం ఉంటుంది..' అని జేఏసీ నేతలు స్పష్టం చేశారు.

సీఎం పేషీ ఉద్యోగులే సమస్యలపై ప్రశ్నిస్తున్నారు

'మా సమస్యలపై ఎక్కని గడప లేదు. సీఎం దగ్గరకు వెళదామంటే పేషీ అధికారులు అపాయింట్‌మెంట్ లేదని చెబుతున్నారు. కానీ అక్కడి ఉద్యోగులే డీఏ ఏమైంది? హెల్త్‌కార్డులు ఏమయ్యాయి? అని అడుగుతున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఒకసారి కూర్చుని మాట్లాడితే మా సమస్యలు సగం వరకు పరిష్కారమవుతాయి. ఆయనపై విశ్వాసం ఉంది. ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలు ఇస్తూ ఉద్యోగులకు ఊరటనిచ్చారు. ప్రమోషన్లు, బదిలీలు చేపట్టి మా పక్షాన నిలిచిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. మా న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి. ప్రజా ప్రభుత్వంలో భాగం చేయాలి..' అని జేఏసీ నేతలు కోరారు.

ఉద్యోగుల ప్రధాన డిమాండ్లివీ..

- 2022 జూలై 1 నుంచి పెండింగ్‌లో ఉన్న ఐదు కరువు భత్యాలు (డీఏ)లు వెంటనే విడుదల చేయాలి. బకాయిలను నగదు రూపంలో చెల్లించాలి.
- 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను క్లియర్ చేయాలి, ఇ-కుబేర్ వ్యవస్థను రద్దు చేయాలి. ట్రెజరీ విభాగం ద్వారా బిల్లులను క్లియర్ చేసే పాత విధానాన్ని పునరుద్ధరించాలి.
- అన్ని ఉద్యోగ సంఘాలతో సంప్రదింపులు/చర్చలు ఇప్పటికే పూర్తయినందున ధరల పెరుగుదల ప్రకారం 51 శాతం ఫిట్‌మెంట్‌తో 2వ పీఆర్సీ సిఫార్సుల నివేదిక తెప్పించుకుని అమలు చేయాలి.
- ప్రభుత్వం, ఉద్యోగులు/ పెన్షనర్ల సమాన సహకారంతో ఉద్యోగుల ఆరోగ్య పథకం అమలు చేయాలి.
- పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలి.
- జీవో-317 సమీక్షించాలి.317 జీవో బాధితులు కోరుకునే చోటకు బదిలీ చేయాలి. ఖాళీల లభ్యత కోసం అడగకుండా, వీలైనంత త్వరగా వెబ్‌సైట్ ద్వారా లేవనెత్తిన అన్ని ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించాలి.

ఉద్యోగుల కార్యాచరణ ఇలా..

- ఈ నెల 23 నుంచి 30 వరకు టీజీ జేఏసీ జిల్లా కమిటీల ఏర్పాటు
- 28న సీఎం, సీఎస్‌లకు కార్యాచరణ లేఖ అందజేత
- నవంబర్ 2న జేఏసీ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ర్యాలీలతో కలెక్టర్లకు కార్యాచరణ లేఖ అందజేత
- 4, 5 తేదీల్లో ర్యాలీలతో జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులకు వినతిప్రతాల సమర్పణ
- 6న టీజీ జేఏసీ కార్యవర్గ సమావేశం
- 7 నుంచి డిసెంబర్ 27 వరకు ఉమ్మడి పది జిల్లాల్లో ఉద్యోగుల పెండింగ్ సమస్యల సాధన సదస్సులు
- జనవరి 3, 4 తేదీల్లో నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు. భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన
- 21న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మౌన ప్రదర్శనలు,
- 23న రాష్ట్ర వ్యాప్తంగా బైక్ ర్యాలీలు, 30న రాష్ట్ర వ్యాప్తంగా మానవహారాలు

25న ఇందిరాపార్క్ ధర్నాను విరమించుకోండి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి మంత్రి సీతక్క హితవు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ నేతలు ఈ నెల 25న ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాను విరమించుకోవాలని, గత పదేళ్లలో మూసీ ప్రక్షాళనకు, మూసీ ప్రాంత ప్రజల సంక్షేమం, ఉపాధికి నయా పైసా కేటాయించని కేంద్రం ఎదుట ధర్నా చేయాలని మంత్రి సీతక్క హితవు పలికారు. యూపీఏ హయాంలో మూసీ ప్రక్షాళనకు రూ.335 కోట్లు మంజూరు చేస్తే, మోదీ పాలనలో పైసా మంజూరు కాకపోయినా కిషన్‌రెడ్డి ఎందుకు పెదవి విప్పలేదని మంగళవారం ఓ ప్రకటనలో నిలదీశారు. ఇతర నదుల ప్రక్షాళనకు నిధులిచ్చి మూసీ ప్రక్షాళనకు పైసా కేటాయించకపోవడం తెలంగాణపై కేంద్రం వివక్షతకు నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. సొంత నియోజకవర్గం మీదుగా మూసీ పారుతున్నా ఏనాడూ కేంద్రం నుంచి నిధులు తీసుకురాని కిషన్‌రెడ్డి ఇప్పుడు ధర్నాకు పిలుపునివ్వడం ఏమిటో ఆయన ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో బీజేపీకి చెందిన ముగ్గురు ఎంపీలు, ఒక కేంద్రమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నందున.. కేంద్రంతో చర్చించి హైదరాబాద్ జీవనరేఖగా భావించే మూసీ పునరుజ్జీవానికి రూ.10 వేల కోట్లు మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును సమర్థిస్తున్న బీజేపీ ఇక్కడ మూసీ అభివృద్ధి ప్రాజెక్టును ఎందుకు వ్యతిరేకిస్తోందని ప్రశ్నించారు.

కేటీఆర్ బ్రాయిలర్ కోడి.. రేవంత్ నాటు కోడి: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాజకీయ అవగాహన లేని కేటీఆర్ తన ఇష్టం వచ్చినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తిడితే చూస్తూ ఊరుకోబోమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి హెచ్చరించారు. నాజూకుగా పెరిగిన కేటీఆర్ బ్రాయిలర్ కోడిలాంటివాడని, డక్కామొక్కీలు తిని సీఎం అయిన రేవంత్‌రెడ్డి నాటు కోడి లాంటి వాడని ఆయన వ్యాఖ్యానించారు. పదేళ్ల అధికారంలో ఉండి రాజభోగాలు అనుభవించిన కేటీఆర్, ఇప్పుడు అధికారం లేకపోయేసరికి పిచ్చిలేసి మాట్లాడుతున్నారని విమర్శించారు. మంగళవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో రాష్ట్ర మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి, టీపీసీసీ నేత గజ్జి భాస్కర్ యాదవ్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ, కేటీఆర్ నాలుకకు నరం లేదని, బుర్రకు తెలివి లేదని వ్యాఖ్యానించారు. రాడార్ వ్యవస్థ ఏర్పాటు కోసం దామగుండం ప్రాంతాన్ని కేటాయిస్తూ బీఆర్‌ఎస్ హయాంలో జీవో ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఆ జీవో ఇచ్చినప్పుడు అక్కడ 9 లక్షల చెట్లు ఉన్నాయని, మూసీ అక్కడే పుట్టిందని తెలియదా అని ప్రశ్నించారు. కర్ణాటక, ఢిల్లీ, ఒడిశా ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల రాజకీయ పార్టీలకు డబ్బులు పంపిన కేటీఆర్, తాము ఎవరికీ డబ్బులు పంపకపోయినా పంపామని నిందలు వేయడం సరైంది కాదని జగ్గారెడ్డి చెప్పారు.

మూసీ బాధితులకు బీజేపీ అండ

మూసీపై బీఆర్‌ఎస్ రాజకీయాలు వద్దు: ఎంపీ రఘునందన్‌రావు

అంబర్‌పేట (హైదరాబాద్): మూసీ బాధితులకు భరోసా ఇవ్వడంలో రాజకీయాలకతీతంగా ఉండాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు చెప్పారు. మూసీ నది పరీవాహక ప్రాంతంలో నివసించే పేదలకు అన్యాయం జరగకుండా బీజేపీ అండగా ఉంటుందన్నారు. మూసీ అభివృద్ధి, హైడ్రాకు తాను మద్దతుగా ఉన్నానంటూ బీఆర్‌ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రాకు, మూసీకి ఉన్న తేడాను అమెరికాలో కొలువుచేసిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తెలుసుకోవాలని సూచించారు. మూసీ బాధితులకు భరోసా ఇచ్చేందుకు మంగళవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన గోల్నాక తులసీరామ్‌నగర్, లంక బస్తీల్లో పర్యటించారు. పేదలకు అన్యాయం చేయకుండా మూసీని అభివృద్ధి చేసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు మూసీ బాధితుల కష్టాలు తెలుసుకుంటున్నామని చెప్పారు.



మూసీ పరీవాహక ప్రాంతం గోల్నాకలో పర్యటిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు తదితరులు

చారిత్రక వైభవానికి ఇబ్బంది రావద్దు

- అసఫ్‌జాహీల నిర్మాణ కౌశలం కొనసాగాలి
- ఆగాఖాన్ ప్రతినిధులకు రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబుల మార్గదర్శనం
- పాత అసెంబ్లీ భవన పునర్నిర్మాణంపై స్పీకర్ చాంబర్‌లో సమీక్ష

సాక్షి, హైదరాబాద్: అసఫ్‌జాహీల నిర్మాణ కౌశలం కొనసాగాలని, పాత అసెంబ్లీ భవన చారిత్రక వైభవానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా పునరుద్ధరించాలని రాష్ట్ర ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆగాఖాన్ నిర్మాణ సంస్థ ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. పాత అసెంబ్లీ భవన పునరుద్ధరణ పనులపై శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి మంగళవారం అసెంబ్లీ స్పీకర్ చాంబర్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు, ఆర్‌అండ్‌బీ అధికారులు, ఆగాఖాన్ ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ రాబోయే మూడు నెలల్లో ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, చారిత్రక వైభవానికి ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు. ఆగాఖాన్ ట్రస్ట్‌కు రూ.2 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్న విషయం తెలియడంతో వెంటనే స్పందించిన మంత్రి.. సమావేశం నుంచే ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడి నిధులు విడుదల చేయించారు. బిల్లుల కోసం ప్రజోపయోగ పనులను ఆపవద్దని అధికారులకు సూచించారు. ఏవైనా బిల్లులు పెండింగ్‌లో ఉన్నా, ఇతర సమస్యలేమి ఉన్నా తనకు లేదా మంత్రి శ్రీధర్‌బాబుకు చెప్పాలని కోరారు. ఈ భవనం అందుబాటులోకి వస్తే కౌన్సిల్‌హాల్‌ను అసెంబ్లీ భవనంలోకి మార్చవచ్చన్నారు. శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పాత అసెంబ్లీ భవన పునరుద్ధరణ పనుల పర్యవేక్షణ కోసం ఎస్‌ఈ స్థాయి అధికారిని నియమించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు.



పాత అసెంబ్లీ భవన పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి తదితరులు

అదో పెద్ద జోక్: మంత్రి కోమటిరెడ్డి

ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ, విద్యుత్ చార్జీల అంశంపై కేటీఆర్ ఈఆర్సీ దగ్గరకు వెళ్లడం పెద్ద జోక్ అని అన్నారు. ఆయనో జోకర్ అని, పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు రాకుండా ప్రజలు ఓడించినా వారికి బుద్ధి రాలేదన్నారు. 200 యూనిట్ల వరకు పేదలకు తమ ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ అందజేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు రాష్ట్రాభివృద్ధికి కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

ఇది కుట్రా... లేక ద్వేషమా?

- హిందూ వ్యతిరేక కాంగ్రెస్ సర్కార్ సమాధానం చెప్పాలి
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై 'ఎక్స్'వేదికగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: వివిధ హిందూ సంస్థల కార్యకర్తల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, వారిపై అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. హిందూ సంస్థల పట్ల, ఆ సంస్థల కార్యకర్తలపట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై కిషన్‌రెడ్డి సామాజిక మాధ్యమం 'ఎక్స్'వేదికగా విరుచుకుపడ్డారు. 'ఇది కుట్రా? లేక ద్వేషమా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని హిందూ వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలి'అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. 'ముందుగా...భారతీయ న్యాయసంహిత సెక్షన్ 176, సెక్షన్ 173 నిబంధన కింద 3 క్రిమినల్ కేసుల కింద ఎఫ్ఐఆర్ ఫైల్ చేసిన పోలీసులు..సోమవారం అర్ధరాత్రి సమయంలో..ఆ ఎఫ్ఐఆర్‌లో మార్పులు చేసి సెక్షన్ 109 (హత్యాయత్నం)ను చేర్చారు. ఇది హిందూ సంస్థల సభ్యులను హింసించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచనను తెలియజేస్తోంది'అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

హిందూ ప్రజలు, సంస్థల పట్ల సీఎంకు ద్వేషభావం: ఈటల



సాక్షి, హైదరాబాద్: హిందూ ప్రజలు, సంస్థల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి ద్వేషభావనతో ఉన్నారని బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో సంఘవిద్రోహ శక్తుల కుట్రలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీది ఒకటే సంస్కృతి అని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మత విద్వేషాలు సృష్టించే వారిని ఏనాడు నియంత్రించలేదని విమర్శించారు. మంగళవారం ఈటల మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో మతోన్మాదులకు షెల్టర్ ఇస్తూ వారిని పెంచి పోషిస్తున్నా కట్టడిచేయలేదని ఆరోపించారు. హిందూ ఆలయాలపై దాడులకు పాల్పడిన విషయంలో ప్రశ్నిస్తున్న వారిని సంఘ విద్రోహశక్తులుగా, మతోన్మాదులుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంపై దాడి ఘటన తర్వాత హిందూ ప్రజానీకం ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని కించపర్చే ప్రసంగాలు చేస్తున్నది ఎవరో తేలిపోయిందన్నారు. హిందూ సమాజంపై విషాన్ని కక్కుతూ, ప్రజలను రెచ్చగొట్టే దుర్మార్గమైన వ్యక్తుల కట్టడిలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సీఎం కేవలం ఎంఐఎం మెప్పు కోసం, ఓటుబ్యాంకు రాజకీయాల కోసమే పనిచేస్తున్నారని ఈటల మండిపడ్డారు.

తెలంగాణలో చిచ్చు పెట్టే యత్నం

రేవంత్‌పై ఈర్ష్యతోనే ఈటల విమర్శలు: ఆది శ్రీనివాస్



సాక్షి, హైదరాబాద్: సెక్యులరిస్టుగా చెప్పుకునే ఈటల రాజేందర్ పూర్తిగా మతతత్వ వాదిగా మారాడని, అందుకే కాంగ్రెస్ పార్టీ గురించి అర్థంలేని విమర్శలు చేస్తున్నారని అసెంబ్లీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టడమే ధ్యేయంగా ఈటల చర్యలున్నాయని, ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో చిచ్చుపెట్టేందుకు బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో జరిగిన ఘటన దురదృష్టకరమని, ఘటన జరిగిన వెంటనే పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారని, దానిపై పూర్తిస్థాయి విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ ఘటన విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డిపై ఉన్న ఈర్ష్య, ద్వేషంతో ఈటల విమర్శలు చేస్తున్నారని, రాజకీయ లబ్ధి కోసమే రేవంత్‌పై విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో సామరస్య వాతావరణం కొనసాగించడమే ధ్యేయంగా సీఎం పనిచేస్తున్నారని, తమ రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ నేతలు అలజడులు సృష్టించవద్దని ఆది శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

30 దాకా బీజేపీ సభ్యత్వ నమోదు

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 30వ తేదీ వరకు బీజేపీ నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పొడిగించినట్టు రాష్ట్ర సభ్యత్వ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్ రావు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తం 24 లక్షల (ఆన్‌లైన్ ద్వారా 20 లక్షలు, మిస్డ్ కాల్ ద్వారా 4 లక్షలు) సభ్యత్వాల నమోదు జరిగిందని వెల్లడించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. సెప్టెంబర్ 25న దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి రోజు.. లక్షా 35 వేల సభ్యత్వాలు నమోదైనట్టు పేర్కొన్నారు. 88 0000 2024 నంబర్‌కు మిస్డ్ కాల్ ద్వారా లింక్‌లోకి వెళ్లి.. సభ్యులుగా చేరవచ్చునని సూచించారు.

దివాళా అంటూ దిక్కుమాలిన ప్రచారం

- అప్పులు.. వనరులు.. ఆర్థిక నిర్వహణలో తెలంగాణ టాప్
- ఆరు గ్యారంటీలు అమలు చేయలేక బీఆర్‌ఎస్‌పై విష ప్రచారం
- రాష్ట్ర ఆదాయం తగ్గి..కాంగ్రెస్ నేతల ఆదాయం పెరుగుతోంది
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం భారీగా అప్పులు చేసి ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రం దివాళా అంటూ దిక్కుమాలిన ప్రచారం చేస్తోందని సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో మండిపడ్డారు. వనరులు.. అప్పులు.. ఆర్థిక నిర్వహణలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని సూచీలు వెల్లడిస్తున్నాయన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు నెరవేర్చలేక కేసీఆర్‌పై కాంగ్రెస్ బురద చల్లుతోందన్నారు. తమ చేతకానితనాన్ని కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై అర్థం లేని వ్యాఖ్యలతో తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ రిజర్వు బ్యాంకు నివేదికలు, కాగ్ గణాంకాలు, ఆర్థిక మండలి నివేదికలు, ఆర్థిక వేత్తల విశ్లేషణలన్నీ తెలంగాణ ఆర్థిక సౌష్టవం, పటిష్టతను పదేపదే నిరూపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రచురించిన సామాజిక ఆర్థిక నివేదికలో కూడా పదేళ్లుగా తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతిని గణాంకాలు వెల్లడిస్తున్నాయని చెప్పారు. సొంత ఆదాయం సమకూర్చుకోవడంలో తెలంగాణ ఎప్పుడూ దేశంలో అగ్రస్థానంలోనే ఉందన్నారు. ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితి దాటకుండా అప్పుల విషయంలో గత ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించిందన్నారు.

నీచ ప్రచారాలను సహించేది లేదు

తన వ్యక్తిత్వంపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్న వారిని వదిలిపెట్టేది లేదని కేటీఆర్ హెచ్చరించారు. తన వ్యక్తిత్వ హననం చేసేలా ప్రధాన మీడియాతోపాటు సోషల్ మీడియాలో చేసే నీచ ప్రయత్నాలపై ఇకపై కఠినంగా వ్యవహరిస్తానని చెప్పారు. రాజకీయ విమర్శల పేరిట ఆధారాలు లేకుండా నీచమైన వ్యాఖ్యలు చేసేవారికి కొండా సురేఖపై వేసిన రూ.100 కోట్ల పరువు నష్టం దావా ఒక గుణపాఠం కావాలన్నారు. రాష్ట్ర ఆదాయం తగ్గుతుండగా, కాంగ్రెస్ నాయకుల ఆదాయం భారీగా పెరుగుతోందన్నారు.

అదుపు తప్పిన శాంతిభద్రతలు

కొద్ది నెలలుగా రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పా యని జనం చేస్తున్న ఆందోళనలకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రుజువు చేస్తున్నాయని కేటీఆర్ అన్నారు. ఇకనైనా శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వ పెద్దలు వివేకంతో ఆలోచించాలని చెప్పారు. పోలీసు ఉన్నతాధికారులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వడంతోపాటు సమర్థవంతమైన పోలీసు ఉన్నతాధికారుల సేవలు వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని మలక్‌పేటలో గతేడాది అక్టోబర్‌లో శంకుస్థాపన చేసిన ఐటీ పార్క్ టవర్ పనులు 11 నెలలుగా ఒక్క అంగుళం కూడా ముందుకు కదలడం లేదన్నారు.


SMART BAZAAR
దీపావళి రెడీ సేల్
ఆత్మీయులకు ప్రత్యేక కానుక!
పండుగ కొనుగోలు పూర్తి చేసుకోవటానికి, స్మార్ట్ బజార్ కు విచ్చేయండి
BUY 1 GET 1 FREE
BUY ANY 1 GET ANY 1 FREE
25%
BUY ANY 2 GET ANY 1 FREE
₹49
₹999
₹899
₹399
50%
అందంగా పండుగ జరుపుకోండి
రుచికరమైన వంటకం చేసుకోండి
₹555
₹205
₹359 ₹479
₹126
BUY ANY 2 GET ANY 1 FREE
₹80
BUY ANY 3 GET ANY 1 FREE
BUY 1 GET 2 FREE
₹1499
₹29999
₹13499
₹7499
₹299
10% INSTANT DISCOUNT*
SBI card
*Min. Trxn.: ₹3,000; Max. Discount: ₹500 Per Trxn; Valid only on one Trxn. per Credit Card; Validity: 23 Oct - 27 Oct 2024. T&C Apply.
వద్ద కూడా లభ్యం
JioMart
fresh Signature
SMART SUPERSTORE


MARUTI SUZUKI
NEXA
STEP UP IN LIFE WITH THE GRAND VITARA DOMINION EDITION.
ENJOY SPECIAL SUV EXCHANGE BENEFITS & MORE.
DOMINION EDITION
GET ACCESSORY PACKAGE OF UP TO
₹52 699*
GRAND VITARA
ONLY 09 DAYS LEFT
GRAND CONSUMER OFFERS UP TO ₹20 000#
GRAND MARUTI SUZUKI SMART FINANCE OFFER
GRAND EXCHANGE BONUS UP TO ₹85 000#
PER LAKH EMI STARTING FROM ₹1 475*
HYDERABAD: NEXA SIDDIPET CENTRAL (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 9010136633), NEXA NAGOLE (KALYANI MOTORS PH: 08062216283),
NEXA MUSHEERABAD (THE MITHRA AGENCIES PH: 08062512735), NEXA RAIDURGAM (PAVAN MOTORS PVT. LTD. PH: 08062511381), NEXA LUMBINI PARK (RKS MOTORS PH: 08062512705),
NEXA MALAKPET (GEM MOTORS INDIA PVT. LTD. PH: 08062511663), NEXA KUKATPALLY (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 08062511747),
NEXA GACHIBOWLI (JAYABHERI AUTOMOTIVE PH: 08062512783), NEXA QCITY ROAD (SAI SERVICE PVT. LTD. PH: 08062512101), NEXA BANJARA HILLS (VARUN MOTORS PH: 08062510767),
NEXA JUBLIEE (RKS MOTORS PH: 08062512711), BEGUMPET: NEXA BEGUMPET (VARUN MOTORS PH: 08062216798), ATTAPUR: NEXA ATTAPUR (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 08062512831),
MIYAPUR: NEXA MIYAPUR (JAYABHERI AUTOMOTIVE PH. 08062511765), SECUNDERABAD: NEXA BOWENPALLY (AUTOFIN LIMITED PH: 08062512192), NEXA SAINIKPURI (VARUN MOTORS PH: 08062512359).
Contact us at 1800-200-[6392], 1800-102-[NEXA] and visit www.nexaexperience.com to book online.
3 years 100 000 km WARRANTY*



"సౌకర్యవంతంగా ఎలా శ్వాసించాలో, మనసును వర్తమాన క్షణం మీద ఎలా లగ్నం చేయాలో మనం నేర్చుకోవాల్సి ఉంది.
– థానిస్సరో భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 23 అక్టోబర్ 2024

అధిక జనాభా వరమా!

కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఇష్టమున్నా లేకున్నా జనాభా అంశంపై చర్చ ఊపందుకుంది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ మరో ఏణ్ణర్థంలో ప్రారంభం కావాల్సిన నేపథ్యంలో ఈ చర్చ ఎంతో అవసరమైనదీ, తప్పనిసరైనదీ. అయితే ఇందులో ఇమిడివున్న, దీనితో ముడిపడివున్న అనేకానేక ఇతర విషయాలను కూడా స్పృశిస్తే ఈ చర్చ అర్థవంతంగా ఉంటుంది. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సామూహిక వివాహాల సందర్భంగా సోమవారం కొత్త దంపతుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ, '2026లో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన పుణ్యమా అని చిన్న కుటుంబానికి బదులు ఎక్కువమంది సంతానాన్ని కనాలని ఆశీర్వదించే రోజులొచ్చేశాయి' అని వ్యాఖ్యానించటం గమనించదగ్గది. తెలుగునాట అష్టయిశ్వర్యాలు లభించాలని దంపతులను ఆశీర్వదించినట్టే తమిళగడ్డపై కొత్త దంపతులకు 16 రకాల సంపదలు చేకూరాలని ఆకాంక్షించటం సంప్రదాయం. ఆ ఆకాంక్షను పొడిగించి ఎక్కువమంది పిల్లల్ని కనాలని ఆశీర్వదించాల్సి వస్తుందన్నది ఆయన చమత్కారం. ఆ మాటల వెనక ఆంతర్యం చిన్నదేమీ కాదు. పునర్విభజన ప్రక్రియ పూర్తయ్యాక లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 స్థానాలూ అమాంతం 753కు చేరుకుంటాయని నిపుణులు చెబుతున్నారు. అంటే ఒక్కసారిగా 210 స్థానాలు పెరుగుతాయన్న మాట! ఆ నిష్పత్తిలో శాసన సభల్లో సైతం సీట్ల పెరుగుదల ఉంటుంది. జనాభా పెరుగుదల రేటులో తీవ్ర వ్యత్యాసాలు కనబడుతున్న నేపథ్యంలో అధిక జనాభాగల ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ లోక్‌సభ స్థానాలూ... ఆ పెరుగుదల అంతగా లేని దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ సంఖ్యలో స్థానాలూ వస్తాయన్నది ఒక అంచనా. మరో మాటలో చెప్పాలంటే జనాభా నియంత్రణపైనా, విద్యపైనా, ఆర్థికాభివృద్ధిపైనా పెద్దగా దృష్టి పెట్టని రాష్ట్రాలు లాభపడబోతున్నాయన్నమాట!

దేశంలో చివరిసారిగా 1976లో పునర్విభజన జరిగింది. ఈ ప్రక్రియ క్రమం తప్పకుండా చేస్తే సమస్యలకు దారి తీయొచ్చన్న కారణంతో 42వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చి పునర్విభజన ప్రక్రియను 2000 వరకూ స్తంభింపజేశారు. అయితే 2001లో 84వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల పరిధిలోని ప్రాంతాల హేతుబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. దాని ప్రకారం లోక్‌సభ స్థానాల సంఖ్య, వాటి పరిధి 2026 తర్వాత జరిగే జనగణన వరకూ మారదు. అయితే ఆ పరిధిలోని అసెంబ్లీ స్థానాలను హేతుబద్ధీకరించవచ్చు. దాని పర్యవసానంగా ఉమ్మడి ఏపీ అసెంబ్లీలోని 294 స్థానాల సంఖ్య మారకపోయినా ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో జిల్లాలవారీగా సీట్ల సంఖ్య మారింది. అన్ని రాష్ట్రాల్లోనూ ఇలాగే జరిగింది.

ప్రతి రాష్ట్రానికీ దాని జనాభా నిష్పత్తికి అనుగుణంగా లోక్‌సభలో ప్రాతినిధ్యం కల్పించాలని మన రాజ్యాంగం నిర్దేశిస్తోంది. దేశంలో ప్రతి ఒక్కరి ఓటు విలువా ఒకేవిధంగా ఉండాలన్నది దీని ఆంతర్యం. 2021లో జరగాల్సిన జనగణన కరోనా కారణంగా వాయిదా వేయక తప్పలేదని కేంద్రం ప్రకటించింది. కనుక వాస్తవ జనాభా ఎంతన్నది తెలియకపోయినా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలోని సాంకేతిక బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఆ సంఖ్యను 142 కోట్లుగా లెక్కేస్తున్నారు. రాష్ట్రాలవారీగా జనాభా ఎంతన్న అంచనాలు కూడా వచ్చాయి. దాన్నే పరిగణనలోకి తీసుకుంటే ఉత్తరప్రదేశ్ నుంచి ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలు 80 కాస్తా 128కి చేరుతాయి. బిహార్‌కు ఇప్పుడు 40 స్థానాలున్నాయి. అవి 70కి ఎగబాకుతాయి. అలాగే మధ్యప్రదేశ్‌కు ఇప్పుడున్న 29 నుంచి 47కూ, రాజస్థాన్‌కు ప్రస్తుతం ఉన్న 25 కాస్తా 44కు పెరుగుతాయని అంచనా. మహారాష్ట్రకు ప్రస్తుతం 48 ఉండగా అవి 68కి వెళ్లే అవకాశం ఉందంటున్నారు. కానీ అదే సమయంలో జనాభా నియంత్రణలో విజయం సాధించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పెరిగే సీట్ల సంఖ్య స్వల్పంగా ఉంటుంది.

దేశ జనాభా వేగంగా పెరుగుతున్నదనీ, ఇదే కొనసాగితే భవిష్యత్తులో అందరికీ చాలినంత ఆహారం లభ్యం కావటం అసాధ్యమన్న అభిప్రాయం ఒకప్పుడుండేది. ఎమర్జెన్సీ రోజుల్లో బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించిన ఉదంతాలకు లెక్కేలేదు. మొత్తంగా జనాభా పెరుగుతూనే ఉన్నా, ప్రపంచంలో అత్యధిక జనాభాగల దేశం మనదే అయినా గడిచిన దశాబ్దాల్లో పెరుగుదల రేటు తగ్గింది. ఈ తగ్గుదల సమంగా లేదు. దక్షిణాది రాష్ట్రాల్లో అధికంగా, ఉత్తరాది రాష్ట్రాల్లో స్వల్పంగా నమోదవుతోంది. ఉదాహరణకు 1951లో తమిళనాడు జనాభా బిహార్ కంటే స్వల్పంగా అధికం. 6 దశాబ్దాల తర్వాత బిహార్ జనాభా తమిళనాడుకన్నా ఒకటిన్నర రెట్లు ఎక్కువ!

దక్షిణాదిన జనాభా పెరుగుదల పెద్దగా లేకపోవటానికి ఆర్థికాభివృద్ధి, స్త్రీలు బాగా చదువుకోవటం, దారిద్ర్యం తగ్గటం ప్రధాన కారణాలు. దేశ జనాభాలో 18 శాతంగల దక్షిణాది రాష్ట్రాలు దేశ జీడీపీకి 35 శాతం వాటా అందిస్తున్నాయి. కుటుంబాల్లో స్త్రీల నిర్ణయాత్మక పాత్ర ఉత్తరాదితో పోలిస్తే పెరిగింది. కీలకాంశాల్లో ఉత్తరాది రాష్ట్రాలు ఘోరంగా విఫలమయ్యాయి. ఈ వైఫల్యం వరం కావటం న్యాయమేనా? స్టాలిన్ మాటల ఆంతర్యం అదే. మరికొందరు నేతలు జనాభా పెంచమంటూ ముసిముసి నవ్వులతో సభల్లో చెబుతున్నారు. ఇది నవ్వులాట వ్యవహారం కాదు. పునరుత్పాదక హక్కు పూర్తిగా మహిళలకే ఉండటం, అంతిమ నిర్ణయం వారిదే కావటం కీలకం. అసలు పునర్విభజనకు జనాభా మాత్రమే కాక, ఇతరేతర అభివృద్ధి సూచీలనూ, దేశ ఆర్థికాభివృద్ధిలో రాష్ట్రాల పాత్రనూ పరిగణనలోకి తీసుకోవటం అవసరం. ఈ విషయంలో విఫలమైతే దక్షిణాది రాష్ట్రాల్లో అసంతృప్తి పెరగటం ఖాయమని కేంద్రం గుర్తించాలి.


గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.షష్ఠి ఉ.6.32 వరకు
తదుపరి సప్తమి తె.5.58 వరకు (తెల్లవారితే గురువారం),
నక్షత్రం: ఆరుద్ర ఉ.11.16 వరకు, తదుపరి పునర్వసు,
వర్జ్యం: రా.11.23 నుండి 12.59 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.23 నుండి 12.11 వరకు, **అమృతఘడియలు:** లేవు.

సూర్యోదయం : 5.58
సూర్యాస్తమయం: 5.32
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

రెండు దేశాలుగా బతకడమే దారి

అభిప్రాయం



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

హమాస్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం ఏడాదికి పైగా సాగుతోంది. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పాలస్తీనా, ఇరాన్, లెబనాన్ ఒక రకమైన అక్ష శక్తిగా మారాయి. 75 సంవత్సరాల తర్వాత కూడా ఒక దేశంగా ఇజ్రాయెల్ ఉనికిని గుర్తించడానికి ఇరాన్, పాలస్తీనా నిరాకరిస్తున్నాయి. ఇది పశ్చిమాసియాకే కాదు, ప్రపంచానికి కూడా సమస్య. 1993 నార్వే ఒప్పందాన్ని ఇజ్రాయెల్ అంగీకరించి, సంతకం చేసింది. ఇది రెండు దేశాల సూత్రాన్ని నిర్దేశించింది. దీని ప్రకారం ఇజ్రాయెల్, పాలస్తీనా ఒకరినొకరు గుర్తించుకోవాలి. యుద్ధం వల్ల దయనీయంగా మారిన పాలస్తీనా ప్రజానీకం పట్ల సానుభూతి చూపుతాము. అయితే పరిష్కారం ఏమిటి? అది రెండు దేశాల సూత్రంలో ఉందనీ, ఆ సూత్రాన్ని ఆచరణలో పెట్టాల్సి ఉందనీ మనందరికీ తెలుసు.



పాలస్తీనాలోని గాజా విముక్తి దళం అని పిలవబడే హమాస్‌పై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం ఏడాదికి పైగా సాగుతోంది. ఒక వేడుకలో పాల్గొన్న 1,200 మంది ఇజ్రాయెల్ పౌరులను హమాస్ దళాలు దారుణంగా వధించడంతో ఇది ప్రారంభమైంది. 2023 అక్టోబర్ 7న జరిగిన ఆ అనాగరిక దాడిలో ఇజ్రాయెల్ పిల్లలు, మహిళలు, పురుషులు దారుణంగా చంపబడ్డారు. ఏ నిర్వచనం ప్రకారమైనా, ఇది ఉగ్ర వాద దాడి. ప్రతీకారంగా, ఇజ్రాయెల్ ప్రభుత్వం హమాస్‌పై భారీ యుద్ధాన్ని ప్రారంభించింది. పాలస్తీనాలో పిల్లలు, మహిళలు సహా వేలాదిమంది చనిపోయారు. వెస్ట్ బ్యాంక్ దాదాపు శిథిలావస్థకు చేరుకుంది.

2023 అక్టోబర్ 7 నాటి మారణకాండను ఖండించకుండా ఇరాన్, లెబనాన్ కూడా హమాస్‌కు మద్దతుగా ఈ యుద్ధంలోకి ప్రవే శించాయి. ఆ విధంగా ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఒక రకమైన అక్ష శక్తిగా మారాయి. కానీ అవి ఇజ్రాయెల్ బలంతో సరిపోలగలవా? ఇజ్రాయెల్ తన అత్యంత అధునాతన సాంకేతికత, యుద్ధ వ్యూహంతో హమాస్ ఆయుధ శక్తిని, ప్రధాన నాయకత్వాన్ని నాశనం చేసింది.

దక్షిణ గాజాలోని రఫా లక్ష్యంగా సాగించిన గ్రౌండ్ ఆపరేషన్‌లో హమాస్ చీఫ్ యాహ్యా సిన్వార్‌ను అంతమొందించినట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) అక్టోబర్ 17న ప్రకటించింది. సిన్వార్ హత్య హమాస్‌కు చావుదెబ్బ. ఇరాన్, లెబనాన్ ఈ యుద్ధంలో తమ పౌర, సైనిక సిబ్బందిని పణంగా పెట్టడానికి సాహసించక పోవచ్చు.

రెండు దేశాల పరిష్కారం

సమస్యకు పరిష్కారం రెండు దేశాల సూత్రంలో ఉందనీ, ఆ సూత్రాన్ని ఆచరణలో పెట్టాల్సి ఉందనీ మనందరికీ తెలుసు. ఇజ్రాయెల్ ఆ సూత్రాన్ని అంగీకరించింది. కానీ హమాస్, ఇరాన్ వ్యతిరేకించాయి. ఇజ్రాయెల్ 1948లో ఆధునిక దేశంగా ఆవిర్భవించినప్పటికీ, తన ప్రజల సుదీర్ఘ ప్రవాస జీవితం తర్వాత, ఎడారి భూమిలో ఆధునిక ప్రజాస్వామ్య, వ్యవసాయ, పారిశ్రామిక దేశంగా తనను తాను నిర్మించుకుంది. కానీ పాలస్తీనా పాలకులు వ్యక్తి స్వేచ్ఛ, ఓటు హక్కులు అమలులోకి వచ్చే ప్రజాస్వామ్యాన్ని సాధ్యమైన వ్యవస్థగా ఎన్నడూ అంగీకరించలేదు. ఇతర ముస్లిం మత నిరంకుశ దేశాల కంటే అధ్వానంగా, పాలస్తీనా, ఇరాన్, ఈజిప్ట్, లెబనాన్ వంటి దేశాలు ఉగ్రవాద కేంద్రాలుగా మారాయి.

ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తిగత హక్కుల క్రమబద్ధమైన ప్రక్రియను అంగీకరించే ఏ దేశమూ ఆధునిక పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలలో స్వీయ విధ్వంస స్థితిని సృష్టించదు. హమాస్, హిజ్బుల్లా, ముస్లిం బ్రదర్‌హుడ్ వంటి ఉగ్రవాద సంస్థలు ప్రపంచం మొత్తానికి సమస్యలను సృష్టించాయి. ఇవి ప్రజల ఆర్థిక అభివృద్ధిపై దృష్టి పెట్టవు. ప్రజలు శాంతియుతంగా వ్యవసాయ లేదా పారిశ్రామిక పనిలో పాల్గొనడానికి అనుమతించవు. స్త్రీ వ్యతిరేక ఆధ్యాత్మిక సైద్ధాంతిక చర్చలకు పూనుకుంటాయి. తాలిబన్ రూపంలో ఇలాంటి బలగం కారణంగా అఫ్గానిస్తాన్‌లో ఏం జరుగుతోందో మనకు తెలుసు.

75 సంవత్సరాల తర్వాత కూడా ఒక దేశంగా ఇజ్రాయెల్ ఉనికిని గుర్తించడానికి ఇరాన్, పాలస్తీనా నిరాకరిస్తున్నాయి. ఇది పశ్చిమాసియాకే కాదు, ప్రపంచానికి కూడా సమస్య. 1948కి ముందు దాని ప్రజలు పదేపదే దేశభ్రష్టులైనప్పటికీ, ఇజ్రాయెల్ ఉనికిని తిరస్కరించడాన్ని చరిత్ర అంగీకరించదు.

సామాజిక–ఆర్థిక పరిస్థితులు

2019లో నేను ఇజ్రాయెల్, పాలస్తీనాలో విస్తృతంగా పర్యటించి రెండు దేశాల సామాజిక–ఆర్థిక పరిస్థితులను గమనించాను. ఇజ్రాయెల్ వైభవాన్ని, గొప్ప పచ్చని ఉత్పత్తి క్షేత్రాలలో సర్వత్రా చూడవచ్చు. వారు ఎడారులను ఉత్పాదక భూములుగా మార్చారు. పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న పాలస్తీనా ప్రజలు, అక్కడి ఏ గ్రామిక ప్రజానీకం... పురుషులు, మహిళలు కూడా ఎడారిలోని పాక్షిక సాగు పొలాల్లో కనిపించరు. వారి వ్యవసాయ భూములలో ఒక్క స్త్రీని కూడా మనం చూడలేము. ఇజ్రాయెల్ స్త్రీలు భారతీయ శూద్ర, దళిత స్త్రీల లాగే నిత్యం పని చేస్తూనే ఉంటారు.

యూదుల కష్టపడి పనిచేసే సంస్కృతి, ఆధ్యాత్మిక తత్వశాస్త్రం వారికి సహాయపడ్డాయి. ఐక్యరాజ్యసమితి ఆర్థిక సహాయం ఉన్నప్పటికీ, అర్థవంతమైన విద్యాసంస్థలను అభివృద్ధి చేయకుండా పాలస్తీనా పేద దేశంగా మిగిలిపోయింది. వారి ఏకైక ఆశ మతం. ఉత్పత్తి లేకుండా మతం వారికి సహాయం చేస్తుందా?

ఇజ్రాయెల్ రాజకీయ వ్యవస్థ సెక్యులరిజం సూత్రాలపై ఆధారపడి నడుస్తుంది. కానీ, పాలస్తీనా, ఇరాన్, లెబనాన్, ఈజిప్టులలో ఇలాంటి వ్యవస్థలు ఉన్నాయా? అవి మత నియంతృత్వాలని మనకు తెలుసు.

కొత్త ఒప్పందాలు అవసరమా?

1993 నార్వే ఒప్పందాన్ని ఇజ్రాయెల్ అంగీకరించి, సంతకం చేసింది. ఇది రెండు దేశాల సూత్రాన్ని నిర్దేశించింది. దీని ప్రకారం ఇజ్రాయెల్, పాలస్తీనా ఒకరినొకరు గుర్తించుకోవాలి. రెండవది 1994 నాటి అబ్రహాం ఒప్పందం. ఇది అబ్రహామిక్ సంస్కృతికి చెందిన పిల్లలుగా యూదులు, ముస్లింల ఉమ్మడి చారిత్రక వారసత్వంతో రెండు దేశాల సహజీవనం గురించి మాట్లాడుతుంది. పాలస్తీనా, ఇరాన్ ఆ ఒప్పందాలను తిరస్కరించాయి.

పాలస్తీనా సాధారణ ప్రజానీకం పట్ల, ప్రత్యేకించి పిల్లలు, మహిళలు, శరణార్థుల దుఃస్థితి పట్ల మనమందరం సానుభూతి చూపుతాము. అయితే పరిష్కారం ఏమిటి? పాలస్తీనా, ఇజ్రాయెల్ ఆ రెండు ఒప్పందాలను గౌరవించాలా లేక కొత్త ఒప్పందాన్ని కుదుర్చుకోవాలా? పాలస్తీనా దైవపాలనా సూత్రాల ఆధారంగా పనిచేస్తోంది. ఇజ్రాయెల్‌కు ప్రజాస్వామ్యం పట్ల ఉన్నంత గౌరవం పాలస్తీనా నాయకులకు లేదు. నా ఉద్దేశంలో వారు ఆ చిన్న భూమిలో రెండు చిన్న దేశాలుగా జీవించాలి. వేరే అవకాశమే లేదు.

ఉభయ దేశాలలోని, ముఖ్యంగా పాలస్తీనాలోని కష్టాల్లో ఉన్న ప్రజల పట్ల సానుభూతి చూపుతున్న ప్రపంచ మేధావులు ముస్లిం ప్రపంచంలో సంస్కరణల గురించి మాట్లాడుతూనే ఉండాలి. ముస్లిం దేశాలు సరైన ఎన్నికల ఆధారిత ప్రజాస్వామ్యాల వైపు వెళ్లాలి. మత నిరంకుశ రాజ్యాలలో ఉండకూడదు. యూదులు ఆ భూమిని విడిచి పెట్టి, 1948కి ముందున్న చోటికి తిరిగి వెళ్లాలంటున్న పాలస్తీనా, ముఖ్యంగా హమాస్, ఇరాన్ డిమాండ్‌ను వారు అంగీకరిస్తున్నట్లయితే, అలాంటి మేధో అజ్ఞానం మానవ విలువలకు మరింత వినాశనాన్ని తెస్తుంది.

పాలస్తీనియన్లను ఆ భూభాగం నుండి బయటకు వెళ్ళమని ఇజ్రాయెలీలు కోరినట్లయితే వారికి కూడా అదే విషయం వర్తిస్తుంది. ఇలాంటి ఘోరమైన సమస్యలన్నింటికీ ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేసే రెండు దేశాల పౌరుల్లోనే పరిష్కారాలు కనిపిస్తాయి. మనం ఇప్పుడు ఇజ్రాయెల్ నుండి వారి సొంత ప్రభుత్వానికి వ్యతిరేకంగా భిన్నాభిప్రాయాలను వింటున్నాము. యుద్ధం ముగిసిన తర్వాత ఇజ్రాయెల్ పౌరులు ప్రస్తుత ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహును పదవి నుంచి దించేయవచ్చు. యాహ్యా సిన్వార్ బతికి ఉంటే పాలస్తీనియన్లు అలా చేసి ఉండేవారా?

ఉక్రెయిన్, రష్యా సమస్యలా కాకుండా ఇజ్రాయెల్, పాలస్తీనా సమస్య నాగరికతా సమస్య. కాబట్టి మనమందరం ముస్లిం దేశాలు మొత్తంగా ప్రజాస్వామ్యం వైపు మారడం గురించి ఆలోచించాలి. పాలస్తీనా తన సొంత ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హమాస్ పట్టు నుండి బయటపడాలి. రెండు దేశాల పరిష్కారాన్ని అంగీకరిస్తూ, ప్రపంచానికీ, దాని సొంత ప్రజలకూ మేలు చేయాలి.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

సాపేక్షం



భవిష్యత్ అనేది మరీ వేగంగా సంభవించడం అన్నది కాదు విషయం, గతం మరీ నెమ్మదిగా జరిగింది.

– సామ్ ఆల్ట్‌మన్, 'ఓపెన్ ఏఐ' సీఈఓ

వెలుగు మాట



దీపావళి అంటే 'వెలిగించిన మట్టి ప్రమిదల వరుస' అని అర్థం. నగరాన్నీ, ఇంటినీ ఆనందోత్సాహాలతో వెలిగించే పండుగ అది. టపాకాయలు కాల్చడం ద్వారా కుక్కలు, చిన్నారులు, వృద్ధులను భయపెట్టడం, శ్వాస ఇబ్బందులకు గురిచేయడం, వాయు నాణ్యతను క్షీణింపజేయడం మాత్రం పండుగ కాదు.

– నటాషా రామరత్నం, యాక్టివిస్ట్

యుద్ధం ఆగాలి!



అమెరికా బహుముఖ, బహుస్థాయిల అత్యంత నైపుణ్యపు విదేశాంగ విధానాన్ని ఉద్వేగపూరిత భారత విదేశాంగ విధాన వ్యాఖ్యాతలు అర్థం చేసుకుంటున్నట్టు లేదు. వాళ్లు 190 దేశాలతో భిన్న అంశాలతో ఆటాడుతుంటారు. దాన్ని అర్థం చేసుకోవడం ద్వారానే వాళ్ల ఆటలో వాళ్లను ఓడించగలం. సరళమైన పడికట్టు మాటలతో కాదు.

– అరవింద్ విర్‌మానీ, నీతి ఆయోగ్ సభ్యుడు

శుభాకాంక్షలు



మన గౌరవనీయ కేంద్ర హోంమంత్రి అమిత్ షాజీకి హృదయపూర్వక జన్మదిన (అక్టోబర్ 22 : అరవయ్యో జన్మదినం) శుభాకాంక్షలు. మీ ప్రతీ ముందడుగులోనూ మంచి ఆరోగ్యం, సంతోషం మీ తోడుగా ఉండుగాక.

– మిథాలీ రాజ్, మాజీ క్రికెటర్

మీకేం బాధ్యత లేదా?



చూస్తుంటే ఢిల్లీ వాయు నాణ్యత ప్రమాదకరమైన స్థాయికి చేరడం పట్ల బీజేపీ ప్రతినిధి దాదాపుగా ఆనందపడుతున్నట్టున్నారు. ఇంక దీనికి అరవింద్ కేజ్రీవాల్‌ను విజయ గర్వంతో నిందిస్తారేమో! భారత రాజధాని ఒక గ్యాస్ ఛాంబర్‌గా మారిందన్నది నిజం. కానీ దీనికి కేంద్ర ప్రభుత్వాన్ని కదా ఎక్కువ నిందించాలి?

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

అనేక మార్గాలు



మనం వెతుకుతున్నది ఎంత అనంతమైనదంటే, దాన్ని భిన్న గొప్ప జీవులు భిన్న మార్గాల్లో కనుక్కున్నారు. దాన్ని కనుక్కోవడానికి ఒకటే మార్గం ఉందని మనం చెప్పలేము; ఎందుకంటే ఒకటి అనంతమైనది అయినప్పుడు దాన్ని చేరుకోవడానికి కూడా అనంతమైన మార్గాలు ఉండివుండాలి. కేవలం ఒక్క ప్రత్యేక మార్గం ఉండదు.

– శ్రీ ఎం, ఆధ్యాత్మిక గురువు

వీళ్లకు అర్థమవుతోందా?



కెనడాలో ఒక మహిళ తాలిబన్ జెండాను ప్రదర్శించడం ఎన్నో ప్రశ్నలను రేపుతోంది (వీడియో జత చేశారు). ఏ మహిళైనా తాలిబన్‌కు ఎందుకు మద్దతిస్తుంది? ఆమె, ఇంకా ఇతర తాలిబన్ మద్దతుదారులు ఉత్తర అమెరికాను వదిలేసి, వాళ్లు అంతగా ఆరాధించే ప్రభుత్వ పాలనలో బతకడానికి అఫ్గానిస్తాన్ రావాలి. అన్నట్టూ, ఇస్లాంలో నిషిద్ధమని చెబుతూ సజీవ ప్రాణులను ఫొటోలు తీయడాన్ని తాలిబన్ నిషేధించింది.

– హబీబ్ ఖాన్, అఫ్గానిస్తాన్ యాక్టివిస్ట్

ఇన్ బాక్స్

దేశ ప్రయోజనాలే ముఖ్యం

ప్రస్తుతం ప్రపంచ దేశాల మధ్య సొంత అవసరాలే మిత్రత్వానికైనా, శత్రుత్వానికైనా ఏకైక ప్రాతిపదిక అవుతున్నాయి. ఈ ధోరణి ఎంతో కొంత ముందు నుండే ఉన్నప్పటికీ, సైద్ధాంతికతనో, ఉమ్మడి ప్రయోజనాలో కొంత భూమికను పోషించేవి. ఇప్పుడా మొహమాటాల తెర తొలగి స్వార్థ ధోరణి పెచ్చరిల్లింది. అమెరికా తన పౌరుడూ, భారత వ్యతిరేకీ, ఖలిస్థాన్ వేర్పాటు వాదీ అయిన పన్నూన్‌పై హత్యాప్రయత్నం జరిగినట్టు, దాంట్లో ప్రథమ నిందితుడు భారత ప్రభుత్వ అధికారి వికాస్ యాదవ్ అనీ, అతన్ని అప్పగించమనీ మన దేశాన్ని కోరింది. ఆయనిప్పుడు ప్రభుత్వంలో పని చెయ్యడం లేదంటూ, అమెరికా ఆరోపణను ఖండించింది మన దేశం. ఇప్పటికే భారతీయ వ్యాపారి నిఖిల్ గుప్తను ఈ కేసులోనే అమెరికా ఖైదులో ఉంచింది. అమెరికా ప్రతిష్ఠాత్మకంగా భావించి కాపాడుతున్న ఆ మహా నాయకుడు పన్నూన్ 'నవంబర్ మొదటి వారంలో భారత్ విమానాల్లో బాంబులు పెడతామ'ని ప్రకటించాడు. భారత్‌కి వ్యతిరేకంగా తీవ్ర వాద ప్రకటనల్ని బహిరంగంగా చేస్తున్న వాడిని అమెరికా కట్టడి చెయ్యదుగానీ అతడిపై కుట్ర పన్నారని భారత్ అధికారుల్ని అప్పగించమని కోరుతుంది. అది మళ్లీ మన మిత్ర దేశం. ఇదనే కాదు ముంబై పేలుళ్ల సూత్రధారి హాడ్లీని అప్పగించమని అడిగినా అప్పగించకుండా దశాబ్దాలుగా తన దగ్గరే దాచుకుంది. తీవ్రవాదంపై పోరులో మనకు సహకరిస్తే దానికి పోయేదేమిటి?

కెనడా ఈ విషయంలో రెండాకులు ఎక్కువే చదివింది. మరో భారత్ వ్యతిరేకీ, ఖలిస్థాన్ వాదీ అయిన నిజ్జర్ హత్య వెనుక భారత ప్రభుత్వం ఉందంటూ ఆ దేశ ప్రధాని బహిరంగ ప్రకటన చేశారు. రుజువులు లేవట, కానీ దర్యాప్తులో తేలిందట. వివాదం ముదిరి దౌత్యవేత్తల బహిష్కరణ దాకా వచ్చింది. చర్చలు మాని రచ్చ చెయ్యడానికి కారణం కెనడా ఎన్నికలకు వెళ్లబోతోంది. ఆ ప్రధానికీ, అధికార పార్టీకీ ఎదురుగాలి ఉందక్కడ. దాని నుండి బయట పడడానికి ఇదో ఎత్తు. కాబట్టి భారత్ కూడా తన సొంత బలమే తన నిజమైన మిత్రుడు అని భావించాలి. స్వప్రయోజనాలకు పెద్దపీట వెయ్యాలి. అవసరానికీ, సమయానికీ తగిన దౌత్యనీతి ప్రదర్శించి అందరితో ఉభయతారకంగా ప్రవర్తించాలి. స్నేహహస్తంలోనే ఉక్కు సంకల్పం కనపడాలి.

– డా॥ డి.వి.జి. శంకర రావు, పార్వతీపురం మాజీ ఎంపీ

న్యాయ వ్యవస్థపై ఏఐ ప్రభావం

కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం అన్ని రంగాలపైనా విశేషంగా పడుతోంది. అందులో భాగంగానే న్యాయ వ్యవస్థనూ అది ప్రభావితం చేస్తోంది. ఏఐతో న్యాయమూర్తుల పని సులువవుతుంది. దేశంలో లక్షల సంఖ్యలో ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదులు సాధ్యమైనంత త్వరగా ఏఐ వినియోగంలో నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. న్యాయ శాస్త్రంలోని అనేక అంశాలు చిటికెలో ఏఐ ద్వారా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. అందువల్ల న్యాయ వ్యవస్థలో ఉన్నవారి పని భారం తగ్గుతుంది. మొత్తం మీద ఏఐ వల్ల న్యాయవ్యవస్థ ఎలా లాభం పొందుతుందో ఇక్కడ చూద్దాం:

ఏఐ కేసు డేటాను విశ్లేషించడానికీ, ఫలితాలను అంచనా వేయడానికీ, నమూనాలను గుర్తించడానికీ సాయపడుతుంది. న్యాయమూర్తులు అదనపు సమాచారంతో నిర్ణయాలు తీసుకునేలా చేస్తుంది. ఏఐ ఆధారిత సాధనాలు న్యాయవాదులు, న్యాయమూర్తులకు సంబంధిత చట్టాల పూర్వాపరాలు, కేస్ స్టడీస్, పరిశోధనలో సమయం ఆదా చేయడంలో సహాయ పడతాయి. ఏఐ ఆధారిత చాట్ బాట్లు వర్చువల్ కోర్టు ప్రొసీడింగ్స్‌లో సహాయ పడతాయి. షెడ్యూల్ చేయడం, రిమైండర్లు, ప్రాథమిక విచారణల వంటి పనులలో సహాయ పడతాయి. ఏఐ ఆధారిత న్యాయ సహాయం, మద్దతును అందించడం ద్వారా... ముఖ్యంగా అట్టడుగు వర్గాలు న్యాయం పొందడంలో అంతరాన్ని తగ్గించవచ్చు. ఏఐ రొటీన్ టాస్క్‌ను ఆటోమేట్ చేయగలదు. న్యాయమూర్తులు, న్యాయస్థాన సిబ్బందిని మరింత సంక్లిష్టమైన, అధిక విలువైన పనులపై దృష్టి పెట్టేలా చేస్తుంది. న్యాయ ప్రక్రియలను మెరుగుపరచడానికి, జాప్యాలను తగ్గించడానికి, న్యాయ వ్యవస్థకు గల మొత్తం సామర్థ్యాన్ని పెంచడానికి ఉపయోగపడుతుంది.

ఏజీఐ... అంటే ఆర్టిఫిషియల్ జనరల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ సాధారణ బుద్ధి) ఒక భావితరహిత ఏఐ వ్యవస్థను సూచిస్తుంది. ఇది మనుషుల మేధస్సుకు సమానంగా విభిన్న పనులను అర్థం చేసుకోవడం, నేర్చుకోవడం జ్ఞానాన్ని అనేక



విభాగాల్లో ఉపయోగించే సామర్థ్యాలు కలిగి ఉంటుంది. ఉదాహరణకు: కారణాలు చెప్పడం, సమస్యలను పరిష్కరించడం; అనుభవం నుంచి నేర్చుకోవడం; సహజ భాషను అర్థం చేసుకోవడం, వివిధ రంగాల్లో జ్ఞానాన్ని ఉపయోగించడం వంటి పనులకు ఇది బాగా ఉపయోగపడుతుంది.

ఏఐ పరిశోధనలో ఏజీఐని పవిత్ర కాంక్షగా పరిగణిస్తారు. ఎందుకంటే ఇది అపారమైన అవకాశాలను తెచ్చిపెడుతుంది. అయితే ఏజీఐ ఇంకా పరిశోధన, అభివృద్ధి దశలోనే ఉంది.

ఏఐ సాధనాలతో సమర్థవంతంగా పని చేయడానికి వ్యూహం, న్యాయవాదులకు, కక్షిదారులకు కౌన్సెలింగ్ వంటి అధిక విలువ గల పనులపై దృష్టి పెట్టడానికి, న్యాయవాదులు కొత్త నైపుణ్యాలను పెంచుకోవాల్సి ఉంటుంది. న్యాయవాద వృత్తిలో జూనియర్లు, లేదా పారాలీగల్స్ వంటి నిర్దిష్ట పాత్రలను ఏఐ స్థానభ్రంశం చేయగలదు. సబ్‌స్క్రిప్షన్ ఆధారిత చట్టపరమైన సేవలు, ఏఐ ఆధారిత లీగల్ కన్సల్టింగ్ వంటి కొత్త వ్యాపార నమూనాలను ఏఐ ప్రారంభించగలదు.


చట్టపరమైన ఆచరణలో ఏఐ ఉపయోగం, నిర్ణయాధికారం పారదర్శకంగా, జవాబుదారీతనంగా ఉండేలా చూసుకోవడం వంటి నియంత్రణ సమస్యలను లేవనెత్తవచ్చు. న్యాయవాదులు ఏఐపై ఎక్కువగా ఆధారపడవచ్చు. దీని వల్ల అవసరమైన నైపుణ్యాలను, నిర్ణయాన్ని (తీర్పును) కోల్పోయే అవకాశం ఉంది. ఏఐ ఆధారిత చట్టపరమైన సాధనాలు డేటా చౌర్యం, ఉల్లంఘనల వంటి ప్రమాదాన్ని పెంచుతాయి.

న్యాయవాదులు ఏఐని ఉపయోగించడంలో నైతికపరమైన చిక్కులను పరిగణనలోకి తీసుకోవాలి. ఏఐ తీసుకునే నిర్ణయం న్యాయంగా, నిష్పక్షపాతంగా ఉండేలా చూసుకోవాలి. నైపుణ్యాలను సాధ్యమైనంత త్వరగా పెంచుకోవడం ద్వారా భవిష్యత్తులో ఏఐ నుంచి ఎదురయ్యే సవాళ్లను దీటుగా ఎదుర్కోవచ్చు. వృత్తిపరంగా విజయవంతంగా ముందుకు వెళ్లవచ్చు. అయితే ఈ వ్యవస్థపై నిరంతర పరిశీలన, పర్యవేక్షణ ఉండాలి.

– అగూరు ఉమామహేశ్వరరావు
సీనియర్ న్యాయవాది

విధి విలాసం

తను ఒక్క పాపం కూడా చేయలేదు కనుక మరణించిన తర్వాత తనకు మోక్షం తప్పదని పార్వతి అనే గృహిణి అనుకుంది. అయితే ఒకరోజు ఇంటిని శుభ్రం చేస్తుండగా అనుకోని విధంగా చీపురు చేజారి ఒక బొద్దింక మీద పడి అది చనిపోయింది. తాను చేసిన ఈ పాపాన్ని ఎవరైనా తీసుకుంటే బాగుండు అని ఆ బొద్దింకను తీసుకుని వీధిలో కెళ్ళింది. తనకు పరిచయమున్న సావిత్రి అనే చేపల వ్యాపారి వద్దకు వెళ్ళి విషయం చెప్పి బాధపడింది. అక్కడితో ఆగకుండా 'నువ్వు ఇప్పటివరకు ఎన్నో చేపలను చంపావు. నువ్వు చనిపోయిన తర్వాత ఏమవుతావో' అని ఆందోళన వ్యక్తం చేసింది. అప్పుడు సావిత్రి 'భయపడకు. నేను ఇప్పటికే వందల చేపలను చంపాను. నువ్వు చంపాననుకున్న ఆ బొద్దింకను నాకివ్వు... నువ్వనుకుంటున్న ఆ పాపాన్ని నేనే స్వీకరిస్తాను' అంది. దాంతో పార్వతి వెంటనే బొద్దింకను ఆమె చేతికిచ్చి మహదానందంగా ఇంటికి చేరింది.



కానీ దేవుడి నిర్ణయాన్ని ఎవరు మార్చగలరు? ఈ ఇద్దరు స్త్రీలూ అనుకోకుండా ఒకే రోజు చనిపోయారు. స్వర్గం నుంచి ఒక విమానం సావిత్రి దగ్గరకు వచ్చింది. నరకం నుంచి యమ దూతలు పార్వతి దగ్గరకు చేరుకున్నారు. అది చూసి పార్వతి 'నేను సావిత్రిని కాదు. పార్వతిని. మీరు పోవలసింది అదిగో సావిత్రి దగ్గరకు' అంది. అయితే నరకలోక దూతలు 'మేమే తప్పూ చేయలేదు. నిన్ను నరకానికి తీసుకుపోవడానికి వచ్చాం. సావిత్రికి మోక్షం లభించింది' అని చెప్పారు. అదేమిటని పార్వతి అడగ్గా దూతలు 'చేపలమ్మడం సావిత్రికి చెల్లు. అది ఆమె వృత్తి ధర్మం. కనుక ఆమె తప్పు చేసినట్టవదు. బాధ్యతలో భాగంగా వాటిని చంపింది. కానీ నువ్వు ఒక్క బొద్దింకనే చంపినప్పటికీ ఆ పాపాన్ని వేరేవారికి బదిలీ చేయడానికి ప్రయత్నించావు. అది మహాపరాధం. అంతకుముందు వరకూ నువ్వెన్నో మంచి పనులు చేశావన్న అహంకారం కూడా నీలో ఉంది. చేసిన తప్పుకు శిక్ష నువ్వే అనుభవించాలి' అని చెప్పి ఆమెను తిన్నగా నరకానికి తీసుకు పోయారు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

యాదాద్రి ఆలయంలోకి శునకం



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ ముఖ మండపంలోకి మంగళవారం శునకం ప్రవేశించింది. ఉదయం బ్రేక్ దర్శనం అనంతరం ధర్మదర్శనం, రూ.150 టికెట్ల దర్శనాల క్యూలను ఆలయాధికారులు వదిలారు. ఈ సమయంలో ధర్మ దర్శనం క్యూలైన్‌లో నుంచి ఒక శునకం ఆలయ తిరువీధి, క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామి ఆలయం నుంచి నేరుగా ముఖమండపంలోకి చేరుకుంది. దీనిని గమనించిన ఆలయ సిబ్బంది, అధికారులు దాన్ని బయటకు తరిమారు. అనంతరం దర్శనాలను నిలిపివేసి ముఖమండపం, క్యూలైన్లలో సంప్రోక్షణ చేపట్టారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే శునకం నేరుగా ఆలయ ముఖ మండపంలోకి ప్రవేశించిందని భక్తులు విమర్శించారు. ఆలయ మాడ వీధిలో సైతం శునకాలు తిరుగుతున్నాయని, వాటిని కొండపైన నివారించాల్సిన అవసరం ఉందంటున్నారు.

మాజీ మంత్రి గంగులకు మాతృవియోగం



గంగుల నర్సమ్మ (ఫైల్)

కరీంనగర్: మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తల్లి గంగుల నర్సమ్మ మంగళవారం ఉదయం కరీంనగర్ క్రిస్టియన్ కాలనీలోని తన నివాసంలో అనారోగ్యంతో కన్నుమూశారు. దుబాయ్ పర్యటనలో ఉన్న కమలాకర్.. తల్లి మరణవార్త తెలిసిన వెంటనే హుటాహుటిన కరీంనగర్‌కు బయల్దేరారు. గంగుల నర్సమ్మ భౌతికకాయానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మేయర్ వై.సునీల్ రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. నర్సమ్మ అంత్యక్రియలు బుధవారం ఉదయం 9 గంటలకు మార్కండేయనగర్‌లోని స్వర్గధామ్ శ్మశానవాటికలో జరుగుతాయని చల్లా హరిశంకర్ వెల్లడించారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి | ప్రధాన అనుచరుడి దారుణహత్య

- కారుతో గుద్ది.. కత్తితో 18 సార్లు పొడిచి..
- జగిత్యాల జిల్లాలో ఘటన



మారు గంగారెడ్డి (ఫైల్)

జగిత్యాల క్రైం: కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు మారు గంగారెడ్డి (58) దారుణ హత్యకు గురయ్యారు. బైక్‌పై వెళుతున్న ఆయన్ను కారుతో గుద్ది..కత్తితో 18 సార్లు పొడిచి హతమార్చడం జగిత్యాల జిల్లాలో సంచలనం సృష్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నేత గంగారెడ్డి మంగళవారం ఉదయం ఏడు గంటల ప్రాంతంలో ఇంటి నుంచి తన బైక్‌పై గ్రామంలోని చౌరస్తా వద్ద గల హోటల్‌కు టీ తాగేందుకు వెళ్లారు. అప్పటికే హత్య చేసేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకున్న అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త బత్తిని సంతోష్ కారులో కాపు కాసి ఉన్నాడు. గంగారెడ్డి చౌరస్తా వద్ద టీ తాగి తిరిగి ఇంటికి వెళుతుండగా.. సంతోష్ కారుతో అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో గంగారెడ్డి అదుపు తప్పి కిందపడిపోయారు. వెంటనే కారులోంచి దిగిన సంతోష్ లేవలేని స్థితిలో ఉన్న గంగారెడ్డిని దాదాపు 18 సార్లు కత్తితో అతి దారుణంగా పొడిచాడు. చనిపోయాడని నిర్ధారించుకున్న సంతోష్ అప్పటికే సమీపంలో ఉన్న ఇద్దరు వ్యక్తులతో కలిసి కారులో పారిపోయాడు. కొనఊపిరితో ఉన్న గంగారెడ్డిని స్థానికులు కారులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందారని పేర్కొన్నారు.

ఆందోళనకు దిగిన జీవన్‌రెడ్డి

విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాతబస్టాండ్ వద్దకు చేరుకొని కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ నాయకులకే రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్పీ అశోక్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో ఎమ్మెల్సీ ఆందోళన విరమించారు.

రాజకీయ కక్షతోనేనా..?

గంగారెడ్డి హత్య రాజకీయ కక్షతోనే జరిగినట్టు అనుమానిస్తున్నారు. గంగారెడ్డిని ఇటీవల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రతిపాదించారు. ఆయన నియామకం దాదాపు ఖరారైనట్టు తెలిసింది. గంగారెడ్డికి గ్రామంలో మంచి పేరుంది. నిందితుడు సంతోష్‌తోనూ ఎలాంటి విభేదాలు లేకపోయినా, హత్య ఎందుకు చేశాడన్నది జిల్లాలోనే చర్చనీయాంశంగా మారింది.

పోలీసుల అదుపులో నిందితుడు

హత్య చేసిన అనంతరం నిందితుడు సంతోష్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. గతంలో నిందితుడు వాట్సాప్‌లో చంపేస్తానంటూ మెసేజ్ పెట్టాడని, సద్దుల బతుకమ్మ రోజు కూడా గ్రామంలో ఓ డీజేను పగులగొట్టాడని, ఓ ప్రజాప్రతినిధిపై దాడి కూడా చేశాడని తెలుస్తోంది. స్థానికులు కొందరు పోలీసులకు సమాచారం అందించినా, అతనిపై చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. చర్యలు తీసుకొని ఉంటే గంగారెడ్డికి ఈ పరిస్థితి ఉండేది కాదని చర్చించుకుంటున్నారు. కాగా ఇది ముమ్మాటికీ రాజకీయ కక్షేనని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ముసుగులో కొందరు బీఆర్‌ఎస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

గంగారెడ్డి హత్య వెనుక ఎవరున్నా ఉపేక్షించొద్దు

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



జగిత్యాల: తాను జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధిని కోరుకుంటున్నానని, హత్యా రాజకీయాలు కాదని, తనకు హత్యా రాజకీయాలు తెలియవని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గంగారెడ్డి మృతి బాధాకరమని, హత్య వెనుక ఎవరున్నా ఉపేక్షించొద్దని ఎస్పీకి సూచించారు. ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని కోరారు.

అవమానాలు చాలు.. ఇకనైనా బతకనివ్వండి

- ఈరోజు మమ్మల్ని కాంగ్రెస్ పార్టీ చంపేసింది
- ఎన్జీవో పెట్టుకుని అయినా ప్రజలకు సేవ చేస్తా
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- గంగారెడ్డి హత్యతో తీవ్ర భావోద్వేగం



అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు దండం పెడుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల: 'అవమానాలు చాలు.. ఇకనైనా బతకనివ్వండి. ఈ రోజు మమ్మల్ని కాంగ్రెస్ పార్టీ చంపేసింది. ఎన్జీవో పెట్టుకోనైనా ప్రజలకు సేవ చేస్తా..'అంటూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. తన ప్రధాన అనుచరుడు గంగారెడ్డి హత్యకు గురికావడంతో జీవన్‌రెడ్డి తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన ఒకానొక దశలో కాంగ్రెస్ పార్టీ చంపిందని వ్యాఖ్యానించారు. నాలుగు దశాబ్దాలపాటు పార్టీకి సేవ చేస్తే మంచి బహుమతి ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశాడు. గంగారెడ్డి హత్యతో ఆందోళనకు దిగిన జీవన్‌రెడ్డికి మద్దతుగా ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జగిత్యాలకు రాగా 'నీకో దండం.. నీ పార్టీకో దండం.. ఇకనైనా బతకనివ్వండి..' అంటూ దండం పెడుతూ వ్యాఖ్యానించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ జీవన్‌రెడ్డికి ఫోన్ చేసి హత్యకు దారి తీసిన పరిస్థితులను తెలుసుకునేందుకు ప్రయత్నించగా మధ్యలోనే ఫోన్ కట్ చేశారు.

పార్టీకి ఎంతో సేవ చేశా

'ఒకప్పుడు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఏకైక ఎమ్మెల్యేగా ఉన్న. అయినా బీఆర్‌ఎస్ వైఫల్యాలు, ఉద్యోగుల సమస్యలు, మహిళల సమస్యలు, రైతుల సమస్యలు ఇలా అన్నీ లేవనెత్తి పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశా. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో నా స్థానం ఎక్కడో ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నో అవమానాలు తట్టుకుంటున్నాం. ఇక ఓపిక లేదు. బీఆర్‌ఎస్ దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కొని, తట్టుకొని నిలబడితే.. ఈరోజు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఇబ్బందికరంగా మారింది. పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించడంతో ఈరోజు జగిత్యాలలో ఎలాంటి పరిస్థితులున్నాయో ఈ ఘటన ద్వారా తెలుస్తుంది. మానసిక అవమానాలకు గురయ్యాం. అది చాలదన్నట్టు భౌతిక దాడులకు తెగబడుతున్నారు'అంటూ జీవన్‌రెడ్డి తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

కాంగ్రెస్ ప్రభుత్వమా? బీఆర్‌ఎస్ ప్రభుత్వమా?

ఇప్పుడు తాము కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నామో.. లేక బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉన్నామో అర్థం కావడం లేదని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పార్టీలకు నైతిక విలువలు ఉండాలని సూచించారు. గతంలో కేసీఆర్ ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయాలని చూసి ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నారని, ఆయన పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు.

మా స్థానం ప్రశ్నార్థకం

కాంగ్రెస్ పార్టీలో ఎన్నో అవమానాలు ఎదుర్కొంటున్నామని, భౌతిక దాడులు చేస్తున్నారని, నాటి టీఆర్‌ఎస్.. ఈనాటి కాంగ్రెస్ ముసుగులో ఉందని జీవన్‌రెడ్డి అన్నారు. మానసిక వేదనకు గురవుతున్నామని, కార్యకర్తలు కూడా నిరాశలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ చేసిందే తాము చేస్తామంటే మన నాయకుడు కేసీఆర్ కాదని, రాహుల్‌గాంధీ అని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకుంటే ఇలాంటివే ఎదురవుతాయని ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించడంతో బీఆర్‌ఎస్ గత ఎన్నికల్లో మూడో స్థానంలోకి వెళ్లిందని గుర్తు చేశారు.

జీవన్‌రెడ్డితో మాట్లాడా

అనుచరుడి హత్య జరిగిన బాధలో వచ్చిన ఆవేదన అది: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో తాను ఫోన్‌లో మాట్లాడానని, అన్నీ సర్దుకుంటాయని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. మంగళవారం సాయంత్రం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ తన ముఖ్య అనుచరుడి హత్యతో జీవన్‌రెడ్డి మనస్తాపానికి గురయ్యారని, ఆ బాధలో ఉండి తన ఆవేదన వ్యక్తం చేశారన్నారు. తాను జీవన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడానని, పోలీసులతో కూడా మాట్లాడి హత్యతో సంబంధమున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని కోరానన్నారు. సీనియర్ మంత్రి శ్రీధర్‌బాబు ఈ విషయాన్ని పరిశీలిస్తున్నారని, అన్ని విషయాలు ఆయన చూసుకుంటారని మహేశ్‌గౌడ్ వెల్లడించారు.

165 మంది ఏఈవోల సస్పెన్షన్

- వ్యవసాయశాఖ సంచలన నిర్ణయం
- హైదరాబాద్ వ్యవసాయ కమిషనరేట్ వద్ద ధర్నా.. ఉద్రిక్తత
- ఏఈవోల విన్నపాన్ని వినకుండానే వెళ్లిపోయిన వ్యవసాయశాఖ డైరెక్టర్...
- డిజిటల్ క్రాప్ సర్వేపై సహాయ నిరాకరణ చేస్తుండటం వల్లే సస్పెండ్ చేశారంటున్న ఏఈవోలు
- ఉత్తర్వుల్లో రైతుబీమాలో రైతుల మరణాల వివరాల నమోదులో నిర్లక్ష్యమని పేర్కొన్న వైనం

సాక్షి, హైదరాబాద్/గన్‌ఫౌండ్రీ: గ్రామాల్లో పనిచేసే వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో)పై ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఏకంగా 165 మంది ఏఈవోలను సస్పెండ్ చేస్తూ వ్యవసాయశాఖ సంచలన నిర్ణయం తీసుకుంది. సస్పెన్షన్ నేపథ్యంలో రగిలిపోయిన ఏఈవోలు మంగళవారం జిల్లాల నుంచి హైదరాబాద్‌లోని వ్యవసాయ కమిషనరేట్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. నాలుగు గంటల పాటు ధర్నా చేశారు. పోలీసులు రావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భారీగా ధర్నా జరుగుతున్నా వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి ఏమాత్రం పట్టించుకోకుండానే పోలీసుల భద్రత నడుమ అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో మరింత ఆగ్రహంతో ఉన్న ఏఈవోలు బుధవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేస్తామని ప్రకటించారు. కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. 2,600 మంది ఏఈవోలు సెలవుల్లో ఉంటామని వెల్లడించారు. నేతలు రాజ్‌కుమార్ రాజు, పరశురాములు, సుమన్, వెంకన్న శ్రీనివాస్ జానయ్య, వినోద్, సత్యంల నాయకత్వంలో ధర్నాలో పెద్ద సంఖ్యలో ఏఈవోలు పాల్గొన్నారు.

కక్ష సాధింపు ధోరణి

డిజిటల్ క్రాప్ సర్వే చేయకపోవడమే 165 మంది ఏఈవోల సస్పెన్షన్‌కు కారణమని ఏఈవోలు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు మాత్రం రైతుబీమా నిబంధనల ప్రకారం మృతి చెందిన రైతుల వివరాల నమోదులో ఏఈవోలు నిర్లక్ష్యంగా వహించారని, అందుకే సస్పెండ్ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కక్ష సాధింపులో భాగంగానే ఈ సస్పెన్షన్లని ఉద్యోగులు మండిపడుతున్నారు. వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి ఏఈవోలను సస్పెండ్ చేస్తూ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఉదయం నుంచి మొదలైన సస్పెన్షన్ల పరంపర సాయంత్రం వరకు కొనసాగింది. బుధవారం మరో కారణంతో మరికొంతమందిని సస్పెండ్ చేయడానికి రంగం సిద్ధం చేశారని వారు ఆరోపిస్తున్నారు.

నాలుగు రోజుల్లో ఎలా అప్‌లోడ్ చేయాలి?

నిబంధనల ప్రకారం రైతు చనిపోయిన తర్వాత నాలుగు రోజుల్లో మరణ ధ్రువీకరణ పత్రంతోపాటు అన్ని రకాల పత్రాలను జత చేసి..సదరు ఏఈవో రైతుబీమా పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలి. అయితే రైతు చనిపోయిన తర్వాత వారి కుటుంబ సభ్యులు కనీసం 11 రోజుల వరకు బయటకు వచ్చే పరిస్థితి ఉండదు. ఆ తర్వాత మరణ ధ్రువీకరణ పత్రం పొందడానికి సమయం పడుతుంది. ఈ విధంగా కుటుంబ సభ్యులు వివరాలు అందించేందుకు కనీసం 15 రోజుల సమయం పడుతుందంటున్నారు. ఇది గతం నుంచి కొనసాగుతుందంటున్నారు. అలాంటప్పుడు కేవలం నాలుగు రోజుల్లో వివరాలు ఏ విధంగా అప్‌లోడ్ చేయాలని ఏఈవోలు ప్రశ్నిస్తున్నారు.

సస్పెండ్ చేయడం సరికాదు

డిజిటల్ క్రాప్ సర్వేను నిరాకరించినందుకు తనను సస్పెండ్ చేయడం సరికాదని హనుమకొండ జిల్లా శాయంపేట క్లస్టర్ ఏఈఓ అర్చన అన్నారు. 15వేల మందితో చేయించాల్సిన సర్వేని 2,600 మందితో చేయించాలని ప్రభుత్వాలు చూస్తున్నాయని అన్నారు. రైతు బీమాలో ఎటువంటి అవకతవకలు జరగకపోయినా సస్పెండ్ చేశారని తెలిపారు.

షోకాజ్ నోటీసు ఇవ్వకుండా సస్పెండ్ చేశారు

డిజిటల్ సర్వే చేసే విషయంలో భయభ్రాంతులకు, మానసిక ఒత్తిడికి గురిచేశారని వరంగల్ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపూర్ ఏఈఓ ప్రవళిక చెప్పారు. కనీస వసతులు లేకుండా సర్వే చేయలేమని విన్నవించినా, వినకుండా రైతు బీమా కారణం చూపించారన్నారు. కనీసం మెమో గానీ షోకాజ్ నోటీస్ గానీ ఇవ్వకుండా సస్పెండ్ చేశారని వాపోయారు.

పంట సర్వే ఏఈవోల ప్రాథమిక బాధ్యత

వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపీ

పంట నమోదు కార్యక్రమం ఏఈవోల ప్రాథమిక బాధ్యత అని రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపీ తెలిపారు. కొందరు ఏఈవోలు పంట పొలాన్ని సందర్శించకుండా సర్వే చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. 165 మంది ఏఈవోలను వ్యవసాయశాఖ సస్పెండ్ చేసిన నేపథ్యంలో సంచాలకుడు డాక్టర్ గోపీ స్పందించి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి గుంటలో సాగైన పంట వివరాలు కచ్చితంగా తెలుసుకోవడానికి, పంటలకు కావాల్సిన ఉత్పాదకాలను అంచనా వేయడానికి, పంట కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, కొనుగోలు నిర్ణయాలు తీసుకోవడానికి, పంట బీమా అమలు, పంట రుణాలు పొందటానికి రైతు బీమా, రైతు భరోసా పథకాల అమలుకు సర్వే ఉపయోగపడుతుందన్నారు.

ఏసీబీకి చిక్కిన పెబ్బేరు పుర కమిషనర్

రూ. 20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఆదిశేషు



వనపర్తి రూరల్/తుర్కయాంజాల్: పెబ్బేరు మున్సిపల్ కాంట్రాక్టర్ నుంచి కమిషనర్ ఆదిశేషు రూ.20 వేల లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. మహబూబ్‌నగర్ ఏసీబీ ఇన్‌చార్జి డీఎస్పీ బి.శ్రీకృష్ణగౌడ్ వివరాల మేరకు.. పెబ్బేరుకు చెందిన మున్సిపల్ కాంట్రాక్టర్ 2023లో మున్సిపాలిటీ వార్డుల్లో టాయిలెట్స్ పెయింటింగ్ వర్క్, సీసీరోడ్ల నిర్మాణంతో పాటు జనరల్ ఫండ్‌తో మూడు పనులు చేపట్టారు. జనరల్ ఫండ్ పనులకు సంబంధించి ఒక్కో బిల్లు రూ.83,930 చొప్పున మొత్తం రూ. 2,51,790 బిల్లులు అతడికి రావాల్సి ఉంది. సదరు కాంట్రాక్టర్ మున్సిపల్ కమిషనర్ ఆదిశేషును కలిసి బిల్లులను విడుదల చేయాలని కోరగా.. రూ.25 వేల లంచం డిమాండ్ చేశారు. చివరగా రూ.20 వేలు ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టర్ నుంచి కమిషనర్ రూ.20 వేల నగదు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా తుర్కయాంజాల్ పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని రాజ్ రంజిత్ ప్రైమ్ హోమ్స్‌లో నివసించే ఆదిశేషు నివాసంపై ఏసీబీ దాడులు కొనసాగుతున్నాయని చెప్పారు. కమిషనర్ ఆదిశేషును బుధవారం నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

జార్ఖండ్‌లో హోరాహోరీ

అధికార సాధనకు సర్వశక్తులూ ఒడ్డుతున్న బీజేపీ

పథకాలపైనే అధికార జేఎంఎం కూటమి భారం



గిరిజన రాష్ట్రం జార్ఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికల పోరు పరాకాష్టకు చేరుతోంది. ఎలాగైనా అధికారాన్ని నిలబెట్టుకోవాలని అధికార జేఎంఎం, కాంగ్రెస్ సంకీర్ణం ప్రయత్నిస్తోంది. ఆ కూటమిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఓడించి జార్ఖండ్‌లో కాషాయ జెండా ఎగరేసేందుకు బీజేపీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌తో పాటు ఇతర నేతల అవినీతినే ప్రధాన ఎజెండాగా మలచుకుని ప్రజల్లోకి వెళ్తోంది. అయితే పుంఖానుపుంఖాలుగా ప్రకటించిన సంక్షేమ పథకాలే తమను మరోసారి గట్టెక్కిస్తాయని అధికార కూటమి విశ్వసిస్తోంది. రాష్ట్రంలో నవంబర్ 13, 20ల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగనుంది. ఫలితాలు 23న వెల్లడవుతాయి. ఇటీవలి హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య ఓటమి నేపథ్యంలో జార్ఖండ్‌లో విజయం కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష ఇండియా కూటమికి ప్రతిష్టాత్మకంగా మారింది. ఈ నేపథ్యంలో జేఎంఎం-కాంగ్రెస్, బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటముల బలాబలాలను ఓసారి పరిశీలిస్తే...

బీజేపీ దూకుడు మంత్రం

దూకుడైన ప్రచారమే మంత్రంగా జార్ఖండ్ ప్రచార పర్వంలో బీజేపీ దూసుకెళ్తోంది. ఎప్పట్లాగే ప్రధాని మోదీ కరిజ్మాపైనే పార్టీ ప్రధానంగా ఆశలు పెట్టుకుంది. ఆయనతో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షా, అసోం సీఎం హిమంత బిశ్వశర్మ తదితర నేతలు కూడా రాష్ట్రంలో కాలికి బలపం పట్టుకుని తిరుగుతున్నారు. పలు అంశాలపై ఎప్పటికప్పుడు ప్రశ్నలు సంధిస్తూ ప్రజలను ఆలోచింపజేయడమే గాక అధికార కూటమిని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. 2014లో బీజేపీ 31.8 శాతం ఓట్లతో 37 అసెంబ్లీ స్థానాలు ఒడిసిపట్టి విజయం సాధించింది. 2019లో ఓట్ల శాతం 33.8కి పెరిగినా 25 స్థానాలకే పరిమితమై అధికారం కోల్పోయింది. ఈ నేపథ్యంలో ఈసారి ఎక్కడా చిన్న అవకాశం కూడా వదలరాదని పార్టీ అధిష్టానం పట్టుదలగా ఉంది.

- బంగ్లాదేశ్ నుంచి జార్ఖండ్‌లోకి చొరబాట్లపై బీజేపీ ప్రధానంగా దృష్టి పెట్టింది. వారివల్ల స్థానికుల అవకాశాలన్నింటికీ భారీగా గండి పడుతుందని జోరుగా ప్రచారం చేస్తోంది.
- సీఎం హేమంత్‌తో పాటు జేఎంఎం, కాంగ్రెస్ నేతల్లో పలువురిపై ఈడీ, సీబీఐ దాడులను ప్రచారంలో పదేపదే ప్రస్తావిస్తోంది.
- రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, మహిళలకు భద్రత లేదని ఆరోపిస్తోంది.
- మోదీ సర్కారు అభివృద్ధి నినాదాన్ని వల్లెవేస్తోంది. డబుల్ ఇంజిన్ సర్కారుతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నేతలు ప్రచారం చేస్తున్నారు.

జార్ఖండ్‌లో 2019 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

మొత్తం స్థానాలు 81

పార్టీ	సీట్లు	ఓట్ల శాతం
బీజేపీ	25	34
జేఎంఎం	30	19
కాంగ్రెస్	16	14
ఇతరులు	10	33

- గత కొద్ది నెలల్లో జార్ఖండ్‌లో వేలాది కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు.

జేఎంఎం సంక్షేమ మంత్రం

అధికార జేఎంఎం, కాంగ్రెస్ కూటమి రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలకు తెర తీసింది.

- మయ్యా సమ్మాన్ యోజన పేరిట 18–50 ఏళ్ల మధ్య వయసున్న మహిళలకు ఏటా నేరుగా రూ.12 వేల నుంచి రూ.30 వేల దాకా ఆర్థిక సాయం అందిస్తోంది.
- ఆప్‌కీ యోజనా, ఆప్‌కీ సర్కార్, ఆప్‌కే ద్వార్, అబువా ఆవాస్, సార్వత్రిక పెన్షన్‌కు తోడు ఆహార భద్రత, క్రీడలు–విద్యా పథకాలను అమలు చేస్తోంది.
- గిరిజన సెంటిమెంట్‌కు ఇవన్నీ తోడై తమను మరోసారి విజయ తీరాలకు చేరుస్తాయని నమ్ముతోంది.

కల్పన ఫ్యాక్టర్

సీఎం హేమంత్ సోరెన్ కల్పన ప్రచార సభలకు లభిస్తున్న భారీ ఆదరణ కమలనాథుల్లో గుబులు రేపుతోంది. భర్తపై బీజేపీ చేస్తున్న అవినీతి ఆరోపణలను ఆమె గట్టిగా తిప్పికొడుతున్నారు. ఇటీవల జేఎంఎంలో చేరి ఉప ఎన్నికలో గండే అసెంబ్లీ స్థానం నుంచి భారీ మెజారిటీతో నెగ్గడం అధికార కూటమిలో జోష్ పెంచింది.

పార్టీలో వలసల జోష్: గిరిజనుల్లో గట్టి ఆదరణ ఉన్న మాజీ సీఎం చంపయ్ సోరెన్ జేఎంఎంను వీడి బీజేపీలో చేరడం కమలనాథులకు మరింత ఊపునిచ్చింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ఏకైక ఎంపీ గీతా కోరా కూడా అదే బాట పట్టారు. అంతేగాక సీతా సోరెన్, అమిత్ కుమార్ యాదవ్, కమలేశ్ సింగ్ రూపంలో ముగ్గురు ఎమ్మెల్యేలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.

గిరిజన సీట్లే నిర్ణాయకం

జార్ఖండ్‌లో ఏకంగా 28 ఎస్టీ రిజర్వుడు స్థానాలున్నాయి. మొత్తం సీట్లలో ఇవి మూడో వంతు కంటే అధికం! అధికార, విపక్ష కూటముల భాగ్యరేఖలను ఇవే నిర్దేశించనున్నాయి.

- ఈ నేపథ్యంలో గిరిజనుడైన తనను మోదీ ప్రభుత్వం వేధిస్తోందంటూ హేమంత్ చేస్తున్న ప్రచారం ఎక్కడ తమ పుట్టి ముంచుతుందోనన్న భయాందోళనలు బీజేపీలో లేకపోలేదు.
- అధికార కూటమి గిరిజన సెంటిమెంట్‌ను గట్టిగా నమ్ముకుంది.
- గిరిజనులు పాటించే సర్నాను ప్రత్యేక మతంగా గుర్తించాలంటూ జేఎంఎం, కాంగ్రెస్ సర్కారు ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం కూడా చేసింది.

ఇరు కూటముల్లోనూ లుకలుకలు

అధికార, విపక్ష కూటములు రెండూ ఇంటి పోరుతో సతమతమవుతుండటం విశేషం. ముఖ్యంగా బీజేపీని నేతల విభేదాలు బాగా కలవరపెడుతున్నాయి. ముఖ్య నేతల మధ్య సమన్వయం బాగా కొరవడిందంటూ వార్తలు వస్తున్నాయి. అధికార కూటమిలోనూ లుకలుకలు లేకపోలేదు. పలువురు కాంగ్రెస్, జేఎంఎం ఎమ్మెల్యేల సిగపట్ల వివాదం ఎన్నోసార్లు హస్తిన దాకా వెళ్లింది. చాలా అసెంబ్లీ స్థానాల్లో సమన్వయంతో కలిసి పని చేసేందుకు కూడా ఇష్టపడనంతగా ఇరు పార్టీల ముఖ్య నేతల మధ్య విభేదాలు పొడసూపాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఉక్రెయిన్ సంక్షోభ పరిష్కారానికి...

అన్నివిధాలా సహకరిస్తాం



కాల పరీక్షకు నిలిచిన బంధం: మోదీ

గత మూడు నెలల్లోనే రష్యాలో ఇది తన రెండో పర్యటన అని మోదీ గుర్తు చేసుకున్నారు. ''ఇరు దేశాల మధ్య నానాటికీ బలపడుతున్న ప్రగాఢ బంధానికి, స్నేహానికి, సమన్వయానికి ఇది సూచిక. రష్యా, భారత మైత్రి కాలపరీక్షకు నిలిచిన బంధం. భారత ఆర్థికాభివృద్ధిలో, భద్రతలో రష్యాది కీలక పాత్ర'' అంటూ ప్రస్తుతించారు. చరిత్రాత్మక కజాన్ నగరంలో భారత్ నూతన కాన్సులేట్‌ను తెరవడం పట్ల ఆనందంగా ఉందని ఈ సందర్భంగా మోదీ అన్నారు. గత జూలైలో కూడా ఆయన రష్యాలో పర్యటించడం తెలిసిందే. ఆ సందర్భంగా పుతిన్‌తో జరిగిన శిఖరాగ్ర భేటీలో పలు విషయాలపై లోతుగా చర్చించారు.

- పుతిన్‌కు మరోసారి స్పష్టం చేసిన మోదీ
- నేడు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ

కజాన్: రష్యా, ఉక్రెయిన్ యుద్ధానికి తక్షణం శాంతియుత పరిష్కారం కనుగొనాల్సిన అవసరముందని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా ఎలాంటి సాయమైనా చేసేందుకు భారత్ సదా సిద్ధమని ప్రకటించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ఈ మేరకు హామీ ఇచ్చారు. 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మంగళవారం రష్యాలోని కజాన్ నగరం చేరుకున్నారు. గత మూడు నెలల్లో మోదీ రష్యా వెళ్లడం ఇది రెండోసారి. కజాన్ చేరిన కాసేపటికే ఆయన పుతిన్‌తో సమావేశమయ్యారు. ఉక్రెయిన్ యుద్ధంతో పాటు పలు అంశాలపై నేతలిద్దరూ లోతుగా చర్చించుకున్నారు. ''ఉక్రెయిన్ సంక్షోభానికి తెర దించే విషయమై మీతో నేను నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉన్నా. నేను ముందు నుంచీ చెబుతున్నట్టుగా ఏ సమస్యకైనా శాంతియుత పరిష్కారమే ఏకైక మార్గం'' అని ఈ సందర్భంగా పుతిన్‌కు మోదీ మరోసారి స్పష్టం చేశారు. ఆయనతో అన్ని విషయాలపైనా అర్థవంతమైన చర్చ జరిగినట్టు అనంతరం ప్రధాని వెల్లడించారు. ఉక్రెయిన్‌పై రెండేళ్లకు పైగా జరుపుతున్న యుద్ధాన్ని విరమించేలా పుతిన్‌ను ఒప్పించి సంక్షోభానికి తెర దించగలిగింది మోదీ ఒక్కరేనని ప్రపంచ దేశాధినేతలంతా అభిప్రాయపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారి భేటీకి అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. రెండు రోజుల పాటు జరగనున్న బ్రిక్స్ సదస్సులో భాగంగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో కూడా మోదీ సమావేశమయ్యారు. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ఆయన బుధవారం భేటీ కానున్నారు. విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఈ మేరకు వెల్లడించారు.

నాకు, మోదీకి మధ్య అనువాదం అవసరమే లేదు

నవ్వులు పూయించిన పుతిన్ వ్యాఖ్యలు

మోదీతో భేటీ సందర్భంగా పుతిన్ చేసిన వ్యాఖ్యలు నవ్వులు పూయించాయి. ''భారత్‌తో రష్యా బంధం ఎంత బలంగా ఉందంటే నా మాటలను అర్థం చేసుకోవడానికి బహుశా మీకు అనువాదం కూడా అవసరం లేదేమో!'' అని మోదీని ఉద్దేశించి పుతిన్ అన్నారు. దాంతో ప్రధానితో సహా భేటీలో పాల్గొన్న ఇరు దేశాల ఉన్నతాధికారులు తదితరులంతా చిరునవ్వులు చిందించారు. భారత్‌తో రష్యా బంధం అత్యంత ప్రత్యేకమైనది. ఎంతో దృఢమైనది. అది నానాటికీ మరింతగా బలపడుతోంది'' అని ఈ సందర్భంగా పుతిన్ అన్నారు.

బ్రిక్స్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం

అంతర్జాతీయంగా బ్రిక్స్ కూటమి ప్రాధాన్యం నానాటికీ పెరుగుతోందని మోదీ అభిప్రాయపడ్డారు. ''కీలకమైన అంతర్జాతీయ అంశాలపై చర్చలకు బ్రిక్స్ ప్రధాన వేదికగా మారుతోంది. అభివృద్ధి, పరస్పర సహకారం, వాతావరణ మార్పులు, ఆర్థిక సహకారం, దేశాల మధ్య పలు రకాలైన కీలక సరఫరా వ్యవస్థల నిర్మాణం వంటి వాటిపై నూతన ఆలోచనల కలబోతకు కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. గతేడాది పలు కొత్త దేశాలు బ్రిక్స్ సభ్యులుగా చేరాయి. మరెన్నో దేశాలు చేరేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచ శాంతి, ప్రగతికి సంబంధించిన పలు కీలక అంశాలపై బ్రిక్స్ దేశాధినేతలతో ఫలవంతమైన చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నా'' అని పేర్కొన్నారు. ఈ కూటమి 2006లో బ్రెజిల్, రష్యా, భారత్, చైనాలతో బ్రిక్ పేరిట ఏర్పాటైంది. 2010లో దక్షిణాఫ్రికా చేరికతో బ్రిక్స్‌గా మారింది. గతేడాది ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యూఏఈ కూడా కూటమిలో చేరాయి.

జేపీసీ భేటీలో రసాభాస

- బీజేపీ ఎంపీ అభిజిత్ గంగోపాధ్యాయ్‌తో తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ వాగ్వాదం
- ఆవేశంతో ఊగిపోతూ గాజు సీసాను పగులగొట్టిన బెనర్జీ
- ఆయనపై ఒకరోజు సస్పెన్షన్ వేటు



సీసాను పగలగొట్టాక చేతి వేళ్లకు గాయాలతో తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ

న్యూఢిల్లీ: వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ సమావేశం వాగ్వాదాలకు వేదికగా నిలిచింది. రసాభాసగా మారిన ఈ సమావేశంలో తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ పట్టరాని ఆవేశంతో గాజు నీళ్లసీసా పగలగొట్టారు. సమావేశాన్ని గలాటాకు వేదికగా మార్చారంటూ బెనర్జీని కమిటీ నుంచి ఒక రోజు పాటు సస్పెండ్ చేశారు. బీజేపీ నేత జగదాంబికా పాల్ అధ్యక్షతన మంగళవారం ఢిల్లీలో వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చించేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశంలో చర్చ సందర్భంగా బీజేపీ నేత, కలకత్తా హైకోర్టు మాజీ జడ్జి అభిజిత్ గంగోపాధ్యాయ్‌తో టీఎంసీ నేత కల్యాణ్ బెనర్జీ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బిల్లును బెనర్జీ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సమయంలో తీవ్ర ఆవేశానికి లోనైన బెనర్జీ గాజు నీళ్ల సీసాను పగలగొట్టి చైర్మన్ కుర్చీ వైపుగా విసిరారు. ఈ క్రమంలో అది బెనర్జీ కుడి బొటనవేలుకు కోసుకుపోయింది. ప్రథమ చికిత్స చేసి కుట్లువేశాక ఆయన మళ్లీ ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ, ఆప్ నేత సంజయ్ సింగ్‌లతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. బెనర్జీ ఆవేశపూరిత చర్యలను మెజారిటీసభ్యులు ఖండించారు. సభ్యుల ఆవేశాలు చూస్తుంటే రేపు పొద్దున ఇంకొకరు ఇలాగే రివాల్వర్‌తో కమిటీకి వస్తారేమో అని చైర్మన్ పాల్ అసహనం వ్యక్తంచేశారు. బెనర్జీని సస్పెండ్ చేయాలంటూ బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే చేసిన తీర్మానాన్ని 10–8 మెజారిటీతో ప్యానెల్ ఆమోదించింది. దీంతో బెనర్జీ కోపంతో సమావేశం నుంచి అర్ధాంతరంగా బయటకు వెళ్లిపోయారు. న్యాయవాదులు, మాజీ జడ్జీలతో కూడిన రెండు ఒడిశా ప్రతినిధి బృందాలతో ప్యానెల్ మాట్లాడుతుండగా ఈ గొడవ జరిగింది. వక్ఫ్ బిల్లుతో వీళ్లకు ఏం సంబంధమని బెనర్జీ నిలదీసినట్లు తెలుస్తోంది. తొలుత బెనర్జీ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న చైర్మన్ ఆ తర్వాత పదేపదే బెనర్జీ కలగజేసుకోవడాన్ని తప్పుబట్టడం, దీనికి అభిజిత్ గంగోపాధ్యాయ్ మద్దతు పలకడంతో గంగోపాధ్యాయ్‌తో బెనర్జీ వాగ్వాదానికి దిగారు. ఉద్దేశపూర్వకంగా బాటిల్‌ను విసిరేయలేదని తర్వాత బెనర్జీ వివరణ ఇచ్చారు. వర్షాకాల సమావేశాల్లో వక్ఫ్ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టగా అభ్యంతరాల నేపథ్యంలో పరిశీలన నిమిత్తం బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి సిఫార్సు చేసిన సంగతి తెల్సిందే.

నస్రల్లా బంకర్‌లో

భారీ సంపద

50 కోట్ల డాలర్ల విలువైన బంగారం, నగదు

వీడియోలు విడుదల చేసిన ఇజ్రాయెల్



బంకర్‌పై ఉన్న ఆస్పత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న జర్నలిస్టులు

జెరూసలేం: బీరుట్‌లోని ఓ ఆస్పత్రి కింద హెజ్‌బొల్లా మాజీ చీఫ్ హసన్ నస్రల్లా గడిపిన రహస్య బంకర్‌లో 50 కోట్ల డాలర్లకు పైగా విలువ చేసే బంగారం, నగదు లభ్యమైనట్టు ఇజ్రాయెల్ తెలిపింది. హమాస్‌తో పాటు హెజ్‌బొల్లా కూడా ఇలా ఆసుపత్రులు, పాఠశాలలు, ఇతర సున్నితమైన ప్రదేశాలను ఆయుధాల నిల్వకు, మిలిటెంట్లకు ఆశ్రయానికి వాడుతోందని ఆరోపించింది. బంకర్ నిర్మాణానికి సంబంధించిన గ్రాఫిక్ ఫొటో, అనుకరణ వీడియోను ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగరీ ఆదివారం విడుదల చేశారు. ఆస్పత్రికి కింద ఉన్నందునని బంకర్‌ను కూల్చే ఆలోచన లేదని వెల్లడించారు. హెజ్‌బొల్లాపై చర్యలు తీసుకోవాలని లెబనాన్ అధికారులకు హగరి విజ్ఞప్తి చేశారు. హెజ్‌బొల్లా డబ్బును ఉగ్రవాదానికి, ఇజ్రాయెల్‌పై దాడికి వాడేందుకు అనుమతించొద్దని లెబనాన్ ప్రభుత్వాన్ని, అధికారులను, అంతర్జాతీయ సంస్థలను కోరారు. ఇందులో హెజ్‌బొల్లా ఆర్థిక విభాగమైన అల్-ఖర్ద్ అల్- హసన్ పాత్ర ఉందన్నారు. హెజ్‌బొల్లా కార్యకలాపాలకు నిధులు సమకూరుస్తున్న తీరును కూడా హగరి వివరించారు. లెబనాన్ ప్రజలు, ఇరాన్ ప్రభుత్వం హెజ్‌బొల్లాకు ప్రధాన ఆదాయ వనరులన్నారు. లెబనాన్, సిరియా, యెమెన్, టర్కీల్లో హెజ్‌బొల్లా నడిపే ఫ్యాక్టరీల నుంచి వచ్చే ఆదాయాన్ని ఉగ్ర కార్యకలాపాలకు వాడుతున్నట్టు చెప్పారు. ''ఇజ్రాయెల్ పోరాటం లెబనాన్ పౌరులపై కాదు. కానీ వారిని హెజ్‌బొల్లా ఇలా కవచాలుగా వాడుకుంటోంది'' అని ఆరోపించారు. లెబనాన్‌లో మరో బంకర్లో కూడా కోట్లాది డాలర్ల విలువైన బంగారం, నగదును సోమవారం గుర్తించినట్టు హగరి తెలిపారు.

బీరుట్‌పై ఇజ్రాయెల్ దాడి..13 మంది మృతి

బీరుట్/టెల్అవీవ్: లెబనాన్ రాజధాని బీరుట్‌పై సోమవారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో 13 మంది చనిపోగా 57 మంది గాయపడ్డారు. బీరుట్ దక్షిణ శివారుల్లో జరిపిన దాడిలో రఫిక్ హరారీ యూనివర్సిటీ ఆస్పత్రికి సమీపంలోని భవనం పూర్తిగా ధ్వంసమైందని అధికారులు తెలిపారు. అయితే, తాము హెజ్‌బొల్లా లక్ష్యంగా దాడి చేశామని, ఆస్పత్రిపై కాదని ఇజ్రాయెల్ ఆర్మీ ప్రకటించింది. అంతకు మించి వివరాలను వెల్లడించలేదు. ఆస్పత్రి ప్రవేశ ద్వారానికి సమీపంలో జరిగిన దాడి దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రచారమవుతున్నాయి. ఇలా ఉండగా, సెంట్రల్ ఇజ్రాయెల్‌పైకి మంగళవారం హెజ్‌బొల్లా పలు రాకెట్లను ప్రయోగించింది. వీటిలో చాలా వరకు తమ గగనతల రక్షణ వ్యవస్థలు మధ్యలోనే అడ్డుకున్నాయని ఇజ్రాయెల్ తెలిపింది. ఒక రాకెట్ బహిరంగ ప్రదేశంలో పడిందని పేర్కొంది.

అస్సాం ఎమ్మెల్యే అఖిల్ గొగోయ్‌పై ఉపా చట్టం

గువాహటి: అస్సాంలో పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ 2019 డిసెంబర్‌లో జరిగిన అల్లర్లలో స్వతంత్ర్య అస్సాం ఎమ్మెల్యే అఖిల్ గొగోయ్ ప్రమేయముందంటూ ఆయనపై జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అభియోగాలు మోపింది. కఠిన చట్టవ్యతిరేక కార్యకలాపాల (నిరోధక)చట్టం–ఉపా కింద ప్రత్యేక ఎన్ఐఏ న్యాయస్థానంలో మంగళవారం చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఈ ఉదంతంలో గతంలో ఇదే కోర్టు గొగోయ్‌సహా నలుగురికి క్లీన్‌చిట్ ఇచ్చింది. ఆ తీర్పును ఎన్ఐఏ గువాహటి హైకోర్టులో సవాల్ చేసింది. హైకోర్టు ఆదేశాలతో స్పెషల్ ఎన్ఐఏ కోర్టులో ఎన్ఐఏ పాత కేసును తెరచి తాజాగా చార్జ్‌షీట్ దాఖలు చేయడం గమనార్హం. ఈ నలుగురూ ఇప్పటికే సుప్రీంకోర్టు తీర్పుతో బయటే ఉన్నారు. ''తీర్పు వెలువడేదాకా కస్టడీలోకి తీసుకోబోం. పాత కేసును తెరచి చార్జ్‌షీట్ వేయడంపై నిందితులు హైకోర్టును ఆశ్రయించవచ్చు' అని ఎన్ఐఏ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఎన్ఐఏ నిర్ణయాన్ని హైకోర్టులో సవాల్ చేస్తామని గొగోయ్ అన్నారు. ప్రజల పక్షాల నిలిచినందుకు ప్రభుత్వం తమను మళ్లీ జైలుపాలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. గతంలో మిగతా ముగ్గురికి వెంటనే బెయిల్‌రాగా బయటికొచ్చారు. గొగోయ్ మాత్రం 567 రోజులు జ్యూడీషియల్ కస్టడీలో గడిపి స్పెషల్ ఎన్ఐఏ జడ్జి ప్రాంజల్ దాస్ క్లీన్‌చిట్ ఇవ్వడంతో ఎట్టకేలకు బయటికొచ్చారు. గొగోయ్ 2021 అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో శివసాగర్ నుంచి జైల్లో ఉండగానే స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలిచి రికార్డ్ సృష్టించారు.

లెక్క తేలింది!

మహారాష్ట్రలో సీట్ల పంపకం కొలిక్కి

- మహాయుతిలో బీజేపీకి సింహభాగం.. 152-155 సీట్లు
- శివసేన (షిండే)కు 78-80 స్థానాలు
- ఎన్సీపీ (అజిత్)కు 52 నుంచి 54 సీట్లు

- మహావికాస్ అఘాడిలో పెద్దన్న కాంగ్రెస్
- హస్తం పార్టీకి 105-110 సీట్లు
- శివసేన (యూబీటీ)కి 90-95
- ఎన్సీపీ (శరద్‌పవార్)కు 75-80

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన కూటముల మధ్య మంగళవారం సీట్ల పంపకం కొలిక్కి వచ్చింది. అధికార మహాయుతి కూటమిలో బీజేపీ సగం కంటే ఎక్కువ సీట్లలో పోటీ చేయనుంది. బీజేపీ 152 నుంచి 155 సీట్లు తీసుకునేలా ఒప్పందం కుదిరింది. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సారథ్యంలోని శివసేన 78–80 స్థానాల్లో పోటీచేయనుంది. అజిత్ పవార్ నేతృత్వంలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ 52–54 స్థానాల్లో పోటీచేసేలా ఒప్పందానికి వచ్చాయని తెలిసింది. బీజేపీ ఇప్పటికే 99 మందితో తొలి జాబితాను విడుదల చేసింది కూడా. శివసేన (షిండే) 45 మందితో మంగళవారం తొలి జాబితా విడుదల చేసింది.

అఘాడిలో సమసిన విభేదాలు: సీట్ల పంపకంపై విపక్ష మహావికాస్ అఘాడిలో విభేదాలు సమసిపోయినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) మధ్య మాటలయుద్ధం నడవడం తెలిసిందే. శరద్‌పవార్, ఉద్ధవ్‌లతో మహారాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జి రమేశ్ చెన్నితాల చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో అఘాడి భాగస్వామ్యపక్షాలు స్థూలంగా ఒక ఒప్పందానికి వచ్చినట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ 105 నుంచి 110 స్థానాల్లో పోటీచేయనుంది. శివసేన (యూబీటీ) 90–95 స్థానాల్లో, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్) 75–80 స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపనున్నాయి.



భారీ వర్షాలతో బెంగళూరు అతలాకుతలం..

భవనం కూలి ఒకరు మృతి

శిథిలాల కింద చిక్కిన మరో ఏడుగురు!

బనశంకరి: కర్ణాటక రాజధాని బెంగళూరులో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో జన జీవనం అస్తవ్యస్తమైంది. నగరంలోని బాబుసాబ్ పాళ్యలో నిర్మాణ దశలో ఉన్న బహుళ అంతస్తుల కట్టడం మంగళవారం సాయంత్రం కుప్ప కూలింది. ఈ ఘటనలో ఒకరు చనిపోయారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది, స్థానికులు పది మందిని క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. శిథిలాల కింద మరో ఏడుగురి వరకు చిక్కుకుని ఉన్నట్లు చెబుతున్నారు. ఘటన సమయంలో భవనంలో 18 మంది వరకు కూలీలున్నట్లు తెలిసింది.

జల దిగ్బంధంలో అపార్ట్‌మెంట్లు

బంగాళాఖాతంలో అల్ప పీడనం, ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో శనివారం రాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. మంగళవారం యలహంకలోని కేంద్రీయ విహార్ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లోకి చెరువు నీరు పోటెత్తింది. దీంతో అపార్ట్‌మెంట్‌లోని 2 వేల మంది చిక్కుబడి పోయారు. 650 కుటుంబాలకు గాను 250 కుటుంబాలను బయటకు తరలించారు.

కొనసాగుతున్న బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ: దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులకు బాంబు బెదిరింపు హెచ్చరికలకు తెరపడటం లేదు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు సుమారు 50 విమానాల్లో బాంబులు పెట్టామంటూ ఆగంతకులు సోషల్ మీడియా ద్వారా బెదిరించారు. ఇందులో ఎయిరిండియా, ఇండిగోకు చెందిన 13 చొప్పున విమానాలు, ఆకాశ ఎయిర్‌కు చెందిన 12, విస్తార విమానాలు 11 ఉన్నాయి. బెదిరింపుల నేపథ్యంలో సోమవారం రాత్రి ఇండిగో తన మూడు సర్వీసులను సౌదీ అరేబియా, ఖతార్‌లకు మళ్లించాల్సి వచ్చింది. అయితే, ఇవన్నీ వట్టివేనని తేలింది. తాజా ఘటనతో కలిపి 9 రోజుల్లో 170కి పైగా విమాన సర్వీసులకు బెదిరింపులు అందినట్లయింది. బాంబు హెచ్చరికల కారణంగా బెంగళూరు–జెడ్డా సర్వీసును దోహా(ఖతార్)కు, కోజికోడ్–జెడ్డా విమానాన్ని రియాద్(సౌదీ అరేబియా)కు, ఢిల్లీ–జెడ్డా సర్వీసును మదీనా(సౌదీ అరేబియా)కు మళ్లించామని ఇండిగో తెలిపింది. ప్రయాణికులందరినీ సురక్షితంగా దించి వేసి, విమానంలో పూర్తి స్థాయిలో తనిఖీలు జరిపామని వివరించింది. ఢిల్లీ–దమ్మమ్, ఇస్తాంబుల్–ముంబై, ఇస్తాంబుల్–ఢిల్లీ, మంగళూరు–ముంబై, అహ్మదాబాద్–జెడ్డా, హైదరాబాద్–జెడ్డా, లక్నో–పుణే విమానాలకు కూడా బాంబు హెచ్చరికలు అందాయని ఇండిగో వెల్లడించింది. అయితే, ఎయిరిండియా తమ విమాన సర్వీసులకు అందిన బాంబు బెదిరింపులపై ఎటువంటి ప్రకటన చేయలేదు. సోషల్ మీడియా ద్వారా తమ విమానాలకు కూడా బెదిరింపులు వచ్చాయని విస్తార ప్రతినిధి చెప్పారు. మిగతా వివరాలను ఆయన తెలపలేదు. బాంబు బెదిరింపులు వట్టివేనని తెలిసినా, ఈ విషయాన్ని సీరియస్‌గానే తీసుకుంటున్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. 1982 నాటి సప్రెషన్ ఆఫ్ అన్ లాఫుల్ యాక్ట్స్ ఎగెనెస్ట్ సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ యాక్ట్(ఎస్‌యూఏఎస్‌సీఏ)కు సవరణలు చేయాలని కేంద్రం యోచిస్తోంది. దీని ప్రకారం బెదిరింపులకు పాల్పడే వారిని కోర్టు ఉత్తర్వులతో పనిలేకుండానే వెంటనే అరెస్ట్ చేసి, విచారణ చేపట్టేందుకు అవకాశమేర్పడుతుంది. అలాగే, దోషులకు కఠిన శిక్షలు పడేలా విమాన భద్రతా నిబంధనలను మార్చాలని కూడా కేంద్రం భావిస్తోంది.

9 రోజుల్లో రూ.600 కోట్ల నష్టం

తొమ్మిది రోజులుగా కొనసాగుతున్న బాంబు బెదిరింపుల కారణంగా విమానయాన సంస్థలకు రూ.600 కోట్ల మేర నష్టం వాటిల్లి ఉంటుందని విమానయాన సంస్థల మాజీ అధికారులు అంటున్నారు. దేశీయ విమానాలకైతే నష్టం సుమారుగా రూ.1.5 కోట్ల చొప్పున, అంతర్జాతీయ సర్వీసులకైతే రూ.5 కోట్ల నుంచి రూ.5.5 కోట్ల వరకు నష్టం ఉంటుందని చెప్పారు. దేశీయ, అంతర్జాతీయ విమానాలకు కలిపి సగటున రూ.3.5 కోట్ల మేర నష్టం ఉంటుందని, ఈ లెక్కన 170 విమానాలకు కలిపి ఈ నష్టం రూ.600 కోట్ల వరకు ఉంటుందని వారు అంచనా వేశారు. ఎయిర్‌పోర్టులో పార్కింగ్ చార్జీలు, ఇంధనం వంటి ప్రత్యక్ష ఖర్చులతోపాటు ఇతర విమానాల షెడ్యూళ్లపై పడే పరోక్ష ప్రభావాన్ని కూడా లెక్కించాల్సి ఉంటుందన్నారు. ఇందులో చిన్న, పెద్ద విమానాలు, వాటి ప్రయాణ వ్యవధిని బట్టి కూడా నష్టం వేర్వేరుగా ఉంటుందని చెప్పారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం, 23, అక్టోబర్, 2024



హతమార్చి.. పోలీసులను ఏమార్చి!

మద్యం మత్తులో మహిళలపై అఘాయిత్యాలకు తెగబడటం, ప్రతిఘటించిన వారిని హత్య చేసి పరారయ్యే హంతకుడిని పట్టుకోవడంలో రాచకొండ పోలీసులు విఫలమయ్యారు. -8లో



టెకీ.. ఆరోగ్యం రిస్క్..

ఐటీ ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితులపై ఆందోళన పెరుగుతోంది. దీనికి పని ఒత్తిడి కారణం ఒకటైతే.. హైబ్రిడ్ వర్క్ ఫ్రమ్ హోం సైతం మరో కారణంగా పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.0/23.0

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 31, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.







దీపావళి.. దొంతులు రెడీ

వెలుగుల పండగ దీపావళి అరుదెంచుతున్న వేళ ఇళ్లల్లో ఏర్పాటు చేసుకునే దొంతుల తయారీ వేగం పుంజుకుంది. నగరంలోని పలు ప్రాంతాల్లో వీటిని తయారు చేసి విక్రయించేందుకు కుమ్మరులు సిద్ధమవుతున్నారు. నగరంలోని ఆసిఫ్‌నగర్ కుమ్మర్‌వాడిలో వృత్తిదారులు దొంతుల రూపకల్పనలో ఇలా నిమగ్నమయ్యారు.

జైళ్లలో నిర్మాణ పనులపై ఆరా



ఎండీ రమేష్‌రెడ్డితో చర్చిస్తున్న డీజీ డా. సౌమ్యా మిశ్రా

చంచల్‌గూడ: రాష్ట్రంలోని వివిధ జైళ్లల్లో కొనసాగుతున్న నిర్మాణ పనులకు సంబంధించి మంగళవారం చంచల్‌గూడలోని సీకా కార్యాలయంలో పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ అధికారులతో జైళ్ల శాఖ సమీక్ష సమావేశం నిర్వహించింది. సమావేశంలో కార్పొరేషన్ ఎండీ రమేష్‌రెడ్డి, జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్యా మిశ్రా పాల్గొన్నారు. మధిర, వికారాబాద్, మామ్నూర్ ప్రాంతాల్లో నిర్మించినున్న కొత్త జైళ్ల వ్యాయం అంచనా వేశారు. చంచల్‌గూడ, చర్లపల్లి, సిద్దిపేటలలో కొనసాగుతున్న నిర్మాణ పనులపై చర్చించారు. నిర్మాణంలో ఎదుర్కొంటున్న సవాళ్లు, నిధులు ఉపయోగంపై ప్రధాన చర్చ జరిగింది. సకాలంలో పనులు పూర్తి చేస్తామని కార్పొరేషన్ అధికారులు హామీ ఇచ్చారు. సమావేశంలో ఐజీలు యెర్రంశెట్టి రాజేష్, మురళీబాబు, డీఐజీలు డా. శ్రీనివాస్, సంపత్, సూపరింటెండెంట్ నవాబు శివకుమార్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

హజ్ యాత్ర రుసుము గడువు 31 వరకు పెంపు

సాక్షి, సిటీబ్యూరో: హజ్ యాత్ర- 2025కు ఎంపికైన యాత్రికులు ప్రయాణానికయ్యే ఖర్చులను మొదటి విడతగా రూ.1.30 లక్షలు జమ చేయాలని మంగళవారం రాష్ట్ర హజ్ కమిటీ ఎగ్జిక్యూటివ్ అధికారి లియాఖత్ హుస్సేన్ తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు డబ్బులు చెల్లించే గడువును ఈ నెల 31 వరకు కేంద్ర హజ్ కమిటీ పెంచిందన్నారు. గడువు లోపు రుసుము చెల్లించని వారి స్థానంలో వెయిటింగ్ లిస్టులో ఉన్న వారికి యాత్రకు వెళ్లే అవకాశం దక్కుతుందన్నారు. ఎంపికైనవారు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోని ఏదైనా శాఖ నుంచి కేంద్ర హజ్ కమిటీ పేరుతో చలానా తీయాలని కోరారు. హజ్ కమిటీ కేటాయించిన నంబర్‌తో పాటు బ్యాంక్ నిర్ధారణ నంబర్‌ను తప్పక రాయాలని సూచించారు. సందేహాల నివృత్తికి 040-23298793ను సంప్రదించాలని లియాఖత్ హుస్సేన్ సూచించారు.

రాంచరణ్.. ఆర్టీఏకు వచ్చెన్..



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ సినీనటుడు రాంచరణ్ మంగళవారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయానికి వచ్చారు. ఆయన కొత్తగా కొనుగోలు చేసిన రోల్స్‌రాయిస్ కారు రిజిస్ట్రేషన్ కోసం స్వయంగా వచ్చారు. తనకు నచ్చిన నెంబర్ 'టీజీ 09సి 2727' తీసుకున్నారు. హైదరాబాద్ సంయుక్త రవాణా కమిషనర్ సి.రమేష్, ప్రాంతీయ రవాణా అధికారి పురుషోత్తమ్‌రెడ్డిలు మోటారు వాహన నిబంధనల మేరకు కొత్త వాహనం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆర్టీఏ అందజేస్తున్న పారదర్శకమైన పౌరసేవల పట్ల రాంచరణ్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి వాహనదారుడూ విధిగా ఆర్టీఏ కార్యాలయానికి రావడం వల్ల అన్ని వివరాలు కచ్చితంగా నమోదవుతాయని చెప్పారు.

నగరంలో 'తరంగ్'



తరంగ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రవిచంద్రన్

సాక్షి, సిటీబ్యూరో: సునామీ వంటి విపత్తులను ముందే పసిగట్టేందుకు వీలుగా అత్యంత వేగంగా పనిచేసే హై పర్ఫామెన్స్ కంప్యూటింగ్ వ్యవస్థ హైదరాబాద్‌లోని ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ సర్వీసెస్ (ఇన్‌కాయిస్)లో అందుబాటులోకి వచ్చింది. తరంగ్ పేరుతో ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థను మంగళవారం కేంద్ర ఎర్త్ సైన్సెస్ శాఖ సెక్రటరీ డాక్టర్ ఎం.రవిచంద్రన్ ప్రారంభించారు. ఈ తరంగ్ సూపర్ కంప్యూటర్‌కు 1 పెటా ఫ్లాప్స్ సామర్థ్యం ఉంది. 2 పెటాబైట్ స్టోరేజ్ చేసుకోగలదు. 3 పెటాబైట్ ఆర్కైవల్ స్టోరేజీ చేసుకోగలదు. 15.5 పెటా ఫ్లాప్స్ సామర్థ్యంతో కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ అప్లికేషన్స్ ఉన్నాయి. దాదాపు రూ.90 కోట్లతో ఈ ప్రాజెక్టును పూర్తి చేశారు.

అంతులేని పౌర'పాట్లు'

తప్పులు సవరించింది లేదు.. ఎల్‌ఆర్‌ఎస్ ఇచ్చిందీ లేదు

సాక్షి, సిటీబ్యూరో:

- 'నాగోల్ నుంచి కుంట్లూర్ వరకు రెండువందల అడుగుల వెడల్పుతో రోడ్డు ఉన్నట్లు మాస్టర్‌ప్లాన్‌లో ప్రతిపాదించారు. కానీ.. ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు లేవు. చుట్టుపక్కల పెద్ద ఎత్తున నిర్మాణాలు జరిగాయి. రోడ్డు వస్తుందో, రాదో తెలియదు కానీ మా స్థలం రోడ్డు మధ్యలో ఉన్నట్లు చెప్పి ఎల్‌ఆర్‌ఎస్ నిరాకరించారు. ఏళ్లు గడిచాయి. అక్కడ రోడ్డు నిర్మించలేదు. అలాగని మాస్టర్ ప్లాన్ సవరించలేదు. నాతో పాటు ఎంతోమంది తీవ్రంగా నష్టపోయాను' నాగోల్‌కు చెందిన రాంరెడ్డి ఆందోళన ఇది. తప్పుల తడకలాంటి హెచ్ఎండీఏ మాస్టర్‌ప్లాన్ కారణంగా ఆ స్థలాన్ని అమ్ముకోలేక, ఎలాంటి నిర్మాణం చేపట్టలేక మానసికంగా ఎంతో ఆవేదన గురవుతున్నారాయన.
- 'తుర్కయంజాల్ సమీపంలో ఒక వ్యక్తి గతంలో 250 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ ప్రాంతంలో 150 ఫీట్ల రోడ్డు పోతున్నట్లుగా మాస్టర్‌ప్లాన్‌లో ఉందన్నారు. కానీ.. ఆ ప్లాట్ పక్కనే ఉన్న మరో ప్లాట్‌కు ఎల్‌ఆర్ఎస్ ఇచ్చారు. ఇదే అంశంపై సదరు బాధితుడు హెచ్ఎండీఏ అధికారులను సంప్రదించగా 'మాస్టర్‌ప్లాన్ ఒక్కటే తమకు ప్రామాణికం' అని సెలవిచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అతనికి ఎలాంటి పరిష్కారం లభించలేదు.

వేలాది తప్పులు..

హైదరాబాద్ మహానగర అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం 2031 నాటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని 2013 బృహత్ ప్రణాళికను రూపొందించిన సంగతి తెలిసిందే. జీహెచ్ఎంసీ, ఎంసీహెచ్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ, సైబరాబాద్ అథారిటీ, హెచ్ఎండీఏ ప్రణాళికలన్నింటినీ కలిపి బృహత్ ప్రణాళికను తయారు చేశారు. కానీ.. అప్పట్లో దీనిపై ఎలాంటి శాస్త్రీయమైన అధ్యయనం చేయకపోవడంతో అంతులేని తప్పులు దొర్లినట్లు అధికారులు గుర్తించారు. రోడ్లు, చెరువులు, కుంటలు, నాలాలు లేని చోట ఉన్నట్లు, ఉన్న చోట లేనట్లు మాస్టర్ ప్లాన్‌లో నమోదైంది. మరోవైపు హెచ్ఎండీఏ పరిధిలోని వందలాది గ్రామాల్లో కొన్ని సర్వే నంబర్లు, ఊళ్లు మాయమైనట్లుగా కూడా గుర్తించారు. అయిదు మాస్టర్‌ప్లాన్‌లను సమన్వయం చేయడంలో అధికారులు విఫలమయ్యారు. సుమారు 3000కు పైగా తప్పులు ఉన్నట్లు అప్పట్లోనే గుర్తించారు. దీంతో 50 వేల మందికి పైగా బాధితులు ఎల్‌ఆర్ఎస్‌ను తీసుకొనే అవకాశం కోల్పోయారు. ఆ తప్పులు ఇప్పటికీ తమను వెంటాడుతూనే ఉన్నాయని వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిగిలింది నిరాశే..

సమగ్ర మాస్టర్‌ప్లాన్ అమల్లోకి వచ్చిన తర్వాత రెండు మూడుసార్లు ప్రభుత్వం ఎల్‌ఆర్ఎస్‌కు నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ మాస్టర్‌ప్లాన్‌లో తప్పుల కారణంగా నష్టపోయిన బాధితులకు ఇప్పటికీ ఎలాంటి పరిష్కారం లభించలేదు. 'ఏదో ఒక పరిష్కారం లభిస్తుందని, మాస్టర్‌ప్లాన్‌లో తప్పులను సవరిస్తారని అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. కానీ నిరాశా నిస్పృహలే మిగులుతున్నాయి' అని బీఎన్‌రెడ్డి నగర్‌కు చెందిన చంద్రశేఖర్ తెలిపారు.


మరోవైపు 2031 మాస్టర్ ప్లాన్‌ను సవరించి కొత్తది రూపొందించేందుకు అయిదారేళ్లుగా ప్రతిపాదనలు చేస్తూనే ఉన్నారు. మాస్టర్‌ప్లాన్-2041 రానుందన్నారు. ఆ తర్వాత ట్రిపుల్ వన్ జీఓలోని ప్రాంతాలన్నింటినీ కలిపి హెచ్ఎండీఏ పరిధిలోని 7,200 చ.కి.మీలకు వర్తించేలా మహా మెగా మాస్టర్‌ప్లాన్ అన్నారు. ఇప్పుడు కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి ట్రిపుల్ ఆర్ వరకు వర్తించేలా సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని భావిస్తోంది. మాస్టర్‌ప్లాన్- 31 కారణంగా నష్టపోయిన బాధితులు దశాబ్ద కాలంగా ఎలాంటి పరిష్కారం లభించక పడిగాపులు కాస్తూనే ఉండటం గమనార్హం.

వెంటాడుతున్న హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్ తప్పులు

- ఏళ్లు గడిచినా సవరణకు నోచుకోని వైనం
- బృహత్ ప్రణాళికలో అంతులేని జాప్యం
- తీవ్రంగా నష్టపోతున్నామంటున్న బాధితులు

ప్రస్తుతం 2050 బృహత్ ప్రణాళిక..

తెలంగాణ మూడు భాగాలుగా విభజించి 2050 వరకు దశలవారీగా చేపట్టాల్సిన అభివృద్ధిపై బృహత్ ప్రణాళికను రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న ప్రాంతాన్ని అర్బన్‌గా, ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు ఉన్న భూభాగాన్ని సబర్బన్‌గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. రీజినల్ రింగ్‌రోడ్డు నుంచి ఉండే మిగతా తెలంగాణ ప్రాంతాన్ని రూరల్‌గా పరిగణిస్తారు. ఇందుకనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో హెచ్ఎండీఏ పరిధి ప్రస్తుతం ఉన్న 7,200 చ.కి.మీ నుంచి సుమారు 10 వేల చదరపు కి.మీ వరకు పెరగనుంది. ఈ మొత్తం భూభాగానికి వర్తించేవిధంగా 'మెగా మాస్టర్ ప్లాన్ -2050'ని రూపొందిస్తారు. ఇందులో ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు సమగ్ర ప్రజా రవాణా సదుపాయాల ప్రణాళిక (కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్) ఆర్థిక అభివృద్ధి ప్రణాళిక, బ్లూ అండ్ గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రణాళికలు ఉంటాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మెగా మాస్టర్‌ప్లాన్‌ను సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు హెచ్ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఆ దిశగా ఎలాంటి పురోగతి లేకుండాపోయింది.



రెండోరోజూ ప్రశాంతంగా గ్రూప్-1 మెయిన్స్



బేగంపేటలో హాల్ టికెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

సనత్‌నగర్: గ్రూప్-1 మెయిన్స్ రెండోరోజు ప్రశాంతంగా జరిగింది. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో మొత్తం 933 అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 681 మంది పరీక్ష రాశారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటలకు పరీక్ష సమయం కాగా.. అరగంట ముందుగానే అభ్యర్థులను హాల్‌లోకి అనుమతించారు. పోలీసులు అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోనికి పంపించారు. నార్త్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ పర్యవేక్షణలో బేగంపేట ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ రామయ్యల ఆధ్వర్యంలో ఆయా కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా వీల్‌చైర్లను అందుబాటులో ఉంచారు. బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు, బేగంపేట ఇన్‌స్పెక్టర్ రామయ్యతో పాటు పోలీసు సిబ్బంది సెంటర్ వద్ద అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలించి లోపలికి అనుమతించారు.

మీ మనీ.. రమ్మనీ..

ఫ్రీజ్ చేసిన నగదు రిఫండ్‌పై సైబర్ కాప్స్ దృష్టి

- రెండు విధాలుగా స్తంభింపజేస్తున్న అధికారులు
- ఇప్పటి వరకు దాదాపు రూ.40 కోట్లు బాధితులకు
- 'గోల్డెన్ అవర్'లో ఫిర్యాదు చేస్తే మంచి ఫలితాలు

సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల్లో బాధితులు మోసపోవడం ఎంత తేలికో... నేరగాళ్లను పట్టుకోవడం అంత కష్టం. నగదు రికవరీ అనేది దాదాపు అసాధ్యమనే చెప్పవచ్చు. 'గోల్డెన్ అవర్'లో ఫిర్యాదు చేసిన బాధితులకు మాత్రం చాలా వరకు న్యాయం జరుగుతోంది. క్రిమినల్స్‌కు చెందిన బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేసిన వీరి నగదును రిటర్న్ చేయడానికి హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కీలక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది ఇప్పటి వరకు దాదాపు రూ.40 కోట్లు బాధితులకు తిరిగి ఇప్పించగలిగారు.

ఆ సమయమే గోల్డెన్ అవర్..

బాధితులు 'గోల్డెన్ అవర్'లో అప్రమత్తం కావడంతో పాటు తక్షణం ఫిర్యాదు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. నేరం బారిన పడిన తర్వాత తొలి గంటనే గోల్డెన్ అవర్‌గా పరిగణిస్తారు. ఆ తర్వాత ఎంత ఆలస్యమైతే నగదు వెనక్కు వచ్చే అవకాశాలు అంత తగ్గిపోతుంటాయి. ఆర్థిక అంశాలతో ముడిపడి ఉన్న సైబర్ నేరాల్లో బాధితులు తొలుత సైబర్ క్రైమ్ ఠాణాకు రావడంపై దృష్టి పెట్టకుండా తక్షణం 1930 నంబర్‌కు కాల్ చేసి లేదా (www.cybercrime.gov.in)కు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

రెండు రకాలుగా నగదు ఫ్రీజ్..

ఉత్తరాదిలోని వివిధ ప్రాంతాలు కేంద్రంగా దేశ వ్యాప్తంగా సైబర్ నేరాలకు పాల్పడే నిందితులు బాధితుల నుంచి నగదు డిపాజిట్/ట్రాన్స్‌ఫర్ చేయించడానికి సొంత బ్యాంకు ఖాతాలను వాడరు. పోలీసులకు ఎలాంటి ఆధారాలు చిక్కకూడదనే ఉద్దేశంలో మనీమ్యూల్స్‌గా పిలిచే దళారులకు చెందిన వాటితో పాటు బోగస్ వివరాలతో తెరిచిన బ్యాంకు ఖాతాలకు దీనికోసం వినియోగిస్తుంటారు. ఓ నేరం కోసం ఒకే ఖాతాను కాకుండా వరుస పెట్టి బదిలీ చేసుకుపోవడానికి కొన్నింటిని వాడుతుంటారు. మోసపోయిన బాధితులు నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసినప్పుడు ఆ అధికారులు ప్రాథమిక ఖాతాల్లోని నగదు ఫ్రీజ్ చేస్తారు. దీన్ని ఆన్‌లైన్ ఫ్రీజింగ్ అంటారు. సైబర్ క్రైమ్ పోలీసుల దర్యాప్తులో అప్పటికే కొంత నగదు మరో ఖాతాలోకి వెళ్లినట్లు తేలితే ఆయా బ్యాంకుల సహకారంతో దాన్నీ ఫ్రీజ్ చేస్తారు. దీన్ని ఆఫ్‌లైన్ ఫ్రీజింగ్‌గా వ్యవహరిస్తుంటారు.

ఒక్కో టీమ్‌లో ఒక్కో కానిస్టేబుల్..

ఫిర్యాదు చేసినప్పుడు నగదు ఫ్రీజ్ అవుతోందనే విషయం చాలా మంది బాధితులకు తెలియట్లేదు. దీనికి సంబంధించి వస్తున్న ఎస్సెమ్మెస్‌లను వాళ్లు పట్టించుకోవట్లేదు. కొంత కాలానికి తెలిసినప్పటికీ కోర్టుకు వెళ్లి, అనుమతి పొందటం వీరికి పెద్ద ప్రహసనంగా మారుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకున్న నగర సైబర్ క్రైమ్ పోలీసులు ప్రతి టీమ్‌కు ఓ కానిస్టేబుల్‌ను నియమించారు. సైబర్ నేరాల్లో ఫ్రీజ్ అయిన నగదు వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే ఈ అధికారి బాధితులకు ఫోన్ చేసి విషయం చెప్పడంతో పాటు వచ్చి నగదు తీసుకోవడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరతాడు. అలా ఠాణాకు వచ్చిన బాధితులను కోర్టుకు తీసుకువెళ్లి పిటిషన్ వేయడంతో పాటు నగదు విడుదలకు సంబంధించిన బ్యాంకు అధికారులకు ఆదేశాలు ఇచ్చేలా కానిస్టేబుల్ చేస్తున్నారు. గత ఏడాది మొత్తమ్మీద రిఫండ్ అయిన మొత్తం రూ.20.86 కోట్లుగా ఉండగా.. పోలీసుల చర్యల కారణంగా ఈ ఏడాది సెప్టెంబర్ నాటికే ఇది రూ.32.49 కోట్లకు చేరింది. ఈ నెల్లో రిఫండ్‌తో కలిపితే ఇది దాదాపు రూ.40 కోట్ల వరకు ఉంది.



ఇవీ గణాంకాలు:

సంవత్సరం	2023	2024 (సెప్టెంబర్)
నమోదైన కేసులు	2984	2336
కొలిక్కి చేరిన కేసులు	286	247
అరెస్టు అయిన నిందితులు	413	346
ఆన్‌లైన్ ఫ్రీజింగ్	రూ.13.26 కోట్లు	రూ.29.98 కోట్లు
ఆఫ్‌లైన్ ఫ్రీజింగ్	రూ.37.34 కోట్లు	రూ.72.98 కోట్లు
రిఫండ్ అయింది	రూ.20.86 కోట్లు	రూ.32.49 కోట్లు

■ ఫ్రీజ్ అయిన దాంట్లో మిగిలిన మొత్తం రిఫండ్‌పై కోర్టు ఆదేశాలు రావాల్సి ఉంది.

ఔటర్ దాకా.. వెలుగు జిలుగులు



ఎల్ఈడీ స్ట్రీట్‌లైట్ల ఏర్పాటుకు సిద్ధమవుతున్న జీహెచ్ఎంసీ

- ఈఈఎస్ఎల్ నిర్వహణ గడువు ముగియనున్న నేపథ్యంలో..
- కొత్త ఏజెన్సీకి అప్పగించే యోచనలో యంత్రాంగం

సాక్షి, సిటీబ్యూరో: ఎల్ఈడీ వీధి దీపాల నిర్వహణలో ఈఈఎస్ఎల్ విఫలమైన అనుభవంతో.. కొత్త ఏజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించే యోచనలో జీహెచ్ఎంసీ ఉంది. ఒప్పందం మేరకు ఈఈఎస్ఎల్‌కు వచ్చే సంవత్సరం ఏప్రిల్ నెలాఖరు వరకు గడువు ఉంది. ఆ తర్వాత వీధిదీపాల నిర్వహణ పటిష్టంగా ఉండేందుకు పకడ్బందీ చర్యలకు జీహెచ్ఎంసీ సిద్ధమవుతోంది. మరోవైపు ఓఆర్ఆర్ (ఔటర్ రింగ్‌రోడ్) వరకున్న కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలను జీహెచ్ఎంసీలో కలపడంతో పాటు జీహెచ్ఎంసీని మూడు లేదా నాలుగు కార్పొరేషన్లుగా చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నందున ఓఆర్ఆర్ వరకు కూడా వీధిదీపాల లెక్కలు తీసే పనిలో పడింది. ఇందుకోసం ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో, శివార్లలో ఓఆర్ఆర్ వరకున్న పురపాలికలు, గ్రామపంచాయతీల్లో ఉన్న వీధి దీపాలెన్ని.. వాటిలో పని చేస్తున్నవి.. పని చేయనివి తదితర లెక్కలు తీసేందుకు సిద్ధమైంది. ఈ పనికి, దీంతోపాటు కొత్త ఏజెన్సీకి నిర్వహణ బాధ్యతలు అప్పగించే ముందు అవసరమైన టెండర్ల నోటిఫికేషన్లు, టెండర్ల అనంతరం పనుల అప్పగింత తదితరమైనవి నిర్వహించేందుకు ప్రాజెక్ట్ మానిటరింగ్ కమిటీ (పీఎంసీ) కోసం జీహెచ్ఎంసీ టెండర్లు ఆహ్వానించింది. దీంతో పీఎంసీ ఏజెన్సీ వాటిని సర్వే చేసి వివరాలివ్వాల్సి ఉంటుంది. వీధిదీపాలు ఆటోమేటిక్‌గా ఆన్ అండ్ ఆఫ్ అయ్యేందుకు ప్రస్తుతమున్న సెంట్రలైజ్డ్ కంట్రోల్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ (సీసీఎంఎస్) బాక్సులు.. భవిష్యత్తులో ఎన్ని అవసరమవుతాయి, మొత్తం ఎన్ని వీధి దీపాల అవసరం ఉంటుంది వంటి వివరాలు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. జీహెచ్ఎంసీతో పాటు శివార్లలోని కార్పొరేషన్లలోనూ ఈఈఎస్ఎల్ వీధిదీపాల నిర్వహణను చూస్తోంది.

వీధి దీపాల వివరాలివీ..

జీహెచ్ఎంసీ పరిధిలో: 5.48 లక్షలు

కంటోన్మెంట్ పరిధిలో: 13,058

శివార్లలోని ఏడు కార్పొరేషన్లలో : మొత్తం 86,434

అవి: బడంగ్‌పేట్ (16,845), బండ్లగూడ జాగీర్ (13,164), మీర్‌పేట-జిల్లెలగూడ (7,722), బోడుప్పల్ (14,319), పీర్జాదిగూడ (11,485), జవహర్‌నగర్ (10,505), నిజాంపేట్ (12,394).

శివార్లలోని మున్సిపాలిటీల్లో 1,48,533.

అవి: పెద్దఅంబర్‌పేట్ (7,907), ఇబ్రహీంపట్నం (3,403), జల్‌పల్లి (9,139), శంషాబాద్(12,941), తుర్కయాంజాల్ (11,907), మణికొండ (15,000) నార్సింగి (6,988), ఆదిభట్ల (4,189), తుక్కుగూడ(4,754), బొల్లారం (2,061), తెల్లాపూర్ (4,346), అమీన్‌పూర్ (11,488), దమ్మాయిగూడ (8,255), నాగారం (12,206), ఘట్‌కేసర్ (5,778), గుండ్లపోచంపల్లి (3,118), తూంకుంట (4,329), కొంపల్లి (3,223), దుండిగల్ (9,532), పోచారం (7,969).

ఈ గ్రామాల్లో లెక్క తీయాలి

రామచంద్రాపురం, ఐలాపూర్, కర్దనూర్, కిష్టారెడ్డిపేట, ముత్తంగి, పోచారం, సుల్తాన్‌పూర్, కాచవాని సింగారం, కొర్రెముల్, పీర్జాదిగూడ, ప్రతాపసింగారం, బాచారం, గౌరెల్లి, కుత్బుల్లాపూర్, తారామతిపేట్, చీర్యాల, గోధుమకుంట, కీసర, రాంపల్లి, తిమ్మాయిపల్లి, యాద్గార్‌పల్లి, మంఖాల్, గౌడవెల్లి, పూడూరు, మంచిరేవుల, బొమ్రాస్‌పేట్, గోల్కొండ కలాన్, గోల్కొండ ఖుర్ద్, హమీదుల్లానగర్, జన్వాడ, పాటి తదితర గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం ఎన్ని వీధి దీపాలున్నాయో సర్వేలో భాగంగా లెక్క తీయాల్సి ఉంది.

నార్త్ హైదరాబాద్‌కు మెట్రో వేయండి

అల్వాల్: మెట్రో ఫేజ్- 2లో భాగంగా ప్యారడైజ్ నుంచి కొంపల్లి- మేడ్చల్, జూబ్లీ బస్టాండ్ - అల్వాల్ మీదుగా శామీర్‌పేట వైపు మెట్రో రైల్ సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ మేడ్చల్ మెట్రో సాధన సమితి ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో కలిసి మంగళవారం ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ.. నగరమంతా మెట్రో విస్తరించింది కానీ నార్త్ హైదరాబాద్ ప్రాంతానికి విస్తరణ జరగలేదన్నారు. మేడ్చల్, కొంపల్లి, సుచిత్ర, అల్వాల్, శామీర్‌పేట లాంటి అధిక జనాభా ఉన్న నార్త్ హైదరాబాద్ వాసులకు మెట్రో రైల్ వసతి లేకపోవడం అన్యాయమన్నారు. మేడ్చల్, శామీర్‌పేటలను మెట్రో ఫేజ్- 2 ప్రాజెక్టులో చేర్చి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. నార్త్ హైదరాబాద్‌కు మెట్రో అనుసంధానం విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మేడ్చల్ మెట్రో సాధన సమితి ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

హతమార్చి.. » పోలీసులను ఏమార్చి!

ఏడాదిన్నర పాటు ఖాకీల కళ్లుగప్పిన నిందితుడు

- కళ్ల ముందు తిరుగుతున్నా గుర్తించని విచారణాధికారులు
- మరో రెండు ప్రాణాలను బలిగొన్న హంతకుడు
- కేసుల దర్యాప్తులో రాచకొండ పోలీసుల డొల్లతనం
- శాస్త్రీయ కోణంలో ఆధారాలు సేకరించడంలో విఫలం



సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు (ఫైల్)



సాక్షి, సిటీబ్యూరో: మద్యం మత్తులో మహిళలపై అఘాయిత్యాలకు తెగబడటం, ప్రతిఘటించిన వారిని హత్య చేసి పరారయ్యే హంతకుడిని పట్టుకోవడంలో రాచకొండ పోలీసులు ఘోరంగా విఫలమయ్యారు. హత్య చేసి ఏడాదిన్నర కాలం పాటు పోలీసుల కళ్లగప్పి వారి ముందే తిరుగుతున్నా గుర్తించలేకపోయారు. మరో ఇద్దరిని హత్య చేసి, తనంతట తాను దొరికితే తప్ప విచారణాధికారులు నిందితుడిని పట్టుకోలేకపోయారు. శాస్త్రీయ కోణంలో ఆధారాలు సేకరించి తొలి కేసులోనే నిందితుడిని పట్టుకుని ఉంటే.. ఇద్దరు ప్రాణాలతో మిగిలేవారు. కేసుల దర్యాప్తులో రాచకొండ పోలీసుల డొల్లతనంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తాగితే అఘాయిత్యమే..

దాసర్లపల్లి గ్రామానికి చెందిన ఉప్పుల శివ కుమార్ మద్యం మత్తులో సైకోలాగా ప్రవర్తిస్తుంటాడు. తాగిన మైకంలో ఫామ్ హౌస్‌లు, నిర్మానుష్య ప్రాంతాల్లో సంచరిస్తూ ఒంటరిగా ఉన్న మహిళలను లక్ష్యంగా చేసుకుని వారిపై కన్నేసేవాడు. అదను చూసి మద్యం తాగి వారిపై అఘాయిత్యానికి పాల్పడేవాడు. ఎవరైనా ప్రతిఘటిస్తే అక్కడే ఉన్న పదునైన ఆయుధంతో వారిని హత్య చేసి పరారయ్యేవాడు. ఈ ఘటనను ఎవరైనా చూస్తే.. సాక్ష్యం మిగలకుండా వారిని కూడా అంతం చేసేందుకు వెనుకాడేవాడు కాదు. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే అతను తన కార్యకలాపాలను ఎప్పటికప్పుడు వాటిలో పోస్ట్ చేస్తూ పెద్ద సంఖ్యలో ఫాలోవర్లను కలిగి ఉన్నట్లు గుర్తించారు.

ఆధారాల సేకరణలో విఫలం..

దాసర్లపల్లిలోని అరుణ ఫామ్ హౌస్‌లో పనిచేసే శైలజ అనే మహిళపై కన్నేసిన అతను గతేడాది మార్చి 3న ఆమెను హత్య చేశాడు. అనంతరం హతురాలి ఇంట్లో ఉన్న రెండు విదేశీ మద్యం బాటిళ్లు నిందితుడి కంట పడ్డాయి. దీంతో ఒక బాటిల్‌ను తీసుకుని, మరొకటి తీస్తుండగా చేయి జారి కింద పడిపోయింది. పగిలిన బాటిల్‌పై ఉన్న నిందితుడి వేలిముద్రలను పోలీసులు సేకరించారు. అయితే హతురాలు, నిందితుడు ఇద్దరూ అదే గ్రామానికి చెందిన వారే అయినా పోలీసులు ఊరిలో ఉన్న అనుమానితులను విచారించలేదు. దీంతో నిందితుడు శివ కళ్ల ముందు ఉన్నా గుర్తించలేకపోయారు. అంతే కాకుండా హత్య అనంతరం సంఘటనా స్థలానికి పోలీసులు వచ్చిన సమయంలోనూ నిందితుడు కూడా అక్కడే ఉండి ఆధారాల సేకరణలో వారికి సహాయపడినట్లు తెలిసింది. వాసన పసిగట్టి డాగ్ స్క్వాడ్ వెంబడిస్తాయని ముందుగానే తెలుసుకున్న నిందితుడు... అవి రాకముందే అక్కడ్నుంచి పరారయ్యేవాడు. శైలజా రెడ్డిని హత్య చేసిన తర్వాత ఏడాదిన్నర కాలం పాటు అదే ఊర్లో తిరుగుతున్నా పోలీసులు గుర్తించలేకపోయారు. మరోసారి మద్యం మత్తులో మ్యాంగో ఆర్చిడ్స్ ఫామ్ హౌస్‌లో పని చేస్తున్న శాంతమ్మపై అత్యాచారానికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో వేట కొడవలితో హత్య చేశాడు. ఇది చూశాడన్న అనుమానంతో ఆమె భర్త మూగ హోసయ్యనూ అంతం చేశాడు. తొలి కేసులోనే పోలీసులు హంతకుడు శివను పట్టుకుని ఉంటే ఇద్దరి ప్రాణాలకు దక్కేవని స్థానికులు పేర్కొంటున్నారు.

పాత కేసులపై ఆరా..

హత్యలు జరిగిన రెండు ఫామ్ హౌస్‌లలోనూ సీసీటీవీ కెమెరాలు లేకపోవడం కూడా పోలీసుల దర్యాప్తునకు సవాల్‌గా మారింది. రూ.కోట్లు ఖర్చు పెట్టి వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేసుకునే యజమానులు, సిబ్బంది భద్రత, రక్షణ కోసం కనీసం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని ఉండాల్సిందని పోలీసులు సూచిస్తున్నారు. ఫామ్ హౌస్‌లకు వచ్చివెళ్లే దారిలో కూడా ఎలాంటి నిఘా నేత్రాలు లేకపోవడం నిందితులు ఎలాంటి బెరుకు లేకుండా నేరాలకు పాల్పడుతుంటారని అధికారులు చెబుతున్నారు. సాధారణంగా నిందితుడు సాయంత్రం వేళల్లో మద్యం తాగి, మహిళలపై అత్యాచారానికి పాల్పడుతుంటాడు. అడ్డుపడిన వారిపై పదునైన ఆయుధంతో హత్య చేస్తుంటాడు. దీంతో మహేశ్వరం జోన్ పరిధిలో ఇదే తరహాలో ఏమైనా హత్య కేసులు నమోదయ్యాయా అనే కోణంలో పోలీసులు పునఃసమీక్షిస్తున్నారు. నిర్మానుష్య ప్రాంతాలు, ఫామ్ హౌస్‌లు, గృహాలలో సాయంత్రం వేళల్లో జరిగిన మహిళల హత్య కేసులను ఆరా తీస్తున్నారు.

కొత్వాల్‌ను కలిసిన యశ్వంత్

'మౌంట్ గోరిచెన్' చిత్రాన్ని అందించిన మౌంటెనీర్



సాక్షి, సిటీబ్యూరో: మహబూబాబాద్ జిల్లాకు చెందిన మౌంటినీర్ భూక్యా యశ్వంత్ నాయక్ మంగళవారం నగర కొత్వాల్ సీవీ ఆనంద్‌ను కలిశారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని ఎత్తైన శిఖరం మౌంట్ గోరిచెన్‌ను సంబంధించిన 'జ్ఞాపకాన్ని' అందించారు. ఈ శిఖరాన్ని అధిరోహించిన పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించిన యశ్వంత్‌తో కొత్వాల్ బంజారాహిల్స్‌లోని టీజీ సీసీసీలో కాస్సేపు ముచ్చటించారు. మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం భూక్యాతండాకు చెందిన యశ్వంత్ (20) గత నెల 4 నుంచి 16 రోజుల పాటు సాగిన పర్వతారోహణలో అరుణాచల్‌ప్రదేశ్‌లోని అతి ఎత్తైన (సముద్ర మట్టానికి 21,300 అడుగులు) మౌంట్ గోరిచెన్‌ను అధిరోహించారు. ఆ శిఖరంపై జాతీయ పతాకం, సీవీ ఆనంద్ ఫొటోను ప్రదర్శించి తన అభిమానాన్ని చాటుకున్నారు. తాను ఆనంద్ ఫొటోను ప్రదర్శిస్తుండగా తీసిన ఫొటోను ఫ్రేమ్ చేసిన యశ్వంత్ కొత్వాల్ సీవీ ఆనంద్‌కు అందజేశారు.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- దాడులను ఉధృతం చేసిన ఎక్సైజ్‌శాఖ పలుచోట్ల దాడులు
- ఉప్పల్‌లో ముగ్గురి అరెస్టు రెండు బైక్‌లు,మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం

సాక్షి, సిటీబ్యూరో: గంజాయి అక్రమ రవాణాపై ఎక్సైజ్ పోలీసులు దాడులను మరింత ఉధృతం చేశారు. గ్రేటర్ పరిధిలో అన్ని ప్రాంతాల్లో తనిఖీలను ముమ్మరం చేశారు. మంగళవారం ఉప్పల్ నల్ల చెరువు కట్ట వద్ద గంజాయి అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్టీఎఫ్ బృందం పోలీసులు ఎక్సైజ్ సీఐ నాగరాజు నేతృత్వంలో దాడులు చేసి సుమారు 1.5 కిలోల గంజాయిని స్వా. దీనం చేసుకున్నారు. బోడుప్పల్‌కు చెందిన నక్క వినీత్, బల్కంపేట్‌కు మోక తేజష్ కృష్ణ, దమ్మాయిగూడకు చెందిన గరికల అనుదీప్‌లను అరెస్ట్ చేశారు.వారి నుంచి 3 సెల్‌ఫోన్లు, 3 బైక్‌లను స్వా. దీనం చేసుకున్నారు. ఉన్నారు. వీరు ముగ్గురు చిరుద్యోగులుగా పని చేస్తూ గంజాయి అమ్మకాలు సాగిస్తున్నారు. ఆన్‌లైన్‌లో గంజాయిని కొనుగోలు చేసి స్థానికంగా విక్రయిస్తున్నట్లు తెలిపారు.

రూ. 3 కోట్ల గంజాయి, డ్రగ్స్ దహనం...

రెండురోజుల క్రితం ఎక్సైజ్ అధికారులు సుమారు రూ.3 కోట్ల విలువైన గంజాయి, డ్రగ్స్‌ను దహనం చేశారు. దూల్‌పేట్ ఎక్సైజ్,జూబ్లీహిల్స్, కాచిగూడ, మలక్‌పేట్, సికింద్రాబాద్, నారాయణగూడ, ముషీరాబాద్, తదితర ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను రంగారెడ్డి జిల్లా ఈదులపల్లిలోని జీకే మల్టికేవ్ ఇండియా ప్రైవేట్ కంపెనీలో దహనం చేశారు. మొత్తం 219 కేసుల్లో పట్టుబడిన 756.356కేజీల గంజాయి, 1.315 కిలోల వెట్ గంజాయి, 8 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్, 1235.06 కేజీల పాపిస్ట్రా, 06 గంజాయి మొక్కలు, 10 కేజీల హషీస్ ఆయిల్ , కొకైన్, గంజాయి చాక్లెట్లను దహనం చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐలను, సిబ్బందిని ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య



సిద్దూయాదవ్ మృతదేహం

మేడ్చల్‌రూరల్: ఓ ఇంజినీరింగ్ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... జడ్చర్లకు చెందిన సిద్దుయాదవ్ (20) స్థానిక వీఐపీ డీలక్స్ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ కిష్టాపూర్‌లోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన సిద్దూ యాదవ్ గత సోమవారం రాత్రి హాస్టల్‌కు వచ్చాడు. మంగళవారం ఉదయం రూమ్‌మేట్స్ కాలేజీకి వెళుతుండగా మీరు వెళ్లండి..తాను తర్వాత వస్తానని చెప్పాడు. అనంతరం గదిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం హాస్టల్‌కు వచ్చిన అతడి రూమ్‌మేట్స్ డోర్ కొట్టినా స్పందన లేకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఉరివేసుకుని కనిపించడంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా సిద్దూ అప్పటికే మృతి చెంది ఉన్నాడు. హాస్టల్ నిర్వాహకుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు సిద్దూయాదవ్ గత కొంతకాలంగా డిప్రెషన్‌తో బాధపడుతున్నాడని ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బులు పోగొట్టుకోవడంతో ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు.

ఉద్యోగాలు ఇస్తామంటూ రూ.1.17 కోట్లు స్వాహా

- ఆర్‌కే గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవహారమిదీ
- సీసీఎస్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు
- కేసు నమోదు, దర్యాప్తు చేస్తున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రంగాల్లో ప్రైవేట్ ఉద్యోగాల పేరుతో ఐదుగురి నుంచి రూ.1.17 కోట్లు స్వాహా చేసిన ఆర్‌కే గ్రూప్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యజమాని ఎం.సురేష్‌తో పాటు అతడి అనుచరులపై హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు కేసు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లాకు చెందిన షేక్ హుస్సేన్ వలీకి ఓ లోకల్ యాప్‌లో ఆర్‌కే గ్రూప్ సంస్థకు చెందిన ప్రకటన కనిపించింది. వివిధ ఉద్యోగాల పేరుతో ఉన్న దానిని చూసి ఆకర్షితుడైన హుస్సేన్ ఈ ఏడాది జూలై 6న నగరానికి వచ్చి సికింద్రాబాద్‌లోని సంస్థ కార్యాలయానికి వెళ్లాడు. అక్కడ అతడిని కలిసిన సురేష్ తానో పెద్ద కాంట్రాక్టర్‌గా, వేర్ హౌసింగ్ సహా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అనేక కాంట్రాక్టులు చేసినట్లు పరిచయం చేసుకున్నాడు. తనకు ఉన్న పరిచయాలు ఉపయోగించి వివిధ రంగాల్లో ప్రైవేట్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. అందుకుగాను కొంత మొత్తం డిమాండ్ చేశాడు. ఇతడి మాటలు నమ్మిన హుస్సేన్ యూపీఐ ద్వారా రూ.లక్ష చెల్లించాడు. అదే నెల 11న జాబ్ ఆఫర్ లెటర్‌తో పాటు గుర్తింపుకార్డు ఇచ్చిన సురేష్ తన కార్యాలయంలోనే హుస్సేన్‌ను ఉద్యోగిగా ఏర్పాటు చేసుకున్నాడు. కొన్ని రోజులకే జీతం ఇస్తున్నట్లు రూ.65,800 ఫోన్ పే ద్వారా చెల్లించాడు. దీంతో అతడిపై హుస్సేన్‌కు పూర్తి నమ్మకం కలిగింది. తాము మరికొందరికీ ఉద్యోగాలు ఇప్పిద్దామని సురేష్ చెప్పడంతో నమ్మిన హుస్సేన్ తన బంధువులు, స్నేహితులు అయిన 12 మందిని సంప్రదించాడు. వీరంతా కలిసి రూ.1.17 కోట్లు సురేష్‌కు చెల్లించారు. అందరికీ ఆఫర్ లెటర్లు ఇచ్చిన సురేష్, అతడి అనుచరులు కొంత కాలం శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. ఇలా నెల రోజులు ట్రైనింగ్ ఇస్తూ... కొందరికి జీతాలు కూడా ఇచ్చారు. ఆపై హఠాత్తుగా కార్యాలయానికి తాళం వేసి ఉడాయించారు. దీంతో బాధితులు వనపర్తిలోని సురేష్ ఇంటికి వెళ్లి కుటుంబీకులను సంప్రదించినా అతడి వివరాలు లభించలేదు. ఈ గ్యాంగ్ మరికొందరినీ ఇదే పంథాలో మోసం చేసినట్లు తెలుసుకున్న బాధితులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దీన్ని దర్యాప్తు చేస్తున్న అధికారులు పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నారు.

రూ.6.8 కోట్ల కేసంటూ రూ.43.4 లక్షలు వసూలు

- 'నరేష్ గోయల్' కేసు పేరుతో బెదిరింపులు
- నగర వాసి నుంచి స్వాహా చేసిన నేరగాళ్లు
- ట్రాయ్, రిజర్వ్ బ్యాంకు పేర్లు చెప్పి టోకరా
- కేసు నమోదు చేసిన సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన ఓ మహిళ ఉద్యోగిని మనీలాండరింగ్ కేసు పేరుతో బెదిరించిన సైబర్ నేరగాళ్లు ఆమె నుంచి రూ.43.4 లక్షలు స్వాహా చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రైవేట్ ఉద్యోగం చేసే మహిళకు ట్రాయ్ పంపుతున్నట్లు ఓ ఆటోమేటెడ్ సందేశం వచ్చింది. అందులో మరో రెండు గంటల్లో ఆమె పేరుతో ఉన్న అన్ని ఫోన్ నెంబర్లను బ్లాక్ చేస్తున్నట్లు ఉంది. ఇతర వివరాలు కావాలంటే సంప్రదించాలంటూ ఓ ఫోన్ నెంబర్ ఇచ్చారు. దీనికి బాధితురాలి కాల్ చేయగా... ముంబైలోని అంధేరీ ఠాణాలో ఆమెపై ఓ కేసు నమోదైందని, అక్రమ ప్రకటనలు ఇవ్వడం, వేధింపులకు పాల్పడటం ప్రధాన ఆరోపణలని అవతలి వ్యక్తులు చెప్పారు. వెరిఫికేషన్ కోసమంటూ ఆమె నుంచి ఆధార్ నెంబర్ తీసుకున్నారు. ఆపై మరోసారి కాల్ చేసిన సైబర్ నేరగాళ్లు జెట్ ఎయిర్‌వేస్ ఫౌండర్ నరేష్ గోయల్ స్కామ్ పేరు చెప్పి బెదిరించారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని మనీలాండరింగ్‌కు పాల్పడిన ఆరోపణలపై నరేష్ గత ఏడాది సెప్టెంబర్‌లో అరెస్టయ్యారు. ఆ కేసులో మీ ప్రమేయం ఉన్నట్లు తేలిందని బాధితురాలితో చెప్పిన సైబర్ నేరగాళ్లు రూ.538.62 కోట్లతో ముడిపడి ఉన్న ఆ మనీలాండరింగ్ స్కామ్ నుంచి కొంత సొమ్ము కమీషన్‌గా అందినట్లు తేలిందని చెప్పారు. నరేష్ ఇళ్లు, కార్యాలయాల్లో చేసిన దాడుల్లో బాధితురాలి పేరుతో ఉన్న ఏటీఎం కార్డు దొరికిందని, మొత్తం రూ.6.8 కోట్లు ఆమెకు సంబంధించిన ఖాతాల ద్వారా మనీలాండరింగ్ అయినట్లు గుర్తించామని భయపెట్టారు. దీనిపై ఇప్పటికే సుప్రీం కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసిందన్నారు. ఆమె పేరుతో 17 కేసుల్లో ప్రమేయంపై సుప్రీం కోర్టు, ఆర్‌బీఐ జారీ చేసినట్లు ఉన్న లేఖలను సృష్టించి బాధితురాలికి వాట్సాప్ ద్వారా పంపారు. నిర్దోషిగా నిరూపించుకోవాలంటే సుప్రీం కోర్టు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలంటూ ఓ లింకు కూడా పంపారు. వీడియో కాల్ చేసి, పోలీసు మాదిరిగా కనిపించిన నేరగాడు బాధితురాలిపై అరెస్టు వారెంట్ ఉన్న నేపథ్యంలో డిజిటల్ అరెస్టు ద్వారా నిఘా ఉంచుతున్నామని, ఫోన్ వదిలి ఎక్కడకూ వెళ్లద్దని భయపెట్టాడు. ఈ ముప్పు తప్పాలంటే ఆమె దగ్గర ఉన్న సొమ్మంతా ఆర్బీఐ ఖాతాలో జమ చేయాలని, అధికారులు పరిశీలించిన తర్వాత నగదు తిరిగి ఇవ్వడంతో పాటు నిర్దోషిగా ప్రకటిస్తామని సైబర్ నేరగాడు నమ్మబలికాడు. వారి మాటలు పూర్తిగా నమ్మిన బాధితురాలు తన సేవింగ్స్‌తో పాటు మ్యూచువల్ ఫండ్స్, ఇతర ఖాతాల్లోని నగదు సిద్ధం చేసింది. ఇలా మొత్తం రూ.43.40 లక్షలు సైబర్ నేరగాళ్లు సూచించిన ఖాతాలకు పంపింది. ఎట్టకేలకు తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

మహిళ ఆత్మహత్య

మేడిపల్లి: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. బోడుప్పల్ ఎస్ఐఎస్ కాలనీకి చెందిన బసిరి కవిత (40) సంతోష్ దంపతులకు కుమార్తె ఉండేది. గత ఏడాది కుమార్తె మృతి చెందడంతో అప్పటినుంచి భార్యా భర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవి. దీంతో కవిత భర్త సంతోష్ 4 నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కవిత భర్తకు ఫోన్ చేసి కలిసి ఉందామని కోరినా అతను పట్టించుకోవడం లేదు. దీంతో మానసికంగా కుంగిపోయిన ఆమె ఈనెల 20న మధ్యాహ్నం మేడిపల్లిలోని ఓ హోటళ్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి మోహన్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అనుమానాస్పద మృతి

ఉప్పల్: అనుమానాస్పద స్థితిలో డీఎస్ఎల్ మాల్ 9వ అంతస్తు నుంచి కిందపడి ఓ యువతి మృతిచెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లాలాపేట ప్రాంతానికి చెందిన పిన్నపాటి రమేష్ కుమార్తె హరిత(24) ఉప్పల్ డీఎస్ఎల్ ఐటీ భవనంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో కస్టమర్ రిలేషన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తుంది. సోమవారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో హరిత టీమ్ లీడర్ రమేష్‌కు ఫోన్‌చేసి మీ కుమార్తె భవనం నుంచి కింద పడిందని, ఆసుపత్రికి తరలించినట్లు చెప్పింది. దీంతో అతను ఆసుపత్రికి వెళ్లి చూడగా అప్పటికే ఆమె మృతి చెందింది. మృతురాలి తండ్రి రమేష్ ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన కుమార్తె మృతిపై అనుమానం ఉందని విచారణ జరిపించాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

హస్తినాపురం: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా చింతపల్లి మండలం, గడియ గౌరారం గ్రామానికి చెందిన నారబోయిన జంగయ్య (28) శివరాణి దంపతులు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ సాగర్‌కాంప్లెక్స్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఉపాసన ధ్యాన కేంద్రం వద్దనున్న హైరేజ్ అపార్ట్‌మెంట్‌లో మంగళవారం పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించామన్నారు.

పోలీసులపై దాడి ఘటనలో ఐదుగురి అరెస్టు

రాంగోపాల్‌పేట్: ముత్యాలమ్మ దేవాలయ విధ్వంసం ఘటనను నిరసిస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమంలో పోలీసులపై దాడికి పాల్పడిన ఐదుగురు వ్యక్తులను మార్కెట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అమ్మవారి విగ్రహం విధ్వంసాన్ని నిరసిస్తూ ఈ నెల 19న వివిధ హిందూ సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొందరు వ్యక్తులు పోలీసులపై వాటర్ బాటిళ్లు, రాళ్లు, చెప్పులు విసిరి ప్రాణహాని తలపెట్టినట్లు మార్కెట్ ఎస్సై మమత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ కెమెరాలు, వీడియోల ఆధారంగా కొంతం నరేష్ ప్రశాంత్, కిరణ్, వంశ తిలక్, శరత్ ఠాకూర్, రామ్‌రెడ్డి, కిషన్, శివరాం, సాయి ప్రకాష్, సంతోష్, రాజేష్, శ్రీనివాస్, శరత్, సుభాష్, అంజి, ప్రవీణ్ తదితరులపై కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా మంగళవారం మోహన్ రాజేష్, ఎల్లేష్, ఆయుష్‌రాజ్, చింతకాయల శివాజీ, జ్ఞాన సుందర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరి కొందరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

మెట్రో పోలీస్ హోటల్ ప్రధాన నిందితుడి కోసం గాలింపు

ముత్యాలమ్మ దేవాలయ ఘటనకు మెట్రో పోలీస్ హోటల్‌లో మోటివేషనల్ స్పీకర్ ఆధ్వర్యంలో జరిగిన రెచ్చగొట్టే ప్రసంగాలే కారణంగా పోలీసులు భావిస్తున్నారు. అక్టోబర్ 1 నుంచి 30 ఈ హోటల్‌లో మోటివేషనల్ స్పీకర్ మునావర్ జామా ఆంగ్లంతో పాటు, వ్యక్తిత్వ వికాస శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో పాల్గొన్న ఓ వ్యక్తి ముత్యాలమ్మ గుడిలో విగ్రహ విధ్వంసానికి పాల్పడిన విషయం తెలిసిందే. దీంతో పోలీసులు నిర్వాహకుడు మునావర్ జామాతో పాటు హోటల్ యజమాని అబ్దుల్ రషీద్ అహ్మద్, మేనేజర్ రెహ్మాన్‌లపై కేసు నమోదు చేశారు. హోటల్ యజమాని, మేనేజర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు ప్రధాన నిందితుడు మునావర్ జామా కోసం గాలిస్తున్నారు.

రూ.14 లక్షలతో వరదనీటి కాలువ నిర్మాణ పనులు


జరుగుతున్న కాలువ నిర్మాణ పనులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని కేబీఆర్ పార్కు చౌరస్తా శబ్దాలయ స్టూడియో దగ్గర వరదనీటి కాలువ పైప్‌లైన్ నిర్మాణ పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. రూ.14 లక్షల వ్యయంతో 450 ఎంఎం డయా పైప్ లైన్ నిర్మాణ పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. శబ్దాలయ నుంచి రత్నదీప్ సూపర్ మార్కెట్, జుడియో షోరూం వరకు ఈ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. వర్షం వచ్చిందంటే శబ్దాలయ స్టూడియో నుంచి జుడియో షోరూం వరకు పెద్ద ఎత్తున వరదనీరు నిలిచిపోయి స్థానికులతోపాటు ఇటుగా ప్రయాణాలు సాగించేవారికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. దీంతో ఈ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు భారీ వరద నీటి కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ పైప్ లైన్ వేయడం ద్వారా కేబీఆర్ పార్కు వైపు నుంచి వచ్చే వరద నేరుగా పైపుల్లోకి చేరి అటు నుంచి భారీ వరదనీటి కాలువలోకి కలుస్తోంది. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేస్తామని జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 ఈఈ విజయ్‌కుమార్ తెలిపారు.

వ్యర్థాల తొలగింపునకు స్పెషల్‌డ్రైవ్


సమావేశంలో కార్పొరేటర్ కవితారెడ్డి

కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నేటి (బుధవారం) నుంచి వారం రోజులపాటు నిర్వహించబోయే స్పెషల్ డ్రైవ్‌లో డివిజన్‌లోని చెత్తా చెదారంతో పాటు నిర్మాణ వ్యర్థాలు, గ్రీన్ వేస్టేజ్‌ను పూర్తిగా తొలగించాలని కార్పొరేటర్ కవితారెడ్డి కోరారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని వార్డు కార్యాలయంలో సర్కిల్–18 ఏఎంహెచ్‌వో భార్గవ నారాయణతోపాటు డివిజన్‌లోని 10 మంది ఎస్‌ఎఫ్‌ఐలతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తీలు, కాలనీల్లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ప్రధాన రోడ్లవద్ద మెక్లిన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ డ్రైవ్ జరుగుతుందని గుర్తించిన చోట్ల వ్యర్థాలను పూర్తిగా తొలగిస్తే సమస్య పోతుందని ఆమె సూచించారు. ఏఎంహెచ్‌వో మాట్లాడుతూ రాత్రి, పగలు తేడా లేకుండా ఈ డ్రైవ్ కొనసాగుతుందని స్థానికులు ఎక్కడైనా వ్యర్థాలు పేరుకుపోతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఉమ్మడి బస్తీల్లోని సమస్యలు పరిష్కరించండి


సీఎన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న యాదయ్య

రహమత్‌నగర్: ఉమ్మడి బస్తీల్లోని మౌలిక సమస్యలు పరిష్కరించాలని పీజేఆర్ ఎస్పీఆర్‌హిల్స్ ఉమ్మడి బస్తీల ఐక్యత డెవలప్‌మెంట్ కమిటీ నాయకులు కార్పొరేటర్ సీఎన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు వేముల యాదయ్య మాట్లాడుతూ అత్యధికంగా పేదలు నివాసముండే ఎస్పీఆర్‌హిల్స్‌లో డ్రైనేజీ, మంచినీటి లోప్రెషర్ లాంటి అనేక సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వాటిని పరిష్కరించాలని ఆయన కోరారు. దీనిపై స్పందించిన సీఎన్‌రెడ్డి సమస్యలకు సంబంధించిన నివేదికలు తమకు అందజేస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సీతారాంరెడ్డి, అబ్బయ్య, ఎల్లయ్య, ముద్దంగుల శేఖర్, యాదయ్య, కృష్ణచారి తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించాలి


గణేష్‌సింగ్‌ను కలిసిన రామమోహన్ మనమాస తదితరులు

బంజారాహిల్స్: దేశంలో ఓబీసీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఓఎఫ్ఐసీసీఐ చైర్మన్ అండ్ వ్యవస్థాపకుడు రామమోహన్ మనమాస అన్నారు. తాజ్‌కృష్ణా హోటల్‌లో ఓబీసీ పార్లమెంటరీ కమిటీ చైర్మన్ గణేష్‌సింగ్‌ను కలిసి మంగళవారం ఆయన వినతిపత్రం అందజేశారు. భారత వాణిజ్య, పరిశ్రమల మండలిలో ఓబీసీ సమాఖ్య తరుపున వ్యాపారవేత్తలు ఎదుర్కొంటున్న కీలక సమస్యలను వినతిపత్రం ద్వారా ఆయన దృష్టికి తీసుకువచ్చామన్నారు. ఆయా సమస్యలు వ్యాపారాలను అభివృద్ధి చేయడంలోనూ, జాతీయ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడంలోనూ ఆటంకంగా ఉన్నాయన్నారు. సమస్యలు పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా కోరామని తెలిపారు.

ఆర్డీఓకు వినతి


ఆర్డీకు వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

రహమత్‌నగర్: కమలానగర్ టుబీహెచ్‌కే డిగ్నినిటీ హౌజింగ్ కాలనీ ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, సమగ్ర విచారణ అనంతరమే నివాసాలు కేటాయించాలని బస్తీ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ హైదర్ కోరారు. మంగళవారం ఆయన బాధితులతో కలిసి సికింద్రాబాద్ ఆర్‌డీఓకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హైదర్ మాట్లాడుతూ కమలానగర్ డబుల్ బెడ్ రూం ఇళ్ల కేటాయింపులో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. బాధితులకు జరిగిన అన్యాయంపై రాష్ట్ర హైకోర్టు, ముఖ్యమంత్రి కార్యాలయం, సీఎస్, మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్‌లకు ఫిర్యాదు చేయడం జరిగిందని గుర్తుచేశారు. బస్తీతో ఎలాంటి సంబంధం లేని వారికి నివాసాలు కేటాయించారన్నారు. ఇందుకు సంబంధించిన సాక్ష్యాధారాలతో మరోసారి హైకోర్టును ఆశ్రయిస్తామని హైదర్ స్పష్టం చేశారు. పూర్తిస్థాయి విచారణ చేసిన అనంతరమే బాధితులకు ఇళ్లను కేటాయించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్, ఖలీల్, పరంధాములు, ఇబ్రహీం, యాదగిరి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసం అల్లర్లు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నరసింహా


సమావేశంలో మాట్లాడుతున్న ఈటీ నరసింహా

కాచిగూడ: మతోన్మాద శక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం అల్లర్లు సృష్టిస్తున్నాయని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ నరసింహా అన్నారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సమావేశాలు నెర్లకంటి శ్రీకాంత్ అధ్యక్షతన మంగళవారం హిమాయత్‌నగర్‌లో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న నగరంలో ప్రజల మధ్య మత విద్వేషాలు వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి శక్తుల పట్ల ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం, నిఘా వ్యవస్థ, అప్రమత్తంగా ఉండటమే కాకుండా ఘటన జరగకముందే అరెస్ట్ చేయాలని ఆయన సూచించారు. గత అనుభవాల దృష్ట్యా తెలంగాణ మత శక్తుల చేతుల్లోకిపోకుండా ఉండాలంటే లౌకిక ప్రజాస్వామ్య శక్తులు నిరంతరం ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు ఛాయాదేవి, కమతం యాదగిరి, స్టాలిన్, బి.వెంకటేష్, శంకర్‌నాయక్, చంద్రమోహన్ గౌడ్, నళిని, నెర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న నాగరాజు

రహమత్‌నగర్: ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడ్తున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రహమత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గ్యార నాగరాజు ఖైరాతాబాద్ మండల తహసీల్దార్ నయీమోద్దీన్‌కు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహమత్‌నగర్ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని వాపోయారు. కొంతమంది రెవెన్యూ సిబ్బందికి తప్పుడు సమాచారం అందించి వారిని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. అలాంటి వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని నాగరాజు కోరారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

‘ఓటీఎస్’ @ 22,772

- పేరుకుపోయిన నీటి బకాయిలను చెల్లించేందుకు అవకాశం
- అవగాహన కలిగిస్తున్న జలమండలి అధికారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న నివాసితులు


అవగాహన కలిగిస్తున్న జలమండలి అధికారులు


అవగాహన కార్యక్రమంలో వినియోగదారులు

బంజారాహిల్స్: ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన మంచినీటి బిల్లుల బకాయిలు ఒకేసారి చెల్లించి సెటిల్‌మెంట్ చేసుకునే విధంగా ప్రభుత్వం మంచి నీటి వినియోగదారులకు అవకాశం కల్పించింది. వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) స్కీంను ఇటీవల ప్రవేశపెట్టడమే కాకుండా దీని ప్రయోజనాలను తెలియజేసేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత కొన్నేళ్లుగా వివిధ కారణాల వల్ల చాలా మంది వినియోగదారులు బకాయిలు చెల్లించకపోవడంతో నీటి బిల్లులు ప్రతినెలా వడ్డీల రూపంలో పెరిగిపోతున్నాయి. ఒక నెల చెల్లించకపోతే ఆ తర్వాత నెలా అమాంతం రెండింతల బిల్లు అవుతుండడంతో చాలా మంది చెల్లించడానికి వెనుకడుగు వేస్తున్నారు. దీంతో నెలల తరబడి బిల్లులు చెల్లించని నల్లా కనెక్షన్‌దారులకు వడ్డీల రూపంలో బిల్లులు వేలల్లో పేరుకుపోయాయి. ఇంత పెద్ద మొత్తాన్ని ఒకేసారి చెల్లించడంలో మంచినీటి కనెక్షన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అవకాశాన్ని కల్పించారు.

డివిజన్–6లో ఓటీఎస్ అర్హులు 22,772 మంది..

జలమండలి డివిజన్–6 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, వెంగళరావునగర్, బోరబండ, సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో మొత్తం 92 వేల మంచినీటి కనెక్షన్లు ఉండగా తట్టిఖానా, బంజారాహిల్స్, ఫిలింనగర్, జూబ్లీహిల్స్ వెంకటగిరి, సోమాజీగూడ, ఎల్లారెడ్డిగూడ, బోరబండ, ఎర్రగడ్డ, ఫతేనగర్, ఎస్పీఆర్‌హిల్స్ సెక్షన్ల నుంచి నీటి సరఫరా జరుగుతోంది. ఈ డివిజన్ల పరిధిలో 22,772 మంది నల్లా బకాయిలు పడ్డారు. మొత్తం రూ.65.82 కోట్లు పేరుకుపోయిన బకాయిలు జలమండలికి రావాల్సి ఉంది. ఇందులో ఇంట్రెస్ట్ కాంపోనెంట్ రూపంలో రూ.24.48 కోట్లు, లేట్ పేమెంట్ పెనాల్టీ రూపంలో రూ.0.77 కోట్లు, మీటర్ పెనాల్టీ రూ.2.14 కోట్లతో పాటు ప్రిన్సిపల్ అమౌంట్ రూ.38.43 కోట్లు రావాల్సి ఉంది. ఈ మొత్తం వసూలుకు సంబంధిత జలమండలి సెక్షన్ మేనేజర్లు, డీజీఎంలు, జీఎంలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

అవగాహన కార్యక్రమాలు..

ఓటీఎస్ ద్వారా ఒకేసారి నీళ్ల బకాయిలు చెల్లించి తమ బిల్లులను పరిష్కరించుకునేందుకు ప్రవేశపెట్టిన ఓటీఎస్‌పై జలమండలి అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి సెక్షన్ పరిధిలోనూ ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. జలమండలి సెక్షన్ మేనేజర్లు, డీజీఎంలు బకాయిదారులకు మొబైల్ ఫోన్ సందేశాలను కూడా పంపిస్తున్నారు. తమ ఇంటి నీటి కనెక్షన్ క్యాన్ నెంబర్ కొడితే ఎంతమేర బకాయి ఉన్నారో తెలుసుకునే సౌలభ్యం కూడా కల్పించారు. సెక్షన్ కార్యాలయాలకు వెళ్లి అక్కడి అధికారులతో సంబంధిత ఫారాలు భర్తీ చేయడం ద్వారా బకాయిల నుంచి విముక్తి పొందవచ్చు. ఇప్పటికే అవగాహన కార్యక్రమాలకు వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తుంది. దీనికి తోడు ప్రజావాణిలో కూడా నీటి బిల్లుల బకాయి చెల్లింపుల ఫిర్యాదులను స్వీకరిస్తూ పరిష్కరిస్తున్నారు. వినియోగదారులకు నచ్చజెప్పి అవగాహన కల్పించి ప్రయోజనాలు వివరిస్తున్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మా పరిధిలో మంచినీటి బకాయిదారులు 22,772 మంది ఉన్నట్లుగా గుర్తించడం జరిగింది. వీరందరికీ సందేశాలు కూడా వెళ్లాయి. ఓటీఎస్ ద్వారా తమ బకాయిలను ఒకేసారి చెల్లించుకోవడం ద్వారా బిల్లులు క్లియర్ చేసుకుని ప్రతినెలా వడ్డీ లేని బిల్లులను చెల్లించుకోవచ్చు. ఈ అవకాశాన్ని నెల రోజులు ఇవ్వడం జరిగింది. అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలి. సందేహాలు ఉంటే తమ పరిధిలోని సెక్షన్ కార్యాలయాల్లో మేనేజర్లు, డీజీఎంలను సంప్రదించాలి. లేదా 155313 నెంబర్‌కు కాల్ చేయడం ద్వారా కూడా తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో ఉన్న రెవెన్యూ విభాగం అధికారులు ఈ విషయంలో తగిన సందేహాల నివృత్తి కూడా చేస్తారు. బకాయిలు పడ్డవారికి రిజిస్టర్ మొబైల్ ద్వారా ఇప్పటికే మెసేజ్‌లు పంపించాం. – హరిశంకర్, జీఎం జలమండలి డివిజన్–6


ఫిర్యాదులు స్వీకరిస్తున్న జలమండలి డివిజన్–6 జీఎం హరిశంకర్

అప్పు చెల్లించమన్నందుకు యువకుడిపై దాడి

వెంగళరావునగర్: అప్పు తిరిగి చెల్లించమన్నందుకు యువకుడిపై ఓ యువతి, తన నలుగురు స్నేహితులతో కలిసి దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... యూసుఫ్‌గూడ సమీపంలో నివసించే వై.రవీందర్‌నాయక్ 2023లో గుంటూరులో సీ.ఏ. చేస్తున్న సమయంలో అతని సోదరి స్నేహితురాలు శ్రావణితో పరిచయం అయింది. తరచూ ఫోన్లు, చాటింగ్ చేసుకునేవారు. ఈ క్రమంలో తన తండ్రికి తీవ్ర అనారోగ్యంగా ఉందని రవీందర్‌నాయక్ నుంచి ఆమె రూ.6 లక్షలు అప్పుగా తీసుకుంది. కొంతకాలం తర్వాత తన డబ్బు అడిగితే తప్పించుకుని తిరుగుతుంది. ఈ క్రమంలో రవీందర్‌నాయక్ ఉద్యోగం కోసం ఇటీవల నగరానికి వచ్చాడు. ఆదివారం శ్రావణి తాను అమీర్‌పేటలో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నానని నాయక్‌కు మెసేజ్ చేసింది. తన డబ్బు ఇవ్వాలని ఆమెను అడగ్గా కృష్ణకాంత్‌పార్క్ వద్దకు వస్తే మాట్లాడదామని చెప్పింది. దీంతో నాయక్ పార్కు వద్దకు వెళ్లి అప్పు గురించి అడగటంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో ఆమె తన స్నేహితులకు ఫోన్ చేయగా దేవరాజ్, తేజ, కార్తికేయ, హిదాయత్‌లు అక్కడకు వచ్చి నాయక్‌పై దాడి చేశారు. బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా రవీందర్‌నాయక్ తనపై దాడి చేశాడని, తనకు న్యాయం చేయాలని సదరు యువతి కూడా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసులు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసన


నిరసన తెలుపుతున్న అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి (జేఎన్ఎఫ్ఏ యూ) కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచన ను నిరసిస్తూ అంబేద్కర్ వర్సిటీ ఐక్యకార్యాచరణ సమితి సభ్యులు నిరసనకు దిగారు. అధ్యాపక, అధ్యాపకేతర, ఉద్యోగ సంఘాల నేతలు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో విశ్వవిద్యాలయంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు, నల్లని మాస్కులు ధరించి మౌనంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో జేఏఎస్ చైర్‌పర్సన్ పల్లవీ కాబ్డే, కన్వీనర్ ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ మహేష్‌గౌడ్, అధ్యాపకేతర ఉద్యోగుల సంఘం నేతలు ఎండీ హబీబుద్దీన్, షబ్బీర్, డాక్టర్ అవినాష్, రాఘవేందర్, కిషోర్, కుమార్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లేనా పబ్ యజమానిపై కేసు నమోదు

బంజారాహిల్స్: నిబంధనలు ఉల్లంఘించిన క్సేనా పబ్ యజమానిపై జూబ్లీహిల్ పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్ 38లో క్సేనా పబ్ నుంచి భారీ శబ్దాలు రావడంతో పాటు నిర్ణీత సమయం ముగిసిన తర్వాత కూడా కొనసాగించడంపై స్థానికుల నుంచి పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పెట్రోలింగ్ విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకోగా అధిక శబ్దాలు రావడం గమనించారు. దీంతో పబ్ యజమాని కౌశిక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌష్టికాహారంపై అవగాహన


కార్యక్రమంలో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ చిన్నారులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో యూకేజీ చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కజొన్నతో పాటు వివిధ రకాల ఆహార పదార్థాలు ఎలా తయారు చేస్తారో విద్యార్థులకు వివరించారు. మొక్కజొన్నతో పొందే లాభాలతో పాటు ఎటువంటి పౌష్టికమైన ఆహారం తింటే ఆరోగ్యకరంగా ఉంటామో తెలియజేశారు. అనంతరం మొక్కజొన్న పొత్తులను విద్యార్థులకు అందజేశారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ ప్రతిభానగర్‌లో మరో అక్రమ నిర్మాణాన్ని ఖైరాతాబాద్ మండల రెవెన్యూ సిబ్బంది మంగళవారం కూల్చివేశారు. ప్రతిభానగర్ ప్రధాన రహదారి పక్కన ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం చేపడుతున్నాడని కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో మండల స్పెషల్ ఆర్ఐ కిరణ్‌రాజ్ తమ సిబ్బందితో అక్కడికి చేరుకుని జేసీబీతో నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా కిరణ్‌రాజ్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

26న దీపావళి కల్చరల్ ఫెస్టివల్ సెలబ్రేషన్స్

లిబర్టీ: దీపావళి కల్చరల్ ఫెస్టివల్ సెలబ్రేషన్స్ ఈనెల 26వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆదిలీలా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ మాజీ సంచాలకులు డాక్టర్ ఎస్. ఆదినారాయణ తెలిపారు. ఆదిలీలా ఫౌండేషన్ ఫోరం కరస్పాండెంట్స్ క్లబ్ సైట్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాయంత్రం 7 గంటల నుంచి 11 గంటల వరకు సెలబ్రేషన్స్ నిర్వహిస్తామని ఉత్సవాల్లో వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు కళాకారులు పాల్గొంటారన్నారు. 26వ తేదీన సాయంత్రం ఏబీ 19 మధుర రోడ్డులో సెలబ్రేషన్స్ జరుగుతాయని వివరించారు. కళారంగంలో నిష్ణాతులైన కళాకారులు పాల్గొని తమ ప్రదర్శనలు ఇస్తారని ఆయన తెలిపారు.

డ్రైనేజీ సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించండి



కాచిగూడ: డ్రైనేజీ సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ జలమండలి సిబ్బందికి సూచించారు. మంగళవారం డివిజన్‌లోని ఆదర్శబస్తీలో డ్రైనేజీ పైపులైన్‌లో పేరుకుపోయిన మట్టి, చెత్తను సిబ్బందిచే తొలగింప చేశారు. మున్సిపల్, జలమండలి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తూ సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని అమె అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ చంద్రశేఖర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, జలమండలి డీజీఎం కృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బయ్య పాల్గొన్నారు.

సీవరేజీ సమస్యను పరిష్కరిస్తా


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: సీవరేజీ సమస్యను పరిష్కరిస్తానని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆమె బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లోని సింగాడకుంట బోరింగ్ గల్లీ, చోటూబాయి గల్లీల్లో నెలకొన్న సీవరేజీ ఓవర్‌ఫ్లో సమస్యను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ చాలారోజుల నుంచి సీవరేజీ పొంగి పొర్లుతున్నదని, తనకెన్నో సార్లు స్థానికులు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ సమస్య పరిష్కారానికి నూతనంగా సీవరేజీ పైప్‌లైన్ మంజూరు చేయిస్తానని హామీనిచ్చారు. సీవరేజీ పైప్‌లైన్ పనులు పూర్తయిన తరువాత సీసీ రోడ్డు కూడా వేయడం జరుగుతుందన్నారు.

సాక్షి బుధవారం। 23। అక్టోబర్। 2024

నగరంలో నేడు

1. స్వదేశ్ జాగరణ్ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో సాయంత్రం 5 గంటలకు స్వదేశ్ మేళాను గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభిస్తారు.
2. ఐదుగురు ప్రత్యేక నిపుణులచే జంట నగరాల్లో తొలిసారిగా ప్రారంభించనున్న స్ట్రోక్ యూనిట్‌పై అబిడ్స్ ఫతేమైదాన్‌లోని బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుంది.
3. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో మైటీస్ ట్రిబ్యుట్ వరల్డ్ ఆఫ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.
4. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో హైలైఫ్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

కంటోన్మెంట్ విలీనం కథ కంచికే!

- ప్రతిపాదనలు మినహా కార్యాచరణ లేని వైనం
- విలీనం సంక్లిష్టం అవుతుందనే కారణంతోనే వెనకడుగు?
- బోర్డు ఎన్నికల దిశగా అడుగులు


కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం ప్రతిపాదన అటకెక్కింది! రక్షణ శాఖ ఈ ప్రతిపాదనను దాదాపు పక్కకు పెట్టినట్లేనని తెలుస్తోంది. డిఫెన్స్ ఎస్టేట్స్ వర్గాల అనధికారిక సమాచారం మేరకు.. విలీనం జరిగే అవకాశం లేదు. నూతన చట్టం రూపకల్పన, సమీప మున్సిపాలిటీల్లో కంటోన్మెంట్‌ల విలీనం.. నేపథ్యంలో నాలుగేళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న ఎన్నికల నిర్వహణపై పునరాలోచనలు సాగుతున్నాయి. మొత్తానికి పార్లమెంట్ శీతాకాల సమావేశాల నాటికి కంటోన్మెంట్ చట్టాన్ని సవరిస్తూ రూపొందించిన బిల్లు, బోర్డు ఎన్నికల నిర్వహణపై పూర్తి స్థాయి స్పష్టత వచ్చే అవకాశముంది.

హడావుడే తప్ప.. ఆచరణ లేదు

కంటోన్మెంట్ బోర్డులను రద్దుచేసి, ఆయా ప్రాంతాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయాలనే ప్రతిపాదన దాదాపు పదేళ్ల క్రితమే మొదలైంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం పలుమార్లు విస్పష్టమైన ప్రకటన కూడా చేసింది. కంటోన్మెంట్‌ల బలోపేతం కోసం చేపట్టాల్సిన చర్యలపై 2018లోనే కేంద్రం సుమిత్ బోస్ నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. 2019లో ఈ కమిటీ ఇచ్చిన సూచనల మేరకే 'ది కంటోన్మెంట్స్ యాక్ట్ -2006' స్థానంలో నూతన బిల్లును రూపొందించింది. 'ది కంటోన్మెంట్ బిల్-2020' పేరిట రూపొందించిన డ్రాఫ్ట్ బిల్లుపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి అదే ఏడాది శీతాకాల పార్లమెంట్ సమావేశాల ఎజెండాలో చేర్చారు. మరోపక్క కంటోన్మెంట్‌లను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేయడంపై కూడా అధ్యయనం చేపట్టింది. ఈ క్రమంలోనే గతేడాది జనవరి 4న సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయడంపై చర్చించేందుకు కేంద్రం ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసింది. ఫిబ్రవరి మొదటి వారంలో భేటీ అయిన కమిటీలో ఏం చర్చించారో ఇప్పటికీ వెల్లడి కాలేదు. ఈ క్రమంలోనే 2023 ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా కంటోన్మెంట్‌ల ఎన్నికల నిర్వహణకు కేంద్రం నోటిఫికేషన్ వెలువరించింది. మార్చిలో ఎన్నికల ప్రక్రియను అర్ధంతరం నిలిపివేస్తూ, నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంది. ఇందుకు గల కారణాలు సైతం ఇప్పటికీ బహిర్గతం కాలేదు. ఇక తాజాగా ఈ ఏడాది జూన్ 25న రక్షణ శాఖ సెక్రెటరీ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, కంటోన్మెంట్ అధికారులపై కంటోన్మెంట్ విలీనంపై మరోసారి చర్చించి అభిప్రాయాలు సేకరించారు. అనంతరం ఈ విషయంలో ఎలాంటి కదలిక లేదు. కంటోన్మెంట్ విలీనం అత్యంత క్లిష్టమయ్యే పక్రియగా తేలడంతోనే కేంద్రం ఈ ప్రతిపాదనను పక్కకు పెట్టేసినట్లు తెలుస్తోంది. డిఫెన్స్ ఎస్టేట్స్ వర్గాల సూచన మేరకే కేంద్రం వెనుకడుగు వేస్తోందని సమాచారం.

ఎన్నికలపై పునరాలోచన

కంటోన్మెంట్‌లను మరింత ప్రజాస్వామ్యయుతంగా మార్చడమే లక్ష్యంగా నూతన చట్టాన్ని అమల్లోకి తేనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ మేరకు ది కంటోన్మెంట్స్ యాక్ట్ -2006 స్థానంలో రూపొందించిన నూతన బిల్లులో పలు కీలక సవరణలు కూడా చేసింది. అయితే నాలుగేళ్లుగా ఈ బిల్లుకు మాత్రం మోక్షం లభించడం లేదు. పైగా గతేడాది ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేసి, అర్ధంతరం నిలిపివేయడంపై కూడా పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మూడేళ్లుగా కంటోన్మెంట్‌లో ప్రజాప్రతినిధులు లేకుండానే పాలన సాగుతూ ఉండటాన్ని పలువురు తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో వీలైనంత త్వరగా కంటోన్మెంట్‌లకు ఎన్నికలు నిర్వహించాలని రక్షణశాఖ ఉన్నతాధికారులు ఆలోచిస్తున్నట్లు సమాచారం. 2014 అక్టోబర్‌లో కంటోన్మెంట్ బోర్డు ఎన్నికల కోసం నోటిఫికేషన్ వెలువరించి పదేళ్లు పూర్తికావడం గమనార్హం.

వృత్తి నిపుణులకు ఎగ్జిక్యూటివ్ కోర్సు ప్రారంభం

రాయదుర్గం: 2030 నాటికి గ్రీన్ ఎకానమీ ప్రపంచవ్యాప్తంగా సుమారు 100 మిలియన్ ఉద్యోగాలు సృష్టించాలన్నది లక్ష్యం. ఇండియాలో రాబోయే 25 ఏళ్లలో 30 మిలియన్ సస్టేనబిలిటీ సంబంధిత ఉద్యోగాలు ఏర్పాటు కానున్నాయి. ఈ నేపథ్యంలో వృత్తి నిపుణులకు ఆధునిక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులు అందించాలని మంగళవారం నిర్ణయించారు. ఇండస్ట్రీలో మారుతున్న అవసరాలను తీర్చడంలో ఒక ముందడుగని చెప్పవచ్చు. ఐఐఎం కలకత్తా, టాలెంట్ స్ప్రింట్ సంస్థలు ఒక ఒప్పందం చేసుకొని ఈ కోర్సును అందించేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఐఐఎం కోల్‌కత్తా ప్రొఫెసర్, ప్రోగ్రామ్ డైరెక్టర్ రూనా సర్కార్ మాట్లాడుతూ పాఠ్య ప్రణాళిక కఠినమైన పరిశోధనపై ఆధారపడి ఉంటుందన్నారు. కార్పొరేట్ అనుభవం ఉన్న వృత్తి నిపుణుల కోసం ప్రత్యేకంగా రూపొందించామన్నారు. ఇది కేవలం సస్టేనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌కు అనుగుణంగా ఉండటం మాత్రమే కాకుండా అత్యాధునిక వ్యాపార లక్ష్యాలను ఏకీకృతం చేయడానికి రూపొందించామన్నారు. టాలెంట్ స్ప్రింట్ వ్యవస్థాపక సీఈఓ, ఎండీ డాక్టర్ శంతనూపాల్ మాట్లాడుతూ సస్టేనబిలిటీ ఇప్పుడు కేవలం నియంత్రణ అంశం మాత్రమే కాదన్నారు. ఇది లాభదాయక అంశమని, అంతేగాకుండా కీలక వ్యాపార అవసరంగా మారిందన్నారు. ఈ కోర్సు విశ్వసనీయమైన పాఠ్య విధానంపై ఆధారపడి ఉందన్నారు. నేర్చుకునే వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కోర్సులో 12నెలల లైవ్ లెర్నింగ్ అనుభవం ఉంటుందన్నారు. ఇది నైతిక, వ్యూహాత్మక సుస్థిరతా సవాళ్లు, గ్రీన్ ఫైనాన్స్, డిజైన్ థింకింగ్ వంటి కీలక పరిజ్ఞానాన్ని వెలుగులోకి తెస్తుందన్నారు.

ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో పంచాయతీ రాజ్ సమ్మేళన్


పంచాయతీ రాజ్ సమ్మేళనలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో పంచాయతీరాజ్ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి అన్ని రంగాల్లో జరగాలని సూచించారు. ప్రతి పంచాయతీలో కంప్యూటర్ వ్యవస్థ ఉండాలని, గతంలో ప్రతి పంచాయతీకి కంప్యూటర్లు పంపిణీ చేయడం జరిగిందని, కంప్యూటర్స్ లేని 22,164 పంచాయతీలకు ఇప్పుడు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ సమ్మేళన్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మిజోరం, ఒడిశా రాష్ట్రాల పంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డీపీ డైరెక్టర్ జనరల్ నరేందర్‌కుమార్ పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్



మన్సూరాబాద్: గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్(నాలుగుసార్లు) డాక్టర్ పెండెం కృష్ణ కుమార్ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను మంగళవారం రాజ్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా పెండెం కృష్ణ కుమార్ మన్సూరాబాద్‌లో మాట్లాడుతూ గవర్నర్ తన గిన్నిస్ వరల్డ్ రికార్డులు, సేవా కార్యక్రమాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారన్నారు. తాను పోషించిన 315 పాత్రల ఫొటోలను పరిశీలించి నటనా కౌసల్యాన్ని ప్రత్యేకంగా అభినందించారని పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహిత వినియోగం, స్వచ్ఛభారత్, టీబీ రహిత సమాజానికి చేపడుతున్న కార్యక్రమాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చేస్తున్న కార్యక్రమాలను గవర్నర్‌కు వివరించినట్లు స్పష్టం చేశారు. అనంతరం గవర్నర్‌కు చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేసినట్లు తెలిపారు.

కొత్త చట్టాలపై అవగాహన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న డీజీ డా.సౌమ్య మిశ్రా

చంచల్‌గూడ: తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ, బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కారాగార సంబంధిత విషయాలపై కొత్త నేర చట్టాలు-2023పై జైళ్ల శాఖ అధికారులకు, సిబ్బందికి మంగళవారం చంచల్‌గూడలోని సీకా శిక్షణ సంస్థలో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సును జైళ్ల శాఖ డీజీ డా.సౌమ్య మిశ్రా ప్రారంభించారు. సదస్సు 3 రోజులు పాటు కొనసాగుతుంది. మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల జైళ్ల శాఖ అధికారులు పాల్గొంటారు. ఈ సందర్భంగా డీజీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ కొత్త చట్టాలపై జైలు అధికారులు, సిబ్బందికి అవగాహన ఉండాల్సి ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో ఐజీలు యెర్రంశెట్టి రాజేష్, మురళీబాబు, డీఐజీ డా.శ్రీనివాస్, సూపరింటెండెంట్ నవాబు శివకుమార్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

డైరెక్టర్ ఆఫ్ సెకండరి హెల్త్ సర్వీస్‌లను ఏర్పాటు చేయాలి


మంత్రి దామోదర రాజనర్సింహకు వినతి పత్రం సమర్పిస్తున్న జేఏసీ ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: వైద్య విధాన పరిషత్ స్థానంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరి హెల్త్ సర్వీస్‌లను ఏర్పాటు చేయాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ జేఏసీ చైర్మన్ డాక్టర్ వినయ్ కుమార్ కోరారు. ఈ మేరకు జేఏసీ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆరోగ్యశ్రీ ట్రస్టు భవనంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ డాక్టర్ వినయ్‌కుమార్, కన్వీనర్ పాండు మాట్లాడుతూ.. వైద్య విధాన పరిషత్తును డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సెకండరీ సర్వీసెస్‌గా ఏర్పాటు చేయాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆస్పత్రులకు హేతుబద్ధంగా సిబ్బందిని నియమించాలని కోరారు. వైద్య విధాన పరిషత్‌లో గత ప్రభుత్వం హయాం నుంచి ఎన్నో సమస్యలు తాండవిస్తున్నాయని, ఆ సమస్యలను విడతలవారిగా పరిష్కరిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చారని తెలిపారు. జేఏసీ సలహాదారు యూనుస్, కో చైర్మన్లు మరియమ్మ, సత్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మీ, కో కన్వీనర్లు శైలజ, క్రిస్టఫర్, డాక్టర్ వీరేష్, డేవిడ్, నర్సింహారెడ్డి, పరబ్‌కుమార్, బైరపాక శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, సంధ్య పాల్గొన్నారు.

ఎన్ఐఎన్‌కు జమ్మూ బృందం



సాక్షి, సిటీబ్యూరో: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ క్యాంపస్‌ను జమ్మూ, కశ్మీర్‌కు చెందిన మీడియా ప్రతినిధుల బృందం సందర్శించింది. శ్రీనగర్ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో డిప్యూటీ డైరెక్టర్ తారీఖ్ రథర్ నేతృత్వంలో 14 మంది మీడియా ప్రతినిధులు ఐదు రోజుల పర్యటన కోసం నగరానికి వచ్చారు. పోషకాహార లేమి నివారణకు, ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టేందుకు పోషకాహార సంస్థ నిపుణులు నిరంతరం కృషి చేస్తున్నారని ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ శాంత సబుజ్ దాస్ వివరించారు. అంటువ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధుల నివారణలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. సరైన ఆహారం తీసుకోకపోతే హృద్రోగ సమస్యలు, బీపీ, మధుమేహం వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కాగా, సంస్థలో జరుగుతున్న పరిశోధనల గురించి శాస్త్రవేత్తలు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ మహేశ్వర్, డాక్టర్ భానుప్రకాశ్‌రెడ్డి, డాక్టర్ జీజే బాబు వివరించారు.

ఏఐసీసీ డేటా టెక్నాలజీ సెల్ వైస్ చైర్మన్‌గా హైదరాబాదీ


ఖలీద్ సైఫుల్లా

సాక్షి, సిటీబ్యూరో: ఏఐసీసీ డేటా అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్‌గా హైదరాబాద్‌కు చెందిన ఖలీద్ సైఫుల్లా నియమితులయ్యారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోదంతో నియమిస్తున్నట్లు జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్ ఖలీద్ సైఫుల్లా, గూగుల్, ఇన్ఫోస్కో, నెస్, డెల్ వంటి అగ్రశ్రేణి కంపెనీల్లో సేవలు అందించి 20 సంవత్సరాలకు పైగా అనుభవాన్ని గడించారు. పార్టీకి మరింత ఐటీ సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు.

బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలి

- ఓబీసీ సెంట్రల్ కమిటీ జాతీయ అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి
- మహిళా బిల్లులో అవకాశం కల్పించాలని వినతి



కాచిగూడ: మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలని ఓబీసీ సెంట్రల్ కమిటీ జాతీయ అధ్యక్షురాలు ఎం.భాగ్యలక్ష్మి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం నగరంలో జరిగిన సమావేశంలో ఓబీసీ పార్లమెంట్ కమిటీ చైర్‌పర్సన్ గణేష్ సింగ్‌ను ఓబీసీ సెంట్రల్ కమిటీ ప్రతినిధులు భాగ్యలక్ష్మీ నేతృత్వంలో కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఓబీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో ప్రత్యేక ఓబీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల కోటాను 2శాతం అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు 27శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. క్రిమిలేయర్ కోటాను రూ.30లక్షలకు పెంచాలని అన్నారు. ఐఐటీ, ఐఐఎమ్ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఓబీసీలకు ఇవ్వాలని, ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో ఓబీసీ మహిళలకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ సెంట్రల్ కమిటీ ప్రతినిధులు చిన్నయ్య, రవికుమార్, జయప్రకాష్, లలితా చందన, శ్రీనివాస్ గౌడ్, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో దిద్దుబాటు!

- అడ్డగోలుగా కొత్త టీచర్ల పోస్టులు
- ఖాళీగా ఉన్న పోస్టుల్లో సర్దుబాటుకు ప్రయత్నాలు
- కొత్త టీచర్లకు డీఈవో ఆఫీస్ నుంచి పిలుపు
- బదిలీనా.. డిప్యూటేషన్‌లా..? తర్జనభర్జన
- మరోవైపు విద్యాధికారులకు షోకాజ్ నోటీసులు

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ కొత్త టీచర్ల పోస్టింగ్‌లో జరిగిన అవకతవకలపై దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. డీఎస్సీ-2024 కౌన్సెలింగ్‌లో అధికారుల గిమ్మిక్కులపై 'సాక్షి' దినపత్రికలో రెండు రోజుల క్రితం 'నవ్విపోదురు గాక..! అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. అవసరమైన పాఠశాలల్లో ఖాళీల భర్తీకి పోస్టింగ్ ఇవ్వకుండా.. అవసరం లేని పాఠశాలల్లో అదనపు పోస్టింగ్‌లు కేటాయించడాన్ని తీవ్రంగా పరిగణించింది. దీంతో విద్యాశాఖ అధికారులు కొత్త టీచర్ల పోస్టులను సర్దుబాటు చేసేందుకు బదిలీతోనా లేక డిప్యూటేషన్లతో మార్పిడి చేయాలన్నది తర్జనభర్జన పడుతున్నారు. రెండు రోజులుగా డీఈఓ ఆఫీస్‌కు రావాలని కొత్త టీచర్లకు ఫోన్ల తాకిడి పెరిగింది. పోస్టింగ్ ఇచ్చిన పాఠశాలలో కాకుండా మరో పాఠశాలలో రిపోర్ట్ చేయాలని మౌఖిక ఆదేశాలు ఇవ్వడం విస్మయానికి గురిచేస్తోంది. దీంతో కొత్త టీచర్లు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పోస్టుల్లో చేరిన మహిళా టీచర్లు పలువురు పాఠశాలలకు దగ్గర్లో నివాసాలు కూడా మార్చుకున్నారు. తాజా ఆదేశాలతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవంగా హైదరాబాద్ జిల్లాలో మొత్తం 878 పోస్టులకు గాను 584 పోస్టులను భర్తీ చేశారు. అయితే అనేక పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను కౌన్సెలింగ్‌లో చూపించకుండా.. అడ్డగోలుగా కొత్త టీచర్లకు పోస్టులు కేటాయించడం వివాదాస్పదమైంది. దీంతో తిరిగి సర్దుబాటు చేసేందుకు జరుగుతున్న కసరత్తు కొత్త టీచర్ల పాలిట శాపంగా తయారైంది.

50 పోస్టులపైనే..

జిల్లా విద్యాశాఖ కొత్త టీచర్ల పోస్టింగ్‌లో సైతం నిర్లక్ష్యం వహించినట్లు స్పష్టమైంది. మొత్తం మీద సుమారు 50పైగా పోస్టింగ్‌లు అవసరం లేని చోట కేటాయించినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏకంగా ఒక ఉపాధ్యాయ సంఘం సమగ్ర వివరాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తే గానీ.. మేల్కొకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. అత్యధికంగా ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఖాళీలను కౌన్సెలింగ్‌లో చూపించినట్లు తెలుస్తోంది. హైస్కూల్ పోస్టింగ్‌లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. ఫలితంగా అవసరం లేని పాఠశాలల్లో అదనపు పోస్టులు భర్తీ కాగా, అత్యవసరం ఉన్న పాఠశాలల్లో ఖాళీలు అదేవిధంగా వెక్కిరిస్తున్నాయి. సాక్షాత్తు అధికారులు సైతం ఇందుకు అంగీకరిస్తున్నారు. అయితే జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పోస్టుల ఖాళీలను లెక్కిస్తే ఫిర్యాదులో పేర్కొన్న దానికంటే రెట్టింపు ఉంటాయని ఉపాధ్యాయ సంఘాలు వాదిస్తున్నాయి.

8 మందికి షోకాజ్ నోటీసులు

డీఎస్సీ-20024 కౌన్సెలింగ్‌లో ఉపాధ్యాయ ఖాళీలను చూపించడంలో నిర్లక్ష్యం వహించిన ఎనిమిది విద్యాశాఖ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. అందులో ఒక డిప్యూటీ ఈవోలు, ఏడుగురు డిప్యూటీ ఐఓఎస్‌లకు జిల్లా విద్యాశాఖ నోటీసులు జారీ చేసింది. రెండు రోజుల్లోగా నోటీసులకు సంజాయిషీ ఇవాలని ఆదేశించింది.

బయటపడిన డొల్లతనం

డీఎస్సీ-2024 కౌన్సెలింగ్ పోస్టింగ్‌లో జిల్లా విద్యాశాఖ డొల్లతనం బహిర్గతమైంది. ఉపాధ్యాయ ఖాళీలను ప్రదర్శించుటకు డిప్యూటీ ఈవో, డిప్యూటీ ఐవోఎస్‌ల పలు సూచనలు చేసినా.. నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు సాక్షాత్తు జిల్లా విద్యాశాఖ అంగీకరించడం గమనార్హం. ఈమేరకు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ మంగళవారం పత్రికలకు ప్రకటన విడుదల చేసింది. ప్రకటనలో ఇలా.. 'పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల సమాచారం తెప్పించి పలు మార్లు పరిశీలించుకొని డీఈవో ఆఫీస్‌లో సమర్పించమని డిప్యూటీ ఈవో, డిప్యూటీ ఐవోఎస్‌ల చెప్పడం జరిగింది. అనేక పర్యాయాలు సవివరంగా వివరించి సందేహాలను నివృత్తి చేసిన తర్వాత కూడా కొందరు డిప్యూటీ డీఈవోలు, డిప్యూటీ ఐవోఎస్‌లు కొన్ని పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న ఖాళీలను చూపించకపోవడం జరిగింది. ఈ విషయంపై వారికి సంజాయిషీ నోటీసులు ఇవ్వడం జరిగింది. బుధవారంలోగా నోటీసులకు సమాధానం రాగానే కలెక్టర్‌కు పంపించి చర్యలు తీసుకుంటాం' అంటూ పత్రిక ప్రకటనలో స్పష్టం చేసింది.

గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశాం

– మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్


మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు ఆల్బం అందజేస్తూ..

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గీత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేశామని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కల్లు గీతకార్మిక సంఘం 67వ వార్షికోత్సవం సందర్భంగా రూపొందించిన తెలంగాణలో 10ఏళ్ల ప్రయాణం ఆల్బంను మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, టాడి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్‌కు మంగళవారం అందజేశారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ సర్వాయి సర్దార్ పాపన్న జయంతి, వర్ధంతులను తమ హయాంలో అధికారికంగా నిర్వహించామని, పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై పెట్టడానికి నిర్ణయించి జీవో కూడా జారీ చేశామన్నారు. హైదరాబాద్‌లో మూసివేసిన కల్లు దుకాణాలు తెరిపించడంతో పాటు వృత్తిపన్ను రద్దు చేశామని, ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షలకు పెంచామని, నీరా పాలసీ తీసుకువచ్చి నెక్లెస్ రోడ్డులో నీరా కేఫ్ నిర్మించామని చెప్పారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు ఎంవీ రమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వి.వెంకట్ నర్సయ్య, గ్రేటర్ కన్వీనర్, ఎం.కృష్ణస్వామి, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ గ్లోబల్ శాంతి పురస్కారాల ప్రదానం


మాట్లాడుతున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్

సుల్తాన్‌బజార్: శాంతి మత సామరస్యానికి ప్రతీక అయిన హైదరాబాద్ నగరం అందరికీ ఆదర్శమని తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్, మాజీ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ బండ ప్రకాష్ అన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో మహాత్మాగాంధీ జయంతి, అంతర్జాతీయ అహింసా దినోత్సవ ముగింపు ఉత్సవాలను పురస్కరించుకొని ముఖ్య అతిథిగా విచ్చేసి ఆయన ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు, యువకులు శాంతిమార్గంలో నడిచి దేశ సమైఖ్యత, అభివృద్ధికి పాటుపడాలన్నారు. తెలంగాణ శాసన మండలి సభ్యులు ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా మాట్లాడుతూ.. హింస మార్గం ద్వారా జీవితంలో ఏమీ సాధించలేమని, కులమతాలకు అతీతంగా ఐక్యంగా శాంతియుత జీవనం సాగిస్తూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ.. గాంధీ పయనించిన శాంతి అహింసా సద్భావన వంటి అంశాలను అనుసరిస్తే సమాజం అన్నిరంగాల్లో అభివృద్ధి దిశలో వెళ్తుందన్నారు. రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ మాట్లాడుతూ.. ప్రజలందరూ ఇంటింటికీ బీసీ సర్వేల గురించి వచ్చే అధికారులకు ఆయన కుటుంబ సభ్యుల వివరాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్, సుప్రీం కోర్ట్ ఆఫ్ ఇండియా న్యాయవాది డీఎల్.పాండు, ఉజ్వల్ చందర్, డాక్టర్ రవితేజ, విద్యావేత్త మధుసూదన్ ముదిరాజ్, బత్తుల హేమంత్, శివకుమార్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అంతకుముందు మహాత్మా గాంధీ గ్లోబల్ పీసీ అవార్డులను ప్రదానం చేశారు.

ట్రాన్స్‌జెండర్స్‌కు ఆధార్ కార్డుల జారీ గొప్ప పరిణామం

– డైరెక్టర్ బి.శైలజ


మలక్‌పేట వికలాంగుల సంక్షేమ భవనంలో ఆధార్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సంక్షేమశాఖ అధికారులు

చాదర్‌ఘాట్: దేశంలోనే మన రాష్ట్రంలో మొదటిసారిగా ట్రాన్స్‌జెండర్స్‌కు ఆధార్ కార్డు సెంటర్ ద్వారా ట్రాన్స్‌జెండర్స్ ఆధార్ కార్డులు జారీ చేయడం రాష్ట్రానికి గర్వకారణమని రాష్ట్ర వికలాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమశాఖ డైరెక్టర్ బి.శైలజ అన్నారు. మలక్‌పేటలోని వికలాంగుల సంక్షేమ భవనంలో ట్రాన్స్‌జెండర్స్ ఆధార్ కార్డుల జారీ ప్రక్రియను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రంలో సుమారు 50 వేల మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారని తెలిపారు. గతంలో ఆధార్‌లో వెబ్‌సైట్ మేల్, ఫిమేల్ కాలమ్ మాత్రమే ఉండేదని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వ అనుమతితో ట్రాన్స్‌జెండర్స్ కాలమ్ పొందుపరిచి ఆధార్ కార్డులు జారీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్డుల ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులవుతారని తెలిపారు. దేశంలో ఎక్కడైనా ఈ కార్డులు గుర్తింపుగా చెలామణి అవుతాయని తెలిపారు. అవకాశాన్ని రాష్ట్రంలోని ప్రతి ట్రాన్స్‌జెండర్స్ వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పోస్టల్ డిపార్ట్‌మెంట్ పోస్ట్‌మాస్టర్ హరిప్రసాద్, ప్రోగ్రామ్ మేనేజర్ జయంతి, సంక్షేమశాఖ పీడీ అరుణ, ట్రాన్స్‌జెండర్స్ కో ఆర్డినేటర్ ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కంప్యూటింగ్ సదస్సు




సాక్షి, సిటీబ్యూరో: కంప్యూటింగ్ అంశానికి సంబంధించి కేఎల్‌హెచ్ బాచుపల్లి క్యాంపస్‌లో ఏసీఎం ఇండియా ప్రాంతీయ శాఖ సదస్సు జరిగింది. ఆవిష్కరణల విశేషాలు నెట్ వర్కింగ్, చర్చల వేదికగా దీనిని నిర్వహించారు. కంప్యూటింగ్ కమ్యూనిటీలో అత్యాధునిక అంశాలు, భాగస్వామ్యాలపై ఈ సదస్సు దృష్టి సారించింది. కీలకోపన్యాసాలు చేసిన వక్తలతో నిర్వహించిన ఆస్క్ మీ ఎనీథింగ్ సెషన్ ఆసక్తికరంగా సాగింది. కార్యక్రమంలో ఒరాకిల్ ఇండియాకు చెందిన మరియా జోసెఫ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు చెందిన ప్రొఫెసర్ యోగేశ్ సిమ్హాన్, ఎస్ఆర్ఎమ్ స్కూల్ ఆఫ్ కంప్యూటింగ్ చైర్ పర్సన్ రేవతి వెంకటరామన్, ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన పొన్నురంగం కుమార్ గురు కేఎల్ డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ విసి డాక్టర్ జి.పార్థసారథివర్మ పాల్గొని ప్రసంగించారు.

8వ రోజు సత్తాచాటిన క్రీడాకారులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గచ్చిబౌలి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంతో పాటు విభిన్న వేదికల్లో కొనసాగుతున్న ఎస్ఎఫ్ఏ ఛాంపియన్‌షిప్స్ 8వ రోజు పోటీల్లో అథ్లెట్లు తమ క్రీడా నైపుణ్యాలతో అలరించారు. గచ్చిబౌలి స్టేడియంలో అండర్-18 బాలుర 1500మీ రేసులో ది క్రీక్ ప్లానెట్ స్కూల్‌కు చెందిన సాయి నిశ్చల్ ముక్కాల, అండర్-16 బాలుర 800మీ మాదాపూర్ మెరిడియన్ స్కూల్‌కు చెందిన ఆర్య ముదలియార్ స్వర్ణ పతకాలు సాధించారు. బాలుర అండర్-12 షాట్‌పుట్‌లో బోలారం సదాశివ పాఠశాలకు చెందిన ఎంఆర్ నవదీప్ 3 కేజీల షాట్‌పుట్‌ను ఫీల్డ్ మీదుగా విసిరి బంగారు పతకం సాధించగా, బాలికల అండర్-12 హైజంప్‌లో టీఎస్ఆర్ ఎక్సలెన్సియా అకాడమీకి చెందిన ఆర్వీ వితనాల బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. బాలుర అండర్-10 విభాగంలో సఫిల్‌గూడ డీఏవీ పబ్లిక్ స్కూల్ నుంచి కార్తికేయ అభిరన్ పెమ్మరాజు క్యూబ్-సాల్వింగ్ నైపుణ్యంతో స్వర్ణాన్ని గెలుచుకోగా, బాలికల అండర్-10 విభాగంలో ఫుప్పల్‌గూడ ది ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ నుంచి యుధిర మాంచెమ్ స్వర్ణం సాధించింది. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో బ్యాడ్మింటన్ అండర్-17 బాలికల డబుల్స్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకోగా, కబడ్డీ బాలుర అండర్-14 మొదటి రౌండ్‌ను ప్రారంభించింది. ఈ సంవత్సరం హైదరాబాద్ ఎడిషన్ ఎస్ఎఫ్ఏ ఛాంపియన్‌షిప్స్‌లో భాగంగా 22 క్రీడా విభాగాల్లో జరుగుతున్న పోటీల్లో 920 పాఠశాలల నుంచి 23,000 మంది అథ్లెట్లు పాల్గొనడం విశేషం. ఈ ఛాంపియన్‌షిప్స్ ఈనెల 28 వరకు కొనసాగనున్నాయి.

ఎండ కన్నెరుగని శరీరాలు ఎండ్‌లెస్ సమస్యల చిరునామాలుగా మారుతున్నాయి. ఆరు అంకెల జీతాలు అందుకునే జీవితాలు అనారోగ్యాలకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఐటీ ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితులపై ఆందోళన పెరుగుతోంది. దీనికి పని ఒత్తిడి కారణం ఒకటైతే.. హైబ్రిడ్, వర్క్ ఫ్రమ్ హోం సైతం మరో కారణంగా పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఆదోళన నేపథ్యంలో పలు కంపెనీలు.. కార్యాలయ ఆవరణల్లో మార్పులకు కారణమవుతున్నాయి. - సాక్షి, సిటీబ్యూరో





- నగర ఐటీ నిపుణుల అనారోగ్యకర జీవనశైలి
- ఇటీవలి ఎన్ఐఎన్ సహా పలు అధ్యయనాల్లో వెల్లడి
- హైబ్రిడ్, వర్క్ ఫ్రమ్ హోమ్ సైతం కారణాలే
- కార్యాలయాల్లో ఆరోగ్య సాధన ఏర్పాట్ల పెంపు

టెకీ.. ఆరోగ్యం రిస్కీ..

నగరంలో దాదాపు తొమ్మిది లక్షల మంది పైగా ఐటీ ఉద్యోగులు ఉన్నారు. వీరు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నడిపించే చోదకశక్తిగా మారినప్పటికీ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోలేకపోతున్నారు. తద్వారా రానున్న సంవత్సరాల్లో 30 ఏళ్ల 40 ఏళ్ల వయస్సు ఉద్యోగుల్లో నాన్–కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సిడి)లో భారీ పెరుగుదల కనిపించనుంది. నగరానికి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) పరిశోధకులు మాదాపూర్‌లోని హైటెక్ సిటీలోని ఐటీ సెక్టార్‌లో ఇటీవల వర్క్‌ప్లేస్ వెల్‌నెస్ స్టడీ వెల్లడించిన విషయం ఇది. ఈ అధ్యయనం న్యూట్రియెంట్స్ జర్నల్‌లో ప్రచురితమైంది.

అంతర్గత అధ్యయనాల్లోనూ..

ఇదే విధంగా పలు సంస్థలు నిర్వహిస్తున్న అంతర్గత అధ్యయనాల్లోనూ ఇలాంటి ఫలితాలే వస్తున్నాయి. ఎస్ఓఐ హెల్త్‌కేర్ అనే ఒక వెల్‌నెస్ సంస్థ జరిపిన అధ్యయనంలో అత్యధికంగా టెక్ ఉద్యోగులు మెడనొప్పి, హైపర్ టెన్షన్, లోయర్ బ్యాక్ పెయిన్, సర్వైకల్ స్పాండిలైటిస్‌తో బాధపడుతున్నారని తేల్చింది. అలాగే కార్పల్ టన్నెల్ సింద్రోమ్.. అనే చేతులకు సంబంధించిన సమస్యతో, లోయర్ బ్యాక్‌కి కాళ్లకు కలిపి నొప్పులు అందించే సాక్రోలియక్ జాయింట్ డిస్‌ఫంక్షన్‌తో పలువురు ఇబ్బంది పడుతున్నారని స్పష్టం చేసింది. టెక్నోపార్క్ అంతర్గతంగా చేయించుకున్న అధ్యయనం ఇది.

ఫలితం అంతంతే..

గత ఐదు సంవత్సరాల్లో, చురుకైన జీవితం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని ప్రోత్సహించడంలో అనేక స్వచ్ఛంద సంస్థలు, కంపెనీల హెచ్ఆర్ విభాగాలతో కలిసి పాలు పంచుకుంటున్నాయి. అయినప్పటికీ కరోనా కారణంగా చాలా మంది ఉద్యోగులు మరింత నిశ్చల జీవనశైలికి అలవాటు పడ్డారని ఐటీ రంగ నిపుణులు అంటున్నారు. 'చురుకైన జీవనశైలిని అలవర్చుకునే విషయంలో కొన్ని సంవత్సరాలుగా సానుకూల మార్పులు కనిపిస్తున్నాయి. జిమ్‌లో వర్కవుట్ చేయడం, రన్నింగ్, యోగా సెషన్‌లు, నడకలను ప్రోత్సహిస్తూ, ఆరోగ్యకరమైన జీవనంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నాం. అయితే, ఇంకా చాలా పనులు చేయాల్సి ఉంది' అని హైదరాబాద్ రన్నర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజేష్ వెచ్చా చెబుతున్నారు.



ఆ అలవాట్లతో చేటు..

రోజుకు సగటున ఎనిమిది గంటలపైనే కూర్చుని ఉంటున్నారు. ఇదే కాకుండా తరచూ బయట, రెస్టారెంట్స్‌లో తినడం, వేళలు పాటించకపోవడం, తాజా పండ్లు, కూరగాయల వినియోగం స్వల్పంగా ఉండడం, పని ఒత్తిడితో తరచూ భోజనాన్ని మానేయడం, ఎయిర్ కండిషన్డ్ గదుల్లో ఉండడం.. వంటివి హానికరంగా మారుతున్నాయి. మొత్తం ఐటి ఉద్యోగుల్లో 20శాతం మంది మాత్రమే వారానికి 150 నిమిషాల పాటు శారీరక శ్రమ చేస్తున్నారు. మరోవైపు వర్చువల్ వర్క్ వారి పాలిట హానికరంగానే పరిణమిస్తోంది. వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్ మానసిక, శారీరక ఆరోగ్యానికి సమస్య తెచ్చిపెడుతోంది. ఈ నేపథ్యంలో కంపెనీలు దిద్దుబాటు చర్యలు ముమ్మరం చేసినట్టు తెలుస్తోంది.





ఒత్తిడి ఫుల్.. శ్రమ నిల్..

నగర ఐటీ రంగంలో నిమగ్నమైన ఉద్యోగుల్లో ఎక్కువ మంది నిశ్చల జీవనశైలి కావడంతో శారీరక శ్రమ తక్కువ. మరోవైపు తీవ్ర పని ఒత్తిడి. ఈ కారణంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు గుండె జబ్బులు, రక్తపోటు, మధుమేహం, పక్షవాతం, దీర్ఘకాలిక కిడ్నీ, గుండె సంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితులు కొనసాగితే 26 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్కుల్లో మెటబాలిక్ సింద్రోమ్ (ఎంఇటీఎస్)కు అంతిమంగా నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్‌కు దారితీసే అవకాశం ఉందని అధ్యయనం హెచ్చరించింది. మగవారిలో 90 సెం.మీ లేదా అంతకంటే ఎక్కువ, మహిళల్లో 80 సెం.మీ లేదా అంతకంటే ఎక్కువ నడుము చుట్టుకొలత, ట్రైగ్లిజరైడ్స్ (టీజీ) స్థాయిలు 150 మి.గ్రా/డీఎల్ లేదా అంతకంటే ఎక్కువ, హై డెన్సిటీ లైపో ప్రొటీన్ స్థాయి వంటివి ప్రమాద సంకేతాలుగా హెచ్చరించింది.

వాటిలో కొన్ని..

- వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా సమస్యలు వస్తున్నప్పటికీ చాలా మంది దాన్నే ఎంచుకున్నారని ఈ పరిస్థితుల్లో పలు సంస్థలు ఉద్యోగిని బట్టి ఉద్యోగాన్ని, వర్క్‌ప్లేస్‌ని డిజైన్ చేసే ఎర్గోనామిక్స్‌ను పరిచయం చేస్తున్నాయి.
- ప్రతి 10 నిమిషాలకూ ఒకసారి కళ్లు బ్లింక్ చేయాలి లేదా సిస్టమ్ నుంచి బ్రేక్ తీసుకోవాలని టీసీఎస్ నోటిఫికేషన్స్ ఇస్తోంది.
- టెక్నోపార్క్ కంపెనీ.. తమ ప్రాంగణంలో వాక్ వే, యోగా సెంటర్స్.. వంటివి ఏర్పాటు చేసింది. అలాగే ఓపెన్ జిమ్, జాగింగ్ ట్రాక్, ఫుట్ బాల్ టర్ఫ్ వంటివి ప్లాన్ చేస్తోంది.
- కాలుష్యరహిత స్మార్ట్ బైక్స్‌ను ఇన్ఫోపార్క్ అందిస్తోంది. అలాగే వాటర్ ఫ్రంట్ వాక్ వే, జాగింగ్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్ సైతం ప్లాన్ చేస్తోంది.
- జుంబా క్లాసెస్ నిర్వహిస్తున్న సైబర్ పార్క్.. త్వరలో ఫుట్ బాల్ టర్ఫ్ ఏర్పాటు చేయనుంది.



ఐటీ కారిడార్‌లో.. రెడ్ హార్ట్ ట్రాఫిక్ సిగ్నల్

గచ్చిబౌలి: గుండెను పదిలంగా ఉంచుకుంటే పది కాలాల పాటు ఆరోగ్యంగా ఉండవచ్చనే నినాదంతో ప్రధాన కూడళ్లలో రెడ్ హార్ట్ సిగ్నల్ ఏర్పాటు చేశారు. స్టార్ హాస్పిటల్ సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులతో కలిసి ప్రధాన కూడళ్లలో రెడ్ సిగ్నల్‌కు బదులు రెడ్‌హార్ట్ సింబల్ ఏర్పాటు చేశారు. హృద్రోగాలపై వాహనదారులకు మరింత అవగాహన కల్పించేందుకు తమ వంతు ప్రయత్నంగా వీటిని ఏర్పాటు చేశారు. వయసుతో నిమిత్తం లేకుండా ఎంతో మంది గుండె సంబంధిత వ్యాధులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలిసిందే. ఐటీ కారిడార్‌లోని రెడ్ సిగ్నల్ వచ్చినప్పుడు హార్ట్ సింబల్ కనిపిస్తోంది. దీంతో వాహనదారులు గుండె ఆరోగ్యం గురించి ఆలోచించే వీలుంటుంది. గచ్చిబౌలి ట్రాఫిక్ డివిజన్ పరిధిలోని గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం, నార్సింగి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రధాన కూడళ్లలో రెడ్ సిగ్నల్‌కు బదులు హార్ట్ సింబల్ కనిపిస్తోంది. వినూత్న రీతిలో హార్ట్ సింబల్ కనిపించడంతో వాహనదారులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. దీంతోపాటు సిగ్నల్స్‌కి సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట్లో వైరల్‌గా మారాయి.




మై ఓన్ ట్రబుల్డ్ వరల్డ్ ఆర్ట్ ఎగ్జిబిషన్

ఆర్ట్ గ్యాలరీలో ఆకట్టుకుంటున్న చిత్రాలు



మాదాపూర్: కళాకారులు వేసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రామయి స్టేట్ అర్ట్ గ్యాలరీలో నిర్వహిస్తున్న మై ఓన్ ట్రబుల్డ్ వరల్డ్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన చిత్రాలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. కళాకారులు వేసిన చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని సందర్శకులు కొనియాడారు. ఈనెల 28వ తేదీ వరకూ ప్రదర్శన కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ సందర్శకులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

26న భల్లే.. భల్లే.. మ్యూజిక్ షో



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో పంజాబీ సంగీతం పరవళ్లు తొక్కనుంది. పంజాబ్‌లోని లూథియానాకు చెందిన గాయని జస్లీన్ రాయల్ గచ్చిబౌలిలోని విందు వినోదాల కేంద్రం బౌల్డర్ హిల్స్ వేదికగా ఈ నెల 26న సంగీత ప్రదర్శన నిర్వహిస్తున్నారు. సాయంత్రం 4గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ సంగీత సందడిలో నగరానికి చెందిన థియరీ రాక్ బ్యాండ్‌తో పాటు ప్రముఖ లేడీ డీజే పరోమా కూడా పాల్గొంటున్నారు. వైవిధ్యభరిత సంగీతాన్ని ఆస్వాదించే మ్యూజిక్ లవర్స్‌ను ఈ కార్యక్రమం అలరించనుంది.

సిటీలో 'మహీంద్రా ఫస్ట్'.. ప్రీ ఓన్డ్ కార్లు..

సాక్షి, సిటీబ్యూరో: మహీంద్రా ఫస్ట్ ఛాయిస్‌కు చెందిన ఆటో కంటెంట్ కామర్స్ పోర్టల్ కార్ – బైక్ ఆధ్వర్యంలో ప్రీ ఓన్డ్ కార్ల కేంద్రం కార్ – బైక్ సెలెక్ట్ నగరంలోని ఆటోనగర్‌లో ఏర్పాటైంది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. స్థానికంగా వీవీసీ మోటార్స్ భాగస్వామ్యంతో ఏర్పాటైన ఈ స్టోర్ కస్టమర్లు ఎంచుకోడానికి అనేక రకాల సర్టిఫైడ్ ప్రీ–ఓన్డ్ కార్లను అందిస్తుందని, కస్టమర్లు గ్యారెంటీ బైబ్యాక్‌ని సైతం పొందవచ్చని వివరించారు. అదే విధంగా రెండేళ్ల పాటు యూజ్డ్ కార్ వారంటీ పొందవచ్చని, ఉచిత హోమ్ టెస్ట్ డ్రైవ్ కోసం కారును ఆన్‌లైన్‌లో రిజర్వ్ చేసుకోవచ్చని తెలిపారు.





హెచ్ఐసీసీలో హైలైఫ్ బ్రైడల్ ఎగ్జిబిషన్

మూడు రోజుల పాటు అందుబాటులో
ఆకర్షిస్తోన్న ప్రముఖ డిజైనర్ల వస్త్రాభరణాలు

ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో మంగళవారం ఏర్పాటు చేసిన హైలైఫ్ బ్రైడల్ ఎగ్జిబిషన్‌ను నటీమణులు అషురెడ్డి, సాయిరెడ్డి నిర్వాహకుడు డొమినిక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ దేశంలోని ప్రముఖ డిజైనర్లు రూపొందించిన ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని, యువతను ఆకట్టుకునే ప్రత్యేక డిజైన్‌లు సైతం అందుబాటులో ఉన్నాయని వివరించారు. వివాహాది శుభకార్యాలకు, పండుగలకు ధరించే సంప్రదాయ వస్త్రాలు ఆకర్షణగా నిలుస్తున్నాయన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆభరణాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నటి శ్రీపావ, పలువురు మోడల్స్ పాల్గొన్నారు. – మాదాపూర్



రీల్ కాదు.. రియాలిటీ..

- వినబడదు..మాటలు రావు..
- అయినా అన్నింటిలోనూ ఫస్ట్
- లిప్‌మూమెంట్ ద్వారానే పాఠాలు అర్థం చేసుకుంటూ
- ఉపాధ్యాయులు, విద్యార్థుల మన్ననలు పొందుతూ



బంజారాహిల్స్: దేశం కాని దేశం.. ఊరు కాని ఊరు.. మన భాష అసలే తెలియదు.. మాట్లాడడానికి నోరు పెగలదు.. చెవులు వినబడవు.. అమెకున్న గ్రహణ శక్తి సంజ్ఞలు మాత్రమే. మూగ, చెవుడు అయినా కేవలం ఉపాధ్యాయులు చెప్పేది లిప్‌మూమెంట్ ద్వారా గ్రహిస్తూ చదువులో దూసుకుపోతోంది. క్లాస్‌లో ఎప్పుడూ మొదటి స్థానమే. నేపాల్‌కు చెందిన రియా (17) తల్లిదండ్రులు జయన్‌బహదూర్, తల్లి జోగు మాయలు పొట్ట చేతబట్టుకుని ఉపాధి నిమిత్తం 15 సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వచ్చారు. జయన్ బహదూర్ కుక్‌గా పనిచేస్తుండగా, భార్య మాయ గృహిణి. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. చిన్న కూతురు రియా పుట్టుకతో మూగ, చెవుడు. తన భావాలను పంచుకోవాలంటే మాటలు రావు. ఇతరులు చెప్పేది వినబడదు. అయితేనేం ఆమెకున్న గ్రహణ శక్తికి తనలోని లోపాలు కూడా చిన్నబోతాయి. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–10లోని గాయత్రీహిల్స్‌లోని లిటిల్‌స్టార్ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతోంది రియా.

ఎప్పుడూ ఫస్టే..

తరగతి గదిలో టీచర్లు చెప్పేది వినబడకపోయినా.. వారి లిప్‌మూమెంట్ ద్వారా ఆ పాఠాలు గ్రహిస్తోంది. ఏమైనా అర్థం కాకపోతే నోట్‌బుక్‌లో రాసి టీచర్లను అడుగుతుంది. నర్సరీ నుంచి తొమ్మిదో తరగతి వరకూ ఇక్కడే చదువుతున్న రియా ఎప్పుడూ క్లాస్ ఫస్టే వస్తుందని తెలుగు టీచర్ అనూష తెలిపారు. బ్లాక్‌బోర్డుపై తాము రాసే పాఠాల విషయాలు బాగా అబ్జర్వ్ చేస్తుందని హిందీ టీచర్ అర్షియా పర్వీన్ తెలిపారు. ఈ బాలిక అంటే మొత్తం స్కూల్ విద్యార్థులకే కాకుండా టీచర్లకు కూడా ప్రత్యేక గౌరవం ఇస్తుంటారని ఆమె వెల్లడించారు.




నూరు శాతం హాజరు..

వినబడదు..మాట్లాడలేదు..అయినా సరే ఏ ఒక్కరూ ఆమెను హేళనగా చూడరని, క్లాస్‌లో ఎప్పుడూ ఫస్ట్ వస్తుంటుందని స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా తెలిపారు. ఈ బాలిక అక్క, అన్న కూడా ఇదే పాఠశాలలో చదివారని తెలిపారు. రియాలో ఉన్న ప్రతిభను గుర్తించి ఆమె వద్ద ఎలాంటి ఫీజు తీసుకోకుండానే నర్సరీ నుంచి తొమ్మిదో తరగతి వరకూ ఉచితంగా చదువును అందిస్తున్నట్లు అస్మతున్నీసా పేర్కొన్నారు. కేవలం చదువులోనే కాకుండా పాఠశాలల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ పాల్గొని అబ్బురపరిచే నృత్యాలు కూడా చేసి ఆకట్టుకుంటుంది. క్రాఫ్ట్‌వర్క్, డ్రాయింగ్, పోస్టర్ మేకింగ్, చార్ట్ తయారీలో కూడా రియా పాల్గొంటూ బహుమతులు సాధిస్తోంది. ఒక్కరోజు కూడా గైర్హాజరు కాకుండా స్కూల్ అటెండెన్స్‌లో 100 శాతంతో అందరి కంటే ముందుంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. అంతేకాదు తమ కంటే బాగా చదవడం, మార్కులు కూడా బాగా రావడం మమ్మల్ని ఎంతగానో ఆశ్చర్యపరుస్తుందని సహచర విద్యార్థిని సౌమ్య చెబుతోంది.

క్లుప్తంగా...

అభ్యంతరకర వీడియోలు తొలగించండి

ముత్యాలమ్మ విగ్రహ ధ్వంసం కేసులో ఐ4సీకి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహ ధ్వంసానికి సంబంధించిన వీడియోలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని ఢిల్లీలోని ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) సీఈవోకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అలాగే, పిటిషనర్ ఫిర్యాదును స్వీకరించి విచారణ చేపట్టాలని మారేడుపల్లి స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌కు స్పష్టం చేసింది. ఎస్‌హెచ్‌ఓకు ఫిర్యాదుతోపాటు సంబంధిత మెటీరియల్ అందజేయాలని, విచారణ చేపట్టి అవసరమైన ఉత్తర్వులు ఇస్తామని చెప్పింది. తదుపరి విచారణను నవంబర్ 5కు వాయిదా వేసింది. ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేస్తున్న అభ్యంతరకర వీడియోలను ప్రజలు చూడకుండా సోషల్ మీడియా నుంచి తొలగించి.. ధ్వంసం ఘటనపై దర్యాప్తు చేపట్టాలంటూ న్యాయవాది ఇమ్మనేని రామారావు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి మంగళవారం విచారణ చేపట్టారు. ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఖొరాసన్ ప్రావిన్స్ ద్వారా సైబర్ టెర్రరిజం వ్యాపిస్తోందని, వాయిస్ ఆఫ్ ఖురాసన్, టీకేడీ మానిటరింగ్ ది ఖురాసన్ డెయిరీ అనే వెబ్‌సైట్ల ద్వారా ఉగ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నారని పిటిషనర్ న్యాయవాది తెలిపారు. ఒక్క తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఇలాంటి వెబ్‌సైట్లు నడుపుతున్నారన్నారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. అభ్యంతరకర వీడియోలు తొలగించాలని ఆదేశించారు.

రెండో రోజు 69.4% మంది హాజరు

ప్రశాంతంగా గ్రూప్–1 పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1 మెయిన్స్ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన పేపర్–1 జనరల్ ఎస్సే ప్రశాంతంగా జరిగింది. హెచ్ఎండీఏ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లోని 46 పరీక్షా కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు అభ్యర్థుల హాజరు శాతం 69.4 శాతంగా నమోదైంది. మొత్తం 31,383 అభ్యర్థులతోపాటు హైకోర్టు ఉత్తర్వుల ద్వారా స్పోర్ట్స్ కేటగిరీలో 20 మందిని అదనంగా పరీక్షకు అనుమతించారు. మంగళవారం నాటి పరీక్షకు 21,817 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సోమవారం నాటి పరీక్షకు హాజరైన అభ్యర్థులతో పోలిస్తే మంగళవారం 927 మంది అభ్యర్థులు ఎక్కువగా గైర్హాజరయ్యారు. పరీక్ష నిర్వహణ తీరును తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయం నుంచి అధికారులు పర్యవేక్షించారు. పరీక్షల నేపథ్యంలో కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు.

నవంబర్ 4న చలో హైదరాబాద్

తాజా మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్యగౌడ్

సిరిసిల్ల: తెలంగాణ ప్రజా పాలనలో తాజా మాజీ సర్పంచులు భాగస్వాములు కాదా అని తాజా మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సర్వీ యాదయ్యగౌడ్ ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో తాజా మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలు మంగళవారం ఐదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యాదయ్యగౌడ్ పాల్గొని ప్రసంగించారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు మంజూరు చేయమంటే రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. పది నెలలుగా తాజా మాజీ సర్పంచులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు ఇవ్వకుండా కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని, చేసిన పనుల పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడంతో సర్పంచులు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లుల మంజూరు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, ఎప్పటిలోగా బిల్లులు ఇస్తారో చెప్పాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే నవంబర్ 4న చలో హైదరాబాద్ పోరుబాట చేపడతామన్నారు.

నూతన నేర చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

శిక్షణా కార్యక్రమంలో జైళ్ల శాఖ డీజీ సౌమ్యామిశ్రా

సాక్షి, హైదరాబాద్: నూతన నేర చట్టాలపై జైలు అధికారులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని జైళ్ల శాఖ డీజీ సౌమ్యామిశ్రా అన్నారు. వేగంగా మారుతున్న సమాజ అవసరాలకు తగిన విధంగా ఇటీవలి క్రిమినల్ చట్టాల్లో ఎన్నో మార్పులు తెచ్చారని, ఇవన్నీ చట్టాన్ని అత్యంత సమర్థంగా అమలు చేయడంలో అధికారులకు ఉపయోగపడతాయని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ, బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్అండ్‌డీ) సంయుక్తంగా 'కొత్త క్రిమినల్ చట్టాలు, జైలు అధికారులకు అవగాహన' అనే అంశంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (సికా)లో ఈ కార్యక్రమాన్ని తెలంగాణ జైళ్లశాఖ డీజీ డాక్టర్ సౌమ్యా మిశ్రా ప్రారంభించారు. ఈనెల 24 వరకు ఈ శిక్షణ కొనసాగనుంది. తెలంగాణ జైళ్లశాఖ అధికారు లతోపాటు మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుంచి జైలు అధికారులు పాల్గొంటున్నారు.

సాక్షి, హైదరాబాద్

దేవాదాయ శాఖ భూముల్లో సౌర విద్యుత్తు ఉత్పత్తి కానుంది. వ్యవసాయ యోగ్యం కాని భూములు దశాబ్దాలుగా వృథాగా ఉంటున్నాయి. ఈ భూముల్లో సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. కొన్నిచోట్ల భూములు అన్యాక్రాంతమయ్యాయి. అలాంటి భూములను తిరిగి స్వాధీనం చేసుకుని, వ్యవసాయానికి ఉపయోగపడని భూములను గుర్తించి వాటిల్లో కూడా సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయాలని నిర్ణయించారు. అయితే నేరుగా దేవాదాయ శాఖ కాకుండా.. స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జీలు) ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. భూములు ఇవ్వటం ద్వారా లీజు రూపంలో దేవాదాయ శాఖకు ఆదాయం రానుండగా, సౌర విద్యుత్తు ప్లాంట్ల నిర్వహణ రూపంలో ఎస్‌హెచ్‌జీలకు రాబడి సమకూరుతుంది. తొలుత ప్రయోగాత్మకంగా కొన్ని దేవాలయాల భూములను గుర్తించి ఆయా జిల్లాల రెవెన్యూ యంత్రాంగం ఆధ్వర్యంలో రెడ్‌కో, ఎస్‌హెచ్‌జీలతో ఒప్పందాలు చేసుకోనున్నారు. ప్రస్తుతానికి 250 ఎకరాల భూములను గుర్తించారు. 62 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్లను ఏర్పాటు చేసే వీలుంది. వీటి ద్వారా నిత్యం సగటున 2.48 లక్షల యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే అవకాశం ఉందని అంచనా.



దేవుడి భూముల్లో 'సౌర' వెలుగులు

వ్యవసాయ యోగ్యం కాని భూముల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయం

రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ శాఖకు 40 వేల ఎకరాలకు పైగా భూములున్నాయి. వీటి అలనాపాలనా అంత పక్కాగా లేదు. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు వేల ఎకరాల భూములు కబ్జా చేశారు. వీటిల్లో విడిపించుకోదగ్గ భూములను తిరిగి స్వాధీనం చేసుకుని, వాటికి సంబంధిత దేవుడి పేరుతో పాస్ పుస్తకాలు పొందే కసరత్తు దేవాదాయ శాఖ ప్రారంభించింది. ఇప్పటికే 57 శాతం భూముల వివరాలను ధరణిలో నమోదు చేయించారు. ఇప్పటికి స్వాధీనం అయిన భూములు, కబ్జా కాకుండా ఉన్న భూములను దేవాలయాలకు ఆదాయాన్ని తెచ్చిపెట్టేలా వినియోగించుకునే ప్రయత్నం ప్రారంభమైంది. అయితే వ్యవసాయ యోగ్యంగా లేని భూములపై ఇప్పటివరకు పెద్దగా దృష్టి లేకుండా పోయింది. ఇప్పుడు వాటిల్లో సౌర విద్యుత్తు ఫలకాలు ఏర్పాటు చేయటం ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేసి విక్రయించాలని నిర్ణయించారు. అయితే దీన్ని సొంతంగా నిర్వహించగలిగే స్థాయిలో దేవాదాయ శాఖ వద్ద మానవవనరులు లేవు. దీంతో ఎస్‌హెచ్‌జీలను తెరపైకి తెచ్చారు.

దేవాదాయ శాఖకు 40 వేల ఎకరాల భూములు

ఈ ప్రాజెక్టును ప్రస్తుతానికి ప్రయోగాత్మకంగా రెండుదశల్లో నిర్వహించాలని దేవాదాయ శాఖ నిర్ణయించింది. తొలి దశలో ఐదు దేవాలయాలకు చెందిన 231 ఎకరాలను గుర్తించింది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయానికి చెందిన 20 ఎకరాలు, మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి మందిరానికి చెందిన 100 ఎకరాలు, నిర్మల్ జిల్లా భైంసాలోని శ్రీ గోశాలకు చెందిన 96 ఎకరాలు, నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జానకంపేటలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి చెందిన 9 ఎకరాలు, నల్లగొండ జిల్లా మోత్కూరు మండలం బుజిలాపురంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి గుడికి చెందిన 6 ఎకరాలను మొదటి దశ కోసం గుర్తించారు. రెండో దశలో మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు మండలం మాటేడు గ్రామ శ్రీ రామలింగేశ్వర స్వామి టెంపుల్, మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామంలోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవాలయం, మహబూబాబాద్‌లోని శ్రీ శివాలయం, హనుమకొండ రాగన్న దర్వాజా ప్రాంతంలోని శ్రీసీతారామచంద్రస్వామిదేవాలయాలకు చెందిన 21 ఎకరాలను ఇందుకోసం గుర్తించారు. వీటిల్లో త్వరలో సోలార్ విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. ప్రస్తుతం ఆయా భూముల్లో రెడ్ కో, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సర్వే జరుగుతోంది. ఎకరాకు రూ.15 వేల మేర లీజును ఖరారు చేసే అవకాశం ఉందని సమాచారం.

వివిధ ఆలయాలకు చెందిన భూముల ఎంపిక

స్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో నిర్వహణ

దేవాలయాలకు లీజు రూపంలో ఆదాయం

ప్రయోగాత్మక పరిశీలనకు 250 ఎకరాల భూమి గుర్తింపు





చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో వర్షపునీటి ప్రవాహానికి కొట్టుకుపోతున్న ధాన్యం

ఆరబోసిన ధాన్యం నీటిపాలు

- చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వరదలో కొట్టుకుపోయిన ధాన్యం
- సకాలంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం

చౌటుప్పల్: సకాలంలో ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటంతా నీటిపాలు చేయాల్సి వచ్చింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో మంగళవారం సాయంత్రం కురిసిన ఆకస్మిక భారీ వర్షానికి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం రాశులు కొట్టుకుపోయాయి. ధాన్యాన్ని ఎండలో ఆరబెట్టుకుని తిరిగి కుప్పలు పోసుకునే సమయంలో వర్షం రావడంతో రైతులు ఏమి చేయాలో తెలియక పరుగులుపెట్టారు. అప్పటికప్పుడు ధాన్యాన్ని కుప్పలుగా పోసుకున్నారు. పట్టాలు కప్పుకున్నారు. పెద్ద ధాన్యం కుప్పలను ట్రాక్టర్లతో దగ్గరకు చేర్చుకునే ప్రయత్నం చేశారు. అయినా వర్షం భారీగా కురవడంతో వరద నీటి ప్రవాహంలో ధాన్యం కుప్పలు కొట్టుకుపోయాయి. దీంతో రైతులు బోరున విలపించారు.

విద్యార్థిని మృతికి బాధ్యత ఎవరిది?

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద
- నారాయణ కాలేజీ సందర్శన.. సిబ్బందిపై ఆగ్రహం



సిబ్బందితో మాట్లాడుతున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

నిజాంపేట్: 'కాలేజీలో విద్యార్థులు చదువుకునేందుకు మంచి వాతావరణం, వసతులు లేవు. విద్యార్థినుల చావుకు ఎవరు బాధ్యత వహిస్తారు? ఒక అమ్మాయి ప్రాణం కాపాడలేకపోయాం.. ఇన్‌స్టిట్యూట్ నడపడానికి అసలు అర్హత ఉందా' అని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద బాచుపల్లి నారాయణ జూనియర్ కాలేజీ సిబ్బందిపై ప్రశ్నల వర్షం కురిపించారు. బాచుపల్లి కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని అనూష ఆదివారం సాయంత్రం హాస్టల్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో మంగళవారం నేరెళ్ల శారద కాలేజీని సందర్శించి విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనూష ఉరి వేసుకున్న గదిని సైతం పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గతంలో తాను ఈ కాలేజీని సందర్శించినప్పుడు ఇక్కడ మెరుగుపరచాల్సిన వసతుల గురించి ప్రశ్నించానని చెప్పారు. కేవలం గత నాలుగు రోజుల నుంచి మాత్రమే భోజనం సరిగ్గా పెడుతున్నారని విద్యార్థినులు తన దృష్టికి తీసుకువచ్చారని ఆమె తెలిపారు. ఇక్కడ చదువుతున్న ప్రతి విద్యార్థిని చదువుతో పాటు వారి క్షేమం బాధ్యత సైతం కాలేజీ నిర్వాహకులదేనని ఆమె స్పష్టం చేశారు. నారాయణ, శ్రీచైతన్య కాలేజీల్లో జరుగుతున్న ఇలాంటి సంఘటనలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం దృష్టి సారించారని తెలిపారు. తిరిగి ఇలాంటి సంఘటనలు జరగకుండా కాలేజీ నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని, లేకపోతే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

కటకటాల్లోకి నిర్మాత శివరామకృష్ణ

▶ మొదటి పేజీ తరువాయి

వివాదాలు సృష్టించాడు. సుప్రీంకోర్టు వరకు వెళ్లిన ఈ వ్యవహారంపై సీసీఎస్‌లో నమోదైన కేసు ఉస్మానియా యూనివర్సిటీ ఠాణాకు బదిలీ అయింది. దీనిపై దర్యాప్తు చేసిన ఓయూ పోలీసులు శివరామకృష్ణతోపాటు ఆర్కైవ్స్ రికార్డు అసిస్టెంట్ కె.చంద్రశేఖర్, రియల్టర్ ఎం.లింగమయ్యలను అరెస్టు చేశారు. నిర్మాతగా ఉన్న శివరామకృష్ణ శ్రీవెంకటేశ్వర ఎస్టేట్స్ సంస్థకు మేనేజింగ్ పార్ట్‌నర్‌గా ఉన్నారు. ఈయన రాయదుర్గం పైగా విలేజ్‌లోని సర్వే నం. 46లో ఉన్న 83 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు యాచారంలోని మరో 10 ఎకరాల ప్రైవేట్ భూమిపై కన్నేశాడు. తార్నాకలో ఉన్న స్టేట్ ఆర్కైవ్స్‌లో ప్రభుత్వానికి, నిజాం తదితరులకు చెందిన పురాతన పత్రాలతోపాటు కొందరు ప్రైవేట్ వ్యక్తులవి ఉంటాయి. వీటిని ఆధారంగా చేసుకుని ఆ భూముల్ని కాజేద్దామనుకున్న శివరామకృష్ణ ఆర్కైవ్స్‌లో పని చేస్తున్న చంద్రశేఖర్‌ను సంప్రదించాడు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో పని చేసే రెహ్మాన్ ద్వారా వీరిద్దరికీ పరిచయం ఏర్పడింది.

నకిలీవి సృష్టించి.. అటెస్టేషన్ చేసి..

చంద్రశేఖర్‌కు భారీ మొత్తం ఇచ్చేలా ఒప్పందం చేసుకుని, కొంత చెల్లించిన శివరామకృష్ణ తన వద్ద ఉన్న నకిలీ పత్రాలు చూపించారు. వీటికి మద్దతుగా స్టేట్ ఆర్కైవ్స్ నుంచి ఓ నకిలీ పహాణీ, సేత్వార్ రూపొందించి, అటెస్టేషన్ చేసి ఇవ్వాలని కోరాడు. అయితే తన వద్ద అన్ని రకాలైన పురాతన రికార్డులు ఉన్నప్పటికీ... ఆర్కైవ్స్ మాత్రం ఇలాంటి సర్టిఫికెట్లు, అటెస్టేషన్ లెటర్లు జారీ చేయదు. అయినప్పటికీ డబ్బుకు ఆశపడిన చంద్రశేఖర్ ఈ ఆఫర్‌కు అంగీకరించాడు. ఆ మేరకు నకిలీవి రూపొందించడమే కాకుండా అవి అసలువే అంటూ అటెస్టేషన్ చేసి ఇచ్చాడు. వీటి ఆధారంగా సైదాబాద్‌కు చెందిన రియల్టర్ ఎం.లింగమయ్యతో కలిసి శివరామకృష్ణ రాయదుర్గంలోని భూమిలో పాగా వేశాడు. దీనిపై ప్రభుత్వం–శివరామకృష్ణ హైకోర్టు వరకు వెళ్లారు. శివరామకృష్ణ వద్ద ఉన్న నకిలీ పత్రాలకు బోగస్ అటెస్టేషన్ పత్రాలు తోడయ్యాయి. వీటి ఆధారంగా హైకోర్టు సదరు భూమి శివరామకృష్ణదే అని తీర్పు ఇచ్చింది. దీన్ని ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.

సుప్రీంకోర్టు తీర్పుతో తెర

యాచారంలో ఉన్న ప్రైవేట్ భూమిపైనా శివరామకృష్ణ నకిలీ పత్రాలు సృష్టించడంతో అది వివాదాల్లో పడింది. 2003 నుంచి సాగిన రాయదుర్గం భూవివాదానికి ఇటీవల సుప్రీంకోర్టు తీర్పుతో తెరపడింది. శివరాకృష్ణ సమర్పించినవి నకిలీ పత్రాలని తేల్చిన న్యాయస్థానం అది ప్రభుత్వ భూమిగా ప్రకటించింది. దీంతో స్టేట్ ఆర్కైవ్స్ డైరెక్టర్ గత ఆగస్టులో చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కీలక ఆధారాలు సేకరించిన పోలీసులు గత వారం శివరామకృష్ణతోపాటు చంద్రశేఖర్, లింగమయ్యలను అరెస్టు చేశారు. ఈ స్కామ్‌లో న్యాయవాదులు సహా మరికొందరికి పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్న అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

బతికుండగానే శ్మశానానికి..

వృద్ధురాలిని వదిలేసిన బంధువులు



శ్మశాన వాటికలో రాజవ్వ

తంగళ్లపల్లి (సిరిసిల్ల): ప్రాణం ఉండగానే ఓ వృద్ధురాలిని బంధువులు శ్మశానవాటికలో వదిలేసి వెళ్లారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగిన ఈ అమానవీయ ఘటన వివరాలివి. గ్రామానికి చెందిన కూకట్ల రాజవ్వ (75) గతంలో గ్రామ పారిశుధ్య కార్మికురాలిగా పనిచేసింది. భర్త కొంతకాలం క్రితం మరణించడం, సంతానం లేకపోవడంతో తన అన్న ఇంట్లో ఉండేది. ఈ క్రమంలో అనారోగ్యంతో మంచం పట్టింది. దీంతో మేనల్లుడు తిరుపతి ఆమెను తీసుకొచ్చి శ్మశానంలో వదిలేసి వెళ్లాడని స్థానికులు పేర్కొంటున్నారు. కాగా, ఈ విషయమై అతన్ని సంప్రదించగా.. రాజవ్వ సోదరి పిల్లలు ఆమెను చూసుకుంటామని తీసుకెళ్లారని, మంగళవారం తీసుకొచ్చి శ్మశానంలో వదిలేసి వెళ్లారని వెల్లడించాడు. స్థానికుల సమాచారంతో శ్మశానవాటికకు చేరుకున్న పోలీసులు.. ఈ ఘటనపై ఆరా తీశారు. రాజవ్వ బంధువులతో మాట్లాడి ఆమె బాగోగులు చూసుకునేలా కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఆమెను బంధువుల ఇంటికి తరలించారు.

డ్రగ్స్ దందాలో టీవీ ఛానల్ అధినేత

▶ మొదటి పేజీ తరువాయి

సమకూర్చుకుంది. ఏదైనా ఓ కేసులో డ్రగ్ సప్లయర్, పెడ్లర్, కన్స్యూమర్లతో పాటు వీరితో సంబంధాలు కలిగి ఉన్న వారి వివరాలను ఆద్యంతం పరిశీలిస్తోంది. ఆయా వివరాలతో ప్రత్యేకంగా డేటాబేస్ సైతం రూపొందిస్తోంది. దాన్ని కేంద్రం అధీనంలోని క్రైమ్ అండ్ క్రిమినల్ నెట్‌వర్క్ అండ్ ట్రాకింగ్ సిస్టంతో (సీసీటీఎన్ఎస్) అనుసంధానించింది.

ఓ కేసు దర్యాప్తులో దొరికిన తీగ

పోలీసు విభాగం కొన్నాళ్ల క్రితం అదుపులోకి తీసుకున్న ఓ డ్రగ్ వినియోగదారుడికి సంబంధించిన కాల్‌డేటాలో సదరు మీడియా సంస్థ అధినేత వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఆ వినియోగదారుడితో ఈయన సంబంధాలు కలిగి ఉన్న నేపథ్యంలో పోలీసులు మరికొంత లోతుగా ఆరా తీశారు. దీంతో ఆయనకు ఈ డ్రగ్ వినియోగదారుడితో పాటు మరో రెండు కేసుల్లో ప్రమేయం ఉన్న 14 మందితో సంబంధాలు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. వీరిలో డ్రగ్స్ వినియోగదారులతో పాటు ఆ కేసుల్లో అనుమానితులు సైతం ఉన్నారు. కొందరితో చాలా కాలంగా సంప్రదింపులు జరుపుతున్నట్లు గుర్తించారని తెలిసింది. ఈ జాబితాలో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాళ్లు సైతం ఉండటం గమనార్హం.

కదలికలపై కన్ను

డ్రగ్స్ దందా చేస్తున్న వారితో సంబంధాలు కలిగి ఉండటంతో పాటు మాదకద్రవ్యాలకు బానిసలుగా మారిన వారిలో ప్రముఖులు కూడా ఉంటున్నారు. ఉన్నత కుటుంబాల్లో ఈ జాఢ్యం ఒకరి నుంచి మరొకరికి విస్తరిస్తోంది. ఈ వర్గాల్లో పెరిగిన డిమాండ్‌తోనే సింథటిక్ డ్రగ్స్ దందా జోరందుకుంటోంది. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకునే పోలీసులు ఇటీవలి కాలంలో ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇప్పుడు ఏకంగా ఓ మీడియా సంస్థ అధినేతకే మాదకద్రవ్యాల వినియోగదారుడు, ఆ కేసుల్లో అనుమానితులతో సంబంధాలు ఉన్నట్టుగా తెలియడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆయనతో పాటు ఆ జాబితాలోని వారిపై నిఘా ఉంచడంతో పాటు వారి కదలికల్ని ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు.

2011 నుంచి సంబంధాలు

మీడియా చానల్ అధినేతకు, మాదకద్రవ్యాల కేసుల్లో అనుమానితులు, వినియోగదారులుగా ఉన్న వారి మధ్య జరిగిన సంప్రదింపులు భారీ స్థాయిలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం 15 మందితో 2,500 కాల్స్ ఉన్నట్లు తెలిసింది. వీటిలో అత్యధికం ఇన్‌కమింగ్ కాల్స్ కాగా ఎస్సెమ్మెస్‌ల్లో మాత్రం ఎక్కువగా ఔట్ గోయింగ్ ఉన్నాయి. వీరిలో కొందరితో ఆయన 2011 నుంచి సంబంధాలు కలిగి ఉండటం గమనార్హం. వారి మధ్య వందల నిమిషాల సేపు సంప్రదింపులు జరిగాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన వారితోనూ కాల్స్, ఎస్సెమ్మెస్‌లు ఉండటంతో పోలీసు విభాగం అప్రమత్తమైంది.



జలదిగ్బంధంలో దుర్గమ్మ

పాపన్నపేట (మెదక్): మెదక్ జిల్లాలోని ఏడుపాయల దుర్గమ్మ ఆలయం మంగళవారం జల దిగ్బంధంలో చిక్కుకుంది. సింగూరు నుంచి సోమవారం రాత్రి 14,088 క్యూసెక్కుల నీటిని వదిలారు. దీంతో మంజీర ఘనపురం ఆనకట్ట పొంగి పొర్లుతోంది. వరద తాకిడి పెరగడంతో ఆలయాన్ని మూసేశారు. భక్తులు మంజీర నది వైపు వెళ్లకుండా, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



పిల్లలతో అనుబంధాలు తెగిపోతున్నాయ్

నెలల తరబడి డ్యూటీలోనేనా అంటూ టీజీ పోలీసు కుటుంబ సభ్యుల ఆందోళన

ఖిలా వరంగల్: ' నెలల తరబడి డ్యూటీలోనేనా.. వారానికి ఒక్కసారి ఇంటికి పంపరా.. పిల్లలతో అనుబంధాలు తెగిపోతున్నాయి' అంటూ టీజీ పోలీసు కుటుంబ సభ్యులు మంగళవారం వరంగల్‌లోని రంగశాయిపేట గవిచర్ల క్రాస్ రోడ్డు జంక్షన్‌లో చంటి పిల్లలతో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. 'కొత్తగా తీసుకొచ్చే లీవ్ మాన్యువల్‌తో నెలకు ఒక్కసారి మాత్రమే ఇంటికి వచ్చే అవకాశం ఉంటుంది. కుటుంబానికి దూరమై మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. 15 రోజులకు ఒకసారి ఇచ్చే నాలుగు రోజుల పర్మిషన్ లీవ్ పాత పద్ధతినే కొనసాగించాలి' అని ఈ సందర్భంగా పల్లవి, నవ్యశ్రీ, అంజలి తదితరులు కోరారు. తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్‌లో రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 1 నుంచి కొత్తగా తీసుకొస్తున్న లీవ్ మాన్యువల్‌పై పోలీసు కుటుంబాలు నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసింది. ఈ నేపథ్యంలో పోలీస్ కుటుంబాలు ఆందోళనకు దిగుతాయని ముందస్తుగా గమనించిన పోలీసులు ఆర్టీఏ జంక్షన్, బెటాలియన్ ప్రధాన గేటు వద్ద భారీగా మోహరించారు. పోలీసుల అంచనాలకు అందకుండా ఇతర ప్రాంతాల్లోని పోలీస్ కుటుంబాలు వివిధ మార్గాల్లో రంగశాయిపేట జంక్షన్‌కు చేరుకొని రోడ్డుపై బైఠాయించాయి. విషయం తెలుసుకున్న ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, టీజీఎస్పీ కమాండెంట్ రాంప్రకాశ్, ఏసీపీలు నందిరాంనాయక్, తిరుపతి, సీఐలు వెంకటరత్నం, రమేష్‌లు మహిళా పోలీసులతో కలిసి అక్కడకు చేరుకున్నారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని చెప్పినా పోలీసు కుటుంబాలు ససేమిరా అనడంతో వారిని వ్యానులో ఎక్కించి బెటాలియన్‌కు తరలించారు. వినతిపత్రం స్వీకరించి సాయంత్రం వదిలేశారు. ఈ కార్యక్రమంలో 200 మంది పోలీసు కుటుంబాలు పాల్గొన్నాయి. బెటాలియన్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బందిని ఉదయాన్నే స్పెషల్ పోలీసులు అదుపులోకి తీసుకొని ఆఫీసులకే పరిమితం చేశారు.

పల్లెల్లోనే 2.02 కోట్ల జనాభా

ఐదు వేలలోపు జనాభా ఉన్న జీపీలు 7,435..

పీఆర్ ఆర్‌డీ ప్రజెంటేషన్‌లో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లోనే 2.02 కోట్లు (57.72%) జనాభా నివసిస్తున్నట్టుగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం మూడున్నర కోట్ల జనాభాలో పట్టణాల్లో 1.48 కోట్లు (42.28%) నివసిస్తున్నారు. అదేవిధంగా... మొత్తం రాష్ట్రంలోని 12,941 మొత్తం గ్రామపంచాయతీల్లో... వెయ్యి నుంచి ఐదువేల లోపు జనాభా ఉన్న గ్రామపంచాయతీలు 7,435 (57.45 %) ఉన్నట్టు, 501 నుంచి వెయ్యిలోపు జనాభా ఉన్న జీపీలు 4,300 (33.23%) ఉన్నట్టుగా తేలింది. సిటిజన్స్ చార్టర్‌కు సంబంధించి అన్ని జీపీల్లో గ్రామసభలు నిర్వహించినట్టు పేర్కొంది. పంచాయతీల్లో 21 ఆన్‌లైన్ సేవలు, 25 ఆఫ్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నట్టుగా తెలిపింది. గ్రామాల్లో ప్రజలకు మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు భవిష్యత్ ప్రణాళికల్లో భాగంగా డిజిటల్ సర్టిఫికెట్లు/ సిటిజన్ సర్వీసెస్ ప్రొసీడింగ్స్‌కు పంచాయతీ కార్యదర్శి ద్వారా ఈ–సైనింగ్, అథంటికేషన్ చేయనున్నట్టు తెలిపింది. మరిన్ని సేవలు ఆన్‌లైన్‌లోకి తీసుకురానున్నట్టు వెల్లడించింది. మంగళవారం రాజేంద్రనగర్ ఎన్ఐఆర్‌డీ–పీఆర్‌లో జీవన సౌలభ్యం: క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలు అనే అంశంపై పంచాయతీ సమ్మేళనంలో భాగంగా పీఆర్ ఆర్‌డీ తరఫున డిప్యూటీ కమిషనర్ వెస్లీ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

తెలంగాణ భౌగోళికంగా.. 1,12,077 చ.కి.మీలలో విస్తరణ		మున్సిపల్ కార్పొరేషన్లు	13
		మున్సిపాలిటీలు	128
		గ్రామపంచాయతీలు	12,941
గ్రామీణ జిల్లాలు	గ్రామీణ మండలాలు	రాష్ట్ర జనాభా	3.50 కోట్లు
32	537	గ్రామీణ జనాభా	2.02 కోట్లు (57.72 %)
సబ్ డివిజన్లు	74	పట్టణ జనాభా	1.48 కోట్లు (42.28)



వసతుల గురించి అడిగితే.. సస్పెండ్ చేస్తామంటున్నారు

సమస్యలపై రోడ్డెక్కిన వనపర్తి జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ విద్యార్థులు

వనపర్తి టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి చదువుకున్న ఊరని గొప్పగా చెప్పే అధికారులు, నాయకులు.. వనపర్తి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో అబ్బాయిలు, అమ్మాయిలకు ఒకేచోట టాయిలెట్లు ఏర్పాటు చేయడం దారుణమని పలువురు విద్యార్థినులు నిరసన వ్యక్తం చేశారు. వనపర్తిలోని ఇంజనీరింగ్ కళాశాలకు సొంత భవనం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. సమస్యలను పరిష్కరించాలని ప్రిన్సిపాల్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, వసతుల గురించి అడిగితే కళాశాల నుంచి సస్పెండ్ చేస్తానని భయపెడుతున్నారని మండిపడ్డారు. కొన్ని గ్రూపులను కళాశాలకు దూరంగా ఉన్న ఒక ప్రభుత్వ భవనంలోకి మార్చారని పేర్కొన్నారు. అక్కడ ఫర్నిచర్ సరిగ్గా లేదని, అబ్బాయిలు, అమ్మాయిలకు ఒకేచోట టాయిలెట్లు ఉన్నాయని, దానికితోడు వాటికి పైకప్పు లేదన్నారు. ఈ సందర్భంగా గోపాల్‌పేట ప్రధాన రహదారిలో 4 గంటలపాటు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. సాయంత్రం ఆర్డీవో పద్మావతి, డీఎస్పీ వెంకటేశ్వర్లు విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



ఎన్ఐసీ చేతికి 'ధరణి'

- మూడేళ్లపాటు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- నాలుగేళ్ల తర్వాత కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ చేతికి భూ రికార్డుల నిర్వహణ
- ఈ నెల 29తో ముగియనున్న టెరాసస్ కంపెనీ గడువు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వ్యవసాయ భూముల రికార్డులను నిర్వహిస్తున్న ధరణి పోర్టల్‌ను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ)కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ధరణి పోర్టల్‌ను నిర్వహిస్తున్న టెరాసస్ కంపెనీ గడువు ఈనెల 29తో ముగియనున్న నేపథ్యంలో రానున్న మూడేళ్లపాటు ఈ బాధ్యతను ఎన్ఐసీకి అప్పగిస్తున్నట్లు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్ ఉత్తర్వులు జారీ చేశారు. టెరాసస్ నుంచి పోర్టల్ నిర్వహణ చేపట్టేందుకు నెల రోజుల సమయం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది నవంబర్ 30 నుంచి మూడేళ్లపాటు ధరణి పోర్టల్‌ను ఎన్ఐసీ అధికారికంగా నిర్వహించనుంది. ధరణి పోర్టల్ అమల్లోకి వచ్చిన తర్వాత 2020 అక్టోబర్ 29 నుంచి ఐఎల్ఎఫ్ఎస్ (ఆ తర్వాత టెరాసస్‌గా మారింది)కు రికార్డుల నిర్వహణ బాధ్యత అప్పగించగా నాలుగేళ్ల తర్వాత కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం పరిధిలో పనిచేసే ఎన్ఐసీకి తెలంగాణలోని భూముల రికార్డుల బాధ్యత అప్పగించడం గమనార్హం. ఈ మార్పుపై ఈ నెల 26న జరిగే కేబినెట్ భేటీలోనూ చర్చించనున్నట్లు రెవెన్యూ వర్గాలంటున్నాయి. దీంతోపాటు కొత్త రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్) చట్టం ముసాయిదాపైనా మంత్రివర్గం చర్చించి ఆమోదం తెలిపే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి రెవెన్యూ సిబ్బంది ఉండేలా మొత్తం 10,954 భూరక్షక్ (పేరు అధికారికంగా నిర్ణయించాల్సి ఉంది) పోస్టులకు కూడా మంత్రివర్గం అనుమతివ్వనుందని రెవెన్యూ వర్గాలు పేర్కొన్నాయి.

స్వదేశీ సంస్థ చేతుల్లోకి 'ధరణి': పొంగులేటి

ఇప్పటివరకు విదేశీ కంపెనీ అయిన టెరాసస్ చేతిలో ఉన్న ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతను స్వదేశీ సంస్థ అయిన ఎన్ఐసీకి అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు తొందరపాటు నిర్ణయాలతో తీసుకొచ్చిన ధరణి పోర్టల్ కారణంగా తెలంగాణ రైతాంగం ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొందని... తెలంగాణలోని 1.56 కోట్ల ఎకరాల భూమిని విదేశీ కంపెనీకి తాకట్టు పెట్టారని పొంగులేటి ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాము తెలంగాణ రైతాంగానికి ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పుడు భూరికార్డుల నిర్వహణ బాధ్యతను కేంద్ర ప్రభుత్వరంగ సంస్థకు అప్పగించామని పేర్కొన్నారు. తద్వారా రాష్ట్రంలోని 71 లక్షల మంది రైతుల ఖాతాల్లోని భూములకు రక్షణ ఏర్పడిందన్నారు. త్వరలోనే ధరణి సమస్యల నుంచి తెలంగాణ రైతాంగానికి విముక్తి కల్పిస్తామన్నారు.





హాన్, మూసీ మధ్య పోలికలెన్నో!

- నగరం మధ్య నుంచే ప్రవహిస్తున్న నదులు
- గతంలో హాన్‌లో మురుగు కలవడంతో దుర్గంధం.. మూసీలో కలుస్తున్న వ్యర్థాలు
- హాన్ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుతో పూర్వ వైభవం సాధించిన ఆ నది
- ఆ ప్రాజెక్టు స్ఫూర్తితోనే మూసీ పునరుజ్జీవానికి ప్రణాళికలు రచిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

(సియోల్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

మూసీ-హాన్ నదుల మధ్య భౌగోళిక సారూప్యతలు ఇవీ..

హాన్
- దక్షిణ కొరియా ఉత్తర భాగంలోని తైబెక్ సన్‌మేక్ పర్వతాల్లో పుట్టిన హాన్ నది.. గాంగ్వాన్, జియోంగ్గీ, ఉత్తర చుంగ్‌చియాంగ్ ప్రావిన్సుల ద్వారా సియోల్ నగరంలోకి ప్రవేశిస్తుంది. ఈ నగరంలో సుమారు 40 కి.మీ. మేర ప్రవహిస్తూ పశ్చిమాన ఉన్న 'ఎల్లో సీ'లో కలుస్తుంది.
- దీని మొత్తం పొడవు 514 కి.మీ.కాగా సియోల్ నగరంలో 40 కి.మీ. మేర ప్రవహిస్తుంది.

మూసీ
- వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లో పుట్టిన మూసీ.. హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ గుండా హైదరాబాద్‌లోకి ప్రవేశిస్తుంది. పాత, కొత్త నగరాలను రెండుగా విభజిస్తూ పురానా నాపూల్, డబీర్‌పురా, అంబర్‌పేట, చాదర్ ఘాట్, ఉప్పల్ మీదుగా నగరం నడిబొడ్డు నుంచి మిర్యాల గూడ సమీపంలోని వాడపల్లి వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది.
- మూసీ నది మొత్తం పొడవు 240 కి.మీ. కాగా హైదరాబాద్‌లో 57.5 కి.మీ. మేర ప్రవహిస్తుంది.

అధిక పట్టణీకరణ, కాలుష్యం కారణంగా ఏదైనా నది ప్రాభవం కోల్పోతే దాని పునరుజ్జీవం ఆ ప్రాంత ఆర్థికాభివృద్ధిలో భాగమే. దక్షిణ కొరియా వేగవంతమైన ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతున్న హాన్ నదే అందుకు ఉదాహరణ. వరదల నియంత్రణతోపాటు పర్యావరణ సమతౌల్యతను కాపాడుతూ వినోద, పర్యాటక కేంద్రంగా పట్టణ నదులను ఎలా అభివృద్ధి చేయవచ్చో హాన్ నది నిరూపిస్తోంది. మూసీ నదిని పునరుద్ధరించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం.. అందులో భాగంగా దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లోని హాన్ నదిని అధ్యయనం కోసం ఎంపిక చేసుకుంది. రెండు నదుల మధ్య చాలా పోలికలు ఉండటమే అందుకు కారణం.

విజయవంతమైన హాన్ రివర్ ఫ్రంట్ అభివృద్ధి..

సియోల్‌లో స్థిరమైన పట్టణాభివృద్ధికి విజయవంతమైన నమూనాగా హాన్ రివర్ ఫ్రంట్ నిలుస్తోంది. సియోల్ నగర సామాజిక, సాంస్కృతిక రంగాలను హాన్ నది ప్రతిబింబిస్తోంది. ఈ ప్రాజెక్టులో భాగంగా నీటి నాణ్యతను మెరుగుపరచడంతోపాటు నది ఒడ్డునున్న పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించారు. ఫలితంగా సియోల్‌లో ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. గాలి నాణ్యత మెరుగుపడింది. జీవ వైవిధ్యం పునరుద్ధరణ సైతం జరిగింది. హాన్ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు విజయం అంత సులువుగా జరగలేదు. స్థిరమైన పట్టణ ప్రణాళిక, నది నిర్వహణ కోసం భారీ ఎత్తున అక్కడి ప్రభుత్వం పెట్టుబడులు పెట్టింది. పాలకుల చిత్తశుద్ధి, సుస్థిరతతో నది సుందరీకరణతోపాటు ప్రజా వినోద కేంద్రంగా హాన్ గణనీయమైన అభివృద్ధిని సాధించింది. హాన్ నదిని సియోల్ నగరంలో వరద నీటి నియంత్రణ, నీటి నిర్వహణ కోసం కూడా వినియోగిస్తున్నారు.

మూసీ పునరుజ్జీవం అనివార్యమే..

సహజ వనరుల సంరక్షణతోపాటు హైదరాబాద్‌లో పట్టణ పునరుద్ధరణ, పర్యావరణ పునరావాసానికి మూసీ పునరుజ్జీవం అనివార్యమే. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల దాహార్తిని తీర్చిన మూసీ.. కాలక్రమేణా మురికి కూపంగా మారిపోయింది. గృహ, పారిశ్రామిక వ్యర్థాలు కలవడంతోపాటు ఆక్రమణలకు సైతం గురైంది. ఫలితంగా మూసీ చుట్టూ ఉన్న సాంస్కృతిక, వారసత్వ సంపద నాటి ప్రాభవాన్ని, ప్రాముఖ్యతను కోల్పోయింది. మూసీ పునరుద్ధరణ, పునరుజ్జీవం కోసం గతంలో ప్రతిపాదనలు సిద్ధమైనా కార్యరూపం మాత్రం దాల్చలేదు.

తేలియాడే రెస్టారెంట్లు.. రూఫ్‌టాప్ గార్డెన్లు

జీవ వైవిధ్యంతోపాటు వ్యాపార కేంద్రంగా సియోల్‌లోని హాన్ నది

(సియోల్ నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

ఒకప్పుడు మురికికూపంగా ఉన్న హాన్ నదిని మూడు దశల్లో అభివృద్ధి చేయాలని 2008లో నిర్ణయించిన దక్షిణ కొరియా ప్రభుత్వం తొలిదశలో నీటిశుద్ధితోపాటు పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దింది. స్థానికులతోపాటు విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు నదిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసింది. నదికి ఇరువైపులా తేలియాడే రెస్టారెంట్లు, రూఫ్‌టాప్ గార్డెన్లు, కేఫటేరియాలు, 40కిపైగా షాపింగ్ కాంప్లెక్సులు, యాంఫీ థియేటర్లను నిర్మించింది. పిల్లలంతా ఆహ్లాదంగా గడిపేందుకు వీలుగా 15 పార్కులను అభివృద్ధి చేసింది. 78 కి.మీ. మేర సైకిల్ ట్రాక్‌లు, బైక్ పాత్‌లను ఏర్పాటు చేసింది. నదిలో జీవవైవిధ్యం దెబ్బతినకుండానే ఈ చర్యలన్నీ చేపట్టింది. దీంతో స్థానిక ప్రజలతోపాటు విదేశీ పర్యాటకులను ఆకర్షించే హాట్‌స్పాట్‌గా హాన్ నది మారింది. నదిలో బోటింగ్, నదీ తీరం వెంబడి సైక్లింగ్, వాకింగ్ ట్రాక్స్, పార్కులతో నిత్యం సందర్శకులతో ఆ ప్రాంతమంతా కిటకిటలాడుతోంది. ప్రస్తుతం ఏటా సగటున 6.69 కోట్ల మంది పర్యాటకులు హాన్ నదిని సందర్శిస్తున్నారు.

తాగునీటి అవసరాలు సైతం తీరుస్తూ..

దక్షిణ కొరియాలోని సియోల్ నగరవాసుల తాగునీటి అవసరాలను హాన్ నదే తీరుస్తోంది. హైదరాబాద్ జంటనగరవాసుల దాహార్తిని గతంలో ఎలాగైతే మూసీ తీర్చిందో.. అచ్చం అలాగే హాన్ నది సియోల్ ప్రజలకు జీవనదిగా మారింది. స్వచ్ఛమైన మంచినీటిని సియోల్‌వాసులకు అందించేందుకు హాన్ నది పరీవాహక ప్రాంత పరిధిలో నాలుగు చోట్ల నీటి ఫిల్టరేషన్ కేంద్రాలను అక్కడి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నదిలోని నీటి నాణ్యత మెరుగ్గా ఉందని ఐరాస సైతం గుర్తించింది.

రెండో దశ డీపీఆర్ రెడీ



రెండో దశలో హాన్ నది అభివృద్ధికి సుమారు రూ. 6 వేల కోట్లు ఖర్చు చేయనున్నాం. పీపీపీ విధానంలో ఈ నిధులను సమీకరించనున్నాం. ఇప్పటికే ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధమైంది.

– పార్క్ జి. యంగ్
ఫ్యూచర్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్
(జనరల్ అఫైర్స్)



'హాన్'ను ఎలా పునరుద్ధరించారు?

- నదికి తిరిగి జీవం పోసిన విధానాన్ని అడిగి తెలుసుకున్న పొంగులేటి బృందం
- సియోనామ్ వాటర్ రిసోర్స్ రికవరీ ప్లాంట్ సందర్శన
- యంగ్‌వన్ కార్పొరేషన్ చైర్మన్, సీఈవో కీ హాక్ సంగ్‌తో భేటీ
- సియోల్‌లో రెండోరోజు పర్యటన

సాక్షి, హైదరాబాద్: మూసీ పునరుద్ధరణపై అధ్యయనానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో దక్షిణ కొరియాలోని సియోల్ వెళ్లిన అధికారుల బృందం రెండో రోజైన మంగళవారం అక్కడ విస్తృతంగా పర్యటించింది. తొలుత హాన్ నదిని సందర్శించి నది పునరుద్ధరణ పనులను పరిశీలించింది. ఒకప్పుడు మురికి కాలువలా ఉన్న నదికి జీవం పోసిన విధానాన్ని మంత్రులు పొంగులేటి, పొన్నం అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సియోల్‌లో నీటి సరఫరా, పర్యావరణ, ఆర్థిక వ్యవస్థకు ఈ నది ఎలా కీలకంగా మారిందో అక్కడి అధికారులు వారికి వివరించారు. అనంతరం మంత్రుల బృందం దక్షిణ కొరియాకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత వస్త్ర తయారీ సంస్థ యంగ్‌వన్ కార్పొరేషన్ చైర్మన్, సీఈవో 'కీ హాక్ సంగ్'తో సమావేశమైంది. వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో వస్త్ర తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఇటీవల ముందుకొచ్చిన ఆయన.. త్వరలోనే ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభిస్తామని మంత్రులకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఏర్పాటైన ఫ్యాషన్ టెక్నాలజీ యూనివర్సిటీ, స్కిల్స్ యూనివర్సిటీ గురించి పొంగులేటి, పొన్నం ఆయనకు వివరించారు. ఆ తర్వాత సియోల్‌లోని సియోనామ్ వాటర్ రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను అధికారుల బృందం సందర్శించింది. నీటి శుద్ధీకరణ ఎలా జరుగుతోందో పరిశీలించింది. సియోల్‌లోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన వ్యర్థ జలాలను ఈ కేంద్రాలు శుభ్రపరుస్తాయి. రోజుకు 16.3 లక్షల లీటర్ల మురుగునీటితోపాటు 4 వేల కిలోలీటర్ల వ్యర్థాలను శుద్ధి చేస్తాయి. ఈ సామ ర్థ్యం ప్రపంచంలోనే 9వ అతిపెద్ద ప్లాంటుగా గుర్తింపు పొందింది. ఇదే కేంద్రంలో హాన్ నది నీటి స్వచ్ఛతను కూడా ఎప్పటికప్పుడు పరిశీలిస్తారు.



హాన్ నదిని పరిశీలిస్తున్న పొంగులేటి, పొన్నం, వేం నరేందర్‌రెడ్డి

ప్రతిపక్షాలు సహకరించాలి

మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు అమలయ్యేందుకు ప్రతిపక్ష పార్టీలు సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సియోల్ పర్యటనలో ఉన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధిలో మూసీని భాగం చేయాలని తమ ప్రభు త్వం భావిస్తోందన్నారు. నిర్వాసితులకు ఎలాంటి కష్టం రానివ్వబోమని.. పునరావాసంతోపాటు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పొన్నం హామీ ఇచ్చారు. కాగా, సీఎం రేవంత్‌రెడ్డి తలపెట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుతో హైదరాబాద్ మరో సియోల్ నగరంగా రూపాంతరం చెందుతుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

త్వరలోనే 'కాళేశ్వరం'పై విజిలెన్స్ తుది నివేదిక

- జస్టిస్ పీసీఘోష్ కమిషన్‌కు విజిలెన్స్ డీజీ హామీ
- నేటి నుంచి కాగ్ అధికారులతోపాటు మరికొందరికి క్రాస్ ఎగ్జామినేషన్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై నిర్వహిస్తున్న విచారణ కొలిక్కి వచ్చిందని, త్వరలోనే నివేదిక అందజేస్తామని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీజీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన జస్టిస్ ఘోష్‌ను కలిసి సమావేశమయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన శాశ్వత చర్యలను సూచిస్తూ త్వరలో తుదినివేదిక ఇస్తామని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) సైతం కమిషన్‌కు సమాచారం ఇచ్చింది. సోమవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్న జస్టిస్ పీసీ ఘోష్ బుధవారం నుంచి క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియను పునరుద్ధరించనున్నారు.

నిర్మాణ సంస్థల ప్రతినిధులు, సబ్ కాంట్రాక్టర్లను కూడా!

రామగుండం మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, గజ్వేల్ ఈఎన్సీ బి.హరిరామ్‌తో పాటు ఇతర ఇంజనీర్లు, అధికారులకు కమిషన్ మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించనున్నట్లు తెలిసింది. నీటిపారుదల శాఖ కార్యదర్శులుగా పనిచేసిన రిటైర్డ్, ప్రస్తుత ఐఏఎస్ అధికారులకు సైతం కమిషన్ ఈ దఫాలోనే క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించనుంది. నిర్మాణ సంస్థల ప్రతినిధులు, సబ్‌కాంట్రాక్టులు పొందిన వారిని సైతం కమిషన్ పిలిచే అవకాశం ఉంది. బిల్లుల చెల్లింపులు ఎవరికి జరిగాయి? ఆ చెల్లింపులను మళ్లీ ఎవరికి బదిలీ చేశారు? అనే అంశంపై కమిషన్ ఆరా తీస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన ఆర్థిక అవకతవకలపై ఆడిట్ నివేదిక తయారు చేసిన కాగ్ అధికారులను సైతం కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నెల 28వరకు కమిషన్ ఈ ప్రక్రియను నిర్వహించనుంది. తదుపరి దఫాలో గత ప్రభుత్వంలోని కీలక ప్రజాప్రతినిధులకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించే అవకాశాలున్నాయి.

కేసులు నీరుగార్చే కుట్ర

- ఏడు కేసుల్లో సీఎం చంద్రబాబు, ఇతర కేసుల్లో నలుగురు మంత్రులు నిందితులు
- వారి పేర్లు తొలగించే కుట్ర
- డీజీపీకి లేఖ రాసిన మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు

సాక్షి, అమరావతి: 'ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉన్న అవినీతి కేసులను నీరుగార్చేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. 2014–19 మధ్య టీడీపీ హయాంలో యథేచ్ఛగా సాగించిన కుంభకోణాలపై నమోదైన ఏడు కేసుల నుంచి ఆయన పేరు తొలగించేందుకు ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు..' అని మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్, సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమలరావు దృష్టికి తెచ్చారు. 'ప్రభుత్వ ఒత్తిడితో ప్రస్తుత పోలీస్, సీఐడీ ఉన్నతాధికారులు ఆ కేసుల విచారణలో న్యాయస్థానానికి సహాయ నిరాకరణ చేస్తున్నారు. చార్జిషీట్లను న్యాయస్థానానికి పునఃసమర్పించకుండా ఉద్దేశపూర్వకంగా తొక్కిపెడుతున్నారు. తద్వారా కేసుల దర్యాప్తు సాగకుండా అడ్డుకుంటున్నారు' అని స్పష్టం చేశారు. 'చంద్రబాబుపై అవినీతి కేసులకు సంబంధించి దర్యాప్తు అధికారులను వేధిస్తున్నారు. అప్పటి సీఐడీ అదనపు డీజీ సంజయ్, సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇన్‌చార్జ్ కె.రఘురామ్‌రెడ్డిని హఠాత్తుగా బదిలీ చేసి ఎక్కడా పోస్టింగులు ఇవ్వకుండా జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు' అని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు, పలు వురు మంత్రులు నిందితులుగా ఉన్న ఈ కేసుల విచార ణను సీబీఐకి అప్పగించాలని అభ్యర్థిస్తూ ఓ సామాజిక కార్యకర్త హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయాన్ని కూడా పొన్నవోలు తన లేఖలో ప్రస్తావించారు. ఈమేరకు ఈ నెల 17న డీజీపీకి ఆయన రాసిన లేఖ 'సాక్షి'కి లభ్యమైంది. కేసుల దర్యాప్తులో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ న్యాయస్థానానికి పూర్తిగా సహకరించాలని... దర్యాప్తు అధికారులకు రక్షణగా నిలవాలని అందులో డీజీపీని కోరారు. పూర్తి ఆధారాలతో, న్యాయపరమైన అంశాలను ఉటంకిస్తూ డీజీపీకి రాసిన లేఖలో ప్రధానాంశాలివీ..

చంద్రబాబు పేరు తొలగించే కుట్ర..: రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కేసు సహా దర్యాప్తులో ఉన్న ఏడు కేసుల్లో నిందితుల జాబితా నుంచి ప్రధాన నిందితుడు చంద్రబాబు పేరు తొలగించాలని టీడీపీ కూటమి ప్రభుత్వం కుట్రపన్నింది. అందుకోసం సీఐడీ, పోలీసు ఉన్నతాధికారులను తీవ్రంగా ఒత్తిడి చేస్తోంది. ఆ కేసుల తుది దర్యాప్తు నివేదికను న్యాయస్థానానికి సమర్పించే ముందు నిందితుల జాబితా నుంచి చంద్రబాబు పేరు తొలగించాల్సిందేనని దర్యాప్తు అధికారులను ఒత్తిడి చేస్తూ బెదిరిస్తోంది. దర్యాప్తు నివేదికలను తారుమారు చేయాల్సిందేనని అధికారులను వేధిస్తున్నారు. తద్వారా ప్రధాన నిందితుడైన చంద్రబాబును ఈ కేసుల నుంచి సులువుగా బయటపడేయ వచ్చన్నది అసలు ఉద్దేశం. సాక్షులుగా న్యాయస్థానం ఎదుట 164 సీఆర్‌పీసీ కింద వాంగ్మూలం ఇచ్చిన అధికారులపై ఈ కేసులను నెట్టేయాలని కుట్ర పన్నింది. చంద్రబాబు, మరో నలుగురు మంత్రులు ఏడు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. అందుకే అవినీతి నిరోధక చట్టం కింద దర్యాప్తునకు గవర్నర్ అనుమతి కోరడం లేదు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

బెయిల్ నిబంధనలను ఉల్లంఘించిన చంద్రబాబు

స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబుకు మధ్యంతర బెయిల్ మంజూరు సందర్భంగా సుప్రీంకోర్టు స్పష్టమైన షరతులు విధించింది. ఈ కేసుకు సంబంధించిన అంశాలను మీడియా ఎదుటగానీ మరెక్కడాగానీ మాట్లాడకూడదని స్పష్టం చేసింది. అనంతరం పూర్తిస్థాయి బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు కూడా షరతులు విధించింది. అయితే చంద్రబాబు తాను న్యాయస్థానాలకు అతీతమన్నట్టు వ్యవహరిస్తూ కేసు దర్యాప్తును ప్రభావితం చేసే రీతిలో వ్యవహరిస్తుండటం విస్మయపరుస్తోంది. తాజాగా 'ఆహా'లో నందమూరి బాలకృష్ణ నిర్వహిస్తున్న 'అన్‌స్టాపబుల్' షోలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ప్రోమోను మంగళవారం విడుదల చేశారు. అందులో స్కిల్ స్కామ్ కేసు గురించి చంద్రబాబు పలు అంశాలను ప్రస్తావించడం గమనార్హం. తనను అకారణంగా అరెస్ట్ చేశారని.. తాను ఏ తప్పూ చేయలేదని వ్యాఖ్యలు చేశారు. కేసు ఇంకా విచా రణలో ఉండగానే తనకు తానే తీర్పు ఇచ్చేశారు! తద్వారా స్కిల్ స్కామ్ కేసు గురించి మాట్లాడ వద్దన్న న్యాయస్థానం ఆదేశాలను ధిక్కరించారు. అంతేకాదు.. తాను ఎవరినీ విడిచిపెట్టబోనంటూ దర్యాప్తు అధికారులను బెదిరించే రీతిలో చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

విద్యుత్ ఉద్యోగుల విరాళం రూ.18.69 కోట్లు



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి సహాయ నిధికి విద్యుత్ ఉద్యోగులు తమ ఒకరోజు మూలవేతనం రూ.18.69 కోట్లను విరాళంగా అందజేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను సచివాలయంలో కలిసి ఈ మేరకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఇంధన శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ పాల్గొన్నారు.


'ఉమ్మడి అనంత'లో కుంభవృష్టి


పండమేరు వరదతో ముంపునకు గురైన అనంతపురం నగర శివారు కాలనీ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో సోమవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 9 గంటలకు మొదలైన వాన జోరు మంగళవారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. ఉరుములు, మెరుపులు, బలమైన గాలులతో పలు మండలాల్లో కుంభవృష్టి కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పండమేరు పోటెత్తడంతో అనంతపురంలోని కాలనీలు జలమయమయ్యాయి. వరదపై ముందస్తు సమాచారం లేక కట్టుబట్టలతో మిగిలామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

'విద్యుత్' కమిషన్ ముందు అక్రమ డైరెక్టర్ల వాదనలు ఏమిటి?

- నిబంధనలకు విరుద్ధంగా నియమితులైనట్టు జనవరిలో ప్రభుత్వమే జీవో ఇచ్చింది
- వారింకా కొనసాగుతూ ఈఆర్సీ ముందు హాజరై ఎలా వాదనలు వినిపిస్తారు?
- అడ్డగోలు విద్యుత్ ఒప్పందాలతో వచ్చే ఐదేళ్లలో భారీగా మిగులు విద్యుత్
- ట్రాన్స్‌కో ఏఆర్ఆర్ పిటిషన్లపై బహిరంగ విచారణలో పలువురి వాదనలు


బహిరంగ విచారణలో ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావు

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ విద్యుత్ సరఫరా సంస్థ (ట్రాన్స్‌కో) జేఎండీ, మరో నలుగురు డైరెక్టర్లను నిబంధనలకు విరుద్ధంగా నియమించారని గత జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం స్వయంగా ఓ జీవో జారీ చేసింది. అయినప్పటికీ ఇంకా పదవుల్లో కొనసాగుతున్న అక్రమ డైరెక్టర్లు చట్టబద్ధ సంస్థ అయిన రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి(ఈఆర్సీ) ముందు హాజరై వాదనలు వినిపించవచ్చా? అని విద్యుత్ రంగ నిపుణులు, సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ ఎం.వేణుగోపాల్‌రావు ప్రశ్నించారు. 2024–29 మధ్యకాలానికి సంబంధించి ట్రాన్స్‌కో దాఖలు చేసిన వార్షిక ఆదాయ అవసరాలు (ఏఆర్ఆర్), టారిఫ్ ప్రతిపాదనలపై మంగళవారం విద్యుత్ నియంత్రణ భవన్‌లో ఈఆర్సీ నిర్వహించిన బహిరంగ విచారణలో ఆయన మాట్లాడారు. కీలకమైన ఈ కార్యక్రమానికి ట్రాన్స్‌కో సీఎండీ ఎలా గైర్హాజరవుతారని అడిగారు. తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కోలోని డైరెక్టర్ల నియామకాలు అక్రమమని ప్రకటిస్తూ గత జనవరి 27న రాష్ట్ర ఇంధన శాఖ జారీ చేసిన జీవో నం.3ను ఆయన కమిషన్ దృష్టికి తీసుకెళ్లి ఈ విషయంలో ప్రభుత్వానికి తగిన సూచనలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజలపై మిగులు విద్యుత్ భారం వేయరాదు..

రాష్ట్ర విద్యుత్ అవసరాలపై అవాస్తవిక అంచనాలతో అడ్డగోలుగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకోవడంతో భారీగా విద్యుత్ మిగిలిపోతోందని వేణుగోపాల్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత సంవత్సరం 2024–25లో ఏకంగా 21,866 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ మిగిలిపోతోందని స్వయంగా డిస్కంలు నివేదించాయన్నారు. 2024–25లో 24 వేల ఎంయూలు ఉండనున్న మిగులు విద్యుత్ 2028–29 నాటికి 43 వేల ఎంయూలకు పెరగనుందని తెలిపారు. వాడుకోకపోయినా మిగులు విద్యుత్‌కు చెల్లించాల్సిన రూ.వేల కోట్ల ఫిక్స్‌డ్ చార్జీల భారం రాష్ట్ర ప్రజలపై పడనుందన్నారు. ట్రాన్స్‌కో వివిధ రకాల వ్యయాలు, చార్జీలను అసాధారణంగా, అవాంఛనీయంగా పెంచి ప్రతిపాదించిందని, వినియోగదారుల ప్రయోజనాల దృష్ట్యా వాటిని అనుమతించరాదని కోరారు. సరైన ప్రామాణికత లేకుండా వచ్చే ఐదేళ్లలో ట్రాన్స్‌మిషన్ చార్జీలను రెట్టింపు చేసుకోవడానికి ట్రాన్స్‌కో కోరిన అనుమతిని తిరస్కరించాలని స్పిన్నింగ్ మిల్స్ కంపెనీల ప్రతినిధి శివకుమార్ కోరారు. 2019–24 మధ్యకాలంలో ఆర్జించిన రూ.582.68 కోట్ల మిగులు ఆదాయాన్ని 2024–29 మధ్యకాలంలోని వ్యయాల్లో సర్దుబాటు చేస్తామని ట్రాన్స్‌కో ఈఆర్సీకి ప్రతిపాదించింది.

ముఖాముఖికి నేడు మంత్రి శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా నేడు గాంధీభవన్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రజలను కలవనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆయన గాంధీభవన్‌లో ఉంటారని, తమ సమస్యల గురించి ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వచ్చి దరఖాస్తులు ఇవ్వవచ్చని గాంధీభవన్ వర్గాలు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించాయి.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానాల తనిఖీ

బాంబు బెదిరింపులతో సిబ్బంది ఉరుకులు పరుగులు



శంషాబాద్: విమానాలకు బాంబు బెదిరింపుల కాల్స్ ఆగడం లేదు. మంగళవారం దేశవ్యాప్తంగా మూడు ఎయిర్‌లైన్స్ సంస్థలకు చెందిన మొత్తం 47 విమానాలకు బాంబు బెదిరింపు కాల్స్‌తో పాటు మెయిల్స్, ట్విట్టర్ సందేశాలు రావడంతో ఆయా ఎయిర్‌పోర్టుల్లో భద్రతాధికారులు ఉరుకులు పరుగులు పెట్టారు. ఇందులో భాగంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మొత్తం నాలుగు విమానాల్లో తనిఖీలు చేపట్టారు. ఉదయం హైదరాబాద్ నుంచి జెడ్డా, బెంగళూరు, మధ్యాహ్నం జోధ్‌పూర్ బయలుదేరిన ఇండిగో విమానాల్లో బాంబులున్నట్లు మెయిల్స్‌తో పాటు ట్విట్టర్ సందేశాలు రావడంతో ఎయిర్‌పోర్టు భద్రతాధికారులు, సైబరాబాద్ పోలీసులు ఉరుకులు పరుగులు పెట్టారు. బెదిరింపు సందేశాలు వచ్చిన విమానాలను క్షుణ్ణంగా తనిఖీలు చేసి ఉత్తుత్తి కాల్స్, సందేశాలుగా గుర్తించిన తర్వాత సంబంధిత విమానాలు రెండు నుంచి మూడు గంటలు ఆలస్యంగా టేకాఫ్ తీసుకున్నాయి.

వారణాసి విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

సాయంత్రం బెంగళూరు నుంచి వారణాసికి బయలుదేరిన ఆకాశ ఎయిర్‌లైన్స్‌కు చెందిన క్యూపీ–1612 విమానంలో కూడా బాంబు ఉన్నట్లు బెదిరింపు కాల్ రావడంతో ఎయిర్‌లైన్స్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. శంషాబాద్ విమానాశ్రయ ఏటీసీ అనుమతితో సాయంత్రం 5.10 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎమర్జెన్సీ ల్యాండ్ చేశారు. విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎలాంటి బాంబులు లేవని నిర్ధారించుకుని ఫేక్ కాల్‌గా నిర్ధారించారు. అనంతరం విమానం వారణాసికి బయలుదేరింది.

ప్రైవేటు ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు?

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ ప్రతిపాదన

సాక్షి, హైదరాబాద్: కొత్తగా ఏర్పాటయ్యే ప్రైవేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచేందుకు వైద్య, ఆరోగ్యశాఖ యోచిస్తోంది. ప్రస్తుతం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్(సీఈఏ) ప్రకారం కొత్త ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ చార్జీలు చాలా నామమాత్రంగా ఉన్నాయి. వేయి కోట్ల రూపాయలతో నిర్మించే ఆస్పత్రికి కూడా కేవలం రూ.16 వేలే రిజిస్ట్రేషన్ చార్జీలున్నాయి. సీఈఏలో నిర్దేశించిన మేరకు 200 పడకలు, ఆ పైచిలుకు కొత్త ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ ఆస్పత్రికి కూడా అత్యధికంగా రూ.16 వేలే ఉంది. ఈ నేపథ్యంలో బడా కార్పొరేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్ చార్జీలు పెద్ద ఎత్తున పెంచాలనే ఉద్దేశంతో వైద్య, ఆరోగ్యశాఖ ఉంది. అందుకు సంబంధించి ఉన్నతాధికారులతో కసరత్తు చేస్తోంది. ఏటా కోట్లాది రూపాయల టర్నోవర్ చేస్తూ సర్కారుకు తక్కువ ఫీజు కడుతున్నారని, పైగా ఒక్కసారి చెల్లిస్తే ఐదేళ్లవరకు మళ్లీ ఎటువంటి ఫీజులుండటం లేదని, ఇటువంటి నామమాత్రపు చార్జీలను దృష్టిలో పెట్టుకొని వాటిని సవరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్య,ఆరోగ్యశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో వాటి చార్జీలను చట్ట ప్రకారం సవరించాలనే యోచన చేస్తోంది. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను ప్రభుత్వం ఆదేశించినట్టు సమాచారం.

దీపావళికి 804 ప్రత్యేక రైళ్లు

దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్



సాక్షి, హైదరాబాద్: దీపావళి, ఛఠ్ పండుగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని వివిధ మార్గాల్లో 804 ప్రత్యేక రైళ్ల నడిపేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. ఇది గతేడాది కంటే 28 శాతం అదనమని చెప్పారు. దసరా సీజన్‌లో ప్రయాణికుల రద్దీకనుగుణంగా అక్టోబర్‌లో 624 ప్రత్యేక రైళ్లను నడిపినట్లు పేర్కొన్నారు. దీపావళి, ఛఠ్ పండుగల దృష్ట్యా పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, జార్ఖండ్, బిహార్, ఉత్తరప్రదేశ్, హరియాణా, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని ప్రధాన స్టేషన్‌లైన సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌ల నుంచి షాలిమార్, రక్సాల్, జైపూర్, లాల్‌ఘర్, హిసార్, గోరఖ్‌పూర్, షిరిడీ, దానాపూర్, నిజాముద్దీన్, కటక్, అగర్తల, సంత్రాగచ్చి తదితర ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయన్నారు. మదురై, ఈరోడ్, నాగర్‌కోయిల్, కొల్లాం, బెంగళూరు, పన్వేల్, దాదర్ తదితర ప్రాంతాలకు కూడా ప్రయాణికుల డిమాండ్ మేరకు రైళ్లను నడపనున్నట్లు పేర్కొన్నారు. నవంబర్ 30 వరకు సుమారు 6,556 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు భారతీయరైల్వే ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రయాణికుల అవసరాల మేరకు ఈ ప్రత్యేక రైళ్లలో రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్ బోగీలు ఉంటాయని చెప్పారు. సాధారణ బోగీల్లో ప్రయాణం చేసేవారు కౌంటర్‌ల వద్ద నిరీక్షించవలసిన అవసరం లేకుండా యూటీఎస్ మొబైల్ యాప్ ద్వారా టికెట్‌లను కొనుగోలు చేయవచ్చు.



రవాణాశాఖలో ఫ్యాన్సీ నంబర్ల

కుంభకోణం

56 మంది డేటా బేస్ అడ్మినిస్ట్రేటర్ల తొలగింపు

- ఓ అధికారి కనుసన్నల్లో జరిగిన అవినీతి బాగోతం
- త్వరలో మరికొందరిపై వేటు

సాక్షి, హైదరాబాద్: రవాణాశాఖలో కొందరు అధికారులు, ఓ ప్రైవేటు ఏజెన్సీ సిబ్బంది కలిసి ఫ్యాన్సీ నంబర్ల కుంభకోణానికి పాల్పడ్డారు. ఫ్యాన్సీ నంబర్లకు వాహనదారులు కోట్ చేసిన ధరను రహస్యంగా ఉంచాల్సింది పోయి, ఆ మొత్తాన్ని అనుకూల వాహనదారుల చెవిన పడేసి ఆ నంబర్ వారికే దక్కేలా పావులు కదిపారు. ఇలా ఒక్కో నంబర్ కేటాయింపు ద్వారా భారీగా కమీషన్లు దండుకున్నారు. ఇదంతా ఓ అధికారి కనుసన్నల్లో జరిగిందని తేల్చుకున్న ప్రభుత్వం ఆయనపై చర్యలకు సిద్ధమవుతోంది. కొన్నేళ్లుగా రవాణాశాఖలో జరుగుతున్న అవినీతి బాగోతం గుట్టు విప్పే పని ఇప్పుడు వేగంగా సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో కొందరు అధికారులు భారీగా అక్రమాలను సాగించారని గుర్తించిన ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని బహిర్గతం చేయాలని నిర్ణయించింది. గతంలో రవాణాశాఖలో అన్నీ తానై చక్రం తిప్పిన ఓ అధికారిపై భారీగా ఫిర్యాదులున్నాయి. కమిషనర్‌ను కూడా లెక్క చేయకుండా ఆ అధికారే అన్ని చక్కబెట్టేవారన్న ఆరోపణలున్నాయి. సిబ్బందికి పదోన్నతులు, బదిలీలు కూడా ఆయన కనుసన్నల్లోనే జరిగేవి. ఇదే తరహాలో ఫ్యాన్సీ నంబర్ల కేటాయింపు వ్యవహారం కూడా చోటుచేసుకుంది. ఆ అధికారికి చెందిన ఓ బినామీ సంస్థ కూడా ఈ శాఖలో కీలకంగా వ్యవహరించిందని సమాచారం.

రూ.కోట్లలో కమీషన్లు

రవాణా శాఖ కార్యాలయాలకు సాంకేతిక సహకారాన్ని అందించే బాధ్యతను ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ఈ క్రమంలో ఆ సంస్థ సిబ్బందిని ఓ అధికారి తన అక్రమాలకు వినియోగించుకున్నారన్న ఫిర్యాదులున్నాయి. రవాణా శాఖలో ఫ్యాన్సీ నంబర్లకు బాగా డిమాండ్ ఉంటుంది. సెంటిమెంటు ఆధారంగా వాహనదారులు తమకు ఇష్టమైన నంబరును పొందేందుకు ఆసక్తి చూపుతారు. 0001, 9999, 0099, 5555... ఇలాంటి నెంబర్లకు డిమాండ్ చాలా ఎక్కువ. ఏటా దాదాపు లక్ష వరకు నంబర్లను వేలంలో ఉంచటం ద్వారా రవాణా శాఖకు ఏటా రూ.80 కోట్లకుపైగా ఆదాయం వస్తుంది. ఈ నంబర్ల కేటాయింపు బిడ్డింగ్ పద్ధతిలో జరుగుతుంది. ఎవరు ఎక్కువ కోట్ చేస్తే వారికి నంబరు దక్కుతుంది. రవాణాశాఖ ప్రధాన సర్వర్ వద్ద విధుల్లో ఉండే ప్రైవేటు సంస్థ సిబ్బంది బిడ్డింగ్‌లో కోట్ చేసిన మొత్తాన్ని ఆ అధికారికి చేరవేసేవారు. అప్పటికి బిడ్‌లో నమోదైన గరిష్ట మొత్తాన్ని తెలుసుకుని అనుకూల వాహనదారులకు చేరవేయటం ద్వారా నంబర్ అలాట్ అయ్యే మొత్తం కోట్ చేసేలా చక్రం తిప్పేవారు. ఇలా కోరిన వారికి నంబర్ ఇప్పించి పెద్ద మొత్తంలో కమీషన్లు వసూలు చేసే వారు. అలా ఏటా రూ.కోట్లలో జేబుల్లో వేసుకునేవారు. ఇప్పుడు దీనిపై ప్రభుత్వం విచారణ జరిపిస్తోంది. ఈ కుంభకోణంలో బాధ్యులుగా కొందరిని గుర్తించింది. ప్రస్తుతానికి 56 మంది డేటాబేస్ అడ్మినిస్ట్రేటర్ల(డీబీఏ)లను విధుల్లో నుంచి తొలగించినట్టు తెలిసింది. త్వరలో మరికొందరిపైనా చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం. సూత్రధారిగా ఉన్న అధికారిపైనా శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని తెలుస్తోంది.



ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తీరును అధికారులకు వివరిస్తున్న చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్

ప్రజావాణి అద్భుతం

- ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల ప్రశంసలు
- మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ సందర్శన

లక్డీకాపూల్ (హైదరాబాద్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం అద్భుతంగా ఉందని, ప్రజలు ప్రజాభవన్‌లో తమ సమస్యల పరిష్కారం కోరుతూ భారీగా తరలిరావడం విశేషమని ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల బృందం అభిప్రాయపడింది. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఆ బృందం తిలకించింది. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రజాపాలన స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లతో ఈ బృందం అధికారులు సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తీరును చిన్నారెడ్డి, దివ్య ఆ బృందానికి వివరించారు. బృందంలోని కొంతమంది అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు వారు సమాధానాలు ఇచ్చారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు నిరంతరంగా ఫాలో అప్ ఉంటుందని చిన్నారెడ్డి, దివ్య తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించిన ఈ బృందం...కార్యక్రమం నిర్వహణపై ప్రశంసలు కురిపించింది. ఈ కార్యక్రమంలో ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ అధికారి మాధవి రావులపాటి కూడా పాల్గొన్నారు. కాగా ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 518 దరఖాస్తులు అందాయి. అందులో మైనారిటీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 130 అర్జీలు వచ్చాయి. విద్యుత్ శాఖకు 82, రెవెన్యూ సమస్యలపైన 72, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సమస్యలపై 55, సాంఘిక సంక్షేమ శాఖకు 29, ప్రవాసీ ప్రజావాణి ద్వారా 1, ఇతర శాఖలకు సంబంధించి 150 దరఖాస్తులు అందినట్లు కోఆర్డినేటర్ రాకేశ్‌రెడ్డి తెలిపారు.

ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు ఉండాలి

- వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సాక్షి, హైదరాబాద్: జిల్లా, ప్రాంతీయ ఆసుపత్రులకు రోగులు ఎక్కువగా వస్తారని అక్కడ అన్ని రకాల సౌకర్యాలు ఉండాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు సూచించారు. ప్రస్తుత అవసరాలే కాకుండా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) ఆసుపత్రుల పనితీరు, టీవీవీపీని సెకండరీ హెల్త్‌కేర్ డైరెక్టరేట్‌గా మార్చడానికి 'ఆస్కి' తయారు చేసిన ప్రతిపాదనలపై మంత్రి రాజనర్సింహ ఆ శాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ హేమంత్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, 'ఆస్కి' కన్సల్టెంట్స్ సుబోధ్, వీరభద్రయ్య, శ్రీదేవి, అభిషేక్‌లతో సమీక్షించారు. 'ఆస్కి' కన్సల్టెంట్స్ మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్(ఐపీహెచ్ఎస్) ప్రకారం హాస్పిటల్స్‌లో క్లినికల్, నాన్ క్లినికల్ స్టాఫ్ ప్యాటర్న్ ఉండాలన్నారు. ఈ మేరకు అవసరమైన అదనపు పోస్టులను మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఏపీలో వీవీపీని సెకండరీ హెల్త్ కేర్‌గా మార్చినట్టు అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, అక్కడ తలెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకుని, అవి పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. చాలాచోట్ల డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్ టీచింగ్ హాస్పిటల్స్ కిందకు వెళ్లిపోయాయని, కొన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు వీవీపీ పరిధిలోకి వచ్చాయని అధికారులు మంత్రికి తెలిపారు. వీవీపీ పరిధిలోకి వచ్చిన పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు అవసరమైన స్టాఫ్‌తోపాటు, ఏమేం ఎక్విప్‌మెంట్ అవసరమో ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి సూచించారు.

ఎంజీఎంలో రోగుల ఇక్కట్లపై మంత్రి అసంతృప్తి...

హనుమకొండలోని కాకతీయ మెడికల్ కాలేజీ, దానికి అనుబంధంగా ఉన్న ఎంజీఎం, సీకేఎం, జీఎంహెచ్, టీబీ, కంటి ఆసుపత్రులపై కూడా మంత్రి సమీక్షించారు. ఎంజీఎం ఆసుపత్రిలో రోగుల ఇక్కట్లపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.ఏయే సమస్యలు ఉన్నాయో, ఏమేం అవసరాలు ఉన్నాయో రెండ్రోజుల్లో పూర్తి వివరాలతో ప్రతిపాదనలు అందించాలని మంత్రి ఆదేశించారు. త్వరలో స్వయంగా తానే ఎంజీఎంకు వస్తానని, అన్ని వార్డులు పరిశీలిస్తానని మంత్రి తెలిపారు.

నగరంలో సీఆర్‌పీఎఫ్ స్కూల్‌కు

బాంబు బెదిరింపు

బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు.. బాంబు లేదని నిర్ధారణ



జవహర్‌నగర్‌లోని సీఆర్‌పీఎఫ్ పాఠశాలలో తనిఖీ చేస్తున్న పోలీసులు

జవహర్‌నగర్: ఢిల్లీలోని ఓ సీఆర్పీఎఫ్ పాఠశాల ప్రహరీ వద్ద మూడు రోజుల కిందట బాంబు పేలుడు సంభవించిన ఘటనను మరువక ముందే హైదరాబాద్ శివారులోని జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న సీఆర్పీఎఫ్ పాఠశాలకు వచ్చిన బాంబు బెదిరింపు సందేశం మంగళవారం కలకలం రేపింది. గుర్తుతెలియని దుండగులు సోమవారం అర్ధరాత్రి సీఆర్పీఎఫ్ పాఠశాలకు ఈ–మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు సందేశం పంపారు. జవహర్‌నగర్ సీఆర్పీఎఫ్ పాఠశాలతోపాటు ఢిల్లీలోని రోహిణి, ద్వారకాలోగల సీఆర్పీఎఫ్ పాఠశాలలో బాంబులు అమర్చినట్లు అందులో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పాఠశాల ప్రారంభమయ్యాక యాజమాన్యం ఈ–మెయిల్‌ను చూసి అప్రమత్తమైంది. వెంటనే విద్యార్థులను బస్సుల్లో ఇళ్లకు తరలించడంతోపాటు పోలీసులకు సమాచారం అందించింది. దీంతో సీఆర్పీఎఫ్, ఆర్ఏఎఫ్ పోలీసులతోపాటు రాచకొండ సీపీ సుధీర్‌బాబు, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, కుషాయిగూడ ఏసీపీ మహేశ్, జవహర్‌నగర్ సీఐ సైదయ్య పాఠశాలకు చేరుకొని పరిసర ప్రాంతాలను, పాఠశాల భవనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జాగిలాలతో, బాంబు స్క్వాడ్‌తో అనువనవూ గాలించి బాంబు లేదని నిర్ధారించారు. తమిళనాడు డిప్యూటీ సీఎం సతీమణి పేరున కొందరు దుండగులు ఫేక్ ఐడీ సృష్టించి ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు.

దీపావళి వేళ.. బాణసంచా అక్రమ దందా!

రూ.1.80 కోట్ల సరుకు సీజ్



వరంగల్: దీపావళి వేళ వరంగల్ జిల్లాలో పటాకుల అక్రమ దందా జోరుగా నడుస్తోంది. పండగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగానే భారీగా బాణాసంచాను తెచ్చి గోదాముల్లో నింపేస్తున్నారు. అనుమతులతోపాటు కనీస భద్రతా చర్యలు కూడా తీసుకోకుండానే నిల్వ చేస్తున్నారన్న సమాచారంతో వరంగల్ టాస్క్‌ఫోర్స్ బృందం చేసిన తనిఖీల్లో పెద్దఎత్తున బాణాసంచా డంపులు బయటపడ్డాయి. వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా ఆదేశాల మేరకు మంగళవారం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్, మట్టెవాడ, ఇంతేజార్‌గంజ్ పోలీసులు వరంగల్ ఓల్డ్‌బీట్ బజార్‌లోని వజినేపల్లి రమేశ్ అండ్ బ్రదర్స్, శ్రీసాయి ఫైర్ క్రాకర్స్‌లో తనిఖీలు నిర్వహించగా సుమారు రూ.కోటి 80 లక్షల విలువైన బాణసంచాను అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. పండగల సీజన్ సమీపిస్తుండటంతో వరంగల్‌తోపాటు చుట్టుపక్కల వ్యాపారులు భారీగా పటాకులు తెప్పిస్తూ అనుమతులు లేకుండానే డంప్ చేస్తున్నట్లు గుర్తించారు. దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాలకు తాత్కాలిక అనుమతి కోసం ఆసక్తి ఉన్న వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ చెప్పారు. డంప్‌ను పట్టుకున్న ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ ఎల్.పవన్‌కుమార్, ఆర్ఎస్సై శరత్‌కుమార్, సిబ్బందిని అభినందించారు.

కాటేసిన కరెంటు తీగలు

రెండు వేర్వేరు ఘటనల్లో ఇద్దరు రైతులు మృతి

కౌడిపల్లి(నర్సాపూర్)/నల్లగొండ క్రైం: రెండు వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మరణించారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం జాజితండా పంచాయతీ రామాలయం తండాకు చెందిన కాట్రోత్ బుజ్జి (38) మంగళవారం ఉదయం మేకలను మేత కోసం అడవి వైపు తీసుకెళ్లింది. తండాకు చెందిన శోభ అడవి పందుల బెడద నుంచి వరి పంటను కాపాడుకునేందుకు విద్యుత్ తీగతో కంచె ఏర్పాటు చేసింది. మేకలను మేపుతున్న బుజ్జి విద్యుత్ తీగను గమనించకుండా పొలం వద్దకు వెళ్లడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి, నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మహిళ మృతికి కారకులైన వారు వచ్చేదాక మృతదేహాన్ని తరలించేంది లేదని తండావాసులు ఆందోళన చేశారు. విషయం తెలిసిన వెంటనే పంట యజమాని శోభతోపాటు కుటుంబ సభ్యులు తండాను విడిచి వెళ్లిపోయారు. మరో ఘటనలో నల్లగొండ మండలం ముశంపల్లి గ్రామానికి చెందిన రైతు మల్గిరెడ్డి శ్రీనివాసరెడ్డి (41) మంగళవారం పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నిన తర్వాత నాగలిని పొలం గట్టు వద్ద వదిలి మరో వైపు వెళ్తుండగా.. మోటార్ స్టార్టర్ తీగ తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌రెడ్డి భోజనానికి రాలేదని ఆయన కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో.. వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబా తెలిపారు.

సాగర్‌లోని తెలంగాణ ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం



ఏడాది లక్ష్యం మూడు నెలల్లోనే

సాగర్‌లో రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

నాగార్జునసాగర్: రెండేళ్ల తర్వాత భారీ వరదలు రావడంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో జలకళను సంతరించుకుంది. దీంతో నాగార్జునసాగర్ ప్రాజెక్టులో తెలంగాణ పరిధిలోని రెండు జల విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి జరిగింది. కొద్దిరోజులు ఎడమకాల్వపై ఉన్న రెండు టర్బైన్లలో ఒకటి మొరాయించింది. అలాగే ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో రెండో యూనిట్ గత రెండేళ్లుగా పనిచేయడం లేదు. దీనిని మూడు రోజులుగా జపాన్ నుంచి వచ్చిన సాంకేతిక నిపుణులు మరమ్మతులు చేస్తున్నారు. అయితే, చిన్నచిన్న సమస్యలను అధిగమించి భారీగా జలవిద్యుదుత్పత్తి చేశారు. ఏడాదిలో పూర్తి చేయాల్సిన లక్ష్యాన్ని గత మూడునెలల్లోనే చేరుకున్నారు.

మంగళవారం సాయంత్రానికి చేరుకున్న లక్ష్యం

2024–25 ఆర్థిక ఏడాది (2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు)లో 1,400 మిలియన్ యూనిట్లు ఉత్పాదన లక్ష్యం కాగా.. అక్టోబర్ 22 (మంగళవారం) సాయంత్రానికి లక్ష్యాన్ని చేరుకున్నారు. ప్రాజెక్టు అధికారులు జూలై చివరి వారంలో ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో విద్యుదుత్పత్తిని ప్రారంభించారు. అలాగే ఎడమ కాల్వకు నీటి విడుదల ప్రారంభంతో ఎడమ కాల్వపై గల విద్యుదుత్పాదన కేంద్రంలో ఆగస్టు 2నుంచి విద్యుదుత్పత్తి మొదలైంది. అయితే, ఎడమ కాల్వకు గండిపడటంతో చాలా రోజులు కాల్వకు నీటిని నిలిపివేశారు. ఈ అవాంతరం రాకుంటే.. ఇంకా ముందుగానే విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని చేరుకునే అవకాశముండేదని జెన్‌కో అధికారులు తెలిపారు.

నేడు ఈడీ ముందుకు ఐఏఎస్ అమోయ్ కుమార్

సాక్షి, హైదరాబాద్: భూ కేటాయింపుల్లో అక్ర మాలు జరిగాయన్న ఆరోపణలపై రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్, ఐఏఎస్ అధికారి అమోయ్‌కుమార్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)అధికారులు విచారించనున్నారు. ఇప్ప టికే ఆయనకు ఈడీ సమన్లు జారీ చేయడం తెలిసిందే. అందులో పేర్కొన్న మేరకు అమోయ్‌కుమార్ బుధవారం ఈడీ కార్యాలయానికి రానున్నట్టు ఈడీ అధికార వర్గాల ద్వారా తెలిసింది.

కుల, మత రహిత కాలమ్ ఉండాల్సిందే

2017లో దాఖలైన పిల్‌లో విచారణ ముగించిన హైకోర్టు ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ సర్టిఫికెట్లు, పాఠశాలలో చేరే ముందు సమర్పించే దరఖాస్తులో కుల, మత రహిత కాలమ్ ఉండాల్సిందేనని సర్కార్‌ను హైకోర్టు ఆదేశించింది. కులం, మతం వద్దనే హక్కు ప్రజలకు ఉందని అభిప్రాయపడింది. కుల, మత విభాగాలను దరఖాస్తులో నింపనంత మాత్రాన అవి తిరస్కరణకు గురికావని పాఠశాల విద్యాశాఖ సమర్పించిన కౌంటర్ అఫిడవిట్‌ను పరిశీలనలోకి తీసుకుంటున్నామని స్పష్టం చేసింది. 2010, 2021లోనూ రిట్ పిటిషన్లు దాఖలు చేసి కోర్టును ఆశ్రయించిన పిటిషనర్లు ఇప్పటికే ఉపశమన ఆదేశాలు పొందారని పేర్కొంది. బాధిత వ్యక్తులు అవసరమైతే తదుపరి నష్టపరిహారాన్ని కోరే హక్కు కలిగి ఉంటారని వ్యాఖ్యానించింది. పాఠశాల విద్యాశాఖ స్పష్టమైన వైఖరితో తదుపరి చర్యలు అనవసరమని పేర్కొంటూ పిల్‌లో విచారణ ముగిస్తున్నామని చెప్పింది. జనన ధ్రువపత్రం నుంచి మరణ ధ్రువపత్రం వరకు అన్నింటిలో 'కులం, మతం లేదు' అనే స్టేటస్ కోరుకునే వారిని గుర్తించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేదంటూ డీవీ రామకృష్ణారావు, ఎస్ క్లారెన్స్ కృపాళిని తదితరులు 2017లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఇలాంటి పిటిషన్లు గతంలో దాఖలయ్యాయని, కులం, మతాన్ని పేర్కొనడం, వదులుకోవడంపై స్వేచ్ఛ ఉందని పాఠశాల విద్య డైరెక్టర్ అండ్ కమిషనర్ తరఫున దాఖలు చేసిన కౌంటర్‌లో పేర్కొన్నారని చెప్పింది. మతం, కులం వివరాలు పేర్కొననంత మాత్రాన పిల్లలకు పాఠశాలల్లో ప్రవేశం నిరాకరించబడదని స్పష్టం చేసింది. దీంతో విచారణ ముగిస్తున్నట్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

ఫొటో, వీడియోగ్రాఫర్లకు అండగా ఉంటా

రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): తెలంగాణ ఫొటో, వీడియోగ్రాఫర్లు ఎట్టి పరిస్థితుల్లో ఆత్మహత్యల వైపు ఆలోచించవద్దని, వారికి అండగా తానున్నానని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి హామీ ఇచ్చారు. సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో మంగళవారం తెలంగాణ ఫొటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తన కుమారుడు ప్రదీప్ ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు. ఫొటో వీడియోగ్రాఫర్‌ల పిల్లలకు ఎంబీబీఎస్, ఐఐటీలో సీట్లు వస్తే వారి ఫీజు తాను భరిస్తానని హామీ ఇచ్చారు. నల్లగొండ జిల్లాలో పోలీసు అమరవీరుల కుటుంబాలకు ఏటా జిల్లా ఎస్పీ రూ.10 వేలు ఇస్తారని, కాగా, తాను ఆయా కుటుంబాలకు రూ.25 వేల చొప్పున నగదును బదిలీ చేసినట్టు తెలిపారు. ఫొటో వీడియోగ్రాఫర్‌ల సంక్షేమ సంఘం కార్యాలయం కోసం 500 గజాల స్థలాన్ని ముఖ్యమంత్రితో మాట్లాడి ఇప్పిస్తానని అన్నారు. కార్యక్రమంలో సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు ఎస్కే హుస్సేన్, ప్రధాన కార్యదర్శి లడే రవీందర్, కోశాధికారి బీమిడి మాధవరెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కుటుంబ భరోసా ఇన్‌చార్జి బి.నాగరాజు, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు పల్లె రవికుమార్, సీనియర్ జర్నలిస్టు కాచం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ముగ్గురి మృతి

- ఇద్దరికి గాయాలు.. కామారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో ఘటనలు
- వడ్లు ఆరబెట్టేందుకు వెళ్లి కొడుకు మృతి..తండ్రికి గాయాలు
- పత్తి ఏరేందుకు వెళ్లి తండ్రీ కూతుళ్ల మృతి..భార్యకు గాయాలు



కావేరి (ఫైల్)



లింగస్వామి (ఫైల్)

నాగిరెడ్డిపేట/ కామేపల్లి: రాష్ట్రంలో వేర్వేరు చోట్ల పిడుగుపాటుకు ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా...ఇద్దరు గాయాలపాలయ్యారు. కామారెడ్డి, ఖమ్మం జిల్లాల్లో మంగళవారం జరిగిన ఈ ఘటనల వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం మద్దులపల్లికి గ్రామానికి చెందిన చింతల లింగస్వామి(38), శైలజ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. పెద్దకుమార్తె కావేరి(19) కారేపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో హాస్టల్లో డిగ్రీ మొదటి ఏడాది చదువుతోంది. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన ఆమె ఇంకా వెళ్లలేదు. ఈ క్రమంలో తమ చేనులో పత్తి ఏరేందుకు తల్లిదండ్రులతో కలిసి కావేరి వెళ్లింది. మధ్యాహ్నం వర్షం కురుస్తుండగా అందరూ దగ్గరలోని చెట్టు కిందకు చేరారు. అదేచెట్టుపై పిడుగు పడి లింగస్వామి, కావేరి అక్కడికక్కడే మృతి చెందగా...శైలజకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తోటి రైతులు, కూలీలు ఆమెను చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలిసిన రెవెన్యూ, పోలీసు అధికారులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

వడ్లు ఆరబెట్టేందుకు వెళ్లి...

కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు మంద నాగభూషణం, మంద వెంకటేశం (25) గ్రామ శివారులోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వడ్లను ఆరబెట్టేందుకు వెళ్లారు. మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం రావడంతో తలదాచుకునేందుకు చెట్టు కిందకు వెళ్లారు. అదే చెట్టుపై పిడుగు పడటంతో వెంకటేశం అక్కడికక్కడే మృతి చెందాడు. నాగభూషణం కాలికి గాయాలయ్యాయి. దీంతో అతడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.


చిల్డ్రన్ కేర్

పనిచోటే లాలిపాట

'ఎంతైనా తల్లి మనసు' అనేది మనం తరచుగా వినే మాట.

తల్లి ఎక్కడ ఉన్నా మనసు మాత్రం పిల్లలపైనే ఉంటుంది. ఆ పిల్లలు పసి పిల్లలు అయితే? ఆ బాధ తల్లికే తెలుస్తుంది.

పసిపిల్లలను ఇంట్లో ఎవరికో ఒకరికి అప్పగించి ఉద్యోగం చేసుకునే వెసులుబాటు చాలామంది మహిళా ఉద్యోగులకు లేదు. ఈ పరిస్థితుల్లో పసిబిడ్డలను తమతోపాటు తమ పని ప్రదేశానికి తీసుకువస్తారు. అలా అని వారు అక్కడ నిశ్చింతగా... సంతోషంగా ఉంటున్నారా... అంటే అదీ లేదు. ఇలాంటి పరిస్థితిని గమనించిన కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ అందుకు ఒక పరిష్కార మార్గాన్ని ఆలోచించారు. 'చైల్డ్ కేర్ సెంటర్' ద్వారా తల్లీ బిడ్డలిద్దరూ సంతోషంగా ఉండే ఏర్పాటు చేశారు.



పసిబిడ్డలను తీసుకుని ఉద్యోగ విధులకు హాజరు అవుతున్న మహిళా ఉద్యోగులు పాలివ్వడం నుంచి అన్ని పనులు దగ్గర ఉండి చూసుకోవాల్సిందే. ఆఫీసులో పిల్లలు ఏడిస్తే తోటి ఉద్యోగులు చిరాకు పడతారు. కొందరైతే ముఖం మీదే 'పిల్లల్ని ఇంటి దగ్గరే వదిలి రావచ్చుగా' అని గట్టిగా మాట్లాడతారు. కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఏఆర్ కానిస్టేబుల్స్ కు తమ వెంట పిల్లలను తీసుకువచ్చి వాళ్ల ఆలనాపాలనా చూసుకుంటూ ఉద్యోగ విధులు నిర్వర్తించడం పెద్ద సవాలుగా మారింది.

ఆఫీసులో వారు పడుతున్న ఇబ్బందులను గమనించిన జిల్లా ఎస్పీ సింధుశర్మ పిల్లల కోసం ఏదైనా చేయాలనుకున్నారు. కార్యాలయం మొదటి అంతస్తులో 'చిల్డ్రన్ కేర్ సెంటర్' ఏర్పాటు చేయించారు. పిల్లలకు పాలు ఇవ్వడం నుంచి వారిని ఆడించడానికి కావలసిన అన్ని సౌకర్యాలు 'చిల్డ్రన్ కేర్ సెంటర్'లో ఏర్పాటు చేశారు. స్కూల్‌కు వెళ్లే పిల్లలను సెలవులు ఉన్న రోజుల్లో ఇంటి దగ్గర చూసుకునేవారు ఎవరూ లేక చాలా మంది ఉద్యోగులు వారిని తీసుకొని ఆఫీసుకు వస్తుంటారు. అలాంటి పిల్లలు కూడా 'చైల్డ్ కేర్ సెంటర్'లో సంతోషంగా గడుపుతున్నారు.

ఏఆర్ విభాగంలో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుళ్లకు గార్డ్ డ్యూటీ ఉంటుంది. షిఫ్టుల వారీగా వారికి బాధ్యతలు కేటాయిస్తారు. అలాంటి సందర్భంలో పిల్లల్ని చూసుకోవడానికి రకరకాల ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. ఇలాంటి వారికి ఇప్పుడు 'చిల్డ్రన్ కేర్ సెంటర్'ఎంతో ఊరట ఇస్తోంది.

'పిల్లల కంటే ఉద్యోగం ముఖ్యమా? ఉద్యోగం మానేయ్'లాంటి కరుకు మాటలు...

'నువ్వు హాయిగా డ్యూటీకి వెళ్లిపోతే పిల్లాడిని పట్టుకొని నేను నానా చావులు చావాలా!'లాంటి ఈసడింపులు ఇక ముందు వినిపించకపోవచ్చు.

ఉద్యోగ జీవితాన్ని, కుటుంబ జీవితాన్ని సమన్వయం చేసుకోవాలంటారు. అయితే అది అందరికీ సాధ్యం కాకపోవచ్చు. ఎన్నో సమస్యలు అడ్డుగోడగా ఉండవచ్చు. ఇలాంటి సందర్భాలలో 'చైల్డ్ కేర్ సెంటర్' అనేది తల్లీబిడ్డల కన్నుల్లో సంతోషాన్ని నింపే ఇంద్రధనుస్సు అవుతుంది. నిశ్చింతగా ఉద్యోగం చేసుకోవడానికి అవసరమైన ఆసరాను, ధైర్యాన్నీ ఇస్తుంది.

– సేపూరి వేణుగోపాలాచారి
సాక్షి, కామారెడ్డి

అందుకే... చైల్డ్ కేర్ సెంటర్

మహిళా పోలీసులు పిల్లలతో డ్యూటీకి వచ్చిన సమయంలో వారు పడుతున్న ఇబ్బందులను గమనించాను. ఏ కుటుంబంలోనైనా సరే పిల్లలు తల్లిదగ్గరే ఉండగలుగుతారు. తల్లే వారిని చూసుకుంటుంది. పోలీసు శాఖలో సాధారణ కానిస్టేబుల్‌లుగా 33 శాతం, ఏఆర్ విభాగంలో 10 శాతం ఉద్యోగాలు మహిళలకు రిజర్వు అవడంతో ఆయా విభాగాల్లో మహిళా కానిస్టేబుళ్ల సంఖ్య పెరిగింది. ఏఆర్ కానిస్టేబుల్స్ హెడ్ క్వార్టర్‌లో ఉండి పనిచేస్తుంటారు. వారు గార్డు డ్యూటీతో సహా అన్నిరకాల విధులకు హాజరు కావలసిందే. అలాంటి సందర్భంలో పిల్లలను చూసుకోవడానికి ఇబ్బందులు ఉండకూడదనే చైల్డ్ కేర్ సెంటర్ ఏర్పాటు చేశాను.

– సింధుశర్మ,
కామారెడ్డి జిల్లా ఎస్పీ

ఇబ్బందులు తీరాయి

ఏఆర్ విభాగంలో దాదాపు అందరు మహిళా కానిస్టేబుళ్లకు చిన్న చిన్న పిల్లలున్నారు. పిల్లల్ని ఇంటి దగ్గర వదిలి రాలేని పరిస్థితి ఉంటుంది. వెంట తీసుకుని వస్తాం. అయితే పిల్లలతో డ్యూటీ చేయడం



కొంత ఇబ్బందికరంగా ఉండేది. పిల్లలు ఏడుస్తుండడాన్ని చూసిన ఎస్పీ మేడం పిల్లల కోసం చైల్డ్‌కేర్ సెంటర్ ఏర్పాటు చేశారు. అందులో అన్ని రకాల ఆటవస్తువులు అందుబాటులో ఉంచారు.

– ఏ.మానస,
మహిళా కానిస్టేబుల్, ఏఆర్ విభాగం

పిల్లలు చక్కగా ఆడుకుంటున్నారు...



జిల్లా పోలీసు కార్యాలయంలో డ్యూటీ చేసేవారితో పాటు పనుల మీద వచ్చే మహిళా కానిస్టేబుళ్లు తమ వెంట ఉండే చిన్న పిల్లలను చైల్డ్ కేర్ సెంటర్‌లో వదిలేస్తే అక్కడ ఆడుకుంటున్నారు. బెడ్‌పై నిద్ర పోతున్నారు. తీరిక సమయంలో మేం కూడా వారితో కాసేపు గడపడానికి చైల్డ్‌కేర్ సెంటర్ అనుకూలంగా ఉంది.

– వై.భార్గవి,
మహిళా కానిస్టేబుల్,
దేవునిపల్లి పీఎస్

ఈ ఫొటో నేనే తీశాను!

జస్టిస్ సంజయ్ కరోల్



నేటికింకా కనిపిస్తున్న ఏ దురాచారాన్నో ఎత్తి చూపి మొత్తంగా 'ఇదీ మన దేశం' అనలేం. దేశం ఇంత అభివృద్ధిని సాధిస్తున్నప్పుడు ఎక్కడో ఒకచోట ఇలా జరిగితేనేం?' అని కొట్టిపారేయటాన్నీ సమర్థించలేం. దురాచారం ఏదైనా.. సమూలంగా నిర్మూలన కానంత వరకు దేశమైతే పూర్తిగా అభివృద్ధి చెందినట్లు కాదు.

మహిళల్ని బహిష్టు సమయంలో ఇంట్లోకి రానివ్వకుండా, ఆ ఐదు రోజులు దూరంగా రెండు తడికల చాటున ఏ భద్రతా లేని అశుభ్రంలో అంటరానివారిగా వదిలేయటం అనే మూఢాచారం నేటికీ భారతదేశ గ్రామీణ ప్రాంతాల్లో కనిపిస్తూనే ఉంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు కావస్తున్నా ఈ 'ఆరుబయలు బందిఖానా'ల నుంచి మహిళలకు విముక్తి లభించటమే లేదు! చట్టాలు, సంస్కరణలు కొంతవరకే దుస్థితులను చక్కదిద్దగలుగుతాయి. ఎవరికి వారు, ఏ ఇంటికా ఇల్లు మారవలసిందే. 'ఇంకా ఈ పిచ్చి పనులేమిటి?!' అని ఎవరైనా వెళ్లి నచ్చ చెప్పవలసిందే. వేరే మార్గం లేదు. అలా వదిలేయటం న్యాయం కాదు.

ఇదే విషయం ఈ నెల 19, 20 తేదీలలో గోవాలో జరిగిన సుప్రీంకోర్టు న్యాయవాదుల తొలి ఇంటర్నల్ లీగల్ కాన్ఫరెన్స్‌లో మొదటి రోజే చర్చకు వచ్చింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ ఒక ఫొటోను (మీరు ఇక్కడ చూస్తున్న ఫొటో) సమావేశంలో ప్రదర్శిస్తూ.. 'బీహార్, త్రిపుర వంటి రాష్ట్రాల మారుమూల గ్రామాల్లో ఈనాటికీ బహిష్టులో ఉన్న మహిళల్ని ఇంటికి దూరంగా ఉంచటం అనే దురాచారం కనిపిస్తోంది. ఆ బాధిత మహిళలకు న్యాయం జరగాలంటే న్యాయమే వారి దగ్గరకు వెళ్లాలి. ఇండియా అంటే కేవలం ఢిల్లీనో, ముంబయో కాదు. ఈ ఫొటోను గత ఏడాది ఆయా రాష్ట్రాల గ్రామాలకు వెళ్ళినప్పుడు నేనే స్వయంగా తీశాను' అని చెప్పారు. ఆ సందర్భంలోనే జస్టిస్ సంజయ్ కరోల్.. 'న్యాయమే కాలికి బలపం కట్టుకుని నగరాలకు దూరంగా ఉన్న బాధిత మహిళల దగ్గరకు తిరగాలి..' అన్నారు. 'అంటరాని'వాళ్లను స్పృశించటమే కదా జరగవలసిన న్యాయం!

తాజా అధ్యయనం

సోషల్ మీడియా చేసే చెరుపు గురించి చర్చ ఉన్నప్పటికీ దానిని సరిగా ఉపయోగిస్తే మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తుందని మనస్తత్వ నిపుణులు చెబుతున్నారు. స్నేహాలు, సమూహాలు మనకంటూ కొందరున్నారన్న భరోసా ఇస్తే సలహాలు సూచనలు కూడా ఇక్కడి నుంచి అందడం వల్ల ఆందోళన దూరం అవుతుందంటున్నారు. సోషల్ మీడియాను మెరుగ్గా ఎలా అర్థం చేసుకొని ఉపయోగించాలి?

● మనసుకు మేలే

సోల్‌మేట్స్‌తో సోషల్‌గా...



సోషల్ మీడియా అంటే అదొక అవాస్తవిక ప్రపంచం, అక్కడున్న వారికి ఇబ్బందులు తప్పవు, మహిళల మీద ట్రోలింగ్ ఉంటుంది అనే అభిప్రాయాలు చాలామందిలో ఉన్నాయి. అయితే నాణేనికి మరోవైపు కూడా ఉంది. సోషల్ మీడియాను సరిగ్గా వాడితే మానసిక సమస్యలు దూరమవుతాయని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా ఒంటరితనం, డిప్రెషన్, నిరాశ వంటి వాటితో ఇబ్బంది పడేవారికి సోషల్ మీడియా ధైర్యాన్ని, మద్దతును, అర్థం చేసుకునే స్నేహితులను అందిస్తుందని అంటున్నారు.

ఆత్మీయ బంధాలను అల్లుకోవచ్చు

సోషల్ మీడియాలోని స్నేహాలన్నీ వ్యర్థమని, అక్కడ పరిచయమైన వారిలో నిజాయితీ ఉండదనే అపోహ చాలామందిలో ఉంది. కానీ మనం నిజాయితీగా ఉంటే ఎదుటివారిలోని నిజాయితీని గుర్తించొచ్చని అంటున్నారు మానసిక నిపుణులు. అనేక ప్రాంతాల్లో నివసిస్తున్న వారు, అనేక సామాజిక, ఆర్థిక నేపథ్యాలున్నవారు సోషల్‌మీడియాలో తారసపడుతుంటారు. అందులో మన భావాలకు, అభిప్రాయాలకు తగ్గవారిని ఎంచుకునే అవకాశం ఉంటుంది. వారితో స్నేహం చేయడం ద్వారా మనలోని ఒంటరితనం దూరమవుతుంది. సోషల్‌మీడియాలో పరిచయమై ఆ తర్వాత అత్యంత ఆత్మీయ మిత్రులుగా మారినవారు బోలెడంత మంది ఉన్నారు. ఇవి మనసుకు బలం ఇస్తాయి.

అభిరుచులకు తగ్గ స్నేహాలు

మన చుట్టూ ఉన్నవారు మన అభిరుచులకు తగ్గట్టే ఉంటారని అనుకోలేం. కానీ సోషల్‌మీడియాలో ఒకే అభిరుచి, ఇష్టాయిష్టాలు కలిగిన వారు ఒకచోట చేరే అవకాశం ఉంటుంది. పుస్తక ప్రియులైతే ఒకచోట, చిత్రలేఖనం ఇష్టమైనవారంతా ఒకచోట, సినిమాలపై ఆసక్తి ఉంటే ఒక గ్రూప్, ప్రయాణాలు ఇష్టపడేవారు మరో గ్రూప్.. ఇలా మన ఇష్టాలకు తగ్గట్టు మెలిగే వారు కనిపిస్తారు. ఆ అంశాల గురించి చర్చిస్తారు. వారి అనుభవాలు వినొచ్చు. మన అభిప్రాయాలు పంచుకోవచ్చు.. ఈ గ్రూపులు మన అవగాహన పరిమితిని విస్తృతం చేస్తాయి. తద్వారా మనసును విశాలం చేస్తాయి.

అభిప్రాయాలు సరి చేసుకోవచ్చు

సోషల్ మీడియా భిన్నాభిప్రాయాలు వినిపించే వేదిక. మన చుట్టూ ఉన్నవారి అభిప్రాయాలే కాక, ఎక్కడో ఉన్నవారి అభిప్రాయాలు మనం తెలుసుకోవచ్చు. అయితే భిన్నాభిప్రాయాలు వ్యక్తపరిచేటప్పుడు, సంయమనం చాలా ముఖ్యం. మన మాటే చెల్లాలి, మనం చెప్పిందే వినాలి అనే ఆధిపత్య ధోరణి ఉండకూడదు. కొన్ని అభిప్రాయాలు మన మీద లైట్ వేస్తాయి. మన మూస అభిప్రాయాలను మారుస్తాయి. నెగెటివ్ అభిప్రాయాలను దూరం చేసుకునేందుకు సాయం చేస్తాయి. ఇదంతా ఎందుకు అనంటే ఖాళీగా ఉండే మైండ్‌ను అర్థవంతమైన వ్యాపకంలో పెట్టడానికే. దీనివల్ల డిప్రెషన్ దూరమవుతుంది. అయితే సోషల్ మీడియాలో వచ్చే వార్తలన్నీ నిజాలు కావనేది గుర్తించాలి. అలాంటి ఫేక్ వార్తలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు ప్రచారం చేసేవారిని దూరంగా ఉంచాలి.

నూతన అంశాలపై ఆసక్తి

గాజులు ఎలా తయారు చేస్తారో తెలుసా? అద్దం ఎలా తయారవుతుంది? ఇంట్లో ఖాళీ డబ్బాలతో ఏదైనా అలంకరణ వస్తువులు చేయొచ్చా? చార్‌ధామ్ యాత్ర అంటే ఏమిటి? ఇలా మనకు తెలియని అంశాలను సోషల్ మీడియా ద్వారా తెలుసుకోవచ్చు. వీడియోల ద్వారా నేరుగా పరిశీలించొచ్చు. ఆసక్తి ఉంటే ప్రయత్నించవచ్చు. నూతన అంశాలపై ఆసక్తి ఉన్నవారికి సోషల్ మీడియా ఉపయోగకారి. తద్వారా మనమూ కంటెంట్ క్రియేటర్లుగా మారొచ్చు. ఇదంతా మనసును ఉత్సాహ పరిచే అంశమే.

నిపుణుల సలహాలకు వేదిక

వేసవిలో ఏ ప్రాంతాలకు విహార యాత్రకు వెళ్లొచ్చు? బైక్ ఎక్కువ మైలేజ్ రావాలంటే ఏం చేయాలి? ఇంటీరియర్ డిజైనింగ్ కోసం ఏ రంగులు మేలు? ఇలా అనేక ప్రశ్నలు మనకుంటాయి. కానీ సమాధానాలు ఇచ్చేందుకు అన్నిసార్లూ నిపుణులు మనకు అందుబాటులో ఉండరు. ఆ లోటును సోషల్ మీడియా తీరుస్తుంది. ఇక్కడ అనేకమంది నిపుణులు అందుబాటులో ఉంటారు. కొందరు నిపుణులు కాకపోయినా, తమ అనుభవంతో మన సందేహాలను నివృత్తి చేయగలరు. దీనివల్ల మనకు శ్రమ తగ్గుతుంది. అయితే ఆరోగ్యం, ఆర్థిక విషయాల్లో సోషల్‌మీడియా సలహాలు పాటించకపోవడం మేలని నిపుణులు అంటున్నారు. కాబట్టి ఆ జాగ్రత్త పాటించడం తప్పనిసరి.

సృజనాత్మకతకు వేదిక

ఒక చక్కని కవిత రాశారా? పదిమందితో పంచుకోవాలని ఉందా? ఒక చిత్రం గీశారా? దాన్ని అందరికీ చూపించాలని ఉందా? సోషల్ మీడియా మన సృజనాత్మకతకు చక్కటి వేదిక. ఎంతోమంది అక్కడ పాపులర్ అయ్యారు, అవుతున్నారు. వారి కంటూ అభిమానులను సంపాదించుకున్నారు. ఉన్నచోటే ఆగిపోకుండా సృజనకు వేదిక అందించి, సృజనకారుల్లో ఉత్సాహం నింపడం సోషల్ మీడియాలో సాధ్యం. మానసిక ఉల్లాసానికి సృజనాత్మక ప్రదర్శనలు చాలా మేలు చేస్తాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి!

- సోషల్ మీడియాలో సంయమనం పాటించాలి. వ్యక్తిగతంగా దూషించడం, టార్గెట్ చేయడం, వేధించడం వంటివి చేయకూడదు.
- సోషల్ మీడియాను పరిమితంగానే వాడాలి. దానికి అడిక్ట్ అయిపోకూడదు.
- పూర్తి వ్యక్తిగత వివరాలు, ఇబ్బందికరమైన ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పంచుకోకూడదు.
- సోషల్ మీడియాలో నెగెటివిటీకి దూరంగా ఉండాలి.
- సోషల్ మీడియాలో ఏవైనా వేధింపులు, మోసం, ట్రోలింగ్ వంటివి ఎదురైతే ధైర్యంగా ఎదుర్కోవాలి. వెంటనే సైబర్ నేరాల విభాగానికి ఫిర్యాదు చేయాలి.

లీగల్

పోలీసు స్టేషన్‌కు వెళ్లేటప్పుడు మీ లాయర్‌ను తీసుకువెళ్లనక్కరలేదు

నన్ను ఆన్‌లైన్‌లో వెంబడిస్తూ నా గురించి నా స్నేహితులకు, తోటి ఉద్యోగస్తులకు అభ్యంతరకరమైన ఈ మెయిల్స్ పంపుతూ, నా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్న గుర్తు తెలియని వ్యక్తి పై నేను పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఆ వ్యక్తి ఎవరో కనుగొన్న పోలీసులు నన్ను పోలీస్ స్టేషన్‌కు రమ్మన్నారు. అయితే అప్పటికే అక్కడికి వచ్చిన ఆ వ్యక్తి తన లాయరుని వెంట తెచ్చుకున్నాడు. పోలీసు వారు నన్ను కూడా ఒక లాయర్‌ని తెచ్చుకోమని సలహా ఇస్తున్నారు. అలా తెచ్చుకుంటే మరింత పకడ్బందీగా ఫిర్యాదును రాయించవచ్చు అని అంటున్నారు. నిజానికి నేను లాయర్ ను పెట్టుకునే పరిస్థితులలో లేను. లాయరు లేకుండా పోలీస్ స్టేషన్‌కి వెళ్తే నా కేసు వీగిపోతుంది అని కొందరు అంటున్నారు. నిజమేనా? ఈ పరిస్థితులలో నేను ఏం చేయాలి?

– శివపార్వతి, హైదరాబాద్

మీకు ఉండే సందేహం చాలా మందిలో ఉంటుంది కాబట్టి పూర్తి వివరణ ఇస్తున్నాను. మీరు ఒక బాధితురాలు. మీకు జరిగిన అన్యాయాన్ని పోలీసు వారికి ఫిర్యాదు చేసిన వెంటనే వారు తగిన కేసు నమోదు చేసుకుని మిమ్మల్ని ఇబ్బందికి గురిచేసిన వ్యక్తిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలి. ఒకవేళ పోలీసు వారికి ఈ విషయంలో ఏమైనా న్యాయపరమైన సందేహాలు, చిక్కులు ఉంటే వారు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సలహా తీసుకొని కేసును దర్యాప్తు చేయవలసి ఉంటుంది. కొంతమంది లాయర్‌ను వెంట తీసుకుపోతేనే తమకు న్యాయం జరుగుతుంది అనే భావన కూడా వ్యక్తపరుస్తూ ఉంటారు. అందుకు సామాజిక పరిస్థితులు, చట్టంపై సరైన అవగాహన లేకపోవడం, అవసరం అయిన మేరకు పోలీసు వారి సహకారం లేకపోవడం వంటివి కొన్ని కారణాలుగా చెప్పవచ్చు. బాధితుల తరపున పోలీసు వారు – పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉంటారు కనుక ప్రత్యేకంగా ఒక ప్రైవేటు లాయర్‌ను తీసుకు వెళ్ళవలసిన అవసరం లేదు. లాయరు వచ్చి మీ తరపున ఫిర్యాదు రాయటం వంటివి చేయడం వల్ల మీకు ప్రయోజనం చేకూరకపోగా కొన్ని సందర్భాలలో నష్టం జరిగే అవకాశం కూడా ఉంది. ఒకవేళ మీ తరపున ఎవరైనా లాయరు వచ్చినప్పటికీ, మీకు జరిగిన అన్యాయాన్ని మీ సొంత సరళమైన భాషలో క్లుప్తంగా పోలీసు వారికి వివరించి మీ ఫిర్యాదును అందించటం మంచిది. మీరు ఒక న్యాయ సలహాదారు మీతో ఉండాలి అని స్వచ్ఛందంగా అనుకుంటే మీ వెంట తీసుకుని వెళ్ళవచ్చు కానీ తప్పనిసరి నిబంధనలేవీ లేవు. బాధితులకు మరీ ముఖ్యంగా స్త్రీలకు ఉండే హక్కులను తెలుసుకోవడం, తెలియజేయడం కూడా ప్రభుత్వ కనీస బాధ్యత.



– శ్రీకాంత్ చింతల
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.com కు మెయిల్ చేయవచ్చు.

కాఫీలందించాను

"అది నా పని కాదు".. అనే మాటను ఆఫీసులలో తరచు వింటుంటాం. తప్పేం లేదు. ఏ పని చేయటానికైతే ఉద్యోగంలో చేరామో ఆ పనే కదా చేయాలి! అయితే కొన్నిసార్లు మనకు మించిన పనినో, మనం చేస్తున్న పని కన్నా తక్కువ స్థాయి పనినో అత్యవసరంగా చేయవలసి వస్తుంది. అంటే.. పనే మనల్ని వెతుక్కుంటూ రావటం అన్నమాట. (మొదట్లో పని కోసం మనం వెతుక్కుంటూ వచ్చినట్లుగా). అప్పుడేం చేయాలి? ఏదైనా చెయ్యొచ్చు. మించిన పనైతే "బాబోయ్.. నా వల్ల అవుతుందా!" అని తప్పించుకోవచ్చు. తక్కువస్థాయి పనైతే "అది నా పని కాదు" అని ముఖం తిప్పేసుకోనూ వచ్చు. ఈ రెండూ కాకుండా... "ఎస్, ఐ కెన్' అని ఏ పనికైనా ఉత్సాహంగా చేయందించవచ్చు.

సినిమాల్లోకి రాకముందు పరిణీతి చోప్రా కూడా ఒక సాధారణ ఉద్యోగే. రణ్‌వీర్ సింగ్, అనుష్క శర్మ, రాణి ముఖర్జీ వంటి సినీ సెలబ్రిటీలకు పీఆర్‌గా పని చేశారు. వారి స్కెడ్యూళ్లు చూసుకోవటం, ఇంటర్వ్యూలు ఏర్పాటు చేయటం ఆమె పని. అయితే ఆ పనులు మాత్రమే చూసుకోలేదు పరిణీతి. అవసరం అయినప్పుడు, బాయ్స్ అందుబాటులో లేనప్పుడు అనుష్క శర్మ, రాణి ముఖర్జీ, దీపికా పదుకోన్, నీల్ నితిన్ ముఖేశ్‌లకు కాఫీలు కూడా అందించారట! "తప్పేముంది? మనం చేయగలిగిన పనే కదా!" అంటారు పరిణీతి.

అక్టోబర్ 22 పరిణీతి పుట్టిన రోజు. ఆ సందర్భంగా రాజ్ షమానీకి ఇచ్చిన పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో.. తన తొలినాళ్ల ఉద్యోగ బాధ్యతల్ని, అదనంగా వచ్చి పడిన పనులను తనెంత ఇష్టంగా నిర్వహించిందీ గుర్తు చేసుకున్నారు పరిణీతి. "అవసరమైనప్పుడు పనిలో స్థాయీ భేదాలు చూసుకోనక్కర్లేదని నా ఉద్దేశం.." అంటారు ప్రస్తుతం స్టార్ నటిగా వెలిగిపోతున్న పరిణీతి.


పరిణీతి చోప్రా

బ్యూటిప్

అవొకాడో – క్యారెట్ క్రీమ్ మాస్క్



అవొకాడోలో 'ఇ' విటమిన్ పుష్కలంగా ఉంటుంది. క్యారెట్‌లో బీటా కెరోటిన్, యాంటాక్సిడెంట్లు ఉంటాయి. క్రీమ్‌లో క్యాల్షియం, ప్రొటీన్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవన్నీ నిర్జీవంగా మారిన చర్మానికి టోనర్‌గా పని చేస్తాయి. చర్మ కాంతి మెరుగుపడుతుంది. చర్మం మీదున్న మచ్చలు తొలగిపోతాయి. ఇందుకు ఒక అవొకాడో, ఒక క్యారెట్, అర కప్పు క్రీము, ఒక కోడిగుడ్డు, మూడు టేబుల్ స్పూన్ల తేనె తీసుకోవాలి. అవొకాడోను చిదిమి, అందులో ఉడికించి చిదిమిన క్యారెట్ గుజ్జును కలపాలి. ఈ మిశ్రమంలో గిలక్కొట్టిన కోడిగుడ్డు సొన, తేనె కలిపి ముఖం, మెడకు నున్నితంగా అప్లయ్ చేయాలి. పది– పదిహేను నిమిషాల పాటు అలాగే ఉంచి చన్నీటితో కడగాలి.

మద్యం షాప్ మూసేయాలని మహిళల పోరు



ముంబై ప్రాంతంలోని హెచ్ఎస్‌జీ కాంప్లెక్స్ లోని బూజ్ షాప్ తెరవద్దంటూ మహిళలు అడ్డుపడి, విజయం సాధించారు. కొందరు మద్యం ప్రియులు షాపింగ్ కాంప్లెక్స్ పరిసరాలలో తాగి, చుట్టుపక్కల అమ్మాయిలు, మహిళల పట్ల చులకన వ్యాఖ్యల చేయడం వల్ల తరచూ గొడవలు జరుగుతుండేవి. దీంతో ఇక్కడి మద్యం దుకాణాన్ని మూసేయాలని స్థానిక మహిళలు పట్టుబట్టారు. ఎంకే హెరిటేజ్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ పురుషులు, పిల్లలు కూడా ఆ మహిళలతో జత కలవడంతో అందరూ కలసి మానవ హారంగా ఏర్పడి మౌన నిరసనను తెలియజేశారు. ఈ నిరసన ద్వారా అందరి దృష్టిని ఆకర్షించిన వీరు కలెక్టర్ కార్యాలయానికి, ముఖ్యమంత్రికి ఇ-మెయిల్ ద్వారా తమ సందేశాన్ని పంపారు. ముఖ్యంగా మహిళల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇక్కడి మద్యం దుకాణాన్ని మూసివేయకపోతే స్థానిక ప్రజలు శాంతిభద్రతల సమస్యలను ఎంతగా ఎదుర్కొంటున్నారో తెలియజేస్తూ 50 మందికి పైగా మహిళలు ఒక మెమోరాండంపై సంతకం చేసి, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు పంపారు.

ఫలితంగా సీఎం నుంచి కలెక్టర్, ఎక్సైజ్ శాఖ, సంబంధిత అన్ని శాఖలకు ఈ సమస్యపై దర్యాప్తు చేయమని రాయగడ్ డివిజన్‌కు ఆదేశాలు అందాయి. ప్రతిపాదిత దుకాణం ప్రసిద్ధ సాయిబాబా ఆలయ ప్రవేశ ద్వారం నుండి 144 మీటర్ల దూరంలో ఉందని, ప్రముఖుల విగ్రహాలు, విద్యాసంస్థలు, సమీపంలోని రాష్ట్ర రహదారి వంటి ఇతర అడ్డంకులు లేవని ఎక్సైజ్ శాఖ బృందాలు నివేదించాయి. అయినప్పటికీ స్థానికంగా ఉన్న సమస్యను పరిగణనలోకి తీసుకొని, ఇక్కడ ఉన్న మద్యం షాప్‌ను మరో భవనంలోకి మార్చాలని నిర్ణయించారు. దీంతో మద్యంపై పోరులో మహిళల సాధించిన విజయంగా అందరిని దృష్టిని ఆకర్షించడమే కాదు, ఎంతో మందికి స్ఫూర్తిని కలిగించింది.

ఇంటిప్స్

- దుస్తులకు పట్టేసిన మట్టి మరకలు పోవాలంటే బంగాళా దుంపను ఉడికించిన నీటిలో నానబెట్టి తరవాత మామూలుగా ఉతకాలి.
- పింగాణీ కప్పులకు టీ, కాఫీ మరకలు పట్టేసి క్లీనింగ్ పౌడర్‌తో కడిగినా వదలకుండా ఉంటే, ఒక లీటరు నీటిలో రెండు టీస్పూన్ల సోడియం బైకార్బనేట్ కలిపి మరిగించి అందులో ఈ కప్పులను పది నిమిషాల సేపు నానబెట్టి కడగాలి.





యువ భారత్ 'హ్యాట్రిక్'

కౌలాలంపూర్: సుల్తాన్ జొహర్ కప్ అండర్–21 పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు వరుసగా మూడో విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేసింది. ఆతిథ్య మలేసియా జట్టుతో మంగళవారం జరిగిన రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 4–2 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున శారదానంద్ తివారీ (11వ నిమిషంలో), అర్ష్‌దీప్ సింగ్ (13వ నిమిషంలో), తాలెమ్ ప్రియోబర్తా (39వ నిమిషంలో), రోహిత్ (40వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. మలేసియా జట్టుకు మొహమ్మద్ డానిష్ (8వ నిమిషంలో), హారిస్ ఉస్మాన్ (9వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. భారత జట్టుకు ఐదు పెనాల్టీ కార్నర్‌లు, మలేసియా జట్టుకు నాలుగు పెనాల్టీ కార్నర్‌లు లభించాయి. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో భారత్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి తొమ్మిది పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఐదు పాయింట్లతో న్యూజిలాండ్ రెండో స్థానంలో ఉంది. నేడు జరిగే నాలుగో లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో భారత్ ఆడుతుంది. రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లు ముగిశాక టాప్–2లో నిలిచిన జట్లు ఫైనల్లో తలపడతాయి.

భారత్‌కు పెద్ద దెబ్బ

ఒలింపిక్స్, ఆసియా క్రీడల తర్వాత మూడో మెగా ఈవెంట్ కామన్వెల్త్ క్రీడలు. ఇందులో భారత క్రీడాకారులు ప్రతీసారి పెద్ద సంఖ్యలో పతకాలు పట్టుకొస్తున్నారు. పతకాల పట్టికలోనూ క్రమంగా పుంజుకుంటూ టాప్–10, టాప్–5 స్థానాల్లో పదిలంగా నిలుస్తున్నారు. అలాంటి మెగా ఈవెంట్‌లో ఇకపై పతకాల వేట, పోడియం వద్ద మువ్వన్నెల పతాకం రెపరెపలాడటం కష్టంగా మారనుంది. భారత్ అత్యధికంగా గెలిచే అవకాశాలున్న క్రీడాంశాలను ఆతిథ్య దేశం పెద్ద సంఖ్యలో తొలగించడం మన క్రీడాకారులకు నిజంగా గుండెకోతనే మిగల్చనుంది. ఓవరాల్‌గా పతకాల వేటకు పెద్ద దెబ్బ తగలనుంది.

హాకీ, రెజ్లింగ్, బ్యాడ్మింటన్ సహా 9 క్రీడాంశాలు తొలగింపు

- గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ నిర్వాహకుల నిర్ణయం
- ఆందోళనలో భారత క్రీడాకారులు

లండన్: మరో రెండేళ్లలో జరగబోయే కామన్వెల్త్ క్రీడలు భారత శిబిరాన్ని ఇప్పటి నుంచే నిరాశలో ముంచేశాయి. భారత క్రీడాకారులు పతకాలు కచ్చితంగా గెలిచే క్రీడాంశాలను ఆతిథ్య దేశం స్కాట్లాండ్ తొలగించింది. గ్లాస్గోలో 2026లో జరిగే ప్రసిద్ధ కామన్వెల్త్ పోటీలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యంత పరిమితంగా పదే పది క్రీడాంశాలతో మమ అనిపించేందుకు ఆర్గనైజింగ్ కమిటీ సిద్ధమైంది. గత బర్మింగ్‌హామ్ 2022 కామన్వెల్త్ గేమ్స్‌ను 19 క్రీడాంశాలతో నిర్వహించారు. ఇప్పుడు ఇందులో 9 క్రీడాంశాలకు కోత పెట్టారు. హాకీ, క్రికెట్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్, స్క్వాష్, రిథమిక్ జిమ్నాస్టిక్స్, డైవింగ్, బీచ్ వాలీబాల్ క్రీడలను తప్పించారు. షూటింగ్‌ను బర్మింగ్‌హామ్‌లోనే పక్కన బెట్టారు. తాజా తొలగింపుతో హాకీ, క్రికెట్, బ్యాడ్మింటన్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్ క్రీడాకారులకు నిరాశే మిగిలింది. ఎందుకంటే భారత్ కచ్చితంగా ఈ ఐదు ఈవెంట్లలో పతకాలు గెలిచే అవకాశాలున్నాయి. బర్మింగ్‌హామ్‌లో భారత్ 61 పతకాలతో నాలుగో స్థానంలో నిలిచింది. ఇందులో 30 పతకాలు ఆ ఈవెంట్లలోనే గెలుపొందడం విశేషం. అంటే దాదాపు సగం పతకాలను ఇకపై భారత్ కోల్పోనుండటం ఎదురుదెబ్బగా భావించవచ్చు.

బడ్జెటే ప్రతిబంధకమా?

నిజానికి 2026 క్రీడలు ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రంలో జరగాలి. అయితే అంచనాలను మించిపోతున్న బడ్జెట్ కారణంతో విక్టోరియా వైదొలగింది. దీంతో నిర్వహణకు గ్లాస్గో (స్కాట్లాండ్) ముందుకొచ్చింది. అయితే ఈ దేశం కూడా వేల సంఖ్యలో వచ్చే అథ్లెట్లు, అధికారులు వారికి కల్పించాల్సిన వసతులు, సదుపాయాల గురించి పెద్ద కసరత్తే చేసింది. అధిక సంఖ్యలో క్రీడాంశాల్ని నిర్వహించాలంటే వేదికల సంఖ్య కూడా పెంచాలి. అంటే అక్కడికి అథ్లెట్లు, అధికారిక గణాన్ని తరలించేందుకు రవాణా (లాజిస్టిక్స్) తదితర అంశాలన్నీ పరిగణనలోకి తీసుకొని భారీ ఖర్చుల్ని తగ్గించుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. ఓ పరిమిత బడ్జెట్‌తో నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకుంది.

ఆడించే 10 క్రీడాంశాలు ఇవే...

అథ్లెటిక్స్, స్విమ్మింగ్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్, ట్రాక్ సైక్లింగ్, నెట్‌బాల్, బాక్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, జూడో, లాన్ బౌల్స్, 3X3 బాస్కెట్‌బాల్ క్రీడాంశాలతోనే గ్లాస్గో ఈవెంట్ జరుగుతుంది. అథ్లెటిక్స్, స్విమ్మింగ్, ట్రాక్ సైక్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్, లాన్ బౌల్స్ క్రీడాంశాల్లో దివ్యాంగ అథ్లెట్ల కోసం కూడా పోటీలు ఉంటాయి. గ్లాస్గో కామన్వెల్త్ గేమ్స్ 2026 జూలై 23 నుంచి ఆగస్టు 2 వరకు జరుగుతాయి.

తొలగించిన క్రీడాంశాలు...

హాకీ, క్రికెట్ టీమ్ ఈవెంట్లతో పాటు బ్యాడ్మింటన్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్ (టీటీ), స్క్వాష్, రిథమిక్ జిమ్నాస్టిక్స్, డైవింగ్, బీచ్ వాలీబాల్ క్రీడలను గ్లాస్గో నిర్వాహక కమిటీ పక్కన బెట్టింది.

2022 బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్ గెలిచిన పతకాలు

రెజ్లింగ్ (12), వెయిట్‌లిఫ్టింగ్ (10), అథ్లెటిక్స్ (8), టేబుల్ టెన్నిస్ (7), బ్యాడ్మింటన్ (6), జూడో (3), బాక్సింగ్ (7), హాకీ (2), లాన్ బౌల్స్ (2), స్క్వాష్ (2), క్రికెట్ (1), పారా పవర్‌లిఫ్టింగ్ (1).



2022 గేమ్స్ టీటీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగం స్వర్ణ పతకాలతో శరత్ కమల్, ఆకుల శ్రీజ





2022 గేమ్స్ బ్యాడ్మింటన్ సింగిల్స్ స్వర్ణంతో సింధు

అందుకే 11 మందితో బరిలోకి దిగే పలు టీమ్ ఈవెంట్లతో పాటు మొత్తం 9 క్రీడాంశాలను తొలగించేసింది. కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్య నియమావళి ప్రకారం ఆతిథ్య వేదికకు ఆ వెసులుబాటు ఎప్పటి నుంచో ఉంది. దీన్ని అనుసరించి కేవలం నాలుగే వేదికల్లో పది క్రీడాంశాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేసింది. తద్వారా స్కాట్లాండ్ ప్రభుత్వం మోపెడు ఖర్చును తగ్గించి అనుకున్న బడ్జెట్‌లోపే ఈవెంట్‌ను నిర్వహించాలనుకుంటుంది.

> బ్యాడ్మింటన్‌ను తొలగించాలనే గ్లాస్గో నిర్ణయం నన్ను కలవరపాటుకు గురిచేసింది. తీవ్ర నిరాశలో ముంచింది. క్రీడల్లో ప్రగతి సాధించే భారత్‌లాంటి దేశాలకు ఇది గొడ్డలిపెట్టు. మన షట్లర్లు ఈ క్రీడాంశంలో ఎంతో కీర్తి ప్రతిష్టలు తెచ్చారు. అంతర్జాతీయ వేదికలో సత్తా చాటుకునే అవకాశాన్ని ఇలా కాలరాయడం నిజంగా దురదృష్టకరం.
> –పుల్లెల గోపీచంద్, భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్

> ఇంకెందుకు కామన్వెల్త్ గేమ్స్? పూర్తిగా ఈవెంట్‌నే పక్కన బెట్టేయండి. కేవలం ఒలింపిక్స్ ఆసియా క్రీడలతోనే సరిపెట్టుకుందాం. ఎందుకంటే కీలకమైన ఆటల్ని తొలగించడం వల్ల కామన్వెల్త్ ప్రభ కోల్పోతుంది. వారి నిర్ణయం నన్ను నిర్ఘాంత పరిచింది. ఇక మనం మన జట్టును కామన్వెల్త్ గేమ్స్‌కు పంపించాల్సిన అవసరమే లేదు.
> –విమల్ కుమార్, భారత బ్యాడ్మింటన్ కోచ్

> గ్లాస్గో నిర్వహించే పది క్రీడల్లో టేబుల్ టెన్నిస్ లేకపోవడం బాధాకరం. ఇదొక్కటే కాదు, తొలగించిన అన్ని క్రీడాంశాల ఆటగాళ్లకు ఎదురుదెబ్బ. ముఖ్యంగా టీటీలో మనం ఎన్నో స్వర్ణాలు గెలిచాం.
> –శరత్ కమల్, భారత టీటీ దిగ్గజం

భారత్ బదులు తీర్చుకునేనా!

- నేటి నుంచి జర్మనీతో హాకీ సిరీస్
- మధ్యాహ్నం గం. 3:00 నుంచి దూరదర్శన్ స్పోర్ట్స్, ఫ్యాన్‌కోడ్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ సెమీఫైనల్లో జర్మనీ జట్టు చేతిలో ఎదురైన ఓటమికి బదులు తీర్చుకునే అవకాశం భారత పురుషుల హాకీ జట్టుకు లభించింది. ప్రపంచ చాంపియన్ జర్మనీ జట్టుతో నేడు, రేపు జరిగే రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత జట్టు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. పదేళ్ల తర్వాత స్థానిక మేజర్ ధ్యాన్‌చంద్ నేషనల్ స్టేడియం అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వనుండటం విశేషం. చివరిసారి 2014లో వరల్డ్ లీగ్ ఫైనల్ మ్యాచ్‌కు ధ్యాన్‌చంద్ స్టేడియం వేదికగా నిలిచింది. పారిస్ ఒలింపిక్స్ సెమీఫైనల్లో భారత జట్టు 2–3తో జర్మనీ చేతిలో ఓడిపోయి ఫైనల్‌కు చేరుకోలేకపోయింది. ప్రస్తుత ప్రపంచ ర్యాంకింగ్స్‌లో జర్మనీ జట్టు రెండో స్థానంలో, భారత జట్టు ఐదో స్థానంలో ఉన్నాయి. ఇటీవల చైనాలో జరిగిన ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచిన భారత్ సూపర్ ఫామ్‌లో ఉంది. కెప్టెన్, డ్రాగ్ ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ రాణిస్తే భారత జట్టు పైచేయి సాధించే అవకాశముంది. భారత్, జర్మనీ జట్లు ముఖాముఖిగా ఇప్పటి వరకు 107 మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. 54 మ్యాచ్‌ల్లో జర్మనీ జట్టు గెలుపొందగా... 26 మ్యాచ్‌ల్లో భారత జట్టుకు విజయం దక్కింది. మరో 27 మ్యాచ్‌లు 'డ్రా'గా ముగిశాయి.

కైల్ వెరెన్ సెంచరీ

- దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ 308
- బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్ 101/3



కైల్ వెరెన్

మీర్పూర్: వికెట్ కీపర్ కైల్ వెరెన్ (144 బంతుల్లో 114; 8 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీతో చెలరేగడంతో బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా మెరుగైన స్థితిలో నిలిచింది. తొలి రోజు బౌలర్ల ఆధిపత్యం సాగిన మ్యాచ్‌లో రెండో రోజు బ్యాటర్లు ఆకట్టుకోవడంతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 88.4 ఓవర్లలో 308 పరుగులు చేసింది. టాపార్డర్ విఫలమైన చోట వెరెన్ సెంచరీతో కదం తొక్కగా... ముల్డర్ (54; 8 ఫోర్లు) అర్ధ శతకం నమోదు చేసుకున్నాడు. ఒకదశలో 108/6తో నిలిచిన జట్టును వెరెన్ ఆదుకున్నాడు. ముల్డర్‌తో కలిసి ఏడో వికెట్‌కు 119 పరుగులు జోడించడంతో దక్షిణాఫ్రికా కోలుకోగలిగింది. బంగ్లాదేశ్ బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ 5, హసన్ మహమూద్ 3 వికెట్లు పడగొట్టారు. లోయర్ ఆర్డర్ వీరోచిత పోరాటంతో దక్షిణాఫ్రికా జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 202 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ మంగళవారం ఆట ముగిసే సమయానికి 27.1 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 101 పరుగులు చేసింది. హసన్ (38 బ్యాటింగ్; 5 ఫోర్లు), ముష్ఫికర్ (26 బంతుల్లో 31 బ్యాటింగ్; 3 ఫోర్లు) పోరాడుతున్నారు. షాద్‌మన్ ఇస్లామ్ (1), మోమినుల్ హక్ (0) విఫలమయ్యారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో రబడ రెండు వికెట్లు పడగొట్టాడు. చేతిలో 7 వికెట్లు ఉన్న బంగ్లాదేశ్... ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 101 పరుగులు వెనుకబడి ఉంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

నా కష్టానికి తగిన గుర్తింపు ఇది - రామ్‌చరణ్



రామ్‌చరణ్

సింగపూర్‌లోని మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియంలో రామ్‌చరణ్ మైనపు విగ్రహం ఏర్పాటు కానున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది దుబాయ్‌లో జరిగిన ఇంటర్‌నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డు ప్రదానోత్సవంలో ఈ విషయాన్ని రామ్‌చరణ్ వెల్లడించిన విషయం గుర్తుండే ఉంటుంది. తాజాగా ఈ విగ్రహం కోసం మేడమ్ తుస్సాడ్స్ ప్రతినిధులు రామ్‌చరణ్ కొలతలను తీసుకున్న ఫొటోలను రిలీజ్ చేశారు. ఈ విషయంపై రామ్‌చరణ్ స్పందించారు. ''మేడమ్ తుస్సాడ్స్‌లోని ప్రముఖుల సరసన నా మైనపు విగ్రహం కూడా ఆవిష్కరణ కానుండటాన్ని గౌరవంగా భావిస్తున్నా. కళ పట్ల నాకున్న తపన, నా హార్డ్‌వర్క్‌కు గుర్తింపు దక్కినందుకు హ్యాపీగా ఉంది. రైమ్‌కు (చరణ్ పెంపుడు జంతువు) నా లైఫ్‌లో ఎంతో ప్రాముఖ్యత ఉంది. నా మైనపు విగ్రహంలో రైమ్ కూడా కనిపిస్తుంది'' అని పేర్కొన్నారు. ఇక సింగపూర్‌లోని మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియంలో అమితాబ్ బచ్చన్, షారుక్ ఖాన్, కాజోల్, కరణ్ జోహార్ తదితరుల మైనపు విగ్రహాలు ఉన్నాయి.

రౌడీ నా జీవితాన్ని మార్చింది!



నయనతార

''నానుమ్ రౌడీదాన్' (నేనూ రౌడీనే) సినిమా నా కెరీర్‌లో మర్చిపోలేని అనుభూతుల్ని మిగిల్చింది'' అంటున్నారు హీరోయిన్ నయనతార. విజయ్ సేతుపతి, నయనతార జంటగా విఘ్నేశ్ శివన్ దర్శకత్వం వహించిన చిత్రం 'నేనూ రౌడీనే'. 2015 అక్టోబరు 21న విడుదలైన ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రం విడుదలై తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ స్టిల్స్‌తో కూడిన ఓ వీడియోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు నయనతార. ''నేనూ రౌడీనే' సినిమా నా జీవితాన్ని పూర్తిగా మార్చింది. నా కెరీర్‌ను గొప్పగా మలుపు తిప్పిన ఈ చిత్రం తొమ్మిదేళ్ల క్రితం విడుదలై అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకొని మరచిపోలేని అనుభూతుల్ని అందించింది. ఈ విషయంలో ప్రేక్షకులకు రుణపడి ఉంటాను. ఇలాంటి గొప్ప సినిమాలో అవకాశం ఇచ్చినందుకు విఘ్నేశ్‌కు కృతజ్ఞతలు. ఈ సినిమాతో నటిగా కొత్త అనుభవాలు నేర్చుకున్నాను. ఈ సినిమా నాకు విఘ్నేశ్‌ను ఇచ్చింది'' అని పోస్ట్ చేశారు. కాగా 'నేనూ రౌడీనే' సినిమా చిత్రీకరణ సమయంలోనే నయనతార, విఘ్నేశ్‌ల మధ్య స్నేహం మొదలైంది. ఆ తర్వాత ఆ స్నేహం ప్రేమగా మారింది. 2021లో తమ ప్రేమను వెల్లడించిన వీరు 2022 జూన్ 9న వివాహబంధంలోకి అడుగుపెట్టారు. వీరిద్దరికీ ఉయిర్, ఉలగ్ అనే ట్విన్స్ ఉన్నారు.


జైలర్‌తో ధనుష్?



మామా అల్లుడు రజనీకాంత్, ధనుష్ సిల్వర్ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. హీరో రజనీకాంత్ టైటిల్ రోల్‌లో నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో 'జైలర్' సినిమా వచ్చిన సంగతి తెలిసిందే. 2023లో విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. దీంతో రజనీకాంత్‌తోనే 'జైలర్ 2' తీయాలని ప్రస్తుతం స్క్రిప్ట్ తయారు చేస్తున్నారు దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్. ఈ ఏడాది చివర్లో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. కాగా 'జైలర్ 2'లోని ఓ కీలక పాత్ర కోసం ధనుష్‌ను సంప్రదించారట నెల్సన్. ఈ ప్రత్యేక పాత్రలో నటించేందుకు ధనుష్ కూడా దాదాపు ఓకే చెప్పారట. ఇదిలా ఉంటే... ప్రస్తుతం చెన్నైలో జరుగుతున్న 'కూలీ' సినిమా చిత్రీకరణలో బిజీగా ఉన్నారు రజనీ. ఓ యాక్షన్ సీక్వెన్ చిత్రీకరిస్తున్నారని తెలిసింది. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం 2025లో విడుదల కానుంది.

జీరో టు హీరో

''కంటెంట్ ఉన్న సినిమాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తుంటారు. గతంలో నేను తీసిన 'బట్టల రామస్వామి బయోపిక్, అందరి బంధువయా' సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ దక్కింది. త్వరలోనే 'కాఫీ విత్ ఏ కిల్లర్, సోలో బాయ్' సినిమాల విడుదలను ప్లాన్ చేస్తున్నాం. ఈ చిత్రాలూ ప్రేక్షకులను అలరిస్తాయనే నమ్మకం ఉంది'' అని తెలిపారు నిర్మాత 'సెవెన్ హిల్స్' సతీష్. బుధవారం (అక్టోబరు 23) ఆయన బర్త్ డే. ఈ సందర్భంగా మంగళవారం సతీష్ మాట్లాడుతూ– ''క్రైమ్ థ్రిల్లర్‌గా రానున్న 'కాఫీ విత్ ఏ కిల్లర్' సినిమాకు ఆర్పీ పట్నాయక్ గారు దర్శకత్వం వహించారు. ఇక జీరో నుంచి హీరో అయ్యే ఓ అబ్బాయి కథగా 'సోలో బాయ్' సినిమా ఉంటుంది. ఇందులో గౌతమ్ కృష్ణ హీరోగా నటించారు. శ్వేతా అవస్తి, రమ్య పసుపులేటి హీరోయిన్లుగా నటించారు. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అని తెలిపారు.



సతీష్

ఆ డైట్ చాలా సవాల్‌గా అనిపించింది - శ్రీ మురళి



''మా అత్తగారిది నెల్లూరు. ఇంట్లో నా భార్య, అత్తగారు తెలుగే మాట్లాడతారు... అందుకే నాకు కూడా తెలుగు వస్తుంది. తెలుగులో విడుదలవుతున్న నా మొదటి సినిమా 'బఘీర'. దేశమంతా చూడదగ్గ మంచి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. అందుకే తెలుగులోనూ రిలీజ్ చేస్తున్నాం'' అని కన్నడ హీరో శ్రీమురళి అన్నారు. 'కేజీఎఫ్' ఫేమ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కథ అందించిన చిత్రం 'బఘీర'. డా. సూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో 'ఉగ్రం' ఫేమ్ శ్రీ మురళి, రుక్మిణీ వసంత్ జంటగా నటించారు. హోంబలే ఫిలింస్‌పై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ కన్నడ సినిమాని ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్‌ఎల్‌పీ తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తోంది. ఈ నెల 31న ప్రపంచ వ్యాప్తంగా 'బఘీర' విడుదల కానుంది. ఈ సందర్భంగా శ్రీ మురళి మాట్లాడుతూ– ''ప్రశాంత్ నీల్‌గారి కథని సూరిగారు వంద శాతం అద్భుతంగా స్క్రీన్ మీదకు తీసుకొచ్చారు. 'బఘీర' వ్యక్తిగతంగా నాకు చాలా ఇష్టమైన క్యారెక్టర్. ఈ సినిమా షూటింగ్‌లో నాకు గాయాలైనా పట్టించుకోలేదు. నాకు నా సినిమానే ముఖ్యం. నేను ఫుడ్ లవర్‌ని. ఈ సినిమా కోసం మూడేళ్లు లిక్విడ్ డైట్ చేశాను. అది చాలా సవాల్‌గా అనిపించింది. 'ఉగ్రం 2' కోసం నేను కూడా ఎదురు చూస్తున్నాను'' అని తెలిపారు.

అవార్డుల కోసం నటించను - నిత్యామీనన్



''అవార్డులు, రివార్డుల కోసం సినిమాల్లో నటించను. నా పాత్రకి ప్రాధాన్యత ఉంటేనే చేస్తాను'' అంటున్నారు హీరోయిన్ నిత్యామీనన్. కెరీర్ ప్రారంభం నుంచి నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకుల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నారు ఈ మలయాళ బ్యూటీ. ఇక ధనుష్ హీరోగా, నిత్యామీనన్ హీరోయిన్‌గా నటించిన తమిళ చిత్రం 'తిరుచిత్రంబళం' (తెలుగులో 'తిరు'). మిత్రన్ జవహర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో తన అద్భుతమైన నటనకుగాను ఇటీవల జరిగిన 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ నటిగా అవార్డు అందుకున్నారు నిత్యామీనన్. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో తన సినిమాల ఎంపిక గురించి మాట్లాడుతూ– ''తిరు'కి జాతీయ ఉత్తమ నటిగా అవార్డు అందుకుంటానని ఊహించలేదు. అవార్డులు, రివార్డుల కోసం సినిమాల్లో నటించను. నేను పోషించిన ప్రతి పాత్రకు గుర్తింపు రావాలనుకోను. ఆ పాత్ర నాకు సంతోషాన్నిస్తే చాలనుకునే ఎంపిక చేసుకుంటాను. భారీ బడ్జెట్‌తో తీసే మసాలా సినిమాల్లో చాన్స్ వచ్చినా మొహమాటం లేకుండా చేయనని చెబుతాను. అలాంటి పాత్రలపై నాకు ఆసక్తి లేదు. మంచి పాత్ర అయితే చిన్న సినిమా అయినా అంగీకరిస్తాను. అందరూ అనుసరిస్తున్న మార్గంలోనే నేను కూడా వెళ్లాలనే రూల్ లేదు కదా?'' అని పేర్కొన్నారు.

చాలా పెద్ద కథ అనిపించింది - డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా



నిశాంక్ రెడ్డి, సాహిత్, సందీప్ రెడ్డి, అనన్య, యువచంద్ర

''పొట్టేల్' సినిమా చూశాను.. చాలా బాగా నచ్చింది. కథ విన్నాక ఇది చిన్న కథ కాదు చాలా పెద్ద కథ అనిపించింది. సాహిత్ ఇంత అద్భుతంగా తీస్తాడని ఊహించలేదు. నాకు చాలా పెద్ద బడ్జెట్ మూవీలా కనిపించింది. నిర్మాతలు చాలా ప్యాషన్‌తో తీశారు. అజయ్, యువ, అనన్య, నోయల్, జీవా అందరూ సూపర్‌గా నటించారు. యువ దర్శకులు ఎవరూ ఇటీవల పూర్తి స్థాయి గ్రామీణ నేపథ్యంలో సినిమా చేయలేదనుకుంటున్నాను. ఆ నేపథ్యంలో 'రంగస్థలం' చిత్రం తర్వాత నేను చూసిన సినిమా 'పొట్టేల్'. ఈ సినిమాని అందరూ ప్రోత్సహించాలి'' అని డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కోరారు. యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'పొట్టేల్'. సాహిత్ మోత్కూరి దర్శకత్వంలో నిశాంక్ రెడ్డి కుడితి, సురేష్ కుమార్ సడిగే నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి సందీప్ రెడ్డి వంగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యువ చంద్రకృష్ణ మాట్లాడుతూ– ''చిరంజీవిగారి స్ఫూర్తితో మొదలైన నా జర్నీ ఇక్కడ వరకూ వచ్చింది. 'పొట్టేల్'లో చాన్స్ ఇచ్చిన దర్శక-నిర్మాతలకు థ్యాంక్స్'' అన్నారు. ''ఇటీవల ఏ సినిమాకీ పొందని అనుభూతిని ప్రేక్షకులు మా 'పొట్టేల్'తో పొందుతారు'' అని సాహిత్ చెప్పారు. ''చదువు విలువ అందరికీ తెలియాలనే ఉద్దేశంతో తీసిన సినిమా ఇది'' అన్నారు సురేష్ కుమార్. ''పొట్టేల్' లాంటి సినిమా తీసిన నా ఫ్రెండ్ సాహిత్ పేరు చాలా కాలం గుర్తుండిపోతుంది'' అన్నారు నిశాంక్ రెడ్డి.

నవంబరులో ధూం ధాం



చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్

చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా నటించిన చిత్రం 'ధూం ధాం'. సాయి కిషోర్ మచ్చా దర్శకత్వంలో ఎంఎస్ రామ్ కుమార్ నిర్మించిన చిత్రం ఇది. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీగా రానున్న ఈ సినిమా నవంబరు 8న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా టీజర్‌ను దర్శక-నిర్మాత మారుతి విడుదల చేసి, టీజర్ బాగుందని చెప్పి, యూనిట్‌కి శుభాకాంక్షలు తెలిపారు. ''ఈ చిత్రంలో లవ్‌స్టోరీతో పాటు తండ్రీ కొడుకుల మధ్య ఉండే మంచి ఎమోషనల్ బాండింగ్ కనిపిస్తుంది. లవ్, ఫ్యామిలీ, ఎమోషన్, యాక్షన్, కామెడీ... ఇలా థియేటర్స్‌లో ప్రేక్షకులు చూసి, ఎంజాయ్ చేసే అన్ని కమర్షియల్ అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
931	309
80,221	24,472

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	18,574	△	33
డోజోన్స్	42,976	△	45
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,307	▽	12
డాక్స్	19,422	▽	39
షాంఘై	3,286	△	18
నికాయ్	38,412	▽	543

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	78,251 △	37
బంగారం (99.5 స్వచ్ఛత)	77,938 △	37
వెండి (కిలో)	98,372 △	1138

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.67	84.69
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	107.95	111.80
€	యూరో	ఎస్‌బీఐ	89.75	92.37
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.06	56.48
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.14	57.33
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	61.57	66.24
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.52	23.08
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.00	23.78
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.93	12.75

మార్కెట్ల భారీ పతనం

- అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూలతలు
- మెప్పించని కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు
- విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాల ప్రభావం
- సెన్సెక్స్ 931 పాయింట్లు... నిఫ్టీ 309 పాయింట్లు డౌన్
- రూ.9 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

టపటపా!

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లలో మంగళవారం అమ్మకాలు వెల్లువెత్తాయి. సూచీలు భారీగా నష్టపోయాయి. బెంచ్‌మార్క్ ఇండెక్సులు సెన్సెక్స్, నిఫ్టీ ఒక శాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ 931 పాయింట్లు పతనమైన 80,221 వద్ద స్థిరపడగా... నిఫ్టీ 309 పాయింట్లు క్షీణించి 24,472 వద్ద నిలిచింది. ముగింపు స్థాయిలు రెండు నెలల కనిష్టం కావడం గమనార్హం. ఉదయం స్తబ్దుగా మొదలైన సూచీలు అంతర్జాతీయ మార్కెట్లోని ప్రతికూల సంకేతాలతో నష్టాల బాటపట్టాయి. ఇన్వెస్టర్లు అమ్మకాలకే మొగ్గుచూపడంతో ట్రేడింగ్ గడిచే కొద్దీ నష్టాల తీవ్రత మరింత పెరిగింది. ఒక దశలో సెన్సెక్స్ 1,002 పాయింట్లు క్షీణించి 80,149 వద్ద, నిఫ్టీ 335 పాయింట్లు పతనమై 24,446 వద్ద కనిష్టాలు తాకాయి. వాస్తవానికి ఇండెక్సులు ఒక శాతమే నష్టపోయినా... మిడ్, స్మాల్ క్యాప్ షేర్లు చాలావరకూ భారీగా పతనమయ్యాయి. కొన్ని డిఫెన్స్ రంగ షేర్లు 10-12 శాతం వరకూ పతనం కాగా... ప్రభుత్వ బ్యాంకులతో సహా పలు ప్రధాన రంగాల షేర్లు 3-6 శాతం మధ్యలో నష్టపోయాయి.

అన్ని రంగాల షేర్లలోనూ అమ్మకాలే

ఇంట్రాడేలో అన్ని రంగాల షేర్లలోనూ విక్రయాలు వెల్లువెత్తాయి. సూచీల వారీగా అత్యధికంగా ఇండస్ట్రియల్ ఇండెక్స్ 3.50% నష్టపోయింది. రియల్టీ 3.30%, కమోడిటీ 3%, పవర్ 2.64%, యుటిలిటి, టెలికం, కన్జూమర్ డిస్కేషనరీ సూచీలు 2.50 నష్టపోయాయి. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ సూచీ ఏకంగా 4% పతనమైంది. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 2.50% నష్టపోయింది. ఆసియాలో చైనా, హాంగ్‌కాంగ్ సూచీలు మినహా అన్ని దేశాల ఇండెక్సులు నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు 1.50% పడిపోగా. అమెరికా స్టాక్ సూచీలు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

> సూచీలు ఒకశాతానికి పైగా పతనం కావటంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మొత్తం విలువ మంగళవారం ఒక్క రోజే రూ.9.19 లక్షల కోట్లు హరించుకుపోయింది. దీంతో బీఎస్‌ఈలో మార్కెట్ విలువ రూ.444.45 లక్షల కోట్లకు (5.29 ట్రిలియన్ డాలర్లు) దిగివచ్చింది.

నష్టాలు ఎందుకంటే..

కార్పొరేట్ కంపెనీల సెప్టెంబర్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. తాజాగా ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా క్షిపణి దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రతరమయ్యాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్... నవంబర్‌లో పావుశాతం మేరకే వడ్డీరేట్లను తగ్గించవచ్చనే అంచనాలున్నాయి. అమెరికా పదేళ్ల బాండ్లపై రాబడులు 3 నెలల గరిష్టానికి (4.21%), డాలర్ ఇండెక్సు 103.96 స్థాయికి చేరుకున్నాయి. ఇవన్నీ అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన ధోరణులకు కారణమయ్యాయి.

➡ సెన్సెక్స్‌లోని 30 షేర్లలో ఒక్క ఐసీఐసీఐ బ్యాంకు షేరు 0.67% లాభంతో గట్టెక్కింది. ఎంఅండ్‌ఎం 4%, టాటా స్టీల్ 3%, ఎస్‌బీఐ 2.95%, టాటా మోటార్స్ 2.64%, ఇండస్ ఇండ్ బ్యాంక్ 2.50%, రిలయన్స్ 2%, ఎల్‌అండ్‌టీ 2%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 1% చొప్పున నష్టపోయాయి.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మరింత చేరువగా బీఎస్‌ఎన్‌ఎల్	ద్వితీయ శ్రేణి నగరాల్లో తగ్గిన ఇళ్ల అమ్మకాలు

అదానీ చేతికి ఓరియంట్ సిమెంట్

- రూ. 8,100 కోట్ల డీల్
- 46.8 శాతం వాటా కొనుగోలు
- అదనంగా 26 శాతం వాటాకు ఓపెన్ ఆఫర్

న్యూఢిల్లీ: సిమెంట్ పరిశ్రమలో స్థానాన్ని మరింత పటిష్టం **చేసుకునే దిశగా** అదానీ గ్రూప్ కొనుగోళ్ల పరంపర కొనసా**గిస్తోంది. తాజా**గా సీకే బిర్లా గ్రూప్‌లో భాగమైన **ఓరియంట్** సిమెంట్ (ఓసీఎల్) కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంది. డీల్ విలువ సుమారు రూ. 8,100 కోట్లుగా ఉండనుంది. కంపెనీ ప్రకటన ప్రకారం అదానీ గ్రూప్‌లో భాగమైన అంబుజా సిమెంట్స్ సంస్థ... ఓరియంట్ సిమెంట్‌లో 46.8 శాతం వాటాలను చైర్మన్ సీకే బిర్లాతో పాటు నిర్దిష్ట పబ్లిక్ షేర్‌హోల్డర్ల నుంచి రూ.3,791 కోట్లకు కొనుగోలు చేయనుంది. దీంతో మరో 26 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు ఓపెన్ ఆఫర్ ఇవ్వాల్సి ఉంది. ఒక్కో ఓసీఎల్ షేరుకు రూ. 395.40 రేటు చొప్పున చెల్లించనున్నట్లు, ఈ కొనుగోలుతో తమ మార్కెట్ వాటా రెండు శాతం మేర పెరగనున్నట్లు అంబుజా సిమెంట్స్ తెలిపింది. ఇందుకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. 'ఓసీఎల్ కొనుగోలుతో అంబుజా 2025 ఆర్థిక సంవత్సరం నాటికి 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధిస్తుంది. కీలక మార్కెట్లలో విస్తరించడా



నికి, మార్కెట్ వాటాను 2% మేర పెంచుకోవడానికి ఈ డీల్ తోడ్పడుతుంది' అని అంబుజా సిమెంట్స్ డైరెక్టర్ కరణ్ అదానీ తెలిపారు. టెక్నాలజీ, సర్వీస్ ఆధారిత వ్యాపారాలపై మరింత ఇన్వెస్ట్ చేసే క్రమంలో విక్రయ నిర్ణయం తీసుకున్నట్లు ఓరియంట్ సిమెంట్ చైర్మన్ సీకే బిర్లా తెలిపారు.

అదనంగా మరో 8.5 మిలియన్ టన్నుల సామర్థ్యం .. ఓరియంట్ సిమెంట్‌కు పశ్చిమంలో ఒకటి, దక్షిణాదిలో ఒకటి చొప్పున మొత్తం 2 సిమెంట్ ప్లాంట్లు ఉన్నాయి. వీటి ఉత్పత్తి సామర్థ్యం 8.5 మిలియన్ టన్నులు. అలాగే, మరో 8.1 మిలియన్ టన్నుల ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నాయి. రాజస్తాన్‌లోని చిత్తోర్‌గఢ్‌లో అత్యంత నాణ్యమైన సున్నపురాయి గని ఈ సంస్థ సొంతం. ఓసీఎల్ కొనుగోలుతో అంబుజా సామర్థ్యం 97.4 మిలియన్ టన్నులకు పెరుగుతుంది.

జొమాటో లాభం పోల్‌వాల్ట్

క్యూ2లో రూ. 176 కోట్లు ● 8,500 కోట్ల సమీకరణకు సై



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ కంపెనీ జొమాటో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 5 రెట్లు ఎగసి రూ.176 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ.36 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,848 కోట్ల నుంచి రూ. 4,799 కోట్లకు జంప్‌చేసింది. అర్హతగల సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్ల జారీ (క్విప్) ద్వారా రూ. 8,500 కోట్ల సమీకరణకు బోర్డు అనుమతించినట్లు జొమాటో తెలిపింది. కాగా, 4 వారాల్లో డిస్ట్రిక్ట్ యాప్‌ను ప్రవేశపెట్టనున్నట్లు జొమాటో వ్యవస్థాపకుడు, సీఈవో దీపిందర్ గోయల్ పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ ద్వారా డైనింగ్, మూవీస్, స్పోర్ట్స్ టికెటింగ్, షాపింగ్ తదితర గోయింగ్ అవుట్ సర్వీసులను కన్సాలిడేట్ చేయనున్నట్లు వివరించారు.

ఫలితాల నేపథ్యంలో జొమాటో షేరు ఎన్‌ఎస్‌ఈలో 3.5 శాతం నష్టంతో రూ. 257 వద్ద ముగిసింది.

వెండి @ 1,01,000

ఆల్‌టైమ్ రికార్డు ధర: 1,500 జంప్

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరల రికార్డులు కొనసాగుతున్నాయి. న్యూఢిల్లీలో కేజీ వెండి ధర సోమవారంతో పోల్చితే మంగళవారం రూ.1,500 పెరిగి రూ.1,01,000కు చేరింది. వెండి రూ.లక్ష దాటడం ఇదే తొలిసారి. గత ఐదు రోజులుగా వెండి లాభాల బాటన పయనిస్తోంది. ఇక బంగారం 99.9 పూర్తి స్వచ్ఛత ధర క్రితం ముగింపుతో పోల్చితే రూ.350 పెరిగి రూ. 81,000కు చేరింది. ఇక 99.5 స్వచ్ఛత ధర కూడా ఇదే స్థాయిలో పెరిగి రూ.80,600కు చేరినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. అటు అంతర్జాతీయంగా ఇటు దేశీయంగా ఫ్యూచర్స్ మార్కెట్లలో బంగారం, వెండి పటిష్ట స్థాయిల్లో ట్రేడవుతున్నాయి. అమెరికా సరళతర వడ్డీరేట్ల విధానం, భౌగోళిక ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి వంటి అంశాలతో ఇన్వెస్టర్లను బంగారం ఆకర్షిస్తోంది. దీనికితోడు దేశీయంగా పండుగల సీజన్ నేపథ్యంలో భారీ కొనుగోళ్లు, రూపాయి బలహీనత విలువైన మెటల్ ధరలు పెరగడానికి కారణమని బులియన్ వ్యాపారులు తెలిపారు. పారిశ్రామిక డిమాండ్ పెరగటమే వెండి ధర పరుగుకు ప్రధాన కారణం.



ఒలెక్ట్రా లాభం 156% జంప్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్‌కు (ఎంఈఐఎల్) చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 156% ఎగసి రూ.47.6 కోట్లకు ఎగసింది. టర్నోవర్ 70 శాతం దూసుకెళ్లి రూ.524 కోట్లుగా నమోదైంది. ఈ త్రైమాసికంలో ఈ-బస్‌ల డెలివరీలు 105 శాతం అధికమై 315 యూనిట్లకు చేరాయి. కంపెనీ ఇప్పటి వరకు 2,217 ఎలక్ట్రిక్ బస్‌ల డెలివరీలు పూర్తి చేసింది. 10,503 యూనిట్ల ఈ-బస్‌లకు తమ చేతిలో ఆర్డర్లు ఉన్నాయని ఒలెక్ట్రా సీఎండీ కె.వి.ప్రదీప్ వెల్లడించారు.





లిస్టింగ్‌లో 'హ్యుందాయ్' రివర్స్ గేర్

దేశంలో అతిపెద్ద ఐపీఓగా సంచలనం సృష్టించిన హ్యుందాయ్ మోటార్స్ ఇండియా మంగళవారం లిస్టవుతూనే నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.1,960)తో పోలిస్తే ఒకటిన్నర శాతం డిస్కౌంట్‌తో రూ.1,931 వద్ద లిస్టయ్యింది. ప్రారంభంలో కాస్త రికవరీ అయ్యి అరశాతం పెరిగి రూ.1,969 వద్ద గరిష్టాన్ని తాకింది. అయితే ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగటంతో నష్టాల్లోకి మళ్లింది. ఒక దశలో 8% పతనమై రూ.1,807 ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. చివరికి 7% నష్టంతో రూ.1,820 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.48 లక్షల కోట్లుగా నమోదై దేశీయ ఆటో కంపెనీల్లో విలువ పరంగా ఐదవ స్థానంలో నిలిచింది. కాగా రూ.3.74 లక్షల కోట్లతో మారుతీ సుజుకీ అగ్రస్థానంలో కొనసాగుతోంది. హ్యుందాయ్ సంస్థ 1996 నుంచి భారత్‌లో వ్యాపార కార్యకలాపాలు సాగిస్తోంది.

రిలయన్స్, వాల్ట్ డిస్నీ డీల్‌కు సీసీఐ ఆమోదం

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్, వాల్ట్ డిస్నీల మీడియా అసెట్స్ విలీన ప్రతిపాదనకు దాదాపు రెండు నెలల తర్వాత కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ) ఆమోదముద్ర వేసింది. ఇందుకోసం కొన్ని షరతులు విధిస్తూ మంగళవారం 48 పేజీల ఉత్తర్వులను జారీ చేసింది. వీటి ప్రకారం ఇరు సంస్థలు ఏడు టీవీ చానళ్లను విక్రయించాలి. వీటిలో స్టార్ జల్సా మూవీస్, కలర్స్ మరాఠీ, హంగామా మొదలైనవి ఉన్నాయి. అలాగే క్రికెట్ ఈవెంట్ల ప్రసారాల అడ్వర్టైజ్‌మెంట్ స్లాట్లకు సంబంధించి



బండిల్డ్ విధానంలో వసూలు చేయకూడదు. ఐపీఎల్, ఐసీసీ, బీసీసీఐ వంటి కీలక క్రికెట్ టోర్నీల మ్యాచ్‌ల ఫీడ్‌ను ప్రసార భారతితో షేర్ చేసుకోవాల్సి ఉంటుంది. మరోవైపు, ఇరు సంస్థల ఓటీటీ ప్లాట్‌ఫాంలు (స్టార్‌కి చెందిన డిస్నీప్లస్‌హాట్‌స్టార్, రిలయన్స్‌లో భాగమైన వయాకామ్18కి చెందిన జియోసినిమా) వేర్వేరుగా కొనసాగుతాయి.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఇంటర్వ్యూకు సిద్ధమవుతారా..!

- » ముగిసిన సివిల్స్ మెయిన్ పరీక్షలు
- » సబ్జెక్ట్, సమకాలీన అంశాలపై ప్రశ్నలు
- » 800 మార్కులు కటాఫ్ ఉండొచ్చని అంచనా
- » పర్సనాలిటీ టెస్ట్‌పై దృష్టి పెట్టాలంటున్న నిపుణులు

సివిల్ సర్వీసెస్ మెయిన్ ఎగ్జామినేషన్-2024.. ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర ఉన్నత సర్వీసులకు ఎంపిక ప్రక్రియలో రెండో దశ! ఇటీవల సివిల్స్ మెయిన్స్ పరీక్షలు ముగిసాయి. దీంతో మెయిన్స్ తర్వాత ఏం చేయాలి.. ఇంటర్వ్యూకు సన్నద్ధమవ్వాలా.. కటాఫ్ ఎంత ఉంటుంది అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో.. సివిల్స్ మెయిన్-2024 పరీక్షల విశ్లేషణ తోపాటు, తదుపరి దశ పర్సనాలిటీ టెస్ట్‌లో రాణించేందుకు మెలకువలు..

సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్-2024 ద్వారా 1,056 పోస్టులను భర్తీ చేయనున్నట్లు యూపీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటించింది. ఇందుకోసం తొలి దశ ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించి.. 14,627 మందిని మెయిన్స్‌కు చేసింది. వీరిలో 2,300 నుంచి 2,500 మందికే చివరి దశ ఇంటర్వ్యూకు అర్హత లభించనుంది. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్ కేంద్రంలో 708 మంది, విజయవాడ కేంద్రంలో 136 మంది మెయిన్స్ పరీక్షలు రాసినట్లు సమాచారం.

మిశ్రమ స్పందన

సివిల్స్ మెయిన్స్-2024 పరీక్షలపై అభ్యర్థుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. జనరల్ ఎస్సే, జనరల్ స్టడీస్ నాలుగు పేపర్లు, రెండు ఆప్షనల్ పేపర్లు కలిపి మొత్తం ఏడు పేపర్లుగా.. 1,750 మార్కులకు పరీక్ష నిర్వహించారు. వీటిల్లో కొన్ని పేపర్లు క్లిష్టంగా, మరికొన్ని పేపర్లు సులభంగా ఉన్నాయని చెబుతున్నారు.

800 కటాఫ్ అంచనా

మెయిన్స్ పరీక్షలు రాసిన అభ్యర్థుల్లో తలెత్తే సందేహం.. ఎన్ని మార్కులు వస్తే తుది దశ ఇంటర్వ్యూకు ఎంపికయ్యే అవకాశం ఉంటుంది? అనేది. సివిల్స్ మెయిన్స్ పరీక్షల శైలిని విశ్లేషిస్తే.. కటాఫ్ మార్క్ ఓపెన్ కేటగిరీలో 800గా ఉండొచ్చనేది నిపుణుల అంచనా. దీంతో.. ఈ స్థాయిలో మార్కులు సాధిస్తామని భావిస్తున్న అభ్యర్థులు పర్సనాలిటీ టెస్ట్‌లో విజయానికి ఇప్పటి నుంచే సన్నద్ధత ప్రారంభించాలని సూచిస్తున్నారు.

పేపర్-1.. జనరల్ ఎస్సే

మెయిన్స్‌లో అభ్యర్థులు ఎంతో కీలకంగా భావించే జనరల్ ఎస్సే పేపర్ ఈ సారి సులభంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. తాత్విక దృక్పథం, విశ్లేషణను పరిశీలించేలా ప్రశ్నలు కనిపించాయి. ఎస్సేలు సామాజిక విలువలకు, సమకాలీన పరిస్థితులకు సంబంధించినవి కావడంతో అభ్యర్థులు కొంత సులభంగా ఉన్నట్లు భావించారని పేర్కొంటున్నారు.

పేపర్-2(జీఎస్-1) క్లిష్టంగానే

జనరల్ స్టడీస్ పేపర్-1 క్లిష్టంగానే ఉందంటున్నారు. ఆయా టాపిక్స్‌కు సంబంధించి లోతైన అవగాహన, సంపూర్ణ పరిజ్ఞానం ఉంటేనే సమాధానాలు రాయగలిగేలా ప్రశ్నలు అడిగారు. ప్రపంచ చరిత్ర, జాగ్రఫీ, భారత చరిత్ర అన్నింటికి సమ ప్రాధాన్యం ఇస్తూ ప్రశ్నలు ఎదురయ్యాయి. ఆధునిక భారత చరిత్రకు సంబంధించిన ప్రశ్నల క్లిష్టత స్థాయి ఓ మోస్తరుగా ఉన్నాయి. జాగ్రఫీకి ఎక్కువ వెయిటేజీ కల్పిస్తూ ప్రశ్నలు అడిగారు. ముఖ్యంగా ఎకనామిక్ జాగ్రఫీ సంబంధిత ప్రశ్నలు ఎదురయ్యాయి.

పేపర్-3 (జీఎస్-2).. ఓ మోస్తరు క్లిష్టత

జనరల్ స్టడీస్ పేపర్-2లో పరిపాలన, న్యాయపరమైన అంశాలు, అంతర్జాతీయ సంబంధాలపై ప్రశ్నలు అడిగారు. సమకాలీన అంశాలతో ముడిపెడుతూ ప్రశ్నలు ఎదురయ్యాయి. మొత్తం 20 ప్రశ్నల్లో.. రాజ్యాంగ సిద్ధాంతాలు, న్యాయపరమైన అంశాలు, పరిపాలన, స్థానిక సంస్థలకు సంబంధించిన ప్రశ్నలు కనిపించాయి. అదే విధంగా.. కేస్ స్టడీ ఆధారిత ప్రశ్నలు కూడా అడిగారు. ముఖ్యంగా సమకాలీన అంశాలను కోర్ సబ్జెక్ట్‌లతో సమ్మిళితం చేస్తూ సమాధానాలు ఇచ్చే విధంగా ప్రశ్నలు కనిపించాయి.

పేపర్-4 (జీఎస్- 3).. సిలబస్ పరిధిలోనే

జీఎస్-3(పేపర్-4)లోని ప్రశ్నలన్నీ సిలబస్ పరిధిలోనే అడిగారు. దీంతో.. సిలబస్‌ను ఆసాంతం అవగాహన చేసుకున్న అభ్యర్థులు సులభంగానే సమాధానాలను రాసి ఉంటారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పాపులేషన్, భూ సంస్కరణలు, ఆహార ద్రవ్యోల్బణం పెరుగుదల, ఆర్‌బీఐ ద్రవ్య విధానం, సామాజిక సేవల్లో ప్రభుత్వ వ్యయం వంటి ప్రశ్నలు అడిగారు. కొన్ని ప్రశ్నలు సమకాలీన అంశాలతో ముడిపెడుతూ అడగడంతో కరెంట్ అఫైర్స్‌పై పట్టు ఉన్న అభ్యర్థులు సులభంగానే పరీక్ష రాసే అవకాశముందని పేర్కొంటున్నారు.

పేపర్-5 (జీఎస్-4)

నైతికత, చిత్తశుద్ధి, వైఖరి ఆధారితంగా ప్రశ్నలు అడుగుతున్న జీఎస్-4 పేపర్‌లో సంఘటనలపై ప్రశ్నలు అడిగారు. ఇందులో మొదటి సెక్షన్‌లో ఇంటిగ్రిటీ, ఎథిక్స్‌కు సంబంధించిన ప్రశ్నలు ఉన్నాయి. అభ్యర్థుల నిర్ణయ సామర్థ్యాన్ని, అదే విధంగా మోరల్ జడ్జిమెంట్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగారు. ఐఏఎస్ ఆఫీసర్‌గా విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ఎలా అధిగమిస్తారు అనే విషయం తెలుసుకునేలా కూడా ప్రశ్నలు ఎదురయ్యాయి.

ఆప్షనల్స్.. సబ్జెక్ట్ + సమకాలీనంగా

సివిల్స్ మెయిన్‌లో కీలకంగా భావించే పేపర్లు.. ఆప్షనల్ సబ్జెక్ట్ పేపర్లు. పేపర్-6, పేపర్-7లుగా అభ్యర్థులు ఎంచుకున్న సబ్జెక్ట్ నుంచి రెండు పేపర్లలో పరీక్ష జరిపారు. వీటిల్లో ముఖ్యంగా పాలిటీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, జాగ్రఫీలలో.. అధిక శాతం సబ్జెక్ట్ నైపుణ్యం ఆధారిత ప్రశ్నలే కనిపించాయి. దీంతో ఆప్షనల్స్‌పై పట్టు సాధించిన అభ్యర్థులు ఊరట చెందారు.



పర్సనాలిటీ టెస్ట్‌కు ఇలా

ఎంపిక ప్రక్రియలో చివరి దశ పర్సనాలిటీ టెస్ట్‌ను 275 మార్కులకు నిర్వహిస్తారు. సన్నద్ధత కోణంలో అభ్యర్థులు ప్రధానంగా వ్యక్తిగత అంశాలపై ప్రత్యేక శ్రద్ధతో వ్యవహరించాలి. అకడమిక్ నేపథ్యం, ఉద్యోగం చేస్తున్నట్లయితే ప్రొఫెషనల్ నేపథ్యం, కుటుంబ నేపథ్యం తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. పర్సనాలిటీ టెస్ట్‌లో అభ్యర్థుల నేపథ్యం, వారి దృక్పథం, వైఖరి తెలుసుకునేలా బోర్డ్ సభ్యులు ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి సివిల్స్‌ను ఎంచుకోవడానికి కారణం మొదలు సమకాలీన అంశాల వరకూ.. అన్ని కోణాలపై అవగాహన పెంచుకోవాలి.

సమకాలీన అంశాలు

అభ్యర్థులు సమకాలీన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితుల్లో ఇజ్రాయెల్- గాజా, ఇరాన్, లెబనాన్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధాలు, వాటి పర్యవసానాలు, వాటికి సంబంధించి మన దేశ వ్యూహాలపై స్పష్టమైన అభిప్రాయం ఏర్పరచుకోవాలి. జాతీయ స్థాయిలో ఇటీవల చర్చనీయాంశంగా మారుతున్న పరిణామాలపైనా అవగాహనతో ఉండాలి.

ప్రాంతీయ నేపథ్యం

ఇంటర్వ్యూకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు తమ రాష్ట్రం, జిల్లా, ప్రాంతం ప్రాధాన్యత గురించి తెలుసుకోవాలి. చారిత్రక నేపథ్యంపై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా ప్రస్తుతం స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకున్న సమస్యలు, వాటి పరిష్కారానికి అభ్యర్థుల సూచనలపైనా ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి స్థానిక పరిస్థితులు, సమస్యలపై అవగాహనతోపాటు, పరిష్కార మార్గాలతో సన్నద్ధమవ్వాలి.

ఆసక్తులు.. ఆకట్టుకునేలా

సివిల్స్ ఇంటర్వ్యూ అభ్యర్థులు.. తమ హాబీలపై కొంత కసరత్తు చేయాలి. చాలామంది బుక్ రీడింగ్, వాచింగ్ టీవీ అని, సింగింగ్, ప్లేయింగ్, మూవీస్ వంటి వాటిని పేర్కొంటారు. ఇంటర్వ్యూలో వీటిపైనా ప్రశ్నలు అడుగుతారనే విషయాన్ని గమనించాలి. దీంతోపాటు అభ్యర్థుల వ్యక్తిగత బలాలు, బలహీనతలకు సంబంధించిన ప్రశ్నలు కూడా ఎదురవుతున్నాయి. అభ్యర్థులు తమకున్న బలహీనతల గురించి చెప్పే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. 'అగ్రెసివ్‌నెస్', 'సహనం తక్కువ' వంటి సమాధానాలు చెప్పకపోవడమే మంచిది.

సూటిగా, స్పష్టంగా

పర్సనల్ ఇంటర్వ్యూ సమయంలో అభ్యర్థుల వ్యక్తిగత వ్యవహార శైలి కూడా విజయాన్ని నిర్దేశిస్తుంది. ప్రధానంగా తమ అభిప్రాయాలను సూటిగా,స్పష్టంగా చెప్పగలిగే సామర్థ్యం, ధైర్యం అలవర్చుకోవాలి. ఇందుకోసం తమ అభిప్రాయాలను బలపరిచే అంశాలను ఉదహరించేలా సన్నద్ధమవ్వాలి. తమ అభిప్రాయాన్ని ఎదుటి వారిని మెప్పించే విధంగా చెప్పాలి.

సమయస్ఫూర్తి

సివిల్స్ అభ్యర్థులు అలవర్చుకోవాల్సిన మరో లక్షణం.. సమయస్ఫూర్తి. ఈ లక్షణాన్ని పరిశీలించేందుకు.. 'మీరు ఒక ఐఏఎస్ అధికారిగా ఉన్నారు. ఆ ప్రాంతంలో ఫలానా సమస్య ఎదురైంది? దీనికి తక్షణ పరిష్కారంగా మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?' వంటి ప్రశ్నలు అడుగుతున్నారు. ఇలాంటి వాటికి సమాధానం ఇచ్చేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి.ప్రభుత్వ విధానాలను గౌరవిస్తూనే, రాజ్యాంగానికి అనుగుణంగా పరిష్కార చర్యలు చేపడతామనే విధంగా సమాధానాలు చెప్పాలి.

తక్కువ మార్కులే అనుకోవద్దు

మొత్తం 2025 మార్కులకు నిర్వహించే మూడంచెల సివిల్స్ ఎంపిక ప్రక్రియలో ఇంటర్వ్యూకు కేటాయించింది 275 మార్కులే. కాని తుది జాబితాలో నిలిచేందుకు ఇవే కీలకంగా మారుతున్నాయి. ఆయా అంశాలపై అవగాహనను, వ్యక్తిత్వ లక్షణాలను పరిశీలించే విధంగా ఇంటర్వ్యూ ఉంటోంది. దీంతో ఏ మాత్రం తడబాటుకు గురైనా.. కొద్ది మార్కుల తేడాతో విజయం చేజారే ఆస్కారముంది. కాబట్టి అభ్యర్థులు ఇప్పటి నుంచే సమకాలీన పరిణామాలు, వ్యక్తిత్వ లక్షణాలపై దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

జాబ్ పాయింట్

జిప్‌మర్, పుదుచ్చేరిలో 80 ఫ్యాకల్టీ పోస్టులు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మర్).. రెగ్యులర్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 80.
- » **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-28, అసిస్టెంట్ ప్రొఫెసర్-52.
- » **విభాగాలు:** అనెస్తీషియాలజీ, అనాటమీ, పాథాలజీ, రేడియో డయాగ్నోసిస్, ఫిజియాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ఈఎన్‌టీ, ఇన్విరాన్‌మెంట్ హెల్త్, ఎండోక్రైనాలజీ, నెఫ్రాలజీ, సైకియాట్రీ, సర్జరీ, యూరాలజీ తదితరాలు.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వేతనం:** నెలకు ప్రొఫెసర్ పోస్టులకు రూ. 1,68,900 నుంచి రూ.2,20,400, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు రూ.1,01,500 నుంచి రూ.1,67,400.
- » **ఎంపిక విధానం:**రాతపరీక్ష,ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.11.2024.
- » **వెబ్‌సైట్:** https://jipmer.edu.in

పంజాబ్-సింధ్ బ్యాంక్‌లో 100 అప్రెంటిస్‌లు

ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లోని పంజాబ్-సింధ్ బ్యాంక్ శాఖల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 100. స్టైపెండ్: నెలకు రూ.9000. శిక్షణ కాలం: 12 నెలలు.
- » **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 01.10.2024 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **ఎంపిక విధానం:** విద్యార్హతలో సాధించిన మార్కులు, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.10.2024.
- » **వెబ్‌సైట్:** https://punjabandsindbank.co.in

పవర్‌గ్రిడ్‌లో 70 ట్రైనీ సూపర్‌వైజర్ పోస్టులు

గురుగ్రామ్‌లోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్) ట్రైనీ సూపర్‌వైజర్(ఎలక్ట్రికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 70.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 27 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.
- » **వేతనం:** నెలకు రూ.24,000.
- » **పరీక్ష కేంద్రాలు:** నాగ్‌పూర్, భోపాల్, బెంగళూరు, చెన్నై.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.11.2024.
- » **వెబ్‌సైట్:** www.powergrid.in

ఏఐఏఎస్‌ఎల్‌లో 1,066 పోస్టులు

ఏఐ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్(ఏఐఏఎస్ఎల్) ముంబై ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో.. ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన మూడేళ్ల కాలపరిమితికి వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 1,066.
- » **పోస్టుల వివరాలు:** డిప్యూటీ టెర్మినల్ మేనేజర్-ప్యాసింజర్-01, డ్యూటీ మేనేజర్-ప్యాసింజర్-19, డ్యూటీ ఆఫీసర్-ప్యాసింజర్-42, జూనియర్ ఆఫీసర్-కస్టమర్ సర్వీసెస్-44, ర్యాంప్ మేనేజర్-01, డిప్యూటీ ర్యాంప్ మేనేజర్-06, డ్యూటీ మేనేజర్-ర్యాంప్-40, జూనియర్ ఆఫీసర్-టెక్నికల్-31, డిప్యూటీ టెర్మినల్ మేనేజర్-కార్గో-02, డ్యూటీ మేనేజర్-కార్గో-11, డ్యూటీ ఆఫీసర్-కార్గో-19, జూనియర్ ఆఫీసర్-కార్గో-56, పారా మెడికల్ కమ్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్-01, సీనియర్ కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్/కస్టమర్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్-524, ర్యాంప్ సర్వీస్ ఎగ్జిక్యూటివ్-170, యుటిలిటీ ఏజెంట్ కమ్ ర్యాంప్ డ్రైవర్-100.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.ఎంబీఏ,డ్రైవింగ్ లైసెన్స్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి ట్రేడ్ టెస్ట్, డ్రైవింగ్ టెస్ట్, పర్సనల్/వర్చువల్ ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **ఇంటర్వ్యూ తేదీలు:** 22.10.2024, 23.10.2024, 24.10.2024, 25.10.2024, 26.10.2024.
- » **ఇంటర్వ్యూ వేదిక:** జీఎస్‌డీ కాంప్లెక్స్, సహార్ పోలీస్ స్టేషన్ దగ్గర, సీఎస్‌ఎంఐ విమానాశ్రయం, టెర్మినల్-2, గేట్ నెం.5, సహార్, అంధేరి-ఈస్ట్, ముంబై.
- » **వెబ్‌సైట్:** https://www.aiasl.in





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాక్షి ప్లస్
బుధవారం । 23-10-2024

కొమురం భీమ్ ఆశయ సాధనే లక్ష్యం



సాక్షి, హైదరాబాద్: ఆదివాసీ వీరుడు కొమురం భీమ్ జల్, జంగల్, జమీన్ నినాదమే.. సబ్బండ వర్గాలు ప్రత్యేక తెలంగాణ సాధనకు ఉద్యమించేలా ప్రేరణనిచ్చిందని అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. కొమురం భీమ్ త్యాగాలకు గుర్తుగా.. గతంలోనే పెదవాగు నదిపై ఆయన పేరుతో ప్రభుత్వం ప్రాజెక్టును చేపట్టిందని గుర్తు చేశారు. కొమురం భీమ్ జయంతి సందర్భంగా మంగళవారం సచివాలయంలో ఆయన చిత్రపటానికి మంత్రి సురేఖ నివాళులర్పించారు.


గురుకులాలను బాగు చేయాలి

మాజీమంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: గాడి తప్పిన గురుకుల విద్యా సంస్థలను బాగు చేయాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా హవేళి ఘనపూర్ గురుకుల పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు కరెంటు షాక్‌కు గురై గాయాల పాలవడం దురదృష్టకరమని హరీశ్‌రావు పేర్కొన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం విద్యార్థుల పట్ల శాపంగా మారుతోందని, ప్రభుత్వ పట్టింపులేనితనం పిల్లల ప్రాణాల మీదకు తెస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో గురుకుల విద్యాసంస్థల్లో పాములు, కుక్కల కాట్లు, ఎలుకలు కరవడం, ఫుడ్ పాయిజన్ కేసులు సర్వసాధారణమైపోయాయని, ఆ జాబితాలో కొత్తగా కరెంటు షాక్‌లు కూడా చేరాయన్నారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంతోపాటు కరెంటు షాక్‌తో గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడాలన్నారు.

మత విద్వేషాలు పెరగకుండా కృషి చేయాలి



సాక్షి, హైదరాబాద్: ఇటీవల సికింద్రాబాద్ దేవాలయంలో విగ్రహం ధ్వంసం ఘటన అత్యంత విచారకరమని, మతాల మధ్య విద్వేషాలు పెరగకుండా మత పెద్దలు, మేధావులు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. హైదరాబాద్ మహానగరంలో మతసామరస్యాన్ని కాపాడుకుందామని ఒక ప్రకటనలో ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనకు కారకులు, వారి వెనుక ఉన్న వారిని కఠినంగా శిక్షించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉపరాష్ట్రపతితో ఎంపీ అనిల్‌కుమార్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో.. రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ ఢిల్లీలో భేటీ అయ్యారు. మంగళవారం ఉప రాష్ట్రపతి అధికారిక నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించినట్లు అనిల్‌కుమార్ తెలిపారు. భేటీ సందర్భంగా.. తాను రెండుసార్లు తెలంగాణలో పర్యటించిన విషయాన్ని ఉపరాష్ట్రపతి గుర్తు చేశారని పేర్కొన్నారు.



ఢిల్లీలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసిన రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్

డిజిటల్ లావాదేవీల వైపు రుణగ్రహీతల మొగ్గు

- భారత్‌లో స్మార్ట్ ఫోన్లు, గృహోపకరణాల రుణాల్లో పెరుగుదల
- పారిశ్రామిక రుణాలు తీసుకోవడంలోనూ భారీ వృద్ధి
- గృహాలకు సంబంధించిన దీర్ఘకాలిక పెట్టుబడులపై అనాసక్తి
- వైద్య పరమైన అవసరాలకు తీసుకుంటున్న రుణాల్లో తగ్గుదల
- ఆన్‌లైన్ షాపింగ్‌లో మహిళలు, యువతదే అగ్రస్థానం
- ఈఎంఐ కార్డుల వినియోగంపై దిగువ మధ్యతరగతి ఆసక్తి
- రుణ యాప్‌ల వ్యక్తిగత డేటా సేకరణపై రుణగ్రహీతల్లో ఆందోళన
- హోమ్ క్రెడిట్ ఇండియా సంస్థ అధ్యయన ఫలితాల్లో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: దేశంలో నెలవారీ కిస్తీల చెల్లింపు (ఈఎంఐ), వెబ్‌సైట్, యాప్ ఆధారిత రుణాల పట్ల దిగువ, మధ్యతరగతి వర్గాలకు చెందిన రుణ గ్రహీతల్లో ఆసక్తి పెరుగుతోంది. స్మార్ట్‌ఫోన్లు, గృహోపకరణాల కొనుగోలు కోసం రుణాలు తీసుకునే ధోరణి వేగిరమైంది. పారిశ్రామిక రుణాలు తీసుకోవడంలోనూ రుణ గ్రహీతలు పోటీ పడుతున్నారు. గృహాల కొనుగోలు, మరమ్మతుల కోసం తీసుకునే రుణాల్లో కూడా వృద్ధి నమోదవుతోంది. పైచదువుల కోసం తీసుకునే రుణాల్లో గడిచిన నాలుగేళ్లలో పెద్దగా వ్యత్యాసం కనిపించడం లేదు. పెళ్లిళ్ల కోసం రుణాలు తీసుకునే వారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. హోమ్ క్రెడిట్ ఇండియా సంస్థ 'భారత్‌లో రుణగ్రహీతల తీరుతెన్నులు -2024'అధ్యయన ఫలితాలను ఈ నెల 17న విడుదల చేసింది. ఢిల్లీ, ఎన్సీఆర్, ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, పుణే, అహ్మదాబాద్, లక్నో, జైపూర్, భోపాల్, పాట్నా, రాంచీ, చండీగఢ్, లూధియానా, కొచ్చి, డెహ్రాడూన్ సహా 17 నగరాల్లో హోమ్ క్రెడిట్ ఇండియా సంస్థ అధ్యయనం చేసింది. నెలకు సగటున రూ.31 వేల ఆదాయంతో 18 నుంచి 55 ఏళ్ల మధ్య వయసు కలిగిన రుణగ్రహీతల నుంచి వివరాలు సేకరించింది.

డిజిటల్ ఆర్థిక లావాదేవీల్లో పెరుగుదల

నిరంతరాయంగా లావాదేవీలు నిర్వహించే సౌకర్యం, డిజిటల్ సాంకేతికతపై వినియోగదారుల్లో అవగాహన పెరగడంతో బ్రౌజర్ ఆధారిత బ్యాంకింగ్ కంటే యాప్ ఆధారిత బ్యాంకింగ్‌పై వినియోగదారులు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. యువత, మెట్రో నగరాల్లో యాప్ ఆధారిత బ్యాంకింగ్ వినియోగం ధోరణి ఎక్కువగా ఉంది. ఆన్‌లైన్ షాపింగ్ వినియోగం 2023లో 48 శాతం ఉండగా 2024లో 53 శాతానికి పెరిగింది. ఆన్‌లైన్ షాపింగ్ ధోరణిని ఎక్కువగా మహిళలు (60 శాతం), మిల్లేనియల్స్ (59 శాతం), జెన్ జెడ్ (58శాతం)లో కనిపించింది. మెట్రో, ద్వితీయ శ్రేణి నగరాలు (56 శాతం) ఆన్‌లైన్ షాపింగ్‌లో సమస్థాయిలో పోటీ పడుతున్నాయి. ఆన్‌లైన్ షాపింగ్ చేసే వారిలో కోల్‌కతా, కొచ్చి, హైదరాబాద్, చెన్నై, రాంచీ నగరాలు అగ్రస్థానంలో ఉన్నాయి.

పెరుగుతున్న ఈఎంఐ కార్డుల వినియోగం

ఒకేచోట ఇన్సూరెన్స్, లోన్లు, బిల్లుల చెల్లింపు వంటి ఆర్థిక సేవలు అందించే (ఎంబెడెడ్ ఫైనాన్స్) యాప్‌లు లేదా వెబ్‌సైట్‌లపైనా వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. ఉదాహరణకు 64 శాతం మంది ప్రధాన ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు (అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో)కు ప్రాధాన్యం ఇస్తున్నారు. 21 శాతం మంది ప్రయాణ యాప్స్ (మేక్ మై ట్రిప్, క్లియర్ ట్రిప్)ను ఎంచుకుంటున్నారు. 23 శాతం మంది ఆహార డెలివరీ యాప్స్ (జొమాటో, స్విగ్గీ) ఉపయోగిస్తున్నారు. లక్నో, పాట్నా, అహ్మదాబాద్, భోపాల్, రాంచీ వంటి నగరాల్లో ఎంబెడెడ్ ఫైనాన్స్ పట్ల ఆసక్తి ఎక్కువగా ఉంది. ఇదిలా ఉంటే ఈఎంఐ కార్డులు భారతదేశంలోని దిగువ, మధ్యతరగతి రుణగ్రహీతలు అత్యంత ప్రాచుర్యం పొందిన క్రెడిట్ సాధనంగా భావిస్తున్నారు. వేగంగా, నమ్మకంగా రుణం లభించే వేదికలుగా వీటిని పేర్కొంటున్నారు. వీటితోపాటు క్రెడిట్ కార్డులు, డిజిటల్ లెండింగ్ యాప్‌ల ద్వారా కూడా రుణం తేలిగ్గా లభిస్తుందనే అభిప్రాయం గ్రహీతల్లో కనిపించింది. ఇదిలా ఉంటే రుణగ్రహీతల్లో ఎక్కువ శాతం మంది బ్యాంకు శాఖలకు భౌతికంగా వెళ్లడం, కొందరు ఆన్‌లైన్‌లో దరఖాస్తు విధానాన్ని ఎంచుకుంటున్నారు.

పెరిగిన చాట్‌బాట్స్, వాట్సాప్ వాడకం

వినియోగదారుల సేవలో చాట్‌బాట్‌లకు (ఏఐ ఆధారిత మెసేజింగ్ యాప్‌లు) ఆదరణ వేగంగా పెరుగుతోంది. వీటి సేవలపై జెన్ జెడ్‌కు ఎక్కువ అవగాహన కలిగి ఉండగా, చాట్‌బాట్ వినియోగించడం సులభంగా ఉంటుందని రుణదాతలు భావిస్తున్నారు. వాట్సాప్ కూడా రుణ మార్కెట్‌లో కీలక మార్గంగా మారింది. 59 శాతం మంది రుణదాతలు వాట్సాప్ ద్వారా రుణ ఆఫర్లు పొందుతున్నారు. 2023 లో 24 శాతంగా ఉన్న రుణ ఆఫర్లు 2024 లో 26 శాతానికి పెరగడం వాట్సాప్ డిజిటల్ వేదికపై పెరుగుతున్న నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని అధ్యయనంలో తేలింది.

డేటా గోప్యత కోసం డిమాండ్

రుణ గ్రహీతల్లో డేటా ప్రైవసీ మార్గదర్శకాలకు సంబంధించి పెరుగుతున్న అవగాహన అంతరాన్ని కూడా అధ్యయనం ఎత్తిచూపింది. రుణ సంస్థలు అమలు చేయాల్సిన డేటా గోప్యత ఆవశ్యకతపై రుణ గ్రహీతల్లో క్రమంగా అవగాహన పెరుగుతోంది. దిగువ మధ్యతరగతి రుణదాతల్లో సుమారు 50 శాతం మందికి డేటా రక్షణ మార్గదర్శకాల గురించి అవగాహన లేదు. రుణ గ్రహీతల్లో సుమారు పావుశాతం మందికి మాత్రమే రుణ యాప్స్, వెబ్‌సైట్స్ ద్వారా తమ వ్యక్తిగత డేటా వాడకం తీరును అర్థం చేసుకుంటున్నారు. సుమారు ముప్పావు శాతం మంది తమ వ్యక్తిగత డేటా వినియోగంపై స్పష్టత కోరుతూ, డేటా వినియోగంలో పారదర్శకత కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఆర్థిక అక్షరాస్యత పెరగాల్సిన అవసరం ఉందని అధ్యయనం వెల్లడించింది. రుణ గ్రహీతలు ఇంటర్నెట్ బ్యాంకింగ్, రుణ వెబ్‌సైట్లు, యాప్‌లు, చెల్లింపు వాలెట్లు, ఇతర క్లిష్టమైన ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీల్లో సహాయం అవసరమని నివేదించారు. మహిళలు, జెన్ ఎక్స్‌తోపాటు, ద్వితీయ శ్రేణి నగరాల్లోని రుణగ్రహీతలు డిజిటల్ ఆర్థిక లావాదేవీల నిర్వహణలో ఇప్పటికీ సవాళ్లు ఎదుర్కొంటున్నారు.

భారత్‌లో రుణ గ్రహీతల ధోరణి (శాతాల్లో)

కేటగిరీ	2020	2024
స్మార్ట్‌ఫోన్లు, గృహోపకరణాల రుణాలు	1	37
పారిశ్రామిక రుణాలు	5	21
గృహ రుణాలు	9	15
వైద్య అవసరాలు	7	3
విద్యా రుణాలు	4	4
వివాహ రుణాలు	3	5

మారుపేర్లకు మోక్షమెప్పుడు?

- ఇంటి వద్ద ఒక పేరు.. గనిపై మరో పేరు..
- రెండేసి పేర్లతో కార్మికుల పాట్లు
- కారుణ్య నియామకాలు, పింఛన్లకు ఇబ్బంది
- పేరు మార్పునకు వెయ్యి మంది సింగరేణి కార్మికులు నిరీక్షణ

సాక్షి, పెద్దపల్లి: బొగ్గు గనిపై ఒకపేరు.. ఇంటి వద్ద మరోపేరుతో విధులు నిర్వహిస్తున్న సింగరేణి కార్మికులు.. తమ పేర్లను క్రమబద్ధీకరించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పరిష్కారం కావడం లేదు. సింగరేణిలో మారుపేర్లతో విధులు నిర్వహిస్తున్న కార్మికులను సొంత పేర్లకు మారుస్తామని ఎన్నికల వేళ వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నేతలు ఇచ్చిన హామీలకు మోక్షం కలగడం లేదు. సింగరేణి విస్తరించిన ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని 11 డివిజన్లలో సుమారు వెయ్యి మంది వరకు ఇలా మారుపేర్లతో సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీరేకాకుండా ఉద్యోగ విరమణ చేసినవారు, అన్‌ఫిట్ అయిన వారి డిపెండెంట్లు.. రానివారు అదనం. పేర్లలో తేడా ఉందనే సాకు చూపిస్తూ కార్మికుల వారసులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు విజిలెన్స్ విచారణ పేరిట అధికారులు కాలయాపన చేస్తున్నారు. భూపాలపల్లిలో ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని కార్మికులు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డుల ద్వారా విన్నవించారు.

పరుగు పందెంతో ఉద్యోగంలో చేరి..

1980వ దశకంలో సీఎండీ జీపీరావు పరుగు పందెం నిర్వహించి యువతకు బొగ్గు గనుల్లో ఉద్యోగావకాశాలు కల్పించారు. సింగరేణి సమీప ప్రాంతాల్లోని నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోగా ఎంప్లాయ్‌మెంట్ కార్డులు జారీ అయ్యాయి. ఆ కార్డుల్లో పేర్లు తప్పుగా నమోదయ్యాయి. ఇలాంటి వారు, ఇతరుల కార్డులు పట్టుకుని వచ్చి పరుగుపందెంలో పాల్గొని ఉద్యోగాలు సాధించారు. ఆ కార్డులో ఏ పేరుందో అదే పేరుతో ఉద్యోగంలో కొనసాగారు. కార్మికుల్లో నిరక్షరాస్యులు ఎక్కువ మంది ఉండటంతో.. తమ పేర్లను కార్మికులు ఏనాడూ రికార్డుల్లో పరిశీలించుకోలేదు. సొంత పేర్లను రికార్డుల్లో ఎక్కించుకోవాలన్న ఆలోచన కూడా వారికి రాలేదు. దీంతో దశాబ్దాల తరబడి మారు పేర్లతోనే వారు ఉద్యోగాలు చేస్తున్నారు.



సమస్య పరిష్కరించాలంటూ సీఎంకు పోస్టు కార్డులు రాస్తున్న కార్మికుల కుటుంబసభ్యులు(ఫైల్)

డిపెండెంట్ ఉద్యోగాలపై ప్రభావం

కార్మికులకు సింగరేణి సర్వీసు రికార్డుల్లో ఒక పేరు, వారి ఇంటి వద్ద ఆధార్ కార్డు, విద్యార్హతల సర్టిఫికెట్లు, తదితర పత్రాల్లో మరో పేరు ఉంటోంది. ఈ క్రమంలో కారుణ్య నియామకాలకు దరఖాస్తు చేసుకున్న కార్మికుల వారసులకు.. సర్వీస్ రికార్డులో ఉన్న పేరు కాకుండా, ఇంటి వద్ద ఉన్న పేరుతో ఆధార్ తదితర విద్య, కుల ధ్రువపత్రాలు ఉంటున్నాయి. దీంతో కార్మికుల పిల్లలు కొలువులో చేరేందుకు కూడా అడ్డంకిగా మారుతోంది. రికార్డుల్లో తండ్రీ కొడుకుల పేర్లు సరిగ్గా ఉన్నా.. విజిలెన్స్ విచారణ పేరిట ఊరిలో వేరే పేరుందని అభ్యంతరం వ్యక్తం చేస్తూ కొడుక్కి ఉద్యోగం ఇవ్వడం లేదని వాపోతున్నారు. గనిపై ఉన్న పేరుతోనే పిల్లలు చదివినా.. కొడుకు ఉద్యోగం విషయానికి వచ్చేసరికి.. విజిలెన్స్ విచారణ పేరుతో ఊర్లో తండ్రి పేరు వేరుగా ఉందంటూ ఉద్యోగాన్ని నిలిపివేస్తున్నారు.

రిటైర్డ్ కార్మికులకు తప్పని తిప్పలు

బొగ్గు గనిపై ఒకపేరు, సొంత గ్రామంలో మరోపేరు ఉండడంతో ఉద్యోగ విరమణానంతరం పింఛన్ కోసం కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోని పేరుతో భూములు, ఇళ్లు ఉండటం, గనిపై ఇంకో పేరు ఉండటంతో.. ఏ పేరుతో కొనసాగాలో తెలియక తర్జనభర్జన పడుతున్నారు. ఊర్లో పేరు మార్చితే భూముల రికార్డులన్నీ మారిపోతాయి. బాయి మీద పేరు మార్చితే పింఛన్ నిలిచిపోతుంది. దీంతో కార్మికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.



సొంత కొడుకునైనా..

మా నాన్న దొమ్మెటి లక్ష్మయ్య. సింగరేణిలో కార్మికుడిగా పనిచేసి మెడికల్ ఇన్వాలిడేషన్ అయ్యారు. నాకు అన్ని సర్టిఫికెట్లు ఉన్నాయి. అవన్నీ సమర్పించిన. అయినా మా ఊరిలో ఒకపేరు, బాయి మీద మరో పేరు ఉందనే సాకుతో ఉద్యోగం ఇవ్వడం లేదు.

–డి.రాజు, కార్మికుడి కొడుకు(పీడీపీ01)



ఎనిమిదేళ్లుగా ఎదురుచూపు..

మా నాన్న 30 ఏళ్లుగా 2–ఇంక్లయిన్‌లో పనిచేసి మెడికల్ అన్‌ఫిట్ అయ్యిండు. నాకు ఉద్యోగం వచ్చింది. విజిలెన్స్ విచారణలో పేరు తప్పుగా ఉందని మళ్లీ నన్ను పక్కకు పెట్టారు. ఎనిమిదేళ్లుగా ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాను.

– లక్క శ్రవణ్, కార్మికుడి కొడుకు

శాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్య

మంత్రి కొండా సురేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో శాంతికి విఘాతం కలిగించే చర్యలను ఏమాత్రం సహించబోమని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హెచ్చరించారు. ప్రార్థన మందిరాలను ఆధారం చేసుకుని పార్టీల నేతలు, వ్యక్తులు రాజకీయాలు చేయడం సరికాదని ఆమె ఒక ప్రకటనలో హితవు పలికారు. సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ దేవాలయంపై దాడి ఘటనను రాష్ట్ర ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణించిందని స్పష్టం చేశారు. ఘటన జరిగిన వెంటనే నిందితుడిని అరెస్టు చేశామని గుర్తు చేశారు. నిందితునికి చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ ఘటన ఆధారంగా కొన్ని అల్లరి మూకలు మతసామరస్యాన్ని దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆమె ఆరోపించారు. ప్రస్తుతం ఆలయంలో పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు బుధవారం ఆలయాన్ని సందర్శించాలని ఆదేశించినట్టు మంత్రి వెల్లడించారు.

మలేసియాకు మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మలేసియా పర్యటనకు వెళ్లారు. ఆయిల్ పామ్ సాగు విధానం, నూనె గింజల ఉత్పత్తి, నూనె ఉత్పత్తి.. తదితర అంశాలపై అధ్యయనం చేయటానికి మంగళవారం రాత్రి ఆయన మలేసియా బయలుదేరి వెళ్లారు. మూడు రోజులపాటు అక్కడ పర్యటించనున్నారు. ఉద్యానశాఖ ద్వారా రాష్ట్రంలో అమలు చేస్తున్న ఆయిల్ పామ్ ప్రాజెక్టును మరింత విజయవంతం చేయటానికి తీసుకోవలసిన చర్యలపై ఆయన అధ్యయనం చేయనున్నారు. ఆయనతోపాటు ఈ పర్యటనలో వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఉద్యాన కమిషనర్ యాస్మిన్ బాషా, అధికారులు సరోజిని, ఓఎస్డీ శ్రీధర్ తదితరులు పాల్గొంటున్నారు.

వచ్చేనెల 9 నుంచి ఎంటీఏ దశాబ్ది ఉత్సవాలు

- హాజరుకానున్న తెలుగు ప్రముఖులు
- మహేశ్‌కుమార్ గౌడ్, కేటీఆర్‌లకు ఆహ్వానం పంపిన మలేసియా తెలంగాణ అసోసియేషన్

సాక్షి, హైదరాబాద్: మలేసియా తెలంగాణ అసోసియేషన్ (ఎంటీఏ) ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా నవంబర్ 9 నుంచి దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మలేసియా తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు సైదం తిరుపతి తెలిపారు. ఈ దశాబ్ది ఉత్సవాలకు తెలంగాణకు చెందిన అన్ని రాజకీయపార్టీల ప్రముఖులు హాజరవుతారని మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లతో పాటు పలువురు ప్రముఖులను ఆహ్వానించినట్లు తెలిపారు. మలేసియాలోని కౌలాలంపూర్‌లో జరిగే ఈ ఉత్సవాలకు అక్కడి తెలంగాణ వాసులు భారీగా హాజరవుతారని చెప్పారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను మలేసియాలో పండుగ వాతావరణంలో జరుపుకునేందుకు ఈ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



మంగళవారం కొమురం భీం జయంతి సందర్భంగా నివాళులర్పిస్తున్న మండలి చైర్మన్ గుత్తా, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి శ్రీధర్‌బాబు. చిత్రంలో మధుసూదనాచారి, అరికెపూడి గాంధీ, ఆది శ్రీనివాస్, మైనంపల్లి తదితరులు



చిచ్చుబుడ్ల ఛత్రం..

విశాఖపట్నం దొండపర్తి కుమ్మరవీధిలో కుమ్మర వృత్తి (పాత కాలం నాటి చట్రం)తో దీపావళి ప్రమిదలు, చిచ్చుబుడ్లు తయారు చేస్తున్న శతాధిక వృద్ధుడు శ్రీకాకుళం పరదేశి.

– సాక్షి, ఫొటోగ్రాఫర్ నవాజ్, విశాఖపట్నం



'అనంత'మైన ఇంద్రధనస్సు

ఓ వైపు మేఘావృతం, మరోవైపు ఎండ, ఇంకోవైపు చిన్నగా చినుకులు కురుస్తున్న సందర్భంలో అనంతపురంలో ఇంద్రధనస్సు విల్లువిరిచింది. ఈ దృశ్యాన్ని సాక్షి తన కెమెరాలో బంధించింది.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, అనంతపురం, ఎండీ బాషా



అక్కడ స్పేస్ లేదు.. క్రియేట్ చేసుకున్నారు!

బైక్‌పై ఇద్దరికే పరిమితి ఉన్నా..కొన్ని సందర్భాల్లో ముగ్గురు వరకు వెళ్తుంటారు. కానీ తిరుపతిలో కొందరు యువకులు ఇలా నలుగురు ప్రయాణిస్తూ సాటి వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, మోహన్ కృష్ణ కేశారి, తిరుపతి

క్లుప్తంగా...

పాఠశాలలకు రూ.51.90 కోట్ల గ్రాంటు

సాక్షి,అమరావతి: ఏపీలోని 40,728 పాఠశాలల నిర్వహణ కోసం రూ.51.90 కోట్లు కాంపోజిట్ గ్రాంటు విడుదల చేస్తూ సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులిచ్చారు. ప్రాథమిక పాఠశాలలు, సెకండరీ, సీనియర్ సెకండరీ స్కూళ్లకు 2024–25 విద్యా సంవత్సరానికి గాను 50 శాతం గ్రాంటు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలోని 595 ఎయిడెడ్ పాఠశాలలకు కూడా స్కూల్ గ్రాంట్ విడుదల చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టిబాబు ఎలీకే చిన్నప్ప, ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

వరద బాధితులకిచ్చే రుణాలపై స్టాంప్ డ్యూటీ మినహాయింపు

సాక్షి, అమరావతి: ఇటీవల వరదల్లో నష్టపోయిన కుటుంబాలు తీసుకునే బ్యాంకు రుణాలపై స్టాంప్ డ్యూటీ, యూజర్ చార్జీలకు ప్రభుత్వం మినహాయింపునిచ్చింది. రూ.50 వేల లోపు బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలకు ఇది వర్తిస్తుందని తెలిపింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మంగళవారం ఉత్తర్వులిచ్చారు. రుణాల షెడ్యూల్ చేసుకున్నా ఈ మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. విజయనగరం, అల్లూరి , కాకినాడ, ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లో ఈ సంవత్సరం ఆగస్టు 30వ తేదీ తర్వాత వచ్చిన వరదల్లో నష్టపోయిన బాధితులకే ఈ వెసులుబాటు ఉంటుందని పేర్కొన్నారు.

స్వచ్ఛ రాజకీయాలకు యువత నడుం బిగించాలి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు



గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్నికల్లో ధన ప్రభావం నానాటికీ పెరిగి పోతోందని, ఒక్కో ఎమ్మెల్యే అభ్యర్థి కనీసం రూ.30 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోందని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. గుంటూరులోని బృందావన్‌గార్డెన్స్‌లో రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్న సందర్భంగా మంగళవారం వెంకయ్యనాయుడు ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. వెంకయ్య మాట్లాడుతూ..యువత రాజకీయాల్లోకి వచ్చి అవినీతి, అక్రమాలకు వ్యతిరేకంగా రాజకీయ ప్రక్షాళన చేయాలని పిలుపునిచ్చారు.

'కుంకీ'లొచ్చేనా... కలత తీర్చేనా?

పార్వతీపురం మన్యం జిల్లాను వణికిస్తున్న ఏనుగులు

- గజరాజుల దాడిలో ఇప్పటికే 11 మందికిపైగా మృత్యువాత
- రూ.కోట్లలో పంట, ఆస్తి నష్టం
- కర్ణాటక నుంచి కుంకీలను తీసుకువస్తామని హామీ ఇచ్చిన డిప్యూటీ సీఎం

సాక్షి, పార్వతీపురం మన్యం: కొన్నేళ్లుగా పార్వతీపురం మన్యం జిల్లాను కరి రాజులు వీడటం లేదు. ప్రస్తుతం జిల్లాలో 2 గుంపులు ఏనుగులు సంచరిస్తున్నాయి. ఇటీవల నిర్వహించిన సర్వేలో 11 వరకు గజరాజులు ఉన్నట్లు అధికారులు లెక్క తేల్చారు. ఏనుగుల కారణంగా ఇప్పటికే 12 మంది వరకు రైతులు, గిరిజనులు ప్రాణాలు కోల్పోయారు. రూ.6 కోట్ల మేర పంటలకు, ఇతర ఆస్తులకు ధ్వంసం వాటిల్లినట్లు అంచనా.

సరిహద్దులను దాటుకుంటూ ప్రవేశం..

ఆరేళ్ల క్రితం సరిహద్దులను దాటుకుంటూ జిల్లాలోకి ప్రవేశించాయి గజరాజులు. అప్పటి నుంచి ఎక్కడికక్కడ దాడులు చేస్తూ గిరిజనుల ప్రాణాలు తీస్తున్నాయి. పంటలు ధ్వంసం చేస్తున్నాయి. మరోవైపు ప్రమాదాల బారిన పడి గజరాజులూ మృత్యువాత పడుతున్నాయి. గత జూన్‌లో గరుగుబిల్లి మండలం తోటపల్లి సరిహద్దుల్లో అనారోగ్యంతో ఓ ఆడ ఏనుగు మృతి చెందింది. కొద్దిరోజుల క్రితం కొమరాడ మండలం వన్నాం గ్రామానికి చెందిన వాన శివున్నాయుడు(62) అనే వృద్ధుడిని ఏనుగులు తొక్కి చంపాయి. ఏళ్లుగా అటు అమాయక గిరిజనులతో పాటు.. ఇటు ఏనుగుల ప్రాణాలూ పోతున్నా ఈ సమస్యకు పరిష్కారం లభించడం లేదు.

ఆహార అన్వేషణలో మృత్యువాత..

2018 సెప్టెంబరు 7న శ్రీకాకుళం జిల్లా నుంచి 8 ఏనుగుల గుంపు జియ్యమ్మవలస మండలంలోకి ప్రవేశించింది. అదే నెల 16న అర్తాం వద్ద విద్యుదాఘాతానికి గురై ఒక ఏనుగు ప్రాణాలు కోల్పోయింది. ఆ తర్వాత దుగ్గి సమీపంలోని నాగావళి ఊబిలో కూరుకుపోయి మరో ఏనుగు మృత్యువాత పడింది. అంతకు ముందు 2010 నవంబర్‌లో అప్పటి శ్రీకాకుళం జిల్లాలోని వీరఘట్టం (ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా) మండలం కుంబిడి ఇచ్ఛాపురంలో 2 ఏనుగులు మృతి చెందాయి. గతంలో సాలూరు మండలంలో ఏనుగు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు వదిలింది. కొన్నాళ్ల క్రితం ×హరి≡ అనే మగ ఏనుగు గుంపు నుంచి తప్పిపోయింది. నెలలు గడిచినా దాని జాడ తెలియరాలేదు. గుంపులో కలవలేదు. గతేడాది మేలో జిల్లాలోని భామిని మండలం కాట్రగడ బీ వద్ద విద్యుదాఘాతంతో 4 ఏనుగులు మృత్యువాత పడ్డాయి. ఏనుగులు గుంపు ఇక్కడికి వచ్చిన తర్వాతే మరో 4 ఏనుగు పిల్లలకు జన్మనిచ్చినట్లు తెలుస్తోంది. ఆహార అన్వేషణలో భాగంగా అడవులను వదిలి, జనావాసాల మధ్యకు వస్తున్న ఏనుగులు.. విద్యుదాఘాతాలకు, రైతులు పంటల కోసం ఏర్పాటు చేసుకున్న రక్షణ కంచెలతో ప్రమాదవశాత్తు మృత్యువాత పడుతున్నాయి.

అటు ప్రాణ నష్టం..ఇటు పంట ధ్వంసం

ఏనుగులు దాడి చేయడంతో మనుషుల ప్రాణాలూ పోతున్నాయి. 2019 జనవరిలో కొమరాడ, జియ్యమ్మవలస మండలాలకు చెందిన నిమ్మక పకీరు, కాశన్నదొర ప్రాణాలు కోల్పోయారు. జిల్లాలో గజరాజుల ప్రవేశం నుంచి ఇప్పటి వరకు వాటి దాడిలో 11 మంది పైబడి మృతి చెందగా.. అనేక మంది గాయాలపాలయ్యారు. వేలాది ఎకరాల పంటలను ఇవి ధ్వంసం చేశాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి జిల్లాలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపును ఒడిశా ప్రాంతానికి తరలించినా..తిరిగి జిల్లాకు చేరుకుని కొమరాడ, పార్వతీపురం, జియ్యమ్మవలస, భామిని, సీతంపేట, గరుగుబిల్లి తదితర ప్రాంతాల్లో సంచరిస్తున్నాయి. ఇటీవల జిల్లాలో సంచరిస్తున్న ఏనుగుల సంఖ్యను నిర్ధారించేందుకు 3 రోజులపాటు అటవీ శాఖాధికారులు సర్వే చేపట్టారు. పార్వతీపురం డివిజన్ పరిధిలో ఏడు, పాలకొండ డివిజన్ పరిధిలో 4 ఏనుగులు తిరుగుతున్నట్లు గుర్తించారు.





పార్వతీపురం మన్యం జిల్లాలో సంచరిస్తున్న ఏనుగులు





జోన్‌తోనే సంరక్షణ!

కరిరాజులు ఆహారం, నీరు కోసం తరచూ జనావాసాల మధ్యకు వస్తున్నాయి. దీంతో గిరిజనుల పంటలు ధ్వంసం కావడంతో పాటు, పలువురు ఏనుగుల దాడిలో ప్రాణాలూ కోల్పోతున్నారు. ఇవి జనావాసాల మధ్యకు రాకుండా సాలూరులో జంతికొండ, కురుపాం పరిధిలోని జేకేపాడులో ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుకు 2020 డిసెంబర్‌లో అటవీ శాఖ అధికారులు నిర్ణయించారు. జంతికొండలో 526 హెక్టార్లు, జేకే బ్లాక్‌లో 661 హెక్టార్లలో అటవీ భూమిని గుర్తించారు. ఆ తర్వాత ఆ ప్రతిపాదన ముందుకు వెళ్లలేదు. తర్వాత కూడా ఏనుగుల సంరక్షణకు పార్వతీపురం మండలం డోకిశీల, చందలింగి, కొమరాడ మండలం పెదశాఖ, పాత మార్కొండపుట్టి ప్రాంతాలను పరిశీలించారు. చివరకు సీతానగరం మండలం జోగింపేట అడవులను ఏనుగుల పునరావస కేంద్రం కోసం ఎంపిక చేశారు. ఇప్పటి వరకూ ఏదీ కార్యరూపం దాల్చలేదు.

ఒడిశా నుంచి జిల్లాలోకి...

ఒడిశా రాష్ట్రం లఖేరి నుంచి తొలిసారిగా 1998 అక్టోబర్ 4న కురుపాం అటవీ ప్రాంతంలోకి ఏనుగులు ప్రవేశించాయి. వాటిని తరిమేసినా..1999 ఆగస్టులో కురుపాం, గుమ్మలక్ష్మీపురం కొండల్లోకి వచ్చాయి. మళ్లీ వాటిని వెనక్కి పంపారు. 2007–08 మధ్య గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, సీతంపేట, వీరఘట్టం ప్రాంతాల్లో పంటలను తీవ్రంగా నష్టపరిచాయి. ఆ సమయంలో వాటిని తరిమికొట్టేందుకు ×ఆపరేషన్ గజ≡ను చేపట్టారు. ఏనుగులకు మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి ఒడిశా తరలిస్తుండగా రెండు మృతి చెందాయి. దీంతో ఆ ఆపరేషన్‌ను నిలిపివేశారు. అప్పట్లో ఉమ్మడి విజయనగరం– శ్రీకాకుళం జిల్లాల మధ్య ఎలిఫెంట్ జోన్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసినా గిరిజనుల వ్యతిరేకత నేపథ్యంలో నిలిచిపోయింది.

కుంకీలను పంపేందుకు ఉప ముఖ్యమంత్రి హామీ

చిత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కరిరాజుల వల్ల జరుగుతున్న నష్టాన్ని నివారించడానికి కర్ణాటక నుంచి కుంకీలను తీసుకువచ్చేందుకు గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అందులో భాగంగా జిల్లాకూ కుంకీలను పంపుతామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. కుంకీలు పూర్తి స్థాయిలో శిక్షణ పొందిన ఏనుగులు. ఇవి వస్తే ఇక్కడున్న ఏనుగులతో సహవాసం చేసి, వాటిని తమకు అనుకూలంగా మలుచుకుంటాయి. జనారణ్యంలో తిరుగుతున్న గజరాజులను తిరిగి అరణ్యంలోకి వెళ్లేలా దిశానిర్దేశం చేస్తాయి. ఇదే సమయంలో కుంకీలను తీసుకువచ్చేందుకు జిల్లాలో అనువైన పరిస్థితులు లేవని అటవీ శాఖాధికారుల మాట. జిల్లాలో చిత్తూరు మాదిరి శిక్షణ పొందిన ఏనుగులను ఉంచేందుకు క్యాంపు లేదు. వాటి కోసం పని చేసేందుకు ప్రత్యేక సిబ్బంది లేరు. ఈ పరిస్థితుల్లో కుంకీల రాక ఉంటుందా, ఉండదా? అన్న సందేహాలు గిరిజన సంఘాల నుంచి నుంచి వ్యక్తమవుతున్నాయి.

కుంకీలను రప్పించాలి..

కర్ణాటక నుంచి కుంకీలను త్వరగా జిల్లాకు రప్పించి ఇక్కడున్న ఏనుగులను అడవికిగానీ, సంరక్షణ కేంద్రానికి గానీ తరలించాలి. చాలా ఏళ్లుగా ఏనుగులు ఇక్కడే తిష్ట వేశాయి. 11 మందికిపైగా మృత్యువాత పడ్డారు. రూ.6 కోట్ల మేర పంట, ఆస్తి నష్టం సంభవించాయి. ఏనుగుల వెంట అటవీ శాఖాధికారులు తిరగడమే తప్ప ప్రయోజనం ఏమీ ఉండటం లేదు.

– కొల్లి సాంబమూర్తి,
సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు,
పార్వతీపురం

రైతులు, గిరిజనులు భయపడుతున్నారు..

ఏనుగులు ఎప్పుడు ఏ ప్రాంతం మీద దాడి చేస్తున్నాయో అర్థం కావడం లేదు. అటవీ శాఖాధికారులు తిరగడం, ప్రభుత్వానికి నిధులు ఖర్చు తప్ప ప్రయోజనం ఉండటం లేదు. రైతులు, గిరిజనులు పొలాలకు, ఇతర పనులకు వెళ్లడానికి భయపడుతున్నారు. కుంకీ ఏనుగులను తెప్పిస్తామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చి రెండు నెలలవుతున్నా.. ఇప్పటికీ ఆచరణలోకి రాలేదు.

– హెచ్.రామారావు,
గిరిజన సంఘం నాయకులు, పార్వతీపురం

జగన్ హయాంలోనే డ్రోన్లకు గుర్తింపు

వ్యవసాయ రంగంలో డ్రోన్ల ఉపయోగం

- ఎరువులు, పురుగు మందులు చల్లడానికి, వెద సాగుకు వినియోగం
- సత్ఫలితాలు సాధించిన వైనం
- డ్రోన్లను అభివృద్ధి చేసిన ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ వర్సిటీ
- డీజీసీఏ అనుమతితో ఇప్పటికే డ్రోన్ పైలట్ శిక్షణ పూర్తి



సాక్షి ప్రతినిధి, గుంటూరు: ప్రపంచంలో ఏ కొత్త పరికరం అందుబాటులోకి వచ్చినా.. దాని రూపకర్తను తానేనంటూ డప్పాలు కొట్టుకునే సీఎం చంద్రబాబు.. డ్రోన్ల విషయంలోనూ తప్పటడుగు వేయలేదని మరోసారి రుజువవుతోంది. దేశంలోనే డ్రోన్ క్యాపిటల్‌గా ఏపీని తీర్చిదిద్దనున్నామని ఇటీవల కాలంలో ఇబ్బడిముబ్బడిగా ప్రకటనలు గుప్పిస్తున్న కూటమి సర్కారు.. వైఎస్ జగన్ హయాంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే వ్యవసాయరంగంలో డ్రోన్లను విరివిగా అభివృద్ధి చేసి సత్ఫలితాలు సాధించిన విషయాన్ని మరచి పోయినట్లుంది. డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయ రంగం బాట పట్టించిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందనడంలో అతిశయోక్తి లేదు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీసర్వేకు సైతం డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి మంచి ఫలితాలు సాధించిన సంగతి తెలిసిందే. కూలీల కొరత ఒకవైపు.. యువతరాన్ని రాబోయే కాలంలో వ్యవసాయం వైపు పయనింపజేయడానికి ఈ తరహా డ్రోన్ టెక్నాలజీని గత ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ఈ క్రమంలోనే డ్రోన్ టెక్నాలజీని వ్యవసాయ రంగంలో వినియోగించడంతో పాటు డ్రోన్ పైలెట్లను తయారు చేసే బాధ్యతను ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ వర్సిటీకి అప్పగించింది. 2019 వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ప్రభుత్వ ప్రోత్సాహంతో వర్సిటీ గణనీయంగా డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధి చేసింది. డ్రోన్ టెక్నాలజీని ఎరువులు, పురుగు మందులు జల్లడానికి, విత్తనాలు వెద పద్ధతిలో జల్లడానికి ఉపయోగించారు. ప్రస్తుతం పావు కేజీ నుంచి 25 కిలోల బరువును మోసుకెళ్లేలా డ్రోన్‌లను అభివృద్ధి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా సాగు సకాలంలో రైతుకు ఇబ్బందికరంగా మారుతోంది. ఈ నేపథ్యంలో రైతు సస్యరక్షణలో భాగంగా మందుల వినియోగంలోనూ డ్రోన్ పద్ధతిని ఉపయోగిస్తున్నారు. భారత్‌లోనే ఎక్కడా లేని విధంగా డ్రోన్‌లను వినియోగించడంతో పాటు వందల సంఖ్యలో పైలెట్లకు, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆచార్య ఎన్‌జీ రంగా వర్సిటీ ఇప్పటికే శిక్షణ ఇస్తోంది. ప్రధాన పంటలైన వరి, చెరకు, మినుము, పెసర, పత్తి, మిరప, జొన్న, మొక్కజొన్న, శనగ, వేరుశనగ లాంటి పంటల్లో డ్రోన్లతో సస్యరక్షణ చేస్తోంది. 2020 నుంచి విస్తృత పరిశోధనలు జరిపి దేశంలోనే అత్యాధునికమైన ఏరియల్ రోబోటైజ్ డ్రోన్లను సైతం వర్సిటీ అభివృద్ధి చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో లక్షల ఎకరాల్లో ఈ డ్రోన్ల వినియోగం జరుగుతోంది.

మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్లపై ముగిసిన వాదనలు

29న నిర్ణయం వెలువరిస్తామన్న న్యాయమూర్తి

సాక్షి, అమరావతి: తమపై పుంగనూరు పట్టణ పోలీసులు నమోదు చేసిన తప్పుడు కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఇతర నేతలు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో మంగళవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వ్ చేస్తూ ఈనెల 29న నిర్ణయం వెలువరిస్తామని కోర్టు తెలిపింది. ఈ కేసులో మిథున్‌రెడ్డిపై ఎలాంటి కఠిన చర్యలూ తీసుకోవద్దని ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను అప్పటి వరకు పొడిగించింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వక్కలగడ్డ రాధాకృష్ణ కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కొట్టించుకున్నోళ్లపై పోలీసుల కేసులు

జూలై 18న మిథున్‌రెడ్డి పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డప్ప ఇంటికి వచ్చిన సమయంలో టీడీపీ నేతలు రాళ్ల దాడి చేశారు. అయితే దాడి చేసిన వారిపై కేసులు పెట్టాల్సిన పోలీసులు ఎంపీ మిథున్‌రెడ్డి, రెడ్డప్పతో సహా 71మందిపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. మిథున్‌రెడ్డిని ఎ–1గా చేర్చారు. ఈ కేసుల్లో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ మిథున్‌రెడ్డి తదితరులు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై మంగళవారం జస్టిస్ కృపాసాగర్ మరోసారి విచారణ జరిపారు.

రాజకీయ దురుద్దేశాలతో కేసులు...

మిథున్‌రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ రాజకీయ దురుద్దేశాలతోనే ఈ కేసులు పెట్టారని తెలిపారు. మిథున్‌రెడ్డి పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనాల్సి ఉందని, అందువల్ల అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు...

పోలీసుల తరపు న్యాయవాది మర్రి వెంకట రమణ వాదనలు వినిపిస్తూ, ఉద్దేశపూర్వకంగానే పిటిషనర్లు గొడవలు సృష్టించారని తెలిపారు. పిటిషనర్‌పై పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ముందస్తు బెయిల్‌కు పిటిషనర్లు అర్హులు కారన్నారు. ఆ పిటిషన్లను కొట్టేయాలని ఆయన కోర్టును కోరారు.

అంతరాష్ట్ర దొంగలు అరెస్ట్

362 గ్రాముల బంగారం, రూ.3.55 లక్షలు స్వాధీనం

తిరుపతి రూరల్: తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో కుటుంబ సమేతంగా దొంగతనాలకు పాల్పడే అంతరాష్ట్ర దొంగల ముఠాను తిరుపతి రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి రూ. 10.31 లక్షల విలువైన బంగారు అభరణాలు, రూ. 3.55 లక్షల నగదును రికవరీ చేశారు. మంగళవారం తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైం డీఎస్పీ రమణ కుమార్, రూరల్ సీఐ చిన్నగోవిందు కేసు వివరాలను వెల్లడించారు. సెప్టెంబర్ 20న తిరుపతి రూరల్ మండలంలో ఒకేరోజు 3 ఇళ్లల్లో దొంగతనం జరిగింది. కేసు నమోదు చేసిన పోలీసులు దొంగలను కనిపెట్టేందుకు 4 బృందాలుగా గాలించారు. చెన్నైకి చెందిన శెట్టి మణి, శెట్టి సూర్య, శెట్టి విజయ్‌లు కుటుంబ సమేతంగా చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. గత నెల 30న ఇద్దరు మహిళా దొంగలను అరెస్ట్ చేశారు. ఈ చోరీల్లో సిద్ధహస్తులైన శెట్టి మణి, శెట్టి సూర్యను మంగళవారం రామానూజపల్లి సర్కిల్ సమీపంలో అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న శెట్టి విజయ్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు.



శాస్త్రోక్తంగా రుద్ర హోమం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా రుద్ర హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మహాశివుని జన్మ నక్షత్రం అయిన ఆరుద్ర నక్షత్రం రోజున ప్రతి నెలా రుద్ర హోమం నిర్వహిస్తారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీ నారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వేడుకగా గోపురోత్సవం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గోపురోత్సవాన్ని వేడుకగా మంగళవారం జరిపారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు పర్యవేక్షించారు.


బాలాత్రిపుర సుందరి అమ్మవారికి రూ.9 లక్షల ఆదాయం



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ సూర్యారావుపేటలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీలను మంగళవారం దేవదాయ, ధర్మాదాయ శాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్ర కుమార్ సమక్షంలో లెక్కించారు. మొత్తం 40 రోజులకు రూ.9 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు తెలిపారు.

25న ఉదయగిరిలో జాబ్‌మేళా

ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీసు, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆకుల నరసింహులు మంగళవారం తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, డెక్కన్ వీల్స్ కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదివిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఐరాల విద్యార్థులు

ఐరాల: చిత్తూరు జిల్లా ఐరాల ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్–14 ఫెన్సింగ్ (కత్తిసాము) పోటీలకు ఎంపికయ్యారని ఆ స్కూల్‌ల హెచ్ఎం కోమల తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ, ఇటీవల చిత్తూరు మెసానిక్ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–14 ఫెన్సింగ్ పోటీల్లో బాలికల విభాగంలో తమ స్కూల్ విద్యార్థిని గాయత్రి, బాలుర విభాగంలో పవన్ విశేష ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని, వీరిద్దరూ నంద్యాలలో ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్ దేవాను ఎస్ఎంసీ చైర్మన్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.

బిజినెస్ రీల్

ఎలక్ట్రిక్ వాహన రుణాల కోసం లెండింగో

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు, రిక్షాలు మొదలైన వాటికి రుణాలు ఇచ్చేందుకు లెండింగో పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు లిస్టెడ్ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ మెగా కార్పొరేషన్ లిమిటెడ్ వెల్లడించింది. ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) కస్టమర్ల అవసరాలకు అనుగుణమైన రుణ సాధనాలను అందించడంపై ఇది దృష్టి పెడుతుందని కంపెనీ ఎండీ కునాల్ లాలానీ తెలిపారు. ఈవీ వినియోగం పెరిగేందుకే కాకుండా వ్యవస్థ వృద్ధికి కూడా ఇది దోహదపడగలదని వివరించారు. పర్యావరణ హిత విధానాలను పాటించే క్రమంలో, కర్బన ఉద్గారాలను తగ్గించే, విద్యుత్ వినియోగ సామర్థ్యాలు.. వాయు నాణ్యత మెరుగుపడేందుకు ఉపయోగపడే ప్రాజెక్టులకు లెండింగో రుణాలిస్తుందని కునాల్ చెప్పారు.

జైపూర్‌లో టై 2025 గ్లోబల్ సదస్సు

న్యూఢిల్లీ: ది ఇండస్ ఎంట్రప్రెన్యూర్స్ (టై) పదవ సదస్సు వచ్చే ఏడాది రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరగనుంది. రాజస్థాన్ విభాగం ఏర్పడి 25 ఏళ్లయిన సందర్భంగా దీన్ని నిర్వహించనున్నట్లు టై ఒక ప్రకటనలో తెలిపింది. రెండు రోజుల కార్యక్రమంలో అంతర్జాతీయ ఇన్వెస్టర్లు, మెంటార్లు, వ్యాపార దిగ్గజాలు పాల్గొనున్నట్లు వివరించింది. ఈ ఏడాది తలపెట్టిన సదస్సు డిసెంబర్ 9–11 మధ్య బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరుగుతుందని, ముగింపు కార్యక్రమం డిసెంబర్ 12న మైసూరులో ఉంటుందని టై పేర్కొంది.

అయిదు లక్షల విద్యార్థులకు లియో1 సేవలు

న్యూఢిల్లీ: క్రికెటర్ రోహిత్ శర్మ మద్దతిస్తున్న ఫీజుల మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ సంస్థ లియో1 తమ కార్యకలాపాలను విస్తరిస్తోంది. తాజాగా 5 లక్షల విద్యార్థుల మైలురాయిని అధిగమించినట్లు సంస్థ వివరించింది. విద్యా సంస్థలకు ఫీజ్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ అందించడంతో పాటు విద్యార్థులకు స్మార్ట్ ఐడీ కార్డులు, సకాలంలో చెల్లింపులు జరిపితే రివార్డులివ్వడం, ఆర్థిక అక్షరాస్యత ప్రోగ్రాంలు మొదలైనవి నిర్వహించడం తదితర కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది. రివార్డుల కింద ఇచ్చే లియో1 కాయిన్లను విద్యార్థులు జొమాటో, నైకా తదితర 175 బ్రాండ్ పార్ట్‌నర్స్ వద్ద రిడీమ్ చేసుకోవచ్చని తెలిపింది.

జీప్ నుంచి సరికొత్త మెరీడియన్

ధర రూ. 24.99 లక్షల నుంచి ప్రారంభం

పుణె: సరికొత్త ఫీచర్లతో మెరీడియన్ 2025 వాహనాన్ని ఆవిష్కరించినట్లు జీప్ ఇండియా వెల్లడించింది. దీని ధర రూ. 24.99 లక్షల నుంచి (పరిమిత కాలం వర్తించే ఆఫర్) ప్రారంభమవుతుంది. లాంగిట్యూడ్, లిమిటెడ్ తదితర నాలుగు వేరియంట్లలో ఇది లభిస్తుంది. ఇందులో 5–7 సీటర్ ఆప్షన్లు ఉంటాయి. అలాగే, అధునాతనమైన రాడార్, కెమెరా ఆధారిత ఏడీఏఎస్, స్మార్ట్ కనెక్టివిటీ, 10.25 అంగుళాల ఫుల్ డిజిటల్ క్లస్టర్, 10.1 అంగుళాల ఫుల్ హెచ్‌డీ టచ్‌స్క్రీన్ మీడియా సెంటర్, వైర్‌లెస్ స్మార్ట్‌ఫోన్ చార్జింగ్ తదితర ఫీచర్లు ఉంటాయని జీప్ ఇండియా బ్రాండ్ డైరెక్టర్ కుమార్ ప్రియేష్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-10-2024	
విశాఖ	540–00
చిత్తూరు	568–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530–00
విజయవాడ	540–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70

నేటి బోర్డు సమావేశాలు

హెచ్‌యూఎల్, టీవీఎస్ మోటార్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, కర్ణాటక బ్యాంక్, దొడ్ల డైరీ, ఆంధ్రా సిమెంట్, సాగర్ సిమెంట్, హెరిటేజ్ ఫుడ్స్, బిర్లా కార్ప్, నవీన్ ఫ్లోరిన్ ఇంటర్నేషనల్, గోద్రేజ్ ప్రాపర్టీస్, పిరమిల్ ఎంటర్‌ప్రైజెస్, బీఐవీ ఇండస్ట్రీస్, టీఆర్ఎఫ్, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్, జెనోటెక్ ల్యాబ్స్, లాయిడ్స్ మెటల్స్, కేపీఐటీ టెక్, ఎన్‌డీటీవీ, పిడిలైట్ ఇండస్ట్రీస్, కేర్ రేటింగ్స్, ఆస్టర్ డీఎం హెల్త్‌కేర్

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,641
ఎన్ఎస్ఈ	1,02,476
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	2,51,988
ఎఫ్ఐఐ	- 2,265
డీఐఐ	+ 3,226

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	70.14	$ 60.69
బ్రెంట్	74.36	$ 73.06

మెప్పించని పేటీఎం ఫలితాలు

- క్యూ2లో అసాధారణ మొత్తం కలిపి రూ.928 కోట్ల లాభం
- అది తీసేస్తే నష్టాల్లోనే... 5.8 శాతం పతనమైన షేరు



న్యూఢిల్లీ: డిజిటల్ చెల్లింపుల దిగ్గజం వన్97 కమ్యూనికేషన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో లాభాన్ని ప్రకటించినా... అది మార్కెట్లను మెప్పించలేకపోయింది. ఎందుకంటే జులై–సెప్టెంబర్(క్యూ2)లో రూ.928 కోట్ల నికర లాభాన్ని ప్రకటించినా... దీన్లో ఎంటర్‌టైన్‌మెంట్ టికెటింగ్ బిజినెస్‌ను జొమాటోకు విక్రయించడం ద్వారా వచ్చిన రూ.1,345 కోట్ల అసాధారణ ఆర్జన కూడా ఉంది. ఇలా విక్రయించటం ద్వారా వచ్చిన రూ.1,345 కోట్లలో లాభంగా చూపించిన రూ.928 కోట్ల మొత్తాన్ని తీసేస్తే... కంపెనీ ఈ త్రైమాసికంలో రూ.417 కోట్ల నష్టాన్ని ఆర్జించినట్లు లెక్క. సీక్వెన్షియల్‌గా చూస్తే (క్యూ–1తో పోలిస్తే)ఈ నష్టం తగ్గినట్లు కనిపించినా.. గతేడాది (2023–24) ఇదే కాలంలో (క్యూ2తో పోలిస్తే) మాత్రం నష్టం దాదాపు 70 శాతం పెరిగినట్లు లెక్క. ఎందుకంటే గతేడాది క్యూ2లో కంపెనీ దాదాపు రూ. 291 కోట్ల నష్టాలు ప్రకటించింది. అయితే ప్రస్తుత క్యూ2లో మొత్తం ఆదాయం 34 శాతం క్షీణించి రూ. 1,670 కోట్లకు పరిమితమైంది. దీనిలో పేమెంట్స్ బిజినెస్ త్రైమాసికవారీగా 9 శాతం పుంజుకుని రూ.981 కోట్లకు చేరగా.. ఫైనాన్షియల్ సర్వీసులు 34 శాతం జంప్‌చేసి రూ. 376 కోట్లను తాకినట్లు పేటీఎమ్ వివరించింది. పరోక్ష వ్యయాలు 17 శాతం మేర తగ్గి రూ. 1,080ను తాకాయి. ఇందుకు ఉద్యోగ వ్యయాలు తగ్గడం, గత క్యూ1లో నమోదైన అనూహ్య ఖర్చులు లేకపోవడం దోహదపడినట్లు కంపెనీ వెల్లడించింది. అయితే తాజా డీల్ నేపథ్యంలో కంపెనీ వద్ద నగదు నిల్వలు మాత్రం భారీగా పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో పేటీఎమ్ షేరు ఎన్ఎస్ఈలో 5.8 శాతం పతనమై రూ. 684 వద్ద ముగిసింది.

వరుణ్ బెవరేజెస్ లాభం అప్

క్యూ3లో రూ. 629 కోట్లు



న్యూఢిల్లీ: పానీయాల దిగ్గజం పెప్సీకోకు అతిపెద్ద ఫ్రాంచైజీ బాట్లర్ వరుణ్ బెవరేజెస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024) మూడో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ3)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 22 శాతం పైగా జంప్‌చేసి రూ. 629 కోట్లకు చేరింది. అమ్మకాల పరిమాణం, మార్జిన్లు పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2023) ఇదే కాలంలో రూ. 514 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 25 శాతం ఎగసి రూ. 4,932 కోట్లను తాకింది. గత క్యూ3లో రూ. 3,938 కోట్ల టర్నోవర్ అందుకుంది. కంపెనీ జనవరి–డిసెంబర్ కాలాన్ని ఆర్థి/ క సంవత్సరంగా పరిగణించే సంగతి తెలిసిందే. నిర్వహణ సామర్థ్యం కారణంగా స్థూల మార్జిన్లు 0.22 శాతం బలపడి 55.5 శాతాన్ని తాకాయి. ఇబిటా మార్జిన్లు 1.17 శాతం మెరుగుపడి 25.28 శాతానికి చేరాయి. మొత్తం వ్యయాలు 26 శాతం పెరిగి రూ. 4,156 కోట్లను తాకాయి. అమ్మకాల పరిమాణం 22 శాతం ఎగసి 26.75 కోట్ల కేసులకు చేరినట్లు కంపెనీ వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో వరుణ్ బెవరేజెస్ షేరు ఎన్ఎస్ఈలో 2.6 శాతం లాభంతో రూ. 594 వద్ద ముగిసింది.

మరింత చేరువగా బీఎస్ఎన్ఎల్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) కస్టమర్లకు మరింత చేరువయ్యేందుకు సేవలను మెరుగుపర్చడమేగాక పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వీటిని మంగళవారం ఆవిష్కరించారు. మైనింగ్ కార్యకలాపాల కోసం వేగవంతమైన 5జీ కనెక్టివిటీని సీడాక్ భాగస్వామ్యంతో బీఎస్ఎన్ఎల్ పరిచయం చేసింది. మోసపూరిత కాల్స్, ఎస్ఎంఎస్‌లను ఆటోమేటిక్‌గా నిలువరించే స్పామ్ బ్లాకింగ్ సొల్యూషన్ అందుబాటులోకి తెచ్చింది. సిమ్‌ల కొనుగోలు, అప్‌గ్రేడ్, నెట్‌వర్క్ మారడానికి, లేదా భర్తీకి, కేవైసీ పూర్తి చేయడానికి 24 గంటలు అందుబాటులో ఉండే ఆటోమేటెడ్ సిమ్ కియోస్క్‌లు సైతం రానున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో నేల, గాలి, సముద్రంలోనైనా ఎస్ఎంఎస్‌లు అందుకునేలా భారత్‌లో మొట్టమొదటిసారిగా శాటిలైట్ ద్వారా డైరెక్ట్–టు–డివైస్ కనెక్టివిటీ సొల్యూషన్‌ను సంస్థ ఆవిష్కరించింది. సంస్థ యూజర్లు బీఎస్ఎన్ఎల్ ఫైబర్ టు ద హోమ్ (ఎఫ్‌టీటీహెచ్) సహాయంతో ప్రయాణంలో వైఫైకి కనెక్ట్ కావొచ్చు. ఫైబర్ ఆధారిత ఇంట్రానెట్ లైవ్ టీవీ సేవలతో ఎఫ్‌టీటీహెచ్ కస్టమర్లు 500లకుపైగా ప్రీమియం టీవీ చానెళ్లను వీక్షించవచ్చు.

బీఎస్ఎన్ఎల్ కొత్త లోగో..

ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ కొత్త లోగోను మంత్రి విడుదల చేశారు. వచ్చే ఏడాది మధ్యకాలంలో 4జీ సాంకేతికత కలిగిన 1,00,000 ప్రాంతాలు బీఎస్ఎన్ఎల్ వద్ద ఉంటాయని సింధియా వెల్లడించారు. వీటిలో కొన్ని 5జీకి అప్‌గ్రేడ్ అవుతాయని చెప్పారు. టారిఫ్‌లను పెంచే ఉద్దేశం లేదని బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ రవి స్పష్టం చేశారు. వినియోగదారులు సంతోషంగా ఉండేలా చూడడం, వారి విశ్వాసాన్ని పొందడంపైనే దృష్టిసారించామని అన్నారు. బీఎస్ఎన్ఎల్ ఇప్పటికే పైలట్ ప్రాతిపదికన 4జీ సేవలను అందించడం ప్రారంభించిందని వివరించారు.

ద్వితీయ శ్రేణి నగరాల్లో తగ్గిన ఇళ్ల అమ్మకాలు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 30 ద్వితీయ శ్రేణి ప్రధాన నగరాల్లో ఇళ్ల అమ్మకాలు జూలై–సెప్టెంబర్‌లో 41,871 యూనిట్లు నమోదయ్యాయి. 2023 సెప్టెంబర్ త్రైమాసికంతో పోలిస్తే విక్రయాలు 13 శాతం తగ్గాయని ప్రాప్‌ఈక్విటీ నివేదిక తెలిపింది. గతేడాది రికార్డు స్థాయిలో అమ్మకాలు నమోదు కావడమే ఈ క్షీణతకు కారణం అని వివరించింది. 'కొత్త ప్రాజెక్టుల ఆవిష్కరణ 34 శాతం క్షీణించింది. మొత్తం విక్రయాల్లో అహ్మదాబాద్, వడోదర, గాంధీనగర్, సూరత్, గోవా, నాసిక్, నాగ్‌పూర్‌తో కూడిన వెస్ట్ జోన్ వాటా 72 శాతం ఉంది. తక్కువ జీవన వ్యయం, నైపుణ్యం కలిగిన నిపుణుల లభ్యత, కంపెనీలకు అనుకూల కార్యాచరణ వ్యయంతో పాటు రాష్ట్ర రాజధానులలో మంచి కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు గృహాలకు డిమాండ్‌ను పెంచుతున్నాయి. సెప్టెంబర్ త్రైమాసికంలో అమ్మకాలు పడిపోయినప్పటికీ హౌసింగ్ మార్కెట్ స్థితిస్థాపకంగా ఉంది. ప్రస్తుత పండుగ త్రైమాసికంలో బలమైన విక్రయాలు ఉంటాయని అంచనా. ద్వితీయ శ్రేణి నగరాల్లో రియల్ ఎస్టేట్ పెట్టుబడి చారిత్రాత్మకంగా చాలా లాభదాయకం కాదు. కనెక్టివిటీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో వృద్ధి ఉన్నప్పటికీ ఈ నగరాలు పెట్టుబడిదారులను ఆకర్షించే స్థాయిలో రాబడిని అందించడంలో విఫలమయ్యాయి. పేలవమైన అద్దె ఆదాయం, మూలధన విలువలో అంతగా లేని వృద్ధి, ఆస్తి నిర్వహణ ఖర్చు.. వెరసి ఈ నగరాల్లో పెట్టుబడిని అత్యంత ప్రమాదకరం చేస్తోంది' అని నివేదిక వివరించింది.

ఐటీ సిస్టమ్‌లను ఆడిట్ చేయించండి

డేటా లీకేజీపై రెండు బీమా సంస్థలకు ఐఆర్‌డీఏఐ ఆదేశాలు



న్యూఢిల్లీ: పాలసీదారుల డేటా లీకేజీ ఉదంతాల నేపథ్యంలో ఐటీ సిస్టమ్‌లను ఆడిట్ చేయించుకోవాలని రెండు బీమా సంస్థలను ఆదేశించినట్లు బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఇందుకోసం స్వతంత్ర ఆడిటర్‌ను నియమించుకోవాలని సూచించినట్లు పేర్కొంది. ఆయా సంస్థల యాజమాన్యాలతో కలిసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు వివరించింది. డేటా ఉల్లంఘనలను చాలా తీవ్రంగా పరిగణిస్తున్నామని, పాలసీదారుల ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఐఆర్‌డీఏఐ తెలిపింది. సదరు సంస్థల పేర్లను ఐఆర్‌డీఏఐ వెల్లడించకపోయినప్పటికీ ఆ జాబితాలో స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఉన్నట్లుగా భావిస్తున్నారు. డేటా లీకేజీ జరిగిన మాట వాస్తవమేనని ఆ కంపెనీ ఇటీవలే వెల్లడించడం ఇందుకు కారణం. ఇక డేటా ఉల్లంఘన బారిన పడ్డ రెండో సంస్థ పేరు తెలియరాలేదు.

ఎకానమీకి ప్రైవేటు పెట్టుబడులు, వినియోగం దన్ను

ఆర్‌బీఐ బులెటిన్ విశ్లేషణ



ముంబై: భారత్ ఆర్థిక వ్యవస్థకు ప్రైవేటు పెట్టుబడులకుతోడు, పండుగల సీజన్, వినియోగ డిమాండ్ దన్నుగా ఉన్నట్లు 'స్టేట్ ఆఫ్ ఎకానమీ' శీర్షికన వెలువడిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బులెటిన్ విశ్లేషించింది. భౌగోళిక ఉద్రిక్తతలు నెలకొన్నప్పటికీ, దేశీయ ఆర్థిక ఫండమెంటల్స్ పటిష్టత భారత్ ఎకానమీకి సానుకూలంగా ఉన్నాయని బులెటిన్ పేర్కొంది. ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ దేబబ్రత పాత్ర నేతృత్వంలోని బృందం ఈ కథనాన్ని వెలువరించింది. అయితే బులెటిన్ కథనాలలో వ్యక్తమైన అభిప్రాయాలు రచయితలవిగా భావించాలి తప్ప, భారతీయ రిజర్వ్ బ్యాంక్ అభిప్రాయాలుగా పరిగణించరాదు. బులెటిన్‌లోని ముఖ్యాంశాలు పరిశీలిస్తే...

- 2024–25 రెండవ త్రైమాసికంలో ఎకానమీ స్పీడ్ తగ్గడం (స్థూల దేశీయోత్పత్తి 6.8 శాతం) తాత్కాలిక ధోరణిగానే కనబడుతోంది. పండుగల సీజన్ డిమాండ్ వేగం పుంజుకోవడం, వినియోగదారుల విశ్వాసం మెరుగుపడటం వంటి అంశాలు తిరిగి ఎకానమీకి ఊపును అందిస్తున్నాయి.
- మెరుగైన వ్యవసాయ పరిస్థితుల వల్ల గ్రామీణ డిమాండ్ ఊపందుకుంటుందని భావిస్తున్నారు. వినియోగ డిమాండ్, పెరుగుతున్న వ్యాపార ఆశావాదం పెరుగుదల నేపథ్యంలో ప్రైవేటు పెట్టుబడుల్లో సానుకూల వాతావరణం నెలకొంది.
- ద్రవ్యోల్బణం కొంత అదుపులోనికి రావడం గృహ వ్యయాలకు మద్దతును అందించింది.
- తీవ్ర సవాళ్లను 2024 మొదటి ఆరు నెలల్లో గ్లోబల్ ఎకానమీ తట్టుకుని నిలబడింది. ద్రవ్యోల్బణం భయాలు తగ్గడంతో వృద్ధే లక్ష్యంగా పలు దేశాలు సరళతర ద్రవ్య పరపతి విధానాలను పాటిస్తున్నాయి.
- ఎకానమీకి సంబంధించి కొన్ని హై–ఫ్రీక్వెన్సీ సూచికలు.. 2024–25 రెండవ త్రైమాసికంలో సానుకూల పరిస్థితులను సూచిస్తున్నాయి. ఆగస్టు, సెప్టెంబరులో అసాధారణంగా కురిసిన భారీ వర్షాలు ఎకానమీకి సానుకూల పరిస్థితులను అందించాయి.
- అన్‌సెక్యూర్డ్ రుణాలపై ఇబ్బందులు ఉన్నాయన్న ఆందోళనల నేపథ్యంలో క్రెడిట్ కార్డ్ లావాదేవీ పరిమాణం మందగించడం మరో అంశం.
- మైక్రో ఫైనాన్స్ సంస్థలకు 'రుణ పూచీకత్తు' మార్గదర్శకాలను స్వీయ నియంత్రణ సంస్థ– మైక్రో ఫైనాన్స్ ఇండస్ట్రీ నెట్‌వర్క్ (ఎంఫిన్) కఠినతరం చేయడం ఈ వ్యవస్థకు సానుకూల పరిణామం.
- బ్యాంకింగ్ రంగంలో రుణ వృద్ధి కొంత మందగించినప్పటికీ డిపాజిట్ సమీకరణ లక్ష్యంగా ఈ రేట్ల పెంపునకు అవకాశం ఉంది.
- 3 నుంచి 6వ అంచె పట్టణాల్లో వినియోగదారుల డిజిటల్ పేమెంట్లు గణనీయంగా పెరుగుతున్నాయి.
- వ్యవస్థలో తగినంత ద్రవ్య సరఫరా ఉంది. ఇందుకు తగిన చర్యలను ఆర్‌బీఐ తీసుకుంటోంది.

రెపో పెంపుతో ద్రవ్యోల్బణం కట్టడి...

ఇదిలావుండగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2022 మే నుంచి రెపో రేటును (బ్యాంకులకు తానిచ్చిన రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 6.5 శాతం) 2.5 శాతం పెంచిన ఫలితంగా రిటైల్ ద్రవ్యోల్బణం 2024 సెప్టెంబర్‌నాటికి 1.60 శాతం దిగివచ్చినట్లు ఆర్‌బీఐ సీనియర్ అధికారులు విడుదల చేసిన మరో డాక్యుమెంట్ తెలిపింది. డిప్యూటీ గవర్నర్ మైఖేల్ పాత్ర, ఇంద్రనీల్ భట్టాచార్య, జాయిస్ జాన్, అవ్నీష్ కుమార్ ఈ పత్రాన్ని రూపొందించారు. ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంతో 2022 మే నుంచి 2022 డిసెంబర్ వరకూ రెపో రేటును 2.5 శాతం పెంచింది. దీనితో ఈ రేటు 6.5 శాతానికి చేరింది. అయితే 2023 ఫిబ్రవరి నుంచి రెపో రేటు యథాతథంగా 6.5 శాతం వద్ద కొనసాగుతోంది. గడచిన 10 ద్వైమాసిక సమావేశాల్లో ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ ఈ రేటును మార్చలేదు.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు Q2 RESULTS

బజాజ్ ఫైనాన్స్ లాభం ప్లస్

క్యూ2లో రూ. 4,014 కోట్లు



న్యూఢిల్లీ: ఫైనాన్షియల్ రంగ దిగ్గజం బజాజ్ ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 13 శాతం వృద్ధితో రూ. 4,014 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 3,551 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 13,382 కోట్ల నుంచి రూ. 17,095 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 8,624 కోట్ల నుంచి రూ. 11,697 కోట్లకు పెరిగాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 0.91 శాతం నుంచి 1.06 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.31 శాతం నుంచి 0.46 శాతానికి పెరిగాయి. కనీస మూలధన నిష్పత్తి 21.69 శాతంగా నమోదైంది. అనుబంధ సంస్థ బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ గత నెలలో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కాగా.. కంపెనీ రూ. 3,000 కోట్ల విలువైన షేర్లను ఐపీవోలో విక్రయించింది.

ఫలితాల నేపథ్యంలో బజాజ్ ఫైనాన్స్ షేరు బీఎస్ఈలో 1.6 శాతం నష్టంతో రూ. 6,677 వద్ద ముగిసింది.

అదానీ గ్రీన్ ఎనర్జీ లాభం జూమ్

రూ. 515 కోట్లుగా నమోదు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ అదానీ గ్రీన్ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 39 శాతం జంప్‌చేసి రూ. 515 కోట్లను తాకింది. ఇందుకు అధిక ఆదాయం సహకరించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 371 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,589 కోట్ల నుంచి రూ. 3,376 కోట్లకు ఎగసింది. కంపెనీ సామర్థ్యం 34 శాతం పెరిగి 11,184 మెగావాట్లను తాకింది. ఖావ్డాలో 2,000 మెగావాట్ల సోలార్, 250 మెగావాట్ల విండ్‌తోపాటు.. రాజస్తాన్‌లో 418 మెగావాట్ల సోలార్, గుజరాత్‌లో 200 మెగావాట్ల విండ్ సామర్థ్యాలు కొత్తగా జత కలిసినట్లు కంపెనీ పేర్కొంది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో ఇంధన విక్రయాలు 20 శాతం వృద్ధితో 14,128 మిలియన్ యూనిట్లకు చేరినట్లు తెలియజేసింది.

ఫలితాల నేపథ్యంలో అదానీ గ్రీన్ షేరు ఎన్ఎస్ఈలో 1.6 శాతం క్షీణించి రూ. 1,684 వద్ద ముగిసింది.

అదానీ ఎనర్జీ లాభం హైజంప్

క్యూ2లో రూ. 773 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం మూడు రెట్లు ఎగసి రూ. 773 కోట్లను అధిగమించింది. ఇందుకు అధిక ఆదాయం సహకరించింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 284 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,766 కోట్ల నుంచి రూ. 6,360 కోట్లకు జంప్‌చేసింది. ఈ కాలంలో 140 సర్క్యూట్ కిలోమీటర్లను జత కలుపుకోవడంతో మొత్తం ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ 23,269 సీకేఎంకు చేరినట్లు కంపెనీ వెల్లడించింది. ఇంధన డిమాండ్ నేపథ్యంలో 260.9 కోట్ల యూనిట్లు విక్రయించినట్లు తెలియజేసింది. గత క్యూ2లో 244.6 కోట్ల యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో అదానీ ఎనర్జీ షేరు ఎన్ఎస్ఈలో 1.7 శాతం క్షీణించి రూ. 1,000 వద్ద ముగిసింది.

రూట్ మొబైల్ లాభం ప్లస్

మొత్తం ఆదాయం రూ. 1,113 కోట్లు



న్యూఢిల్లీ: ఎంటర్‌ప్రైజ్ కమ్యూనికేషన్ కంపెనీ రూట్ మొబైల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 14 శాతం ఎగసి రూ. 101 కోట్లను దాటింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 89 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 10 శాతం బలపడి రూ. 1,113 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 1,015 కోట్ల టర్నోవర్ నమోదైంది. సీజనల్‌గా బలహీన త్రైమాసికం(క్యూ2)లోనూ కంపెనీ చరిత్రలోనే అత్యధిక టర్నోవర్ అందుకున్నట్లు రూట్ మొబైల్ ఎండీ, గ్రూప్ సీఈవో రాజ్‌దీప్‌కుమార్ గుప్తా పేర్కొన్నారు. అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లోనూ పటిష్ఠ పనితీరును చూపగలమని విశ్వసిస్తున్నట్లు తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో రూట్ మొబైల్ షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం నష్టంతో రూ. 1,535 వద్ద ముగిసింది.

ఐసీఐసీఐ ప్రు లాభం ఫ్లాట్

రూ. 252 కోట్లుగా నమోదు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ బీమా కంపెనీ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం స్వల్పంగా 3 శాతం పుంజుకుని రూ. 252 కోట్లను తాకింది. గతేడాది(2023–24) ఇదే కాలంలో రూ. 244 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 17,436 కోట్ల నుంచి రూ. 25,229 కోట్లకు జంప్‌చేసింది. నికర ప్రీమియం ఆదాయం రూ. 10,022 కోట్ల నుంచి రూ. 10,754 కోట్లకు మెరుగుపడింది. నిర్వహణలోని ఆస్తులు 18 శాతం బలపడి రూ. 3,20,491 కోట్లను తాకాయి. రూ. 1,400 కోట్ల విలువైన మార్పిడిరహిత డిబెంచర్ల(ఎన్‌సీడీలు) జారీకి బోర్డు అనుమతించినట్లు కంపెనీ వెల్లడించింది. నగదు రూపేణా రానున్న 12 నెలల్లో నిధులను సమీకరించనుంది.

ఫలితాల నేపథ్యంలో ఐసీఐసీఐ ప్రు షేరు బీఎస్ఈలో 2.5 శాతం నష్టంతో రూ. 731 వద్ద ముగిసింది.

ఐసీఐసీఐ సెక్యూరిటీస్ లాభం అప్

క్యూ2లో రూ. 529 కోట్లు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ ఐసీఐసీఐ సెక్యూరిటీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ఠ ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 25 శాతం ఎగసి రూ. 529 కోట్లను తాకింది. బ్రోకింగ్, డిస్ట్రిబ్యూషన్ ఆదాయం బలపడటం ఇందుకు సహకరించింది. గతేడాది (2023–24) ఇదే కాలంలో రూ. 424 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 37 శాతం జంప్‌చేసి రూ. 1,707 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 1,249 కోట్ల టర్నోవర్ నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో ఐసీఐసీఐ సెక్యూరిటీస్ షేరు బీఎస్ఈలో 0.5 శాతం నష్టంతో రూ. 846 వద్ద ముగిసింది.

వారిద్దరూ సిద్ధమే

- రెండో టెస్టుకు పంత్, గిల్ రెడీ
- టీమిండియా అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కటే వెల్లడి

పుణే: గాయం కారణంగా తొలి టెస్టుకు దూరమైన శుబ్‌మన్ గిల్‌తో పాటు... మోకాలి వాపుతో కీపింగ్ చేసేందుకు ఇబ్బంది పడిన రిషబ్ పంత్ రెండో టెస్టు వరకు అందుబాటులో ఉంటారని భారత అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కటే వెల్లడించాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా... భారత్, న్యూజిలాండ్ మధ్య గురువారం నుంచి పుణేలో రెండో టెస్టు ప్రారంభం కానుండగా.. మంగళవారం టీమిండియా ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంది. అనంతరం డస్కటే మీడియాతో మాట్లాడాడు. బెంగళూరు టెస్టులో న్యూజిలాండ్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో కాన్వేను స్టంపౌట్ చేసే ప్రయత్నంలో పంత్ మోకాలికి గాయమైంది. గతంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో అదే కాలికి శస్త్రచికిత్స జరగడంతో జట్టు మొత్తం ఆందోళనకు గురైంది. గాయం తీవ్రత ఎక్కువ ఉండటంతో వెంటనే పంత్ మైదానాన్ని వీడగా... అతడి స్థానంలో ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టాడు. అనంతరం అత్యవసర పరిస్థితుల్లో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన పంత్... పరిగెత్తడానికి ఇబ్బంది పడుతూనే విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. అయితే మ్యాచ్ అనంతరం 'పంత్‌ను జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరముంది' అని టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ పేర్కొనడంతో అతడు రెండో టెస్టులో ఆడతాడా లేదా అనే సంశయం నెలకొంది. అయితే తాజాగా డస్కటే ఈ అంశంపై స్పష్టత ఇచ్చాడు. 'పంత్ పూర్తిగా కోలుకున్నాడు. పుణే టెస్టుకు అతడు


టెన్ డస్కటే

అందుబాటులో ఉంటాడు. గిల్ ఆరోగ్యం కూడా కుదుట పడింది. అతడు నెట్ ప్రాక్టీస్ కూడా చేశాడు. మ్యాచ్ వరకు అంతా సవ్యంగా ఉంటుంది అనుకుంటున్నాం' అని డస్కటే పేర్కొన్నాడు.


గిల్

ఆ ఇద్దరి మధ్యే పోటీ

భారత తుది జట్టులో చోటు కోసం ఇద్దరు ఆటగాళ్ల మధ్య పోటీ ఉందని డస్కటే అన్నాడు. తొలి టెస్టులో భారీ సెంచరీతో రాణించిన సర్ఫరాజ్ ఖాన్, కేఎల్ రాహుల్ మధ్య పోటీ ఉందని అన్నాడు. 'ఇందులో దాయడానికి ఏమీ లేదు. తుది జట్టులో ఓ బెర్త్ కోసం పోటీ ఉంది. బెంగళూరు టెస్టులో సర్ఫరాజ్ చక్కటి ఇన్నింగ్స్ ఆడాడు. రాహుల్ కూడా సంసిద్ధంగా ఉన్నాడు. పిచ్, పరిస్థితులను బట్టి తుది జట్టు ఎంపిక ఉంటుంది. రాహుల్ ఆటతీరును కోచ్ గౌతమ్ గంభీర్ నిశితంగా పరిశీలిస్తున్నాడు. రాహుల్‌పై టీమ్ మేనేజ్‌మెంట్‌కు నమ్మకముంది. అదే సమయంలో దేశవాళీలతో పాటు అవకాశం వచ్చిన ప్రతిసారీ జాతీయ జట్టు తరఫున నిలకడైన ప్రదర్శనతో ఆకట్టుకుంటున్న సర్ఫరాజ్‌ను కూడా పక్కన పెట్టలేం. అందుకే అందరు ఆటగాళ్లకు అండగా నిలుస్తాం. న్యూజిలాండ్ జట్టులో ఎక్కువ మంది ఎడంచేతి వాటం ఆటగాళ్లు ఉండటం వల్లే ఆఫ్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌ను జట్టుకు ఎంపిక చేశారు. ఇటీవల రంజీ ట్రోఫీలో అతడి ప్రదర్శన బాగుంది. తమిళనాడు తరఫున మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి భారీ సెంచరీ బాదడంతో పాటు... బౌలింగ్‌లోనూ రాణించాడు' అని డస్కటే గుర్తు చేశాడు. ఇక స్వదేశంలో జరిగిన టెస్టుల్లో పెద్దగా ఆకట్టుకోలేకపోతున్నాడని విమర్శలు ఎదుర్కొంటున్న హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్‌ను కూడా డస్కటే వెనకేసుకొచ్చాడు. 'బెంగళూరు టెస్టు ఆఖరి రోజు తొలి గంటలో సిరాజ్ చక్కటి బౌలింగ్ చేశాడు. దురదృష్టవశాత్తు వికెట్ దక్కక పోయినా... అతడి బౌలింగ్‌లో ఎలాంటి లోపం లేదు. నాణ్యమైన బంతులతో ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశాడు. పుణేలో పరిస్థితులను బట్టే జట్టు ఎంపిక ఉంటుంది' అని డస్కటే వివరించాడు. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో రెండు ఓవర్లు మాత్రమే వేసిన సీనియర్ ఆఫ్‌స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌కు ఎలాంటి సమస్యలు లేవని అతడు అన్నాడు. మ్యాచ్ పరిస్థితులను బట్టే అతడు తక్కువ బౌలింగ్ చేశాడని తెలిపాడు.


పిచ్‌ను పరిశీలిస్తున్న భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ

టీమిండియా ముమ్మర సాధన

తొలి టెస్టులో పరాజయం పాలై సిరీస్‌లో వెనుకబడిన టీమిండియా... రెండో టెస్టు కోసం కసరత్తులు చేస్తోంది. మంగళవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో భారత ఆటగాళ్లు చెమటోడ్చారు. పంత్ గాయం నేపథ్యంలో మరో వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్... కీపింగ్ ప్రాక్టీస్ చేస్తూ కనిపించాడు. కాసేపటికి మైదానంలోకి వచ్చిన పంత్ బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడంతో పాటు చివర్లో కీపింగ్ సాధన కూడా చేయడంతో అతడి ఫిట్‌నెస్‌పై ఉన్న అనుమానాలు పటాపంచలయ్యాయి. మరోవైపు శుబ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, యశస్వి జైస్వాల్ కూడా ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. ఇక కొత్తగా జట్టుతో కలిసి వాషింగ్టన్ సుందర్ నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ సాగించాడు. ఈ మ్యాచ్ కోసం రూపొందించిన పిచ్‌ను హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ రోహిత్ శర్మ, బౌలర్లు జడేజా తదితరులు నిశితంగా పరిశీలించారు. రెండో టెస్టు కోసం స్పిన్నర్లకు అనుకూలించే పిచ్‌ను తయారు చేసినట్లు సమాచారం.

ఎలాంటి పిచ్ ఎదురైనా...

- పక్కా ప్రణాళికతో రెండో టెస్టు బరిలోకి న్యూజిలాండ్ జట్టు
- ఆల్‌రౌండర్ మిచెల్ వెల్లడి

పుణే: తొలి టెస్టులో ఘనవిజయం సాధించిన న్యూజిలాండ్ క్రికెట్ జట్టు... రెండో మ్యాచ్ కోసం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని ఆ జట్టు ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్ అన్నాడు. పుణేలో స్పిన్ పిచ్ ఎదురయ్యే అవకాశముందని... అయితే దాని కోసం కివీస్ ప్లేయర్ల వద్ద తగిన ప్రణాళికలు ఉన్నాయని పేర్కొన్నాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బెంగళూరులో జరిగిన తొలి టెస్టులో ఘనవిజయం సాధించిన న్యూజిలాండ్... 36 ఏళ్ల తర్వాత భారత గడ్డపై టెస్టు మ్యాచ్ నెగ్గింది. ఈ నేపథ్యంలో మంగళవారం ప్రాక్టీస్ సెషన్ అనంతరం మిచెల్ మాట్లాడుతూ.. 'పిచ్ గురించి ఎక్కువ ఆలోచించడం లేదు. అది ఆటగాళ్ల పని కాదు. పరిస్థితులను ఆకళింపు చేసుకొని దానికి తగ్గట్లు ముందుకు సాగడం ముఖ్యం. ఇందులో మా ప్లేయర్లు సిద్ధహస్తులు. పరిస్థితులకు తగ్గట్లు ఆడటం ముఖ్యం. ప్రత్యర్థి 20 వికెట్లు పడగొట్టడంతో పాటు మంచి స్కోర్లు చేయడం గురించే మేం ఆలోచిస్తున్నాం. బెంగళూరు విజయం జట్టులో మరింత సానుకూల దృక్పథం నింపింది. అయితే దాన్ని పక్కన పెట్టి పుణేలో మళ్లీ తాజాగా ప్రారంభించాల్సిందే. శ్రీలంక పర్యటనలో భాగంగా గాలెలో పూర్తిగా స్పిన్ పిచ్‌లపై మ్యాచ్‌లు ఆడాం. ఒక్కో పిచ్ ప్రత్యేకత ఒకలా ఉంటుంది. వికెట్‌ను బట్టి ఆటతీరును మార్చుకుంటూ ముందుకు సాగాలి. తొలి


మిచెల్, రచిన్

టెస్టులో భారత వికెట్ కీపర్ రిషబ్ పంత్ చక్కటి ఇన్నింగ్స్ ఆడాడు. పంత్ ప్రపంచ స్థాయి ప్లేయర్ అతడి ఆటతీరు నాకు చాలా ఇష్టం' అని మిచెల్ అన్నాడు. మరోవైపు న్యూజిలాండ్ మహిళల జట్టు తొలిసారి ఐసీసీ టి20 ప్రపంచకప్ గెలవడం చాలా ఆనందంగా ఉందని మిచెల్ పేర్కొన్నాడు.

పృథ్వీ షాపై వేటు

- ముంబై రంజీ జట్టు నుంచీ స్థానం కోల్పోయిన భారత క్రికెటర్
- ఫిట్‌గా లేకపోవడం, అనుచిత ప్రవర్తనే కారణాలు

ముంబై: భారత జట్టు మాజీ సభ్యుడు, టాపార్డర్ బ్యాటర్ పృథ్వీ షాను ముంబై రంజీ జట్టు నుంచి తప్పించారు. ఫామ్‌లో లేకపోవడం, ఫిట్‌నెస్ సమస్యలు, అనుచిత ప్రవర్తన కారణంగా అతనిపై వేటు పడింది. టీమిండియా ఓపెనర్‌గా అంతర్జాతీయ కెరీర్‌లో ఐదు టెస్టులు, ఆరు వన్డేలు, ఒక టి20 మ్యాచ్ ఆడిన 24 ఏళ్ల పృథ్వీ ఇటీవలి కాలంలో బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించడం కూడా ముంబై సెలక్టర్ల ఆగ్రహానికి కారణమైంది. తరచూ జట్టు ట్రెయినింగ్ సెషన్‌లకు డుమ్మా కొట్టడంతో పాటు బరువు పెరిగి మ్యాచ్ ఫిట్‌నెస్‌ను కోల్పోవడంతో అతనికి ఉద్వాసన పలికారు. ఈ సీజన్‌లో రెండు మ్యాచ్‌లు ఆడిన పృథ్వీ షా నాలుగు ఇన్నింగ్స్‌లో వరుసగా 7, 12, 1, 39 నాటౌట్ స్కోర్లు చేశాడు. ఫిట్‌నెస్ సమస్యలతో ఫీల్డింగ్‌లోనూ చురుగ్గా స్పందించడం లేదు. దీంతో అతన్ని తప్పించి 29 ఏళ్ల ఎడంచేతి ఓపెనింగ్ బ్యాటర్ అఖిల్ హేర్వాడ్కర్‌ను ముంబై జట్టులోకి తీసుకున్నారు. అతను 41 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 36.51 సగటు నమోదు చేశాడు. ఏడు సెంచరీలు, పది అర్ధసెంచరీలు బాదాడు. ముంబై తదుపరి మ్యాచ్‌ను త్రిపురతో ఆడనుంది. అగర్తలాలో ఈ నెల 26 నుంచి 29 వరకు ఈ మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో భారత టి20 కెప్టెన్, మిడిలార్డర్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్‌కు విశ్రాంతి ఇచ్చారు.



రెండో టెస్టుకూ విలియమ్సన్ దూరం

గాయం పూర్తిగా తగ్గలేదన్న న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు

పుణే: న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ భారత్‌తో రెండో టెస్టులో కూడా బరిలోకి దిగబోడని ఆ దేశ క్రికెట్ బోర్డు తెలిపింది. గజ్జల్లో గాయం కారణంగా బెంగళూరులో జరిగిన తొలి టెస్టుకు దూరమైన విలియమ్సన్... ఇంకా పూర్తి స్థాయిలో కోలుకోకపోవడంతో రెండో టెస్టుకు కూడా అందుబాటులో ఉండడని బోర్డు మంగళవారం స్పష్టం చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టు గెలిచిన న్యూజిలాండ్... గురువారం నుంచి రెండో టెస్టులో టీమిండియాతో తలపడుతుంది. శ్రీలంకతో సిరీస్ సందర్భంగా గాయపడ్డ విలియమ్సన్ అప్పటి నుంచి చికిత్స పొందుతున్నాడు. 'కేన్ కోలుకుంటున్నాడు. అయితే వంద శాతం ఫిట్‌నెస్ సాధించలేదు. అందుకే అతడు రెండో టెస్టులో ఆడబోవడం లేదు. ప్రస్తుతం విలియమ్సన్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నాడు. మూడో టెస్టు వరకు అతడు మ్యాచ్



ఫిట్‌నెస్ సాధిస్తాడని భావిస్తున్నాం' అని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. విలియమ్సన్ గైర్హాజరీలోనూ సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకున్న న్యూజిలాండ్ జట్టు... 36 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత గడ్డపై టెస్టు మ్యాచ్ గెలిచి సిరీస్‌లో ముందంజ వేసింది.

30 పాయింట్ల తేడాతో...

జైపూర్ పింక్ పాంథర్స్ చేతిలో ఓడిన తెలుగు టైటాన్స్

సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్ ఆరంభ పోరులో విజయంతో మురిపించిన తెలుగు టైటాన్స్ జట్టు ఆ తర్వాత వరుసగా రెండో మ్యాచ్‌లో పరాజయం పాలైంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన పోరులో తెలుగు టైటాన్స్ ఏకంగా 30 పాయింట్ల తేడాతో ఓటమి చవిచూసింది. మాజీ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్ 52–22తో తెలుగు టైటాన్స్‌పై ఘనవిజయం సాధించింది. టైటాన్స్ కెప్టెన్ పవన్ సెహ్రావత్ 7 పాయింట్లు సాధించగా... ఆశిష్ నర్వాల్, విజయ్ మలిక్ చెరో ఐదు పాయింట్లు ఖాతాలో వేసుకున్నారు. జైపూర్ పింక్ పాంథర్స్ తరఫున కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ 19 పాయింట్లతో సత్తా చాటాడు. అందులో 17 రెయిడ్ పాయింట్స్ ఉండగా... మరో రెండు బోనస్ పాయింట్లు ఉన్నాయి. అభిజీత్ మలిక్ 8 పాయింట్లతో రాణించాడు. మ్యాచ్ ఆరంభం నుంచే జైపూర్ పింక్ పాంథర్స్ పూర్తి ఆధిపత్యం కనబర్చగా... టైటాన్స్ జట్టు కనీస ప్రతిఘటన కనబర్చలేకపోయింది. అర్జున్ దేశ్వాల్ దూకుడుతో ఆలౌటైన తెలుగు టైటాన్స్ హాఫ్ టైమ్ సమయానికి 13–18తో నిలిచింది. ద్వితీయార్ధంలోనైనా పుంజుకుంటుంది అనుకుంటే అదీ సాధ్యపడలేదు. ఏ దశలోనూ జైపూర్ జట్టుకు పోటీనివ్వలేకపోయిన టైటాన్స్... తాజా సీజన్‌లో రెండో ఓటమి మూటగట్టుకుంది. మూడు మ్యాచ్‌ల్లో ఒక విజయం రెండు పరాజయాలతో 5 పాయింట్లు ఖాతాలో వేసుకున్న టైటాన్స్... పట్టికలో ఏడో స్థానంలో ఉంది. మరోవైపు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన జైపూర్ జట్టు 10 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో నిలిచింది. తదుపరి మ్యాచ్‌లో శనివారం దబంగ్ ఢిల్లీతో తెలుగు టైటాన్స్ తలపడనుంది. మంగళవారమే జరిగిన మరో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 57–36 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై విజయం సాధించింది. యూపీ యోధాస్ తరఫున సురేందర్ గిల్ 17 పాయింట్లతో మెరిశాడు. బెంగళూరు బుల్స్ తరఫున ప్రదీప్ నర్వాల్ 16 పాయింట్లతో ఒంటరి పోరాటం చేసినా ఫలితం లేకపోయింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో తమిళ్ తలైవాస్‌తో పుణేరి పల్టన్ (రాత్రి 8 నుంచి), గుజరాత్ జెయింట్స్‌తో యూ ముంబా (రాత్రి 9 నుంచి) ఆడతాయి.



పాలీ ఇంగ్లిస్‌కు తొలిసారి చోటు

భారత మహిళల జట్టుతో వన్డే సిరీస్‌కు న్యూజిలాండ్ జట్టు ప్రకటన

క్రైస్ట్‌చర్చ్: వికెట్ కీపర్ బ్యాటర్ పాలీ ఇంగ్లిస్ తొలిసారి న్యూజిలాండ్ మహిళల జట్టులోకి ఎంపికైంది. గురువారం నుంచి అహ్మదాబాద్ వేదికగా భారత జట్టుతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో న్యూజిలాండ్ తలపడుతుంది. ఈ సిరీస్ కోసం 15 మంది సభ్యులతో కూడిన న్యూజిలాండ్ జట్టును మంగళవారం ప్రకటించారు. సోఫీ డివైన్ జట్టుకు నాయకత్వం వహిస్తుంది. 28 ఏళ్ల పాలీ ఇంగ్లిస్ కొంతకాలంగా న్యూజిలాండ్ దేశవాళీ క్రికెట్ టోర్నీలలో నిలకడగా రాణిస్తోంది. దాంతో గత జూన్‌లో ఆమెకు సెంట్రల్ కాంట్రాక్ట్ కూడా లభించింది. గతవారం యూఏఈలో ముగిసిన మహిళల టి20 ప్రపంచకప్‌లో తొలిసారి టైటిల్ నెగ్గిన



జట్టులో నుంచి ఇద్దరు (రోజ్‌మేరీ మైర్, లె కాస్పరెక్) మాత్రమే వన్డే సిరీస్‌కు దూరంగా ఉన్నారు. భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య 24, 27, 29వ తేదీల్లో మూడు వన్డేలు జరుగుతాయి.

న్యూజిలాండ్ జట్టు: సోఫీ డివైన్ (కెప్టెన్), సుజీ బేట్స్, ఈడెన్ కార్సన్, లౌరెన్ డౌన్, ఇజీ గేజ్, మ్యాడీ గ్రీన్, బ్రూక్ హాలీడే, పాలీ ఇంగ్లిస్, ఫ్రాన్ జొనాస్, జెస్ కెర్, మెలీ కెర్, మోలీ పెన్‌ఫోల్డ్, జార్జియా ప్లిమర్, హనా రోవి, లె తహుహు.

యూకీ–ఒలివెట్టి జోడీ సంచలనం

బాసెల్: స్విస్ ఇండోర్స్ ఓపెన్ ఏటీపీ–500 టెన్నిస్ టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ సంచలనం సృష్టించింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో యూకీ బాంబ్రీ–ఒలివెట్టి ద్వయం 3–6, 7–5, 10–8తో 'సూపర్ టైబ్రేక్'లో గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్స్ నెగ్గిన జీన్ జూలియన్ రోజర్ (నెదర్లాండ్స్)–జో సాలిస్‌బరీ (బ్రిటన్) జంటను బోల్తా కొట్టించింది. ఈ గెలుపుతో యూకీ–ఒలివెట్టి జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. జీన్ జూలియన్ రోజర్ తన కెరీర్‌లో మొత్తం 37 డబుల్స్ టైటిల్స్ నెగ్గగా... అందులో మూడు గ్రాండ్‌స్లామ్ (ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, యూఎస్ ఓపెన్) టైటిల్స్ ఉండటం విశేషం. జో సాలిస్‌బరీ తన కెరీర్‌లో 17 డబుల్స్ టైటిల్స్ సాధించాడు. అందులో నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ (3 యూఎస్ ఓపెన్, 1 ఆస్ట్రేలియన్ ఓపెన్) ఉన్నాయి.



పరాజయాల్లో ఈస్ట్ బెంగాల్ 'సిక్సర్'

భువనేశ్వర్: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) టోర్నమెంట్‌లో ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) వరుసగా ఆరో మ్యాచ్‌లోనూ పరాజయాన్నే మూటగట్టుకుంది. సొంత గడ్డపై మంగళవారం జరిగిన పోరులో ఒడిశా ఎఫ్‌సీ 2–1 గోల్స్ తేడాతో ఈస్ట్ బెంగాల్ జట్టును ఓడించింది. ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న ఒడిశా స్ట్రయికర్ రాయ్ కృష్ణ (22వ నిమిషంలో), మౌర్తదా ఫాల్ (69వ నిమిషంలో)



చెరో గోల్ చేశారు. ఈస్ట్ బెంగాల్ తరఫున నమోదైన ఏకైక గోల్‌ను డిమిత్రియోస్ డైమంటకోస్ (ఇంజ్యూరీ టైమ్ 45+4వ ని.)లో చేశాడు. బెంగాల్ డిఫెండర్ల పేలవ ప్రదర్శన ఒడిశాకు రెండో విజయాన్ని అందించింది. ఈ సీజన్‌లో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనూ ఓడిన బెంగాల్ అట్టడుగు స్థానంలో నిలిచింది. అలాగే హైదరాబాద్ ఎఫ్‌సీ కూడా ఇంకా బోణీ కొట్టలేకపోయింది. బుధవారం విశ్రాంతి దినం. గురువారం జరిగే మ్యాచ్‌లో చెన్నైయిన్ ఎఫ్‌సీతో గోవా ఎఫ్‌సీ తలపడుతుంది.



మెయిన్ 'డ్రా'కు సహజ

సాక్షి, హైదరాబాద్: అబీర్టో టాంపికో ఓపెన్ డబ్ల్యూటీఏ–125 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్, తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ రెండో రౌండ్‌లో ప్రపంచ 284వ ర్యాంకర్ సహజ 6–4, 6–2తో ప్రపంచ 183వ ర్యాంకర్ మిరియమ్ బుల్గారు (రొమేనియా)పై సంచలన విజయం సాధించింది. తొలి రౌండ్‌లో సహజ 6–0, 6–0తో అనా పావ్లో గొంజాలెజ్ (మెక్సికో)పై గెలిచింది.


తల్లితో కహియావ్

కల్లోల కడలి మధ్యలో... పాపం పసివాడు!

కయాక్ సాయంతో 12 గంటలు గడిపిన వైనం

లైఫ్ ఆఫ్ పై సినిమా గుర్తుందా? ఓ బాలుడు పులితో పాటు చిన్న పడవపై సముద్రంలో చిక్కిపోతాడు. ప్రాణాలు కాపాడుకోవడానికి పెద్ద సాహసమే చేస్తాడు. పులి, పడవ లేవు గానీ హవాయి దీవుల్లోనూ ఇలాంటి ఘటనే జరిగింది. 17 ఏళ్ల బాలుడు సముద్రంలో చిక్కుకుపోయాడు. చిన్న కయాక్ ఆసరాతో 12 గంటలపాటు ప్రాణాలు కాపాడుకున్నాడు. అతని పేరు కహియావ్. హైస్కూల్ కయాకింగ్ బృందంలో సభ్యుడు. హవాయి దీవుల్లోని వై బోట్ హార్బర్ నుంచి డైమండ్ హెడ్ దాకా మిత్రులతో కలిసి కయాకింగ్ చేశాడు. తిరుగు ప్రయాణంలో కనిపించకుండాపోయాడు. దాంతో సహచరులు అత్యవసర సిబ్బందికి ఫోన్ చేశారు. వెంటనే హోనోలులు అగ్నిమాపక శాఖ, అమెరికా కోస్ట్ గార్డ్ సహా 50 మందికి పైగా సిబ్బంది పడవలు, విమానాలతో గాలింపు చేపట్టారు.

ఏం జరిగిందంటే...

ఇంతకీ జరిగిందేమిటంటే కహియావ్ సముద్రంలో ప్రాక్టీస్ చేస్తూ ప్రమాదవశాత్తు సర్ఫ్ స్కీ నుంచి కింద పడ్డాడు. దాంతో అది కాస్తా మునిగిపోయింది. చూస్తే తనకు లైఫ్ జాకెట్ కూడా లేదు. అలలేమో ఈడ్చి కొడుతున్నాయి. సముద్రం అల్లకల్లోలంగా ఉంది. మరోవైపేమో చీకటి పడుతోంది. కష్టమ్మీద ఈదుతూ ఎలాగోలా తన 20 అడుగుల సర్ఫ్ స్కీ కయాక్‌ను అందుకోగలిగాడు. అయితే ఎటు చూసినా సముద్రం. కటిక చీకటి. కాసేపు కయాక్ మీదే పడుకుంటూ, మరికాసేపు దాని ఆసరాతో నీళ్లలో ఈదుతూ గడిపాడు. సమయం గడుస్తున్న కొద్దీ అతనిలో ఆశలూ సన్నగిల్లుతూ వచ్చాయి. సరిగ్గా అప్పుడే దూరంగా పడవలు కనిపించాయి. కాపాడాలంటూ కేకలు వేసినా దురదృష్టవశాత్తూ వారికి వినిపించలేదు. దాంతో అవి దూరంగా వెళ్లి కనుమరుగయ్యాయి. ఒకానొక దశలో ఇక ఈదలేనని నిర్ధారించుకున్నాడు. ఏదేమైనా సరే ప్రశాంతంగా ఉండాలని, అలల వేగం తగ్గగానే వీలైనంతగా ఈదాలని నిర్ణయించుకున్నాడు. ఎవరో ఒకరు తనను కనిపెట్టేదాకా ప్రాణాలు కాపాడుకోవాలనుకున్నాడు. గుండె నిబ్బరంతో కొన్ని గంటల పాటు గడిపాడు. ఇక తెల్లారుతుందనగా సముద్ర జలాలపై హెలికాప్టర్ల చప్పుడు విని కహియావ్‌కు ఒక్కసారిగా ప్రాణం లేచొచ్చింది. కయాక్ సాయంతో సముద్రంలో తేలియాడుతున్న బాలుడిని అమెరికా కోస్ట్ గార్డ్ విమాన సిబ్బంది ఎట్టకేలకు గుర్తించారు. అప్పటికే వెదుకులాటలో ఉన్న కోస్ట్‌గార్డు సిబ్బందికి సమాచారమివ్వడంతో వారొచ్చి కాపాడారు. అలా 8 గంటల ఆపరేషన్ చివరికి సుఖాంతమైంది. ఒంటికి గాయాలతో అతి చల్లని వాతావరణంలో గంటల కొద్దీ గడిపిన అతన్ని హుటాహుటిన ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. శనివారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాడు.


కహియావ్‌ను కాపాడిన కియులానా

జీవితాంతం గుర్తుంచుకుంటా

తన భయానక అనుభవాన్ని కహియావ్ మీడియాతో పంచుకున్నాడు. ''నాకు ఏమవుతుందనే బాధ కంటే నా గురించి అమ్మ ఎంత ఆందోళన చెందుతుందోనని ఆవేదన చెందా. బయటపడతానని అనుకోలేదు. ఇదో గొప్ప అనుభవం. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొగలే ధైర్యాన్నిచ్చింది. కయాకింగ్ కొనసాగిస్తా. ఈ అనుభవాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటా''అని చెప్పుకొచ్చాడు. బాలునిది మామూలు ధైర్యం కాదని కోస్ట్ గార్డ్ సిబ్బంది అన్నారు. ''అంతటి బలమైన గాలులు, కల్లోలంలో అత్యంత శిక్షణ పొందిన మాకే సముద్రంలో చాలా కష్టంగా ఉంటుంది. అలాంటిది చిన్న కయాక్ సాయంతో 17 ఏళ్ల బాలుడు అంత ధైర్యంగా గడపడం గొప్ప విషయం ''అంటూ మెచ్చుకున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

'బటేంగే తో... కటేంగే'

మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో దర్శనమిస్తున్న పోస్టర్లు

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ 'బటేంగే తో కటేంగే'నినాదం ఇప్పుడు మరోసారి చర్చనీయాంశంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో భారతీయ జనతా పార్టీ ఈ నినాదాన్ని పెద్ద ఎత్తున వాడుతున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే వేడెక్కిన మహారాష్ట్ర, జార్ఖండ్‌లలో ఆదిత్యనాథ్ స్లోగన్ పోస్టర్లు దర్శనం ఇవ్వడం ప్రారంభమయ్యాయి. హిందుత్వ అజెండాతో ఓటు బ్యాంకును ఏకం చేసే ప్రయత్నంలో ఈ నినాదాన్ని వాడుకుంటున్నారు. వాస్తవానికి బంగ్లాదేశ్‌లో మారిన రాజకీయ పరిస్థితుల మధ్య, మైనారిటీ హిందువులపై అఘాయిత్యాల అంశంపై సీఎం యోగి గతంలో చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎం యోగి ప్రకటనపై తొలుత ఇటీవల హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఇప్పుడు మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో 'బటేంగే తో కటేంగే'అంటూ పోస్టర్లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ నినాదంతో హిందువులను ఏకం చేయడంతో పాటు తమ ఓటుబ్యాంకును ఏకతాటిపై తెచ్చేందుకు నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయి. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో నిర్వహించనున్న ప్రచార కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

మరోవైపు బీజేపీపై విజయం సాధించేందుకు విపక్షాలు వ్యూహరచన చేస్తున్నాయి. కుల సమీకరణను ప్రధాన అంశంగా చేసుకొని అధికార వ్యతిరేకత నడుమ బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఉన్న కులాలను ఏకతాటి పైకి తెచ్చేందుకు విపక్షాల ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. హరియాణాలో జాట్ ఓటుబ్యాంకును ఉపయోగించుకొని అధికారంలోకి రావాలని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ప్రయత్నించినప్పటికీ బీజేపీ వ్యూహం ముందు అది ఫలించలేదు. 'బటేంగే తో కటేంగే'నినాదంతో హరియాణా ఎన్నికల్లో ప్రచారం చేసిన బీజేపీ .. జాట్‌లు మినహా ఇతర ఓటు బ్యాంకులను తమవైపు తిప్పుకోగలిగింది. కాగా గతంలో ఆగ్రాలో జరిగిన ఓ కార్యక్రమంలో అందరూ ఐక్యంగా ఉండాలని సీఎం యోగి ఆదిత్యనాథ్ జాతీయ సమైక్యతా సందేశాన్ని ఇచ్చారు. అందరం ఐక్యంగా ఉన్నప్పుడే దేశం బలపడుతుందని.. విభజిస్తే విడిపోతామని సీఎం యోగి అన్నారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న తప్పులు ఇక్కడ జరగరాదని యోగి పిలుపునిచ్చారు.



మోదీకి ఛక్-ఛక్ లడ్డూ, కొరొవాయ్ కేక్

కజాన్: బ్రిక్ శిఖరాగ్ర సదస్సులో వాడీవేడీ చర్చల కోసం రష్యాలోని కజాన్ నగరంలో ల్యాండయిన ప్రధాని మోదీకి ఛక్-ఛక్ లడ్డూలు, కొరొవాయ్ కేకులు స్వాగతం పలికాయి. ఈ కొత్తరకం పేర్ల వంటకాలను చూసి నెటిజన్లు ఆన్‌లైన్‌లో వీటి ప్రత్యేకత గురించి తెగ వెతికేస్తున్నారు. ప్రధాని మోదీకి రష్యా స్థానిక మైనారిటీలైన టాటర్ మహిళలు తమ సంప్రదాయ వేషధారణ, వంటకాలతో స్వాగతం పలికారు. ఇందులో ప్రధానంగా ఛక్-ఛక్ లడ్డూ, కొరొవాయ్ కేకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వంటకాల్లో రష్యా సంప్రదాయ, చారిత్రక విశిష్టత దాగి ఉంది. కజాన్ నగరం ఉన్న టాటర్, బష్కిర్ ప్రాంతాల ఆహార, ఆతిథ్య సంప్రదాయాలు వీటిలో సమ్మిళితమై ఉన్నాయి.

ఏమిటీ ఛక్-ఛక్ లడ్డూ?

ఛక్-ఛక్ లడ్డూను ప్రధానంగా గోధుమ పిండితో తయారుచేస్తారు. గోధుమపిండితో చపాతీలు చేసి పెనంపై కాల్చకుండా సన్నగా నిలువుగా, అడ్డంగా చిన్నచిన్న చతురస్రాకారపు గడుల్లా కత్తిరించుకోవాలి. తర్వాత వీటిని నూనెలో బంగారం రంగు వచ్చేదాకా వేయించుకోవాలి. తర్వాత బెల్లం లేదా చక్కెర పాకం తయారుచేసి అందులో కలుపుకుని గట్టిపడ్డాక లడ్డూలాగా గుండ్రంగా చేసుకోవాలి. అంతే ఛక్-ఛక్ లడ్డూ తయార్. ఛక్-ఛక్ లడ్డూ అంటే ఇక్కడి ప్రాంతవాసులకు ఎంతో ఇష్టం. దీనికి మోదీకి రుచిచూడటానికి ఇవ్వగానే మోదీ ఒకింత ఆశ్చర్యపోయారు. ఇది భారత్‌లో తయారుచేసే వంటకంలా ఉందని వ్యాఖ్యానించారు. బిహార్ వంటకం ముర్హీ కా లాయ్, పశ్చిమబెంగాల్ వంటకం మురీర్ మోవా, ఒడిశా వంటకం మువాలా ఉందని సరదాగా అన్నారు. ఛక్-ఛక్ లడ్డూ మూలాలు టాటర్‌స్థాన్, బష్కోర్‌టోస్థాన్‌లలో ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. టాటర్‌స్థాన్‌లో ఇది జాతీయ మిఠాయిగా ప్రఖ్యాతిగాంచింది.

కొరొవాయ్ కథాకమామిషు..

మోదీ రుచిచూసిన మరో తీపి పదార్థం కొరొవాయ్ కేకు. బేకరీ వంటకమైన ఈ కొరొవాయ్ కేకు అక్కడ ప్రతి పెళ్లి వేడుకల్లో తప్పకుండా ఉండాల్సిందే. అతిథులకు వడ్డించడం కోసమే ప్రత్యేకంగా దీనిని సిద్ధంచేస్తారు. తూర్పు స్లావిక్ ప్రాంతవాసులు ఈ బ్రెడ్ కేక్‌ను తయారుచేసేవాళ్లు. అదే ఇప్పుడు సంప్రదాయంగా వస్తోంది. స్లావ్ ప్రాంత ప్రజలు సూర్యుడిని పూజించేవాళ్లు. వృత్తాకార సూర్యుడికి గుర్తుగా ఈ కేకును గుండ్రంగానే తయారుచేస్తారు. పెళ్లయిన జంట భవిష్యత్తు బాగుండాలని కోరుకుంటూ పెళ్లిలో అందరికీ పంచిపెడతారు. కొన్ని సార్లు కేకు పిండి ముద్దలను పొడవుగా జడపాయల్లా అల్లి తర్వాత గుండ్రంగా చుట్టి బేక్ చేస్తారు. పూర్వం ఈ కేకులో ఉప్పు కాస్తంత ఎక్కువ వేసేవాళ్లు. ఉప్పు అతిథులతో బంధాన్ని మరింత బలపరుస్తుందని వారి నమ్మకం. బ్రిక్ సదస్సులో మాత్రం అతిథులకు దీనికి తోడుగా తేనెను అందిస్తున్నట్లు తెలుస్తోంది.

కలైజ్ఞర్ మనవణ్ని.. సారీ చెప్పను!

'సనాతన' వివాదంపై ఉదయనిధి

చెన్నై: సనాతన ధర్మాన్ని డెంగీ, మలేరియాతో పోల్చుతూ గతేడాది చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పేందుకు తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయ నిధి స్టాలిన్ నిరాకరించారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపడం తెలిసిందే. మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఉదయ నిధి మాట్లాడారు. 'సమాజంలో మహిళలు అణచివేతకు గురవుతున్నారనే అర్థంలో అప్పట్లో నేను మాట్లాడిన మాటలను వక్రీకరించారు. తమిళనాడులోనే కాదు దేశవ్యాప్తంగానూ నాకు వ్యతిరేకంగా కేసులు నమోదయ్యాయి. క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్లు వచ్చాయి. కానీ, నా మాటలకు కట్టుబడి ఉన్నా. నేను కలైజ్ఞర్ (దివంగత కరుణానిధి) మనవణ్ని, ఎన్ని కేసులనైనా ఎదుర్కొంటాను గానీ క్షమాపణ మాత్రం చెప్పేది లేదు'అని పేర్కొన్నారు.

ఠాణాలో తిరంగాకు 21సార్లు సెల్యూట్!

భోపాల్: పాకిస్తాన్ అనుకూల నినాదాలు చేస్తూ అడ్డంగా బుక్కయిన ఓ వ్యక్తి..మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం ఓ పోలీస్‌స్టేషన్‌లోని జాతీయ జెండాకు 21సార్లు సెల్యూట్ చేశాడు. భారత్ మాతా కీ జై అంటూ నినదించాడు. ఫైజాన్ అలియాస్ ఫైజల్ అనే వ్యక్తి 'పాకిస్తాన్ జిందాబాద్, భారత్ ముర్దాబాద్'అని నినాదాలు చేస్తున్న ఓ వీడియోను ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశాడు. దీనిపై మిస్రోడ్ పోలీస్ స్టేషన్‌లో ఐపీసీ 153బీ ప్రకారం మేలో కేసు నమోదైంది. పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఫైజాన్ బెయిల్ కోసం మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించాడు. పిటిషన్‌పై 15న విచారణ చేపట్టిన జస్టిస్ డీకే పలివాల్ అతడికి బెయిల్ మంజూరు చేస్తూ షరతులు విధించారు. మిస్రోడ్ పోలీస్ స్టేషన్‌లోని జాతీయ జెండాకు నెలలో మొదటి, నాలుగో మంగళవారాల్లో భారత్ మాతా కీ జై అని నినదిస్తూ సెల్యూట్ చేయాలని ఆదేశించారు. పుట్టి, పెరిగిన దేశం పట్ల బాధ్యత, గౌరవంతో మెలిగేలా చేయడమే తమ ఉద్దేశమన్నారు. కేసు విచారణ ముగిసే వరకు ఇది కొనసాగించాలన్నారు.

పెరూ మాజీ అధ్యక్షుడికి 20 ఏళ్ల జైలు

లిమా: అవినీతి కేసులో దోషిగా తేలిన పెరూ మాజీ అధ్యక్షుడు అలెజాంద్రో టోలేడోకు 20 ఏళ్ల జైలు శిక్ష పడింది. రోడ్డు కాంట్రాక్టు కోసం 3.5 కోట్ల డాలర్ల లంచం తీసుకున్నట్టు ఆయనపై మోపిన అభియోగాలు రుజువయ్యాయి. పెరూ దక్షిణ తీరాన్ని పశ్చిమ బ్రెజిల్‌తో కలిపే రోడ్డు నిర్మాణ కాంట్రాక్టు కట్టబెట్టినందుకు బదులుగా ఒడెబ్రెక్ట్ అనే కంపెనీ నుంచి లంచం తీసుకున్నందుకు టోలెడోను దోషిగా నిర్ధారించారు. గతేడాది నుంచి టోలెడో నిర్బంధంలోనే ఉన్నారు. లిమా జైలులో ఏర్పాటు చేసిన చిన్న గదిలోనే శిక్షను ప్రకటించారు. 2022లో కాంగ్రెస్‌ను రద్దు చేయడానికి ప్రయత్నించిన నేపథ్యంలో తిరుగుబాటు ఆరోపణలను ఎదుర్కొంటున్న మాజీ అధ్యక్షుడు పెడ్రో కాస్టిలోను కూడా అక్కడే ఉంచారు. మరో ఇద్దరు మాజీ అధ్యక్షులు పెడ్రో పాబ్లో కుజిన్స్కి, ఒలాంటా హుమలాను కూడా ఒడెబ్రెక్ట్ కేసులో విచారిస్తుండటం విశేషం.

ఇంట్లో ఆక్సిజన్ సిలిండర్ పేలి కుటుంబంలోని ఆరుగురు దుర్మరణం

బులంద్‌షహర్: ఓ ఇంట్లో రోగికి అమర్చిన ఆక్సిజన్ సిలిండర్ పేలిన ఘటనలో రోగి సహా ఆ కుటుంబంలోని ఆరుగురు మృత్యువాత పడ్డారు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లా సికందరాబాద్‌లో ఈ విషాదం చోటుచేసుకుంది. ఆషాపురి కాలనీకి చెందిన రుక్సానా(45) ఆస్పత్రి నుంచి ఇటీవలే డిశ్చార్జి అయ్యారు. వైద్యుల సూచనల మేరకు ఇంట్లోనే ఆమెకు ఆక్సిజన్ అందజేస్తున్నారు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ప్రమాదవశాత్తూ ఆక్సిజన్ సిలిండర్ భారీ శబ్దంతో పేలింది. ఆ తీవ్రతకు వారుంటున్న రెండంతస్తుల ఇల్లు ధ్వంసమైంది. ఘటనలో రుక్సానా, భర్త రియాజుద్దీన్(50), ఇద్దరు కుమారులు, కుమార్తె తమన్నా, మూడేళ్ల మనవరాలు ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఆ ఇంట్లో మొత్తం 16 మంది ఉంటున్నారని అధికారులు తెలిపారు. తమన్నా తొమ్మిది నెలల నిండు చూలాలని కుటుంబసభ్యులు తెలిపారు. పోలీసులు, ఫైర్, వైద్య సిబ్బందితోపాటు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు శిథిలాలను తొలగించి, రక్షణ సహాయక చర్యలు చేపట్టాయి.

హారిస్, ట్రంప్ హోరాహోరీ ప్రచారం

హారిస్‌కు రిపబ్లికన్ మాజీ అధ్యక్షుని కూతురి మద్దతు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారం తుది అంకానికి చేరుతోంది. పోలింగ్‌కు మరో 14 రోజులే మిగిలి ఉంది. దాంతో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, ఆయన డెమొక్రటిక్ పార్టీ ప్రత్యర్థి కమలా హారిస్ పోటాపోటీ ప్రచారంలో తలమునకలుగా ఉన్నారు. ముఖ్యంగా కీలకమైన స్వింగ్ స్టేట్లను నేతలిద్దరూ పోటాపోటీగా చుట్టేస్తున్నారు. సోమవారం ఉపాధ్యక్షురాలు హారిస్ పెన్సిల్వేనియా, మిషిగన్, విస్కాన్సిన్‌లో సుడిగాలి పర్యటన జరపగా మాజీ అధ్యక్షుడు ట్రంప్ నార్త్ కరోలినాలోని యాష్‌విల్లేలో కలియదిరిగారు. గత రెండు ఎన్నికల్లోనూ నార్త్ కరోలినా ట్రంప్‌కే అండగా నిలిచింది. కానీ కొద్ది రోజులుగా హరికేన్ హెలెన్ అక్కడ బీభత్సం సృష్టిస్తోంది. దాని దెబ్బకు నవంబర్ 5 నాటి పోలింగ్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఓటింగ్ భారీగా తగ్గవచ్చన్న అంచనాలు ట్రంప్‌ను భయపెడుతున్నాయి. భారీ సంఖ్యలో బూత్‌లకు తరలి ఓటేయాల్సిందిగా ప్రజలకు పిలుపునిచ్చారు. మరోవైపు రిపబ్లికన్ పార్టీకి చెందిన మాజీ అధ్యక్షుడు గెరాల్డ్ ఫోర్డ్ కూతురు సుసాన్ ఫోర్డ్ బేల్స్ తాజాగా హారిస్‌కు మద్దతు పలికారు. ఆమెకు ఓటేయాల్సిందిగా అమెరికన్లకు విజ్ఞప్తి చేశారు. ఈ పరిణామం రిపబ్లికన్లకు షాకివ్వగా డెమొక్రాట్లలో మరింత జోష్ నింపింది. హారిస్‌కు మద్దతుగా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా మంగళ, బుధవారాల్లో డెట్రాయిట్‌లో ప్రచారం చేయనున్నారు. ఆయన భార్య మిషెల్ బుధవారం మిషిగన్‌లో హారిస్‌తో కలిసి సభల్లో పాల్గొంటారు. ట్రంప్ మంగళవారం లాటినో వ్యాపార, పారిశ్రామిక ప్రముఖులతో భేటీ కానున్నారు.

నిద్ర పోవడం లేదు: హారిస్

ప్రచారం ముగింపుకు వస్తున్న కొద్దీ నిద్రలేని రాత్రులు గడుపుతున్నట్టు ఒక ప్రశ్నకు బదులుగా హారిస్ చెప్పారు. ''మధ్య రాత్రి మెలకువ వచ్చేస్తోంది. ఇక నిద్ర పట్టడం లేదు. అయితే నా భర్తతో, పిల్లలతో రోజూ ఫోన్లో మాట్లాడుతున్నా. అలా కుటుంబాన్ని మిస్సవకుండా చూసుకుంటున్నా'' అని చెప్పుకొచ్చారు.

నువ్వా, నేనా!

ట్రంప్, హారిస్ నువ్వా, నేనా అన్నట్టుగా తలపడుతున్నట్టు తాజా సర్వేలు, అంచనాలు చెబుతున్నాయి. ఆశావహ ఓటర్లలో హారిస్‌కు 1.8 శాతం మొగ్గు కన్పించింది. అయితే 538 వెబ్‌సైట్ ప్రకటించిన సర్వేల సగటులో మాత్రం ట్రంప్ అతి స్వల్పంగా ముందంజలో ఉన్నారు. ముఖ్యంగా అతి కీలకమైన ఏడు స్వింగ్ స్టేట్స్‌లో కూడా ఇద్దరూ చెరో 47 శాతం ఆదరణతో దాదాపు సమవుజ్జీలుగా నిలిచినట్టు తేలడం విశేషం. అవి ఎవరికి పట్ట కడతాయో చెప్పలేని పరిస్థితి నెలకొందని వాషింగ్టన్ పోస్ట్ సోమవారం ప్రచురించిన తాజా ఓటర్ల సర్వే కూడా తేల్చింది. వీటిలో 51 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లున్న పెన్సిల్వేనియా, మిషిగన్, విస్కాన్సిన్, నెవడాలను సొంతం చేసుకునేవారే గద్దెనెక్కుతారని పేర్కొంది.



బండరాళ్ల మధ్య ఫోన్‌ను అందుకోబోయి... తలకిందులుగా ఇరుక్కున్న మహిళ..!

న్యూ సౌత్ వేల్స్: పర్వత ప్రాంతంలోని బండరాళ్ల మధ్య నడుస్తున్న మహిళ చేతిలోని సెల్‌ఫోన్ జారిపడింది. ఫోన్‌ను అందుకునే క్రమంలో ఆమె రెండు బండరాళ్ల మధ్య సందులో తలకిందులుగా ఇరుక్కుపోయారు. సుమారు ఏడు గంటల యాతన అనంతరం ఆమెను సహాయక సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్ వేల్స్‌లో ఉన్న హంటర్ వ్యాలీలో నెలారంభంలో చోటు చేసుకున్న ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. బాధిత మహిళ పేరు మటిల్డా కాంప్‌బెల్. రాళ్ల మధ్య మూడుమీటర్ల సందులో ఇరుక్కుపోయిన మటిల్డాను కాపాడేందుకు ఆమె స్నేహితులు ఎంతగానో ప్రయత్నించారు. వీలు కాకపోవడంతో ఎమర్జెన్సీ సర్వీస్‌కు సమాచారమిచ్చారు. వారు వచ్చి అర టన్ను బరువున్న ఒక రాయిని పక్కకు జరపగలిగారు. అయినప్పటికీ, మటిల్డాను రక్షించడం సవాల్‌తో కూడుకున్న వ్యవహారమనే అంచనాకు వచ్చారు. 'పదేళ్లుగా ఎన్నో ఘటనలను దగ్గర్నుంచి చూస్తున్నా. కానీ, ఇటువంటిది ఇదే మొదటిసారి'అని ఎమర్జెన్సీ సర్వీస్ పారామెడిక్ పీటర్ వాట్స్ పేర్కొన్నారు. 'మటిల్డా ఇరుక్కుపోయిన ప్రాంతం ఎస్ ఆకారంలో ఉంది. అందుకే, ఆమె కాళ్లు ఇరుక్కున్న బండరాళ్లను కదలకుండా ఉంచుతూనే ఆమె పట్టేంత జాగాను ఏర్పాటు చేయడం ఎంతో క్లిష్టమైన వ్యవహారం. దాదాపు ఏడుగంటల శ్రమ అనంతరం ఆమెను సురక్షితంగా బయటకు తేగలిగాం'అని తెలిపారు. అయినా కూడా ఆమెకు గీసుకుపోయిన గాయాలే తప్ప, ఎటువంటి హాని కలగకపోవడం ఆశ్చర్యపరిచే విషయమని చెప్పారు. ఇంతా చేసినా మటిల్డా ఫోన్ మాత్రం దొరకలేదని వాట్స్ చెప్పారు. ఇంత జరిగినా, ఫోన్‌ను పోగొట్టుకోవాల్సి వచ్చినందుకు మటిల్డా విచారం వ్యక్తం చేయడం కొస మెరుపు..!

లద్దాఖ్ గస్తీ ఒప్పందం నిజమే

ధ్రువీకరించిన చైనా

బీజింగ్: గత నాలుగేళ్లుగా తూర్పు లద్దాఖ్ సరిహద్దు వెంట కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతలకు తెరదించుతూ భారత్‌తో కీలక గస్తీ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు చైనా మంగళవారం ప్రకటించింది. మంగళవారం బీజింగ్‌లో మీడియాతో మాట్లాడిన సందర్భంగా చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ ఈ విషయాన్ని ధృవీకరించారు. ''చైనా, భారత్ సరిహద్దు వెంట గస్తీ సమస్యలను సైనిక, దౌత్య చర్చల ద్వారా పరిష్కరించుకున్నాం. ఈ విషయంలో ఒప్పందం కుదిరింది' అని జియాన్ చెప్పారు. అయితే ఒప్పందం వివరాలను ఆయన వెల్లడించలేదు. తూర్పు లద్దాఖ్‌లో వాస్తవాధీనరేఖ వెంట 2020నాటి గస్తీ పాయింట్లలోకి మళ్లీ స్వేచ్ఛగా వెళ్లేలా చైనాతో కీలక ఒప్పందం కుదిరిందని సోమవారం భారత్ ప్రకటించినా చైనా నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. రష్యాలోని కజన్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ బయల్దేరిన సమయంలో చైనా నుంచి మంగళవారం ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. భారత ప్రధాని మోదీతో జిన్‌పింగ్ భేటీ ఖరారైతే సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు వెల్లడిస్తామని జియాన్ చెప్పారు. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య జరిగిన ఘర్షణల్లో రెండు వైపులా డజన్ల మంది జవాన్లు మరణించడంతో తూర్పు లద్దాఖ్ వెంట వేలాదిగా సైన్యం మొహరించడం తెల్సిందే. అప్పట్నుంచి కొనసాగుతున్న ఉద్రిక్తతలను చల్లార్చేందుకు, భారత్ తన పాత గస్తీ పాయింట్లను చేరుకునేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమవడం తెల్సిందే. అయితే గత కొద్ది వారాలుగా విస్తృతస్థాయిలో జరిగిన భారత, చైనా దౌత్య, సైనిక సంప్రతింపుల ప్రక్రియ సఫలమై సోమవారం కీలక గస్తీ ఒప్పందం సాకారమైంది. దీంతో త్వరలో ఇరుదేశాల బలగాల ఉపసంహరణ మొదలుకానుంది. ఒప్పందంలో భాగంగా గల్వాన్ లోయ, పాంగాంగ్ సరస్సు, హాట్ స్ప్రింగ్స్, గోగ్రా పాయింట్ల నుంచి భారీస్థాయిలో బలగాలను ఉపసంహరించనున్నారు. డెప్సాంగ్, డెమ్చోక్ ప్రాంతాల్లో ఉపసంహరణపై ఇంకా ప్రతిష్టంభన నెలకొంది. అయితే డెప్సాంగ్, డెమ్చోక్‌లలో పెట్రోలింగ్ కార్యకలాపాలు కొనసాగే వీలుంది.

ఇరాక్‌లో ఐఎస్ గ్రూప్ కమాండర్ హతం

బాగ్దాద్: ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)గ్రూప్ లీడర్, మరో ఎనిమిది మంది సీనియర్ నేతలను తమ బలగాలు చంపేశాయని ఇరాక్ ప్రధాని మహ్మద్ షియా అల్-సుడానీ మంగళవారం ప్రకటించారు. సలాహుద్దీన్ ప్రావిన్స్‌లోని హమ్రిన్ కొండప్రాంతంలో బలగాలు చేపట్టిన ఉమ్మడి ఆపరేషన్‌లో జస్సిమ్ అల్-మజ్రౌయి అబూ అబ్దుల్ ఖాదర్ అనే ఐఎస్ గ్రూప్ కమాండర్ హతమయ్యాడన్నారు. డీఎన్‌ఏ పరీక్షల అనంతరం మిగతా వారి వివరాలను ప్రకటిస్తామన్నారు. అంతర్జాతీయ సంకీర్ణ బలగాలిచ్చిన సమాచారం, మద్దతుతో ఈ ఆపరేషన్ చేపట్టినట్లు జాయింట్ ఆపరేషన్స్ కమాండ్ తెలిపింది. భారీ మొత్తంలో ఆయుధాలు, పేలుడు పదార్థాలు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించింది.

ప్రస్తుతానికి ఉమ్మడి సారథ్యమే

- హమాస్ నిర్ణయం
- ఐదుగురితో కమిటీ
- దోహా నుంచి కార్యకలాపాలు

డెయిర్ అల్ బలాహ్: ఇజ్రాయెల్ దళాల చేతిలో ఇటీవల హత్యకు గురైన యాహ్యా సిన్వర్ స్థానంలో చీఫ్‌గా ప్రస్తుతానికి ఎవరినీ నియమించరాదని హమాస్ నిర్ణయించింది. ఇకపై ఈ మిలిటెంట్ గ్రూప్‌కు ఐదుగురు సభ్యుల కమిటీ నాయకత్వం వహించనుంది. ఈ కమిటీ దోహా కేంద్రంగా పని చేస్తుంది. అగ్ర నేతలందరినీ ఇజ్రాయెల్ టార్గెట్ చేస్తున్న నేపథ్యంలో 2025 మార్చిలో జరిగే గ్రూప్ తదుపరి ఎన్నికల దాకా చీఫ్‌గా ఎవరినీ నియమించరాదని హమాస్ నాయకత్వం భావించినట్లు తెలుస్తోంది. సిన్వర్ మరణానికి ఏడాది ముందునుంచే అజ్ఞాతంలోకి గడుపుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో చాలా రోజులుగా కీలక నిర్ణయాలను ఈ కమిటీయే తీసుకుంటూ వస్తోంది. ఇందులో గాజాకు ఖలీల్ అల్ హయా, వెస్ట్ బ్యాంక్‌కు జహెర్ జబారిన్, విదేశాల్లోని పాలస్తీనియన్లకు ఖలీద్ మషాల్ ప్రతినిధులుగా ఉన్నారు. నాలుగో సభ్యుడు హమాస్ షూరా అడ్వైజరీ కౌన్సిల్ అధిపతి మహ్మద్ దర్వీష్. ఐదో సభ్యుడైన హమాస్ పొలిటికల్ బ్యూరో కార్యదర్శి పేరును భద్రతా కారణాల రీత్యా బయట పెట్టడం లేదని సంస్థ పేర్కొంది. వీరంతా ప్రస్తుతం ఖతర్‌లో ఉన్నారు. యుద్ధ సమయంలో ఉద్యమాన్ని, అసాధారణ పరిస్థితులను, భవిష్యత్ ప్రణాళికలను నియంత్రించే బాధ్యతను ఈ కమిటీకి అప్పగించారు. వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకునే అధికారం కూడా దీనికి ఉంది.

సాక్షి ప్లస్
బుధవారం : 23-10-2024

తొలి తెలుగు చరిత్రకారుడు ఏకామ్రనాథుడు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ హిస్టరీ



కాకతీయానంతర యుగం

భాష-సాహిత్యం

దేవగిరి యాదవులు, కాకతీయులపై ఢిల్లీ సుల్తాన్ల దండయాత్ర సమయంలో ఉర్దూ భాష దక్కన్ ప్రాంతంలో ప్రవేశించింది. ఉర్దూ భాష ఈ ప్రాంతంలో దక్కనీ ఉర్దూగా మారింది. తెలంగాణ భాషా సాహిత్యాలపై తనదైన ముద్ర వేసింది. పద్మనాయకుల రాజ్యంలో సంస్కృతంతోపాటు, తెలుగు భాషా సాహిత్యాలు ఆదరణ పొందాయి. సర్వజ్ఞ సింగభూపాలుడు రచించిన సారంగధరచరిత్రను తొలి యక్షగానంగా భావించవచ్చు. ఇతణ్నే ఒకటో సింగ భూపాలుడిగా పిలుస్తారు. అతడి కుమారుడైన అనపోతానాయకుడు రాచకొండ రాజ్యాన్ని విస్తరించాడు. అన పోతానాయకుడు కవి పండిత పోషకుడు. ఇతడు 'అభిరామ రాఘవమ'నే నాటకాన్ని రాశాడు.

విశ్వేశ్వరుడు చమత్కార చంద్రిక అనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. దీన్ని సంస్కృత లక్షణ గ్రంథాలైన ధ్వన్యాలోకం, కావ్య ప్రకాశంతో పోల్చవచ్చు. ప్రతాపరుద్ర యశోభూషణం తరహాలోనే ఈ గ్రంథంలోని శ్లోకాలు కూడా సింగ భూపాలుడి ప్రశంసతో ఉన్నాయి. ఈ గ్రంథం నాటి చారిత్రక విషయాలను తెలుపుతోంది. వీరభద్ర విజృంభణం(డిమం), కరుణాకందళం(అంకం) ఇతడి ఇతర రచనలు. విశ్వేశ్వరుడు.. అనపోతానాయకుడి, రెండో సింగ భూపాలుడి ఆస్థానాల్లోనూ స్థానం పొందాడు. అనపోతనాయకుడి మరో ఆస్థానకవి పశుపతి నాగనాథ కవి. ఇతడు విశ్వేశ్వరుడి శిష్యుడు. ఇతడు మదన విలాసం(సంస్కృతం), విష్ణుపురాణం అనే గ్రంథాలను రచించాడు. మదన విలాసంలో పద్మనాయకుల చరిత్ర విశేషాలు కనిపిస్తాయి. ధర్మపురికి చెందినగొప్ప పండితుడు నరసింహసూరి. ఇతడు విద్యారణ్య స్వామి సమకాలికుడు. ఇతడు ప్రయోగపారిజాతం అనే స్మృతి గ్రంథాన్ని రచించాడు.

అనపోతానాయకుడి కుమారుడైన రెండో సింగ భూపాలుడు బహుముఖ ప్రజ్ఞాశాలి, కవి. ఇతడికి సంగీతం, నాటకం, నాట్యంలో మంచి ప్రావీణ్యం ఉంది. విశ్వేశ్వరుడు, నాగనాథుడు, బొమ్మకంటి అప్పయాచార్యుడు, శాకల్య మల్ల భట్టు తదితర కవి పండితులను పోషించాడు. రెండో సింగభూపాలుడు రసార్ణవ సుధాకరమనే అలంకార శాస్త్ర గ్రంథాన్ని రచించాడు. ఇతడి మరో ప్రసిద్ధ గ్రంథం సంగీత సుధాకరం. కందర్ప సంభవం అనే డిమం (నాటక భేదం)ను, కువలయావళి అనే నాటికను ఇతడు రచించాడు.

రాచకొండకు చెందిన మరో కవి మాధవ భూపాలుడు(రావుమాదానీడు). ఇతడు రామాయణానికి రాఘవీయ వ్యాఖ్య రాశాడు. ఇతడే 1376లో శ్రీశైల ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర బృహత్ శిలా మండపం కట్టించాడు. మాయిభట్టు దీనికి శాసనం రాశాడు. ఈ శాసన కావ్యంలో 28 శ్లోకాలు ఉన్నాయి. ఇందులో మాధవ నాయకుడి శౌర్య పరాక్రమాలను వర్ణించారు. మాధవ భూపాలుడి భార్య నాగాంబిక. ఈమె ఒక తటాకాన్ని నిర్మించింది.

పద్మనాయకులు తాము శివ దేవతాపారాయణులమని చెప్పుకున్నారు. ఒకటో అనపోతానాయకుడు శైవమతాభిమాని. ఆయన ఉమామహేశ్వరం వద్ద శ్రీశైల ఉత్తర ద్వార మండపాన్ని కట్టించాడు. అనేక శివాలయాలను నిర్మించాడు. కానీ రెండో సింగభూపాలుడి కాలం నుంచి వైష్ణవ మత ప్రాధాన్యం పెరిగింది. వేదాంత దేశికులు వైష్ణవ మత వ్యాప్తికి తోడ్పడ్డారు. వైష్ణవం వడగల్, తెంగల్ అనే శాఖలుగా చీలిపోయింది.

దాని కోసం 1429లో నాగారం శాసనాన్ని వేయించింది. ఈ శాసన రచయిత శంభునాథ కవి.

పద్మనాయకులతో సంబంధం లేకపోయినా ఈ యుగానికి చెందినవాడు కందనామాత్యుడు. ఇతడు సబ్బినాడు(కరీంనగర్, వరంగల్) పాలకుడైన ముప్ప భూపాలుడి మంత్రి. పద్మపురాణం, భాగవత దశమ స్కంధాలను మడికి సింగన, కందనామాత్యుడికి అంకితమిచ్చాడు. కందనామ్యాతుడు రచించిన నీతితారావళి ద్వారా ఆ కాలం నాటి వ్యక్తుల ప్రవర్తనను తెలుసుకోవచ్చు. మడికి సింగన రచించిన 'సకలనీతి సమ్మతం' తెలుగులో తొలి సంకలన గ్రంథం. కాలగర్భంలో కలిసిపోయిన చాలా మంది కవులపేర్లు ఈ గ్రంథం ద్వారా తెలుస్తున్నాయి. 21 గ్రంథాల నుంచి లోక, రాజనీతులను సంపుటీకరించిన గ్రంథమిది. ఇతడు పద్మపురాణోత్తర ఖండం, భాగవత దశమ స్కంధం, జ్ఞానవాసిష్ఠ రామాయణం తదితర రచనలు చేశాడు.

తొలి కవయిత్రి గంగాదేవి

ఈ యుగానికి చెందిన తొలి కవయిత్రి గంగాదేవి. కాకతీయుల ఆడపడచు అయిన గంగాదేవి విజయనగర రాజైన బుక్కరాయల కోడలు. కంపరాయల భార్య. ఈమె సంస్కృతంలో 'మధురావిజయ'మనే కావ్యాన్ని రచించింది. నాగేంద్రకవి తొలి శతకాల్లో ఒకటిగా పేర్కొనదగిన రమాధీశ్వర శతకాన్ని రచించాడు.ఇతడు భువనగిరికి చెందినవాడు. కవి భల్లటుడు గణమంజరి, పదమంజరి, శూద్రక రాజ చరిత్ర, భేతాళ పంచవింశతి, విక్రమార్క చరిత్ర (తెలుగు) అనే కావ్యాలను రాశాడు.

పోతన కొంత కాలం మూడో సింగభూపాలుడి ఆస్థానంలో ఉన్నాడు. పోతనను ఒంటిమిట్ట నుంచి ఓరుగల్లు తీసుకురావడానికి ఎంతో శ్రమించాల్సి వచ్చింది. దేశీఛందస్సును పాల్కురికి ప్రవేశపెట్టాడు. పోతన దీన్ని స్వీకరించలేదు. కానీ దేశీ కవిత్వంలోని సరళత్వం ఇతడి కవిత్వంలో కనిపిస్తుంది. పోతన భోగినీ దండకంలో నాటి రాజుల భోగలాలసత్వాన్ని వర్ణించాడు. ఇతడు రాజాశ్రయాన్ని తిరస్కరించి ప్రత్యామ్నాయ సంస్కృతికి పట్టం కట్టాడు. మూడో సర్వజ్ఞ సింగభూపాలుడు స్వయంగా గొప్ప పండితుడు. వెలుగోటి వంశావళిలో పేర్కొన్న శ్రీనాథుడి పద్యం ద్వారా ఈ విషయం తెలుస్తోంది. మల్లినాథసూరి మెదక్ జిల్లా కొలిచెలిమకు చెందినవాడు. ఇతడు రఘువంశం, కుమార సంభవం, మేఘ సందేశం, కిరాతార్జునీయం, శిశుపాలవధకు వ్యాఖ్యానాలు రాశాడు. మల్లినాథసూరి తమ్ముడైన పెద్దిభట్టు సంస్కృతంలో గొప్ప పండితుడు. పెద్దిభట్టు కుమారుడైన కొలిచెలిమ కుమారస్వామి సోమపీథి(సోమయాజి) కూడా గొప్ప వ్యాఖ్యాత. ఇతడు ప్రతాపరుద్రీయానికి రత్నాపణం అనే వ్యాఖ్యానం రాశాడు. రాచకొండకు చెందిన బొమ్మకంటి హరిహరుడు అనర్ఘరాఘవానికి వ్యాఖ్య రాశాడు.

నాథ సంప్రదాయం

రాచకొండ మంత్రుల వంశానికి చెందిన గౌరన ఈ యుగానికి చెందిన మరో గొప్పకవి. పాల్కురికి 'ద్విపద'ను స్వీకరించి హరిశ్చంద్రోపాఖ్యానం, నవనాథ చరిత్రలను రచించాడు. ఇతడు తెలుగు సాహిత్యంలో తొలిసారిగా నాథ సంప్రదాయాన్ని ప్రవేశపెట్టాడు. అది తెలంగాణ, రాయలసీమల్లో విశేష ప్రాచుర్యం పొందింది. నాథ సంప్రదాయం విగ్రహారాధన, కులతత్వాన్ని నిరసించింది. దేవరకొండకు చెందిన సూరన తొలి కల్పిత కావ్యమైన ధనాభిరామాన్ని రచించాడు. గౌరన కుమారుడైన భైరవకవి తెలంగాణలో బంధకవిత్వ ప్రక్రియకు ఆద్యుడు. ఇతడు శ్రీ రంగమహాత్మ్యం, రత్నపరీక్ష, కవి గజాంకుశం (ఛందోగ్రంథం)ను రచించాడు.

అనంతామాత్యుడు భోజరాజీయ కావ్యం, ఛందోదర్పణం, రసాభరణం అనే గ్రంథాలను రచించాడు. ఏర్చూరి సింగన భాగవత షష్ఠమస్కంధాన్ని రాశాడు. ఇతడు నల్లగొండ జిల్లాలోని ఏరూర్చుకు చెందినవాడు. ఇతడి మరో రచన కువలయాశ్వ చరిత్ర. బొప్పరాజు గంగన పంచమస్కంధను రచించాడు.

రేచర్ల రెడ్డి వంశస్థుల రాజధాని పిల్లలమర్రి. ఇది పిన వీరభద్రుడి జన్మస్థలం. 'వాణి నా రాణి' అని సగర్వంగా చెప్పుకున్న మహాకవి పిల్లలమర్రి పినవీరభద్రుడు. ఇతడు అవతారదర్పణం, నారదీయ పురాణం, మాఘమహాత్మ్యం, మానసోల్లాస సారం, శృంగార శాకుంతలం, జైమినీ భారతం అనే గ్రంథాలను రచించాడు. ప్రబంధాల్లో కనిపించే అనేక వర్ణనలకు, పద్యాల ఎత్తుగడలకూ ఒరవడి సృష్టించిన మార్గదర్శి పినవీరభద్రుడు.

కొలని గణపతి దేవుడు శివయోగసారం, మనోబోధ రచించాడు. కాకతీయ సామ్రాజ్య చరిత్రలో కొన్ని ఘట్టాలకు శివయోగసారం ఆధారం. భాగవతంలోని షష్ఠ, ఏకాదశ, ద్వాదశ స్కంధాలను పోతన అనువదించలేదు. వీటిని హరిభట్టు అనువదించాడు. రతి రహస్యం, వరాహపురాణం, మత్స్యపురాణం, నారసింహపురాణం ఇతడి ఇతర రచనలు. త్రిలోకభేది సకల ధర్మసారం రాశాడు. ఇతడు గౌరన మనవడు.

రాజుల మెప్పు కోసం కవులు.. అవధానం, సమస్య పూరణం, గర్భ, గోప్య, బంధ, అక్షరచ్యుత, మాత్రాచ్యుత, ఏక, ద్విసంధాదారణ ప్రక్రియలను అనుసరించడం ఈ కాలం నుంచే మొదలైంది.

ఏకామ్రనాథుడు

కాకతీయ రాజుల చరిత్ర, వంశావళి, వారి పూర్వీకుల క్రమాభివృద్ధి తదితరాలను తెలిపేందుకు ఏకామ్రనాథుడు ప్రయత్నించాడు. ఇతడు తొలి తెలుగు చరిత్రకారుడు. ఓరుగల్లుకు చెందిన ఇతడు ప్రతాపరుద్ర చరిత్రం, ద్వాత్రింశత్సాలభంజికల కథలు అనే గ్రంథాలను రచించాడని తెలుస్తోంది. ప్రతాపరుద్ర చరిత్రం తెలుగులో తొలి వచన రచన. తొలి చారిత్రక గ్రంథం. కాకతీయుల వివరాలతో పాటు నాటి మతాలు, మత వైషమ్యాలు, సంప్రదాయాలు, సాంఘిక ఆచారాలు, సంప్రదాయాలను ఇందులో పేర్కొన్నారు. ప్రతాపరుద్రుడి దినచర్య, వ్యక్తిత్వాన్ని గ్రంథం ద్వారా తెలుసుకోవచ్చు. ఓరుగల్లు సమీపంలోని వివిధ వర్ణాల, వృత్తుల వారి సంఖ్య తదితర విషయాలను ఈ గ్రంథం తెలుపుతోంది. ప్రతాపరుద్ర చరిత్రం ఆనాటి సాంఘిక చరిత్ర.

కొరవి గోపరాజు

పాల్కురికి రచనల తర్వాత తెలంగాణ సాంఘిక జీవితాన్ని విస్తృతంగా వర్ణించిన కావ్యం 'సింహాసన ద్వాత్రింశిక'. దీని రచయిత కొరవి గోపరాజు. ఇతడు నిజామాబాద్ జిల్లా వేముగల్లు (భీమగల్లు)కు చెందినవాడు. ఇతడి పూర్వీకులు రాచకొండలో మంత్రులుగా పనిచేశారు. సింహాసన ద్వాత్రింశికకు విక్రమార్క చరిత్ర అనే సంస్కృత కావ్యం మూలం. కానీ గోపరాజు అనేక కల్పనలు చేసి దీన్ని స్వతంత్ర కావ్యంగా రూపొందించాడు. అందుకే ఈ గ్రంథంలో నాటి సాంఘిక జీవితాన్ని చిత్రించడం సాధ్యమైంది. గోపరాజు సింహాసన ద్వాత్రింశికలో పేద, ధనిక తారతమ్యాలను చక్కగా వర్ణించాడు. మనసు లోతుల్ని విశ్లేషించిన తొలి మనోవైజ్ఞానిక శాస్త్రవేత్తగా ఫ్రాయిడ్‌ను పేర్కొంటారు. కానీ శతాబ్దాల ముందే కొరవి గోపరాజు మనసు లోతుల్ని, కలల్ని విశ్లేషించాడు. సింహాసన ద్వాత్రింశిక తెలంగాణ గొప్ప కావ్యాల్లో ఒకటిగా నిలిచిపోయింది.

పిడుపర్తి కవులు పాల్కురికి మార్గంలో శైవ సాహిత్యాన్ని విరివిగా రాశారు. ఓరుగల్లుకు చెందిన పిడుపర్తి ఒకటో బసవకవి పిల్లనైనారుకథ, బ్రహ్మోత్తర ఖండంతోపాటు గురుదీక్షాబోధను రచించాడు. ఇతడి పెద తండ్రి కుమారుడైన పిడుపర్తి నిమ్మనాథుడు 'నిజ లింగ చిక్కయ్య కథ' అనే యక్షగానాన్ని రచించాడు. రెండో సోమనాథుడు పాల్కురికి సోమనాథుడి పండితారాధ్య చరిత్రను పద్య ప్రబంధంగా రచించాడు. ఇతడు ఒకటో బసవకవి కుమారుడు. ఇతడే 'ప్రభులింగలీలలు' అనే ద్విపద కావ్యాన్ని కూడా రచించాడు. పిడుపర్తి రెండో బసవ కవి దీన్నే పద్యకావ్యంగా కూర్చాడు. ఇతడు ఒకటో బసవకవి మనవడు.

మత పరిస్థితులు

ఈ యుగంలో శైవమత ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. వైష్ణవ మతం కూడా ప్రాచుర్యం పొందింది. ఈ రెండు మతాల మధ్య వివాదాలు తలెత్తేవి. పద్మనాయకుల ఆస్థానంలోని శాకల్య భట్టు, పరాశర భట్టు మధ్య జరిగిన వివాదమే అందుకు నిదర్శనం. పద్మనాయకులు తాము శివ దేవతాపారాయణులమని చెప్పుకున్నారు. ఒకటో అనపోతానాయకుడు శైవమతాభిమాని. ఆయన ఉమామహేశ్వరం వద్ద శ్రీశైల ఉత్తర ద్వార మండపాన్ని నిర్మించాడు. అనేక శివాలయాలు, శ్రీ పర్వత శిఖరానికి సోపానాలు నిర్మించాడు. తొలి పద్మనాయకులు శైవమతాన్ని ఆదరించారు. కానీ రెండో సింగభూపాలుడి కాలం నుంచి వైష్ణవ మత ప్రాధాన్యం పెరిగింది. రెండో అనపోతానాయకుడు రామాలయం నిర్మించాడు. రావు మాదానీడు రాఘవీయ వ్యాఖ్య రాశాడు.శ్రీ రంగనాథుడికి దానాలిచ్చాడు. మూడో సింగ భూపాలుడు బెల్లంకొండ, తిరుపతి శాసనాలు వేయించాడు. వసంత నాయకుడు కంజీవర శాస నాన్ని, ధర్మానాయకుడు శాయంపేట శాసనాన్ని వేయించాడు. ఇవన్నీ వైష్ణవ మత ఉన్నతిని సూచిస్తున్నాయి.

వేదాంత దేశికులు వైష్ణవ మత వ్యాప్తికి తోడ్పడ్డారు. వీరు సుభాషిత నీతి, తత్వ సందేశ, రహస్య సందేశ గ్రంథాలను రచించారు. వైష్ణవం వడగల్, తెంగల్ అనే శాఖలుగా చీలిపోయింది. వేదాంత దేశికులు వడగల్ శాఖను ప్రచారం చేశారు. ఈ శాఖకు చెందిన వారు వైదిక ఆచార వ్యవహారాలను పాటించేవారు. ఈ శాఖ తెలంగాణ అంతటా వ్యాపించింది. మత ప్రచారం కోసం మఠాలను నిర్మించేవారు. వైదిక, పురాణ దేవతలతోపాటు కట్టమైసమ్మ, రేణుక, ముత్యాలమ్మ, మైసమ్మ, మారెమ్మ, ఏకవీర దేవతలకు కూడా ఆలయాలు నిర్మించేవారు. యక్షగానాలు, భాగోతుల ప్రాచుర్యం కూడా వైష్ణవ మత వ్యాప్తిని సూచిస్తున్నాయి. బహమనీ సుల్తాన్‌లు మత అసహనాన్ని ప్రదర్శించారు. హుమాయూన్ జలీం షా పిల్లలమర్రి దేవాలయాన్ని ధ్వంసం చేశాడు. బహమనీ సుల్తాన్ల చర్యలకు మత కారణాలే కాక రాజకీయ, ఆర్థిక కారణాలు కూడా ఉన్నాయి. వీరి దాడుల నుంచి ప్రాణాలను రక్షించుకోవడానికి లక్షలాది మంది ప్రజలు ఇస్లాం మతాన్ని స్వీకరించారు. దీన్నిబట్టి తెలుగు ప్రజల ఇస్లామీకరణ ఈ కాలం నుంచే మొదలైందని తెలుస్తోంది.

వాస్తు, శిల్పకళ

పద్మనాయకులు కాకతీయుల శిల్పకళను అనుసరించారు. వీరి నిర్మాణాల్లో రాచకొండ, దేవరకొండ దుర్గాలు ప్రముఖమైనవి.

ప్రవేశాలు

డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి దూరవిద్య విధానంలో యూజీ, పీజీ, డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.



కోర్సుల వివరాలు

- **యూజీ కోర్సులు:** బీఏ, బీకాం, బీఎస్సీ.
- **పీజీ కోర్సులు:**
  ఎంఏ: జర్నలిజం - మాస్ కమ్యూనికేషన్ /ఎకనామిక్స్ /హిస్టరీ /పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్/పొలిటికల్ సైన్స్ /సోషియాలజీ /ఇంగ్లిష్ /తెలుగు /హిందీ/ఉర్దూ.
  ఎంఎస్సీ: మ్యాథ్స్/అప్లైడ్ మ్యాథ్స్/సైకాలజీ/బోటనీ/కెమిస్ట్రీ/ఇన్విరాన్ మెంటల్ సైన్స్/ఫిజిక్స్/జువాలజీ; ఎంకాం, ఎంఎల్ఐఎస్సీ, బీఎల్ఐఎస్సీ.
- **డిప్లొమా కోర్సులు:** సైకలాజికల్ కౌన్సిలింగ్ /మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ /ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్/హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్/ఆపరేషనల్ మేనేజ్‌మెంట్/ఇన్విరాన్‌మెంటల్ స్టడీస్/హ్యూమన్ రైట్స్/కల్చర్-హెరిటేజ్ టూరిజం/ఉమెన్స్ స్టడీస్/ఇంటర్నేషనల్ రిలేషన్స్.
- **సర్టిఫికెట్ ప్రోగ్రామ్:** ఫుడ్-న్యూట్రిషన్/లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ /ఎన్‌జీవోస్ మేనేజ్‌మెంట్/ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్.
- **కోర్సు వ్యవధి:** యూజీ కోర్సుకు మూడేళ్లు, పీజీ కోర్సుకు రెండేళ్లు, ఎంఎల్ఐఎస్సీ/బీఎల్ఐఎస్సీ/డిప్లొమా కోర్సుకు ఏడాది, సర్టిఫికేట్ కోర్సుకు ఆరు నెలలు.
- **అర్హత:** కోర్సును అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ:** 30.10.2024.
- **వెబ్‌సైట్:** www.braouonline.in

పొటాషియం లోపం వల్ల వచ్చే వ్యాధి?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ - కంటెంట్ (ఎస్ఏ)

వ్యాధులు

1. ఒక వ్యాధిగ్రస్థుడికి నీటిని చూస్తే భయం, వణుకు పుడుతుంది. అతనికున్న వ్యాధి?
   1) డెంగ్యూ 2) టెటానస్
   3) రేబిస్ 4) ఎయిడ్స్
2. కిందివాటిలో ఏ వ్యాధి లైంగిక సంపర్కానికి సంబంధించింది కాదు?
   1) వైరల్ ఎన్‌సెఫాలిటిస్
   2) గనేరియా 3) సిఫిలిస్
   4) యాంటీ ఇమ్యునో డెఫిషియన్సీ- సిండ్రోమ్
3. లాలాజల గ్రంథులపై దాడి చేసే పారామిక్సో వైరస్ వల్ల కలిగే వ్యాధి?
   1) జలుబు 2) గవద బిళ్లలు
   3) మీజిల్స్ 4) డయేరియా
4. సిఫిలిస్, మలేరియా, కలరా వంటి వ్యాధులు సంక్రమించడానికి కారకాలు వరుస క్రమంలో?
   1) ప్రోటోజోవా - ప్రత్యక్ష సంబంధం - ఈగలు
   2) ఎలుకలు - ఆడ అనాఫిలిస్ దోమ- నీరు
   3) లైంగిక సంపర్కం - ఆడ అనాఫిలిస్ దోమ - ఈగలు
   4) మట్టిలోని బ్యాక్టీరియా -కలుషిత ఆహారం - గాలి
5. ట్రిపనో సోమా గాంబియన్సీ అనే ప్రోటోజోవన్ వల్ల కలిగే వ్యాధి?
   1) టైఫాయిడ్ 2) అతిసారం
   3) న్యుమోనియా 4) నిద్రాజాడ్యం
6. కిందివాటిలో సరైన జత?
   1) ప్లాస్మోడియం - సాండ్ ఈగ
   2) విబ్రియో కలరా - ఆడ అనాఫిలిస్ దోమ
   3) ట్రిపనో సోమా - సీసీ ఈగ
   4) క్లాస్ట్రీడియం టిటాని - పెంపుడు జంతువు
7. చికిత్స కోసం వైద్యుడి వద్దకు వెళ్లిన వ్యాధిగ్రస్థులు చెప్పిన లక్షణాల క్రమం కింది విధంగా ఉంది.
   ఎ. చలిజ్వరం, తీవ్ర తల నొప్పి
   బి. రక్త విరేచనాలు - పొత్తి కడుపు నొప్పి
   సి. కండరాల సంకోచం - నరాల తీపులు
   వీరు బాధపడుతున్న వ్యాధులు వరుస క్రమంలో తెల్పండి.
   1) కలరా - టైఫాయిడ్ - డిఫ్తీరియా
   2) అమీబియాసిస్-మలేరియా-డయేరియా
   3) మలేరియా-అమీబియాసిస్-ధనుర్వాతం
   4) అపెండెసైటిస్ - ధనుర్వాతం- పోలియో
8. కిందివాటిలో ఏ వ్యాధి కలుషిత ఆహారం, ఈగల వల్ల సంక్రమించదు?
   1) మలేరియా 2) కలరా
   3) టైఫాయిడ్ 4) అమీబియాసిస్
9. న్యుమోనియా వ్యాధిని కలిగించే సూక్ష్మజీవికి సంబంధించింది?
   1) వైరస్ 2) బ్యాక్టీరియా
   3) ప్రోటోజోవన్ 4) శిలీంధ్రం
10. వ్యాధి, వ్యాధి కారకానికి సంబంధించి సరికాని జత?
   1) మలేరియా - ప్లాస్మోడియం
   2) స్లీపింగ్ సిక్‌నెస్ - ట్రిపనోసోమా
   3) గవదబిళ్లలు - ఎన్‌సెఫలాటిస్ వైరస్
   4) జలుబు - రినో వైరస్
11. ఏ వ్యాధి ప్రభావం శ్వాస అవయవాలపై ఉండదు?
   1) ట్యూబర్ క్యులోసిస్ 2) న్యుమోనియా
   3) కోరింత దగ్గు 4) మీజిల్స్
12. కిందివాటిలో క్షయ వ్యాధికి చెందిన లక్షణం?
   1) శ్లేష్మంతో కూడిన దగ్గు
   2) ఆకలి తగ్గడం, బరువు తగ్గడం
   3) జ్వరం 4) పైవన్నీ
13. 'హైడ్రోఫోబియా'ను కలిగించే వైరస్?
   1) హెర్పెస్ వైరస్ 2) రాబ్డో వైరస్
   3) ఎన్‌సెఫలాటిస్ 4) ఆరోమిక్సో వైరస్
14. ప్లేగు వ్యాధి నిర్మూలనకు ఎవరు కనుగొన్న టెట్రాసైక్లిన్ అనే ఔషధం ఉపయోగపడింది?
   1) అబ్దుల్ కలాం
   2) డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు
   3) లూయీ పాశ్చర్
   4) అలెగ్జాండర్ ఫ్లెమింగో
15. ఏ వ్యాధి బ్యాక్టీరియా, వైరస్, ప్రోటోజోవన్ వల్ల కలుగదు?
   1) క్యాషియోర్కర్ 2) టెటానస్
   3) మలేరియా 4) న్యుమోనియా
16. క్యాషియోర్కర్ దేని లోపం వల్ల వస్తుంది?
   1) ఇనుము 2) ప్రోటీన్
   3) అయోడిన్ 4) కాల్షియం
17. పొటాషియం లోపం వల్ల వచ్చే వ్యాధి?
   1) హైపోకలేమియా 2) హైపోనట్రేమియా
   3) హైపోగ్లైసిస్ 4) అనీమియా
18. పోషక పదార్థాలు, వాటి లోపాలకు సంబంధించి సరైన జతలు?
   ఎ. ఇనుము - కండరాల పక్షవాతం
   బి. సోడియం - హైపోనట్రేమియా
   సి. కాల్షియం - ఆస్టియో మలేసియా
   డి. పొటాషియం - క్వాషియోర్కర్
   1) ఎ, బి 2) ఎ, సి
   3) బి, డి 4) సి, డి
19. అయోడిన్ లోపం వల్ల వచ్చే వ్యాధి?
   1) రక్తహీనత 2) బానపొట్ట
   3) థైరాయిడ్ వాయడం 4) మెరాస్మస్
20. ఒక వ్యక్తిలో నిర్జలీకరణం, రక్తపోటు తగ్గడం, బరువు కోల్పోవడం వంటి లక్షణాలు గుర్తించారు. ఆ వ్యక్తిలో కింది వాటిలో ఏ ధాతులోపం ఉన్నట్లు నిర్ధారించవచ్చు?
   1) కాల్షియం 2) అయోడిన్
   3) పొటాషియం 4) సోడియం

సమాధానాలు

1) 3; 2) 1; 3) 2; 4) 3;
5) 4; 6) 3; 7) 3; 8) 1;
9) 2; 10) 3; 11) 4; 12) 4;
13) 2; 14) 2; 15) 1; 16) 2;
17) 1; 18) 3; 19) 3; 20) 4.

పోషక పదార్థాల లోపం వల్ల వచ్చే వ్యాధులు

పదార్థ లోపం	వ్యాధి	కారణం/లక్షణాలు
ప్రోటీన్	క్యాషియోర్కర్	తల్లిపాల బదులు కార్బోహైడ్రేట్ ఆహారంపై ఆధారపడ్డ ఐదేళ్లలోపు పిల్లలు ఈ వ్యాధికి లోనవుతారు. వికారంగా ఉండటం, పెరుగుదల ఆగిపోవడం, బరువు కోల్పోవడం, బాన పొట్ట, మానసిక వైకల్యం కలుగుతాయి.
ఖనిజాలు	మెరాస్మస్	తల్లిపాలకు బదులు పోషక విలువలు తక్కువగా ఉన్న ఆహారం తీసుకునే ఏడాదిలోపు పిల్లలు ఈ వ్యాధికి లోనవుతారు. కండరాలు సరిగా ఎదగక పోవడం, అవయవాల బలహీనత, పక్క టెముకలు బయట పడటం వంటివి కలుగుతాయి.
ఇనుము (Fe)	రక్త హీనత	ఎర్ర రక్తకణాల్లో హీమోగ్లోబిన్ లోపం వల్ల వ్యక్తులు పాలిపోవడం, ఆకలి కోల్పోవడం, త్వరగా అలసిపోవడం.
పొటాషియం K(Kalium)	హైపోకలేమియా	విపరీతమైన వాంతులు, విరేచనాలతో పొటాషియం కోల్పోవడం, హృదయ స్పందన రేటు అధికమవడం, మూత్రపిండం దెబ్బతినడం, బలహీనత, కండరాల పక్షవాతం.
సోడియం Na (Natrium)	హైపోనట్రేమియా	సోడియం నష్టపోవడం, నిర్జలీకరణం, రక్తపోటు తగ్గడం, బరువు కోల్పోవడం
అయోడిన్ (I)	గ్రంథివాపు	థైరాయిడ్ గ్రంథివాపు
కాల్షియం Ca	రికెట్స్, ఆస్టియో మలేసియా	విటమిన్ డి లోపం ఏర్పడుతుంది.

వైరస్‌ల వల్ల వచ్చే వ్యాధులు

వ్యాధి	కారకం	వ్యాపించే విధానం	లక్షణాలు
జలుబు	రినోవైరస్	తుంపరల వల్ల, ప్రత్యక్ష సంబంధం	ముక్కు కారడం, తలనొప్పి
పోలియో మైలిటిస్	పోలియో వైరస్, ఎంటరో వైరస్	ఈగలు, నీరు, ఆహారం	తలనొప్పి, వాంతులు, శరీరంలో ఒకటి రెండు అవయవాలకు పక్షవాతం, బలహీనత
గవద బిళ్లలు (మంప్స్)	పారామిక్సో వైరస్ పరోటైడస్	ప్రత్యక్ష సంబంధం, వైరస్ లాలాజల గ్రంథుల మీద దాడి	జ్వరం, తలనొప్పి, లాలాజలం అధికంగా ఊరడం - లాలాజల గ్రంథులు వాయడం, గొంతు ఎండిపోవడం
తట్టు (మీజిల్స్)	పారామిక్సో వైరస్ (తట్టు వైరస్)	ప్రత్యక్ష సంబంధం దగ్గేటప్పుడు వెలువడే తంపరల ద్వారా	ముక్కు కారడం, శ్లేష్మ పటలం వాపు, చర్మం మీద ఎర్రని గుల్లలు
మశూచి (స్మాల్‌పాక్స్)	వరియొల వైరస్	ప్రత్యక్ష సంబంధం	జ్వరం, తలనొప్పి, వెన్నునొప్పి, చర్మం మీద గుల్లలు, పొక్కులు ఏర్పడి గుంటలు పడటం
ఇన్‌ఫ్లూయెంజా (ఫ్లూ)	ఆర్థోమిక్సో వైరస్	ప్రత్యక్ష సంబంధం, వస్తువుల ద్వారా	జ్వరం, కండరాల నొప్పి, గొంతు పుండు, పొడిదగ్గు, ఊపిరితిత్తులపై బ్యాక్టీరియా దాడి

గతంలో అడిగిన ప్రశ్నలు


1. మలేరియా సోకిన మానవునిలో చలిజ్వరం వచ్చే సమయం?
   1) ఎర్ర రక్తకణాలు పగిలి మీరో జాయింట్లు విడుదలయ్యే సమయం
   2) స్పోరో జాయింట్ల ఉత్పత్తి సమయం
   3) స్పోరో జాయింట్లు కాలేయ కణాల్లో చేరే సమయం
   4) క్రిప్టో మీరో జాయింట్లు ఎర్ర రక్త కణాల్లో ప్రవేశించే సమయం
2. మానవుల్లో వచ్చే x -డిఫ్తీరియా, y- తట్టు, z - కోరింత దగ్గు అనే వ్యాధులను కల్గించే సూక్ష్మజీవుల పేర్ల క్రమం?
   1) x- వైరస్, y -బ్యాక్టీరియా, z- ప్రోటోజోవా
   2) x- ప్రోటోజోవా, y -బ్యాక్టీరియా, z- వైరస్
   3) x -వైరస్, y-బ్యాక్టీరియా, z- వైరస్
   4) x బ్యాక్టీరియా, y వైరస్, z బ్యాక్టీరియా
3. ఏ వ్యాధి సోకితే శరీరం నుంచి ఎక్కువ శాతం నీరు బయటకు పోయి నిర్జలీకరణ స్థితి ఏర్పడుతుంది?
   1) టైఫాయిడ్ 2) మలేరియా
   3) కలరా 4) డిఫ్తీరియా
4. వేటిని తగినంత మొత్తాల్లో భుజించకపోతే మనం త్వరగా అలసిపోయి నీరసంగా తయారవుతాం?
   1) కార్బోహైడ్రేట్‌లు 2) ప్రోటీన్‌లు
   3) కొవ్వులు 4) విటమిన్‌లు
5. 'మిక్సోవైరస్ పరోటైడస్' వల్ల కలిగే వ్యాధి?
   1) మెదడువాపు 2) గవద బిళ్లలు
   3) తట్టు 4) హెపటైటిస్

సమాధానాలు

1) 1; 2) 4; 3) 3; 4) 1; 5) 2.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

ఐన్‌స్టీన్ ఏ పరిశోధనకు నోబెల్ లభించింది?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

క్వాంటం సిద్ధాంతం - కాంతి విద్యుత్ ఫలితం

కాంతి విద్యుత్ ఫలితం: ఒక లోహ ఉపరితలాన్ని కాంతి కిరణపుంజంతో ఢీకొట్టించినప్పుడు, దాని ఉపరితలం నుంచి ఎలక్ట్రాన్‌లు విడుదలవుతాయి. ఈ దృగ్విషయాన్నే కాంతి విద్యుత్ ఫలితం(Photo Electric Effect) అంటారు.

- అన్ని రకాల కాంతి కిరణాలు అన్ని లోహాల ఉపరితలాల నుంచి ఎలక్ట్రాన్‌లను ఉద్గారం చేయవు.
- ఎలక్ట్రాన్‌లను తేలికగా కోల్పోయే స్వభావం అంటే అతి తక్కువ అయనీకరణ శక్మం (ఒక వాయుస్థితిలోని ఒంటరి పరమాణువు చిట్ట చివరి కక్ష్యలోని ఎలక్ట్రాన్‌ను తొలగించడానికి కావాల్సిన శక్తి) ఉన్నటువంటి లోహాలే కాంతి విద్యుత్ ఫలితాన్ని చూపిస్తాయి.
- ప్రతి లోహానికి సంబంధించి ఒక అభిలాక్షణిక (దానికే ప్రత్యేకమైన) పౌనఃపున్యం ఉంటుంది. లోహ ఉపరితలాన్ని ఢీకొట్టే పతనకాంతి పౌనఃపున్యం, ఆ లోహానికి సంబంధించిన అభిలాక్షణిక పౌనఃపున్యం కంటే ఎక్కువ ఉన్నప్పుడే లోహ ఉపరిత లం నుంచి ఎలక్ట్రాన్‌లు విడుదలవుతాయి.
- ఉదాహరణకు పొటాషియం లోహ ఉపరితలం నుంచి ఊదారంగు కిరణాలు ఎలక్ట్రాన్‌లను విడుదల చేస్తాయి. కానీ, ఎరుపు రంగు కిరణాలు ఎలక్ట్రాన్‌లను విడుదల చేయవు.
- దీనికి కారణాలను ఆయా కాంతి కిరణాల పౌనఃపున్యాల (లేదా తరంగదైర్ఘ్యం లేదా శక్తి) ఆధారంగా విశ్లేషించొచ్చు.
- కింది పట్టికను పరిశీలిస్తే ఎరుపు కిరణాల పౌనఃపున్యం లేదా శక్తి తక్కువ (తక్కువ తరంగదైర్ఘ్యం) కాబట్టి పొటాషియం లోహ ఉపరితలం నుంచి ఎలక్ట్రాన్‌లు విడుదల కావని తెలుస్తుంది.
- సాధారణంగా తక్కువ అయనీకరణ శక్మం ఉన్న క్షార లోహాలు ఫొటో విద్యుత్ ఫలితాన్ని చూపిస్తాయి. అవి పొటాషియం, రుబీడియం, సీజియం. ఈ క్రమంలోనే పరమాణు సైజు పెరిగి అయనీకరణ శక్మాలు పెరగడం వల్ల కాంతి విద్యుత్ ఫలితం చూపించే సామర్థ్యం కూడా ఎక్కువ. అంటే క్షార లోహాలైన లిథియం, సోడియం దాదాపుగా కాంతి విద్యుత్ ఫలితాన్ని చూపించవు. సీజియం తేలికగా కాంతి విద్యుత్ ఫలితాన్ని చూపిస్తుంది.
- కాంతి విద్యుత్ ఫలితాన్ని 'సాధారణీకృత క్వాంటం సిద్ధాంతం' ద్వారా ఐన్‌స్టీన్ వివరించాడు. ఆయన కృషి ఫలితంగా 1905 లో నోబెల్ బహుమతి లభించింది.
- ఈ సిద్ధాంత ప్రకారం ఫోటాన్‌లుగా భావించే కాంతి కణాల శక్తి (E), పౌనఃపున్యానికి (υ) అనులోమానుపాతంలో ఉంటుంది.
  [$E = h\upsilon$, h ప్లాంక్ స్థిరాంకం]
- లోహం నుంచి ఎలక్ట్రాన్‌ను బయటకు తొలగించడానికి అవసరమైన శక్తి ఫోటాన్ కు ఉన్నప్పుడే లోహ ఉపరితలాన్ని ఫోటాన్ ఢీకొట్టినప్పుడు దాని నుంచి ఎలక్ట్రాన్‌లు బహిర్గతమవుతాయి. ఫోటాన్ శక్తి అవసరమైన దాని కంటే తక్కువగా ఉంటే అది లోహం నుంచి ఎలక్ట్రాన్‌లను విడుదల చేయదు.
- ఒక ఫోటాన్ లోహ ఉపరితలాన్ని ఢీకొట్టినప్పుడు అది రెండు పనులు చేయాలి. ఎలక్ట్రాన్‌ల మీద ఉన్న లోహ కేంద్రక ఆకర్షణ బలాలను అధిగమించి విడుదల చేయగలగాలి. తర్వాత వాటికి కొంత శక్తి(గతిజశక్తి) నిచ్చి లోహ ఉపరితలానికి దూరంగా(తిరిగి లోహంలో చేరకుండా) తీసుకెళ్లగలగాలి. అంటే ఈ రెండు పనులు చేయగలిగిన శక్తి లోహాన్ని ఢీకొట్టే ఫోటాన్‌లకు ఉండాలి.
- దీనికి సమీకరణ రూపం: $h\upsilon = W + KE$
  $h\upsilon$ = ఫోటాన్‌ల శక్తి
  W = ఎలక్ట్రాన్‌లపై ఉన్న లోహ ఆకర్షణ బలాలను అధిగమించే శక్తి (పని ప్రమేయం)
  KE = విడుదలైన ఎలక్ట్రాన్‌ల గతిజశక్తి

కాంతి విద్యుత్ ఫలితానికి సంబంధించిన ముఖ్య విషయాలు

- ప్రతి లోహం, కొంత కనీస పౌనఃపున్యం లేదా శక్తి ఉన్న కాంతి పడినప్పుడే ఎలక్ట్రాన్‌లను ఉద్గారం చేస్తుంది. దీన్నే ఆరంభ లేదా ద్వార పౌనఃపున్యం (Threshold Frequency) అంటారు. ఈ ఆరంభ పౌనఃపున్యం కంటే తక్కువ పౌనఃపున్యం ఉన్న కాంతిని ఎంత సేపు ప్రసరింపజేసినా లోహ ఉపరితలం నుంచి ఎలక్ట్రాన్‌లను ఉద్గారం చేయలేం.
- వేర్వేరు లోహాలకు ఈ ఆరంభ పౌనఃపున్యం వేరుగా ఉంటుంది. విడుదలైన ఎలక్ట్రాన్‌ల గతిజశక్తి పతన (ఢీకొట్టిన) కాంతి పౌనఃపున్యంపై ఆధారపడి ఉంటుంది. దాని తీవ్రతపై ఆధారపడదు.
- ఒక సెకనులో విడుదలైన ఎలక్ట్రాన్‌ల సంఖ్య కాంతి తీవ్రతపై ఆధారపడి ఉంటుంది. దాని పౌనఃపున్యంపై ఆధారపడి ఉండదు.
- ఒకవేళ ఎలక్ట్రాన్ విడుదలకు కావాల్సిన శక్తికంటే తక్కువ శక్తి ఉన్న ఫోటాన్‌ను వస్తువు గ్రహించినప్పుడు ఎలక్ట్రాన్‌లు భూస్థాయి (అల్ప శక్తిస్థాయి) నుంచి ఉత్తేజిత శక్తిస్థాయి (అధిక శక్తిస్థాయి)లోకి పరివర్తనం చెందుతాయి. అయితే అధిక శక్తి స్థాయిల్లో ఎలక్ట్రాన్‌లు ఎక్కువసేపు ఉండలేవు (అస్థిరం). కాబట్టి తిరిగి భూస్థాయికొస్తాయి. ఈ ప్రక్రియలో అంటే ఎలక్ట్రాన్‌లు అధికశక్తి నుంచి తిరిగి భూస్థాయిలోకి వస్తున్నప్పుడు గ్రహించిన శక్తి విడుదలవుతుంది. ఈ విడుదలయ్యే శక్తి వికిరణ రూ పంలో ఉంటుంది. తద్వారా వర్ణపటాలు ఏర్పడతాయి. కాబట్టి వివిధ మూలకాలను వేడిచేసినప్పుడు అవి విలక్షణమైన రంగులనిస్తాయి. (దీపావళి టపాకాయలు).

లోహం	-	జ్వాల రంగు
మెగ్నీషియం	-	తెలుపు
కాల్షియం	-	ఇటుక ఎరుపు
స్ట్రాన్షియం	-	కెంపు రంగు
బేరియం	-	లేత ఆకుపచ్చ
లిథియం	-	సింధూర ఎరుపు
సోడియం	-	పసుపు
పొటాషియం	-	ఊదా
రుబీడియం	-	ఎరుపు - ఊదా
సీజియం	-	నీలి వర్ణం

రంగు	తరంగ దైర్ఘ్య అవధి (nm)	పౌనఃపున్య అవధి (Hz)
ఎరుపు (Red)	622 – 780	$4.8 \times 10^{14} - 3.85 \times 10^{14}$
నారింజ (Orange)	597 – 622	$5.01 \times 10^{14} - 4.82 \times 10^{14}$
పసుపు (Yellow)	577 – 597	$5.19 \times 10^{14} - 5.05 \times 10^{14}$
ఆకుపచ్చ (Green)	492 – 577	$4.92 \times 10^{14} - 5.19 \times 10^{14}$
నీలి (Blue)	455 – 492	$6.59 \times 10^{14} - 6.10 \times 10^{14}$
ఊదా (Violet)	390 – 455	$7.69 \times 10^{14} - 6.59 \times 10^{14}$

మాదిరి ప్రశ్నలు

1. ప్లాంక్ సిద్ధాంతం ప్రకారం సరైన వాక్యాలు ఏవి?
   ఎ) కాంతి ఫోటాన్‌లు (క్వాంటా) అనే చిన్న చిన్న శక్తి ప్యాకెట్‌ల రూపంలో ఉద్గారం లేదా శోషణం చెందుతుంది
   బి) ఫోటాన్‌లు కాంతి వేగానికి సమానమైన వేగంతో ప్రయాణిస్తాయి.
   సి) పదార్థ కాంతి శోషణం లేదా ఉద్గారం అవిచ్ఛిన్నంగా ఉంటుంది.
   1) ఎ, సి 2) ఎ, బి
   3) బి, సి 4) ఎ, బి, సి
2. తనపై పడిన వికిరణాలను సంపూర్ణంగా శోషించుకునే లేదా ఉద్గారం చేసే వస్తువును ఏమంటారు?
   1) ఉత్సర్గ నాళిక 2) శీతల వస్తువు
   3) కృష్ణ వస్తువు 4) హరిత వస్తువు
3. క్వాంటా అనేది?
   1) శక్తి ప్యాకెట్ 2) కరెన్సీ
   3) క్వింటాలు 4) కాంతి ప్రమాణం
4. ఫొటో విద్యుత్ ఫలితంలో ఫొటో ఎలక్ట్రాన్‌ల ఉద్గారం దేనిపై ఆధారపడి ఉంటుంది?
   1) ఆరంభ పౌనఃపున్యం
   2) పతన కాంతి తీవ్రత
   3) లోహ స్వభావం 4) అన్నీ
5. ఐన్‌స్టీన్‌కు ఏ పరిశోధనకు నోబెల్ బహుమతి లభించింది?
   1) సాపేక్షతా సిద్ధాంతం
   2) కాంతి పరిక్షేపణం
   3) కాంతి విద్యుత్ ఫలితం
   4) క్వాంటం సిద్ధాంతం
6. ఒక ఫోటాన్ శక్తి ..... కు అనులోమానుపాతంలోనూ ..... కు విలోమానుపాతంలోనూ ఉంటుంది?
   1) పౌనఃపున్యం, తరంగదైర్ఘ్యం
   2) తరంగదైర్ఘ్యం, పౌనఃపున్యం
   3) కాంతి తీవ్రత, తరంగదైర్ఘ్యం
   4) పౌనఃపున్యం, కాంతి తీవ్రత
7. ఎక్కువ పౌనఃపున్యం (తక్కువ తరంగ దైర్ఘ్యం ఉన్న) దృగ్గోచర కాంతి రంగు?
   1) నారింజ 2) ఎరుపు
   3) పసుపు 4) ఊదా
8. అల్యూమినియం (Al) తలం పని ప్రమేయం 4.2eV. సోడియం (Na) తలం పని ప్రమేయం 2.0eV ఈ రెండు లోహాల తలాలపై వికిరణాలు పడి ఫొటో విద్యుత్ ఫలితం ఇవ్వగా కింది పరిశీలనలు వచ్చాయి.
   1) Al, Naలకు ఒకే ద్వార పౌనఃపున్యం ఉంది.
   2) Al ద్వార పౌనఃపున్యం > Na ద్వార పౌనఃపున్యం
   3) Na ద్వార పౌనఃపున్యం > Al ద్వార పౌనఃపున్యం
   4) ఏదీకాదు
9. లిథియం, సోడియం, పొటాషియం, కాల్షియంల ప్రథమ అయనీకరణ శక్మాలు (eV) వరుసగా 5.39, 5.13, 4.34, 6.11 అయితే ఏది కాంతి విద్యుత్ ఫలితాన్ని సులభంగా ప్రదర్శిస్తుంది?
   1) పొటాషియం 2) లిథియం
   3) సోడియం 4) కాల్షియం
10. సీజియం, సోడియం, అల్యూమినియంల పని ప్రమేయాలు వరుసగా 1.9eV, 2.0eV, 4.2eV అయితే అతి తక్కువ ఆరంభ పౌనఃపున్యం ఉన్నది?
    1) సీజియం 2) సోడియం
    3) అల్యూమినియం 4) చెప్పలేం
11. నిశ్చిత వాక్యం (A): రేడియో తరంగాలు, అయస్కాంత క్షేత్రంలో వంగి ప్రయాణిస్తాయి.
    వివరణ (R): రేడియో తరంగాలు స్వభావ రీత్యా విద్యుదయస్కాంతాలు
    1) A, R రెండూ సరైనవే R, A కు సరైన వివరణ
    2) A, R రెండూ సరైనవే, కానీ, R, A కు సరైన వివరణ కాదు
    3) A సరైంది. R సరైంది కాదు.
    4) A సరైంది కాదు. R సరైంది.

సమాధానాలు:

1) 2	2) 3	3) 1	4) 2
5) 3	6) 1	7) 4	8) 2
9) 1	10) 1	11) 1	

The synonym of Surreptitious is..

Model Questions

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Hindus constitute less than one per cent of the American population, (1)/ an overwhelming majority of who (2)/ are either from India (3)/or are people of Indian-origin. (4)/ No error (5)
2. Ever since the Supreme Court ruling (1)/ on the entry of women of all ages into Sabarimala, (2)/ questions of patriarchy, equality, (3)/ constitutional and tradition have been raised. (4)/ No error (5)
3. The controversy that began with a public tussle among (1)/ Mr. Verma and Special Director Rakesh Asthana (2)/ has ended with the former's removal, (3)/ although it is couched as a transfer. (4)/ No error (5)
4. India's largest software exporter Tata Consultancy Services has appointed Daniel Hughes Callahan, (1)/ popularly known Don Callahan as additional and independent director for a period of five years (2)/ with effect from January 10, 2019, based on the recommendations of the Nomination and Remuneration Committee, (3)/ and subject to approval of shareholders. (4)/ No error (5)
5. ISRO had hit upon (1)/ the idea of transforming (2)/ the expendable fourth stage (3)/ in a makeshift satellite to reduce space debris. (4)/ No error (5)

Directions: (Q.No. 6 - 10) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. Drinking milk enriched with vitamin D may <u>significantly reduce the risk of rickets and also aid for</u> sufferers of heart disease, according to studies recently completed at the Indian Institute of Medical Sciences, New Delhi.
   1) be significant in reducing the risk of rickets and aid for
   2) significantly reduce the risk of rickets and aid
   3) cause a significant reduction in the risk of rickets and aid to
   4) significantly reduce the risk of rickets as well as aiding
   5) no correction required
7. If you are in a three-month software design project <u>and, in two weeks, you've put together a program that solving part of the problem</u>, show it to your boss without delay.
   1) and, you've put together a program that solves part of the problem in two weeks
   2) and, you've put together a program that has solved part of the problem in two weeks
   3) and, in two weeks, you've put together a program that solves part of the problem
   4) and, in two weeks, you put together a program that solved only part of the problem
   5) no correction required
8. Many of these environmentalists proclaim <u>to save nothing less than</u> the planet itself.
   1) to save nothing lesser than
   2) that they are saving nothing lesser than
   3) to save nothing less than
   4) that they save nothing less than
   5) no correction required
9. The rate of inflation in this country has been increasing <u>steadily, and this</u> is a source of concern for those in power.
   1) steadily: which
   2) steadily; this trend
   3) steadily, this increase
   4) steadily: this
   5) no correction required
10. Generally, in the fine print of insurance documents <u>lies the clauses that make a fool</u> out of the gullible consumer.
    1) lie the clauses that makes a fool
    2) lies the clauses that makes a fool
    3) lie the clauses that make a fool
    4) Lied the clause that making a fool
    5) no correction required

Directions (Q.No.11-15): In the passage given below there are several blanks with numbers, choose the right word to fill in the blanks from the five options given against each blank to complete the passage.



BANK EXAMS
GENERAL ENGLISH

Come New Year and the state of Andhra Pradesh will ______(11) a separate High Court as the Supreme Court has given the green signal for issuing the notification to this______ (12). It will be the 25th high court in the country and will ______ (13) function from a temporary structure till the permanent building comes up in the ambitious Justice City complex in the state's capital Amaravati. ______(14) the bifurcation of the state on June 2, 2014, Andhra Pradesh and Telangana have had a common High Court situated at Hyderabad, the______ (15) capital city.

11. 1) have 2) have been
    3) being 4) have being
    5) been
12. 1) affect 2) purpose
    3) problem 4) effect
    5) issue
13. 1) initial 2) initially
    3) initialize 4) informally
    5) formerly
14. 1) from 2) further
    3) farther 4) for
    5) since
15. 1) former 2) farther
    3) latter's 4) later's
    5) further

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) On the one hand, Mr. Trump has steadily contributed to the strident and crude anti-migrant rhetoric, characterising prospective migrants from Latin America as drug-dealers, rapists and violent criminals and shutting down the U.S. border to travellers from certain Muslim-majority countries.
B) Matters took a darker turn as Mr. Trump doubled down on his refusal to negotiate over funding for the wall and said he may declare a state of national emergency over this uncomfortable status quo.
C) It began as a populist campaign promise that brought President Donald Trump's supporters cheering to their feet and paved the way for his election.
D) On the other, his insistence that he will not sign any appropriations bill to break the funding logjam in Congress and end what could soon become the longest shutdown in U.S. history, unless that bill includes $5.7 billion in financing for a border wall, has gone down badly with Democrats, who control the House.
E) Now, the border wall with Mexico has become a morass of partisan bickering that has stalemated the U.S. federal government into a three-week-long shutdown, leaving nearly 800,000 public sector workers furloughed without pay.
F) At the heart of this political crisis is the increasingly bitter polarization of public opinion over immigration.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) E
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q.No. 21-23): Choose the correct synonym for the words given below

21. OBNOXIOUS
    1) abhorrent 2) detect
    3) pleasant 4) project
    5) propel
22. SURREPTITIOUS
    1) fugitive 2) renegade
    3) punitive 4) clandestine
    5) castigate
23. DOCILE
    1) uncontrollable
    2) plaint 3) wild
    4) irrepressible 5) loathsome

Directions (Q.No. 24-25): Choose the correct antonym for the words given below

24. ABHORRENT
    1) obscene 2) nasty
    3) vile 4) salubrious
    5) lousy
25. EXUBERANT
    1) phlegmatic 2) ruckus
    3) commotion 4) frolic
    5) crank

Directions (Q.No. 26-35): Choose a word/words to fill in the blanks given below to complete the sentence.

26. There is no way around it: plagiarism is ______ to thievery.
    1) tantamount 2) apathetic
    3) fatuous 4) unscrupulous
    5) indecisive
27. For ____ deeds during her mission overseas, Eesha was awarded the Congressional Medal of Honor.
    1) inept 2) valorous
    3) erroneous 4) malodorous
    5) benign
28. Adrith read the employee manual so that he might ______ himself with his new responsibilities at the company.
    1) relinquish 2) synthesize
    3) orient 4) validate
    5) motivate
29. I am ______ of the problems that this solution will cause, but I still believe that this is the best possible solution.
    1) innocuous 2) cognizant
    3) precipitous 4) reminiscent
    5) belligerent
30. The spectacular presentation by a rainforest adventurer ______ Sampath with the desire to travel to South America to see the jungles for himself.
    1) disheartened 2) inhibited
    3) imbued 4) reconstituted
    5) abhorred
31. As the city grew and stretched its borders, it began to feel the ______ problems of urban sprawl and overpopulation.
    1) improvident
    2) mendacious
    3) ersatz 4) concomitant
    5) surreptitious
32. Terrance, a dentist, ______ to be with the media, so he could see the concert for free.
    1) facilitated 2) conjugated
    3) purported 4) tended
    5) placated
33. ______ on a lounge chair by the pool was the very tan owner of the estate, relaxing in the morning sunshine.
    1) Trident 2) Renegade
    3) Fraught 4) Renowned
    5) Supine
34. Observing his sister's ______ behavior of riding without a helmet, Bandarkar ran to get his mother.
    1) contemptuous
    2) contented 3) ctitious
    4) parlous 5) pensive
35. As the discussions ____concluded, the____continued further.
    1) Definitely , problem
    2) Miserably, issues
    3) Purposefully, impasse
    4) abruptly, stalemate
    5) Soon, curfew

KEY

1) 2	2) 4	3) 1	4) 2
5) 4	6) 2	7) 3	8) 4
9) 2	10) 3	11) 1	12) 4
13) 2	14) 5	15) 3	16) 1
17) 4	18) 4	19) 3	20) 2
21) 1	22) 4	23) 2	24) 4
25) 1	26) 1	27) 2	28) 3
29) 2	30) 3	31) 4	32) 3
33) 5	34) 4	35) 4	